సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 28

గురువారం 12-10-2023



'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'



రుచికి చూపెందుకు?

ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా ఫుడ్ వ్లోగర్ ఆశాలతపై కథనం - 11లో



అఫ్గాన్‌పై రోహిట్

రోహిత్‌శర్మ మెరుపు సెంచరీ.. భారత్‌కు వరుసగా రెండో విజయం - 12లో

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



రాజస్థాన్‌లో నవంబర్ 25న..

రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలను నవంబర్ 23కి బదులుగా నవంబర్ 25న నిర్వహించాలని ఈసీ నిర్ణయం తీసుకుంది.

వివరాలు 13లో ▸



గర్భవిచ్ఛిత్తి కేసులో...

గర్భ విచ్ఛిత్తికి సంబంధించిన కేసులో సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం బుధవారం భిన్న తీర్పుల్ని వెలువరించింది.

వివరాలు 6లో ▸



'పఠాన్‌కోట్' సూత్రధారి హతం

పంజాబ్‌లోని పఠాన్‌కోట్‌లో వాయుసేన స్థావరంపై దాడి సూత్రధారి, జైషే మొహమ్మద్ ఉగ్రవాది షహీద్ లతీఫ్ హతమయ్యాడు.

వివరాలు 6లో ▸



అఫ్గాన్‌లో మళ్లీ భూకంపం

అఫ్గానిస్తాన్‌లో రిక్టర్ స్కేల్‌పై 6.3 తీవ్రతతో మళ్లీ భూకంపం సంభవించింది. వందలాది మంది గాయపడినట్లు సమాచారం.

వివరాలు 6లో ▸



కాకినాడ జిల్లా సామర్లకోటలో గృహ ప్రవేశాలకు సిద్ధమైన జగనన్న కాలనీ ఇళ్లు

పేదింటి పండుగ

నేడు రాష్ట్రవ్యాప్తంగా అక్క చెల్లెమ్మల సామూహిక గృహ ప్రవేశాలు

సామర్లకోటలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొననున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు

శరవేగంగా 7.43 లక్షలకుపైగా గృహ నిర్మాణాలను పూర్తి చేసిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: తమకంటూ ఓ పక్కా ఇల్లు ఉండాలనేది ప్రతి పేదింటి అక్క చెల్లెమ్మల చిరకాల స్వప్నం. వారి తోబుట్టువుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దీన్ని సాకారం చేస్తూ నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద మహిళల పేరిటే ఏకంగా 30.75 లక్షల ఇళ్ల పట్టాలను పంపిణీ చేసి దేశంలో రికార్డు సృష్టించారు. అంతేకాకుండా పంపిణీ చేసిన స్థలాల్లో పక్కా ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం తరఫున అండగా నిలిచారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలా రూపుదిద్దుకున్న ఇళ్లలో గురువారం పండుగ వాతావరణంలో సామూహిక గృహ ప్రవేశాలకు పేదలు సిద్ధమయ్యారు. కాకినాడ జిల్లా సామర్లకోటలో సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమంలో సీఎం జగన్ స్వయంగా పాల్గొననున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో

మిగతా 2వ పేజీలో ▶

ప్రతి అడుగులో అన్నదాత సంక్షేమం

వ్యవసాయం, అనుబంధ రంగాలపై సమీక్షలో సీఎం జగన్

నాలుగేళ్లలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం

- రైతన్నలకు మద్దతు ధరతో పాటు జీఎల్టీ రూపంలో క్వింటాల్‌కు రూ.250 అదనంగా ఇస్తున్నాం
- ధాన్యం కొనుగోలు సమయంలో అన్నదాతకు అండగా యంత్రాంగం
- మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటును ప్రోత్సహించాలి
- ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పెద్ద ఎత్తున పంపిణీకి చర్యలు
- అన్ని ఆర్బీకేల్లో భూసార పరీక్షా కిట్‌లు అందుబాటులో ఉంచాలి
- పాడి రైతులకు చేయూత.. స్వయం ఉపాధి పెంపొందించేలా ప్రణాళికలు.. నవంబర్ మొదటి వారంలో 'వైఎస్సార్ రైతు భరోసా' రెండో విడత పంపిణీకి సన్నద్ధం
- నాలుగున్నరేళ్లలో పథకం ద్వారా రైతన్నలకు రూ.31,005.04 కోట్లు అందించిన ప్రభుత్వం

2లో



గత నాలుగున్నరేళ్లలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం. వాటి ద్వారా ప్రతీ రైతన్న లబ్ధి పొందాలి. ఖరీఫ్ ధాన్యం కొనుగోలు సమయంలో అన్నదాతలకు అన్ని విధాలుగా అండగా నిలవాలి. ఏ ఒక్క రైతు నుంచి కూడా మద్దతు ధర దక్కలేదన్న మాటే వినిపించకూడదు. రైతులెవరూ మిల్లర్లు, మధ్యవర్తులను ఆశ్రయించే పరిస్థితే ఎక్కడా రాకూడదు. మన ప్రభుత్వం వచ్చిన తర్వాత మద్దతు ధరతో పాటు జీఎల్టీ రూపంలో ప్రతీ క్వింటాల్‌కు రూ.250 చొప్పున రైతులు అదనంగా లబ్ధి పొందేలా చర్యలు తీసుకున్నాం. ఇదొక గొప్ప మార్పు.

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్

ఫ్యాక్ట్ చెక్

నిజాలు దాచి దాగుడు'మూత'లు

- మూసివేతలే నిజమైతే గత నాలుగున్నరేళ్లలో 14.26 లక్షల మందికి శిక్షణ ఎవరిచ్చినట్లు రామోజీ?
- గ్రామస్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు నైపుణ్య శిక్షణ
- ఒకే గొడుగు కిందకు తెచ్చి నైపుణ్య శిక్షణ విభాగం ఏర్పాటు.. తిరుపతిలో స్కిల్ వర్సిటీకి 50 ఎకరాలు

- వివరాలు 4లో

గురుకులాలపైనా గురివింద రాతలేనా?

- 2019 ఫిబ్రవరిలో ఎన్నికల స్టంట్‌కే టీడీపీ ప్రభుత్వం ఎస్సీ గురుకులాల ఏర్పాటు నిర్ణయం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 177 గురుకులాలకు నాడు–నేడుతో మహర్దశ.. టీడీపీ హయాంలో 49 మందికే ఎన్ఐటీ, ఐఐటీ, ఎంబీబీఎస్‌ల్లో ప్రవేశాలు
- ప్రస్తుత ప్రభుత్వ నాలుగేళ్ల పాలనలోనే 310 మందికి ప్రవేశాలు

- వివరాలు 4లో

ఇదేమి 'పప్పు' కథ!

- కందిపప్పుపై ఈనాడు తప్పుడు కథనం.. చంద్రబాబు హయాంలో రెండేళ్లపాటు కనిపించని కందిపప్పు పంపిణీ
- దోపిడీ కోసమే ఎన్నికలకు ముందు పండుగ కానుక పేరుతో పంపిణీలు
- అప్పుడు కళ్లుండీ కనపడనట్లే నటించిన రామోజీ

- వివరాలు 4లో









హరినాథ్ | కిరణ్మయి | సుమతి | విజయ్

హైకోర్టు జడ్జీలుగా నలుగురి పేర్లు సిఫారసు

న్యాయవాదులు హరినాథ్, కిరణ్మయి, సుమతి, విజయ్‌లను సిఫారసు చేసిన సుప్రీంకోర్టు కొలీజియం

- ఈ ఏడాది ఫిబ్రవరిలో మొత్తం ఏడుగురి పేర్లు పంపిన హైకోర్టు కొలీజియం
- ఐబీ నివేదికల అనంతరం ఇటీవల సుప్రీంకోర్టుకు పేర్లు పంపిన కేంద్ర న్యాయశాఖ
- తాజాగా వారిలో నలుగురి పేర్లకు సుప్రీంకోర్టు ఆమోదముద్ర
- రాష్ట్రపతి ఆమోదం తరువాత నోటిఫికేషన్ జారీ చేయనున్న కేంద్రం
- ఈ నలుగురి నియామకంతో 31కి చేరనున్న హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్య

2లో

'రింగ్' మాస్టర్ అష్ట వంకర్లు



- ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో లోకేశ్‌పై సీఐడీ ప్రశ్నల వర్షం
- 'ఉప సంఘం' వ్యవహారంపై ప్రశ్నలకు తడబాటు
- హెరిటేజ్ భూముల అంశంపై ప్రశ్నలకు బిత్తరచూపులు
- కరకట్ట నివాసంపై ప్రశ్నించేసరికి కస్సుబుస్సు.. విలేకరుల సమావేశంలోనూ అదే తీరు
- 'సాక్షి'పై అసత్య ఆరోపణలతో విషయాన్ని పక్కదారి పట్టించే యత్నం.. ఇతర విలేకరుల ప్రశ్నలకు చిందులు
- నేనెక్కడికి వెళ్తానో మీకనవసరం అంటూ అసహనం

- వివరాలు 3లో

ఇన్నర్ కేసులో చంద్రబాబుకు

తాత్కాలిక ఊరట

16 వరకు పీటీ వారెంట్ విషయంలో ముందుకెళ్లొద్దు

ఏసీబీ కోర్టుకు హైకోర్టు ఆదేశం.. విచారణ 16కు వాయిదా



సాక్షి, అమరావతి: ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్పులో అక్రమాలు, క్విడ్ ప్రోకో ఆరోపణలపై సీఐడీ నమోదు చేసిన కేసులో నిందితుడిగా ఉన్న మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు హైకోర్టు బుధవారం తాత్కాలిక ఊరటనిచ్చింది. ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో చంద్రబాబు కస్టడీ కోరుతూ సీఐడీ దాఖలు చేసిన పీటీ వారెంట్‌లో తదుపరి ముందుకెళ్లొద్దని విజయవాడ ఏసీబీ కోర్టును హైకోర్టు ఆదేశించింది. ఈ నెల 16వ తేదీ వరకు పీటీ వారెంట్ విషయంలో ఎలాంటి ఉత్తర్వులు జారీచేయవద్దని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 16కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసులో తదుపరి ఎలాంటి సమయం ఇచ్చే ప్రసక్తేలేదని న్యాయమూర్తి తన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఒకవేళ సీనియర్ న్యాయవాదులు సుప్రీంకోర్టులో ఏదైనా కేసులో వాదనలు వినిపించాల్సి ఉంటే ఒక్కరోజు మాత్రమే గడువునివ్వడం సాధ్యమవుతుందని తేల్చి చెప్పారు. ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ చంద్రబాబునాయుడు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై బుధవారం జస్టిస్ సురేష్‌రెడ్డి విచారించారు. చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, దమ్మాలపాటి శ్రీనివాస్, పోసాని వెంకటేశ్వర్లు

మిగతా 3వ పేజీలో ▶

ఇదండీ సంగతి



పక్కా గెలుస్తాడనే నమ్మకం, ధైర్యం ఉందంట సార్! టికెట్ ఇస్తారా.. కొనుక్కోమంటారా.. అని అడుగుతున్నాడ్సార్!

కుల ధ్రువీకరణ పత్రం

ఇక శాశ్వతం

ఒకసారి తీసుకుంటే చాలు.. ఎప్పుడైనా చెల్లుబాటు

- ప్రభుత్వ శాఖలు మళ్లీమళ్లీ అడగకూడదు
- ఆదాయ ధ్రువీకరణ కోసం 6 దశల నిర్ధారణ మాత్రమే.. సర్టిఫికెట్ కోసం విద్యా సంస్థలు విద్యార్థులను ఒత్తిడి చేయొద్దు
- మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం
- ప్రజల ఇబ్బందులకు చెక్.. ఏటా 1.20 కోట్ల సర్టిఫికెట్లు జారీ చేస్తున్న రెవెన్యూ శాఖ
- తాజా విధానంతో 95 శాతం తగ్గే అవకాశం

సాక్షి, అమరావతి: ప్రజలు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తీసుకునే విషయంలో ప్రభుత్వం వారికి మరింత వెసులుబాటు కల్పించింది. ఒకసారి కుల ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేస్తే దాన్ని శాశ్వతంగా పరిగణించాలని అన్ని ప్రభుత్వ శాఖలకు స్పష్టం చేసింది. అలాగే ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ప్రభుత్వ శాఖలు, విద్యా సంస్థలు.. విద్యార్థులు, లబ్ధిదారులను ఒత్తిడి చేయొద్దని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఆదాయ ధ్రువీకరణకు గ్రామ సచివాలయాల్లోనే ఆరు దశల తనిఖీ సరిపోతుందని స్పష్టం చేసింది. ఈ మేరకు ఈ సర్టిఫికెట్ల కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా కొత్త నిబంధనలు అమల్లోకి తెచ్చింది. డిజీ లాకర్లలో సర్టిఫికెట్లు

మిగతా 5వ పేజీలో ▶



స్కిల్ స్కాంలో నేరం జరగలేదని

నిరూపించగలరా?



'స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో నేరం జరగలేదని నిరూపించగలరా? టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు(జైల్లో ఉన్న నేపథ్యంలో) తరఫున నారా లోకేశ్, ఆ పార్టీ నాయకులు మీడియా సమక్షంలో చర్చకు సిద్ధమా? లేదంటే చేసిన తప్పునకు ప్రజలకు క్షమాపణ చెప్పాలి. విచారణ నుంచి తప్పించుకోవడానికి చంద్రబాబు పాట్లు పడుతున్నారు. కానీ చంద్రబాబు దోషి అని ప్రజలందరూ విశ్వసిస్తున్నారు' అని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు.

- వివరాలు 3లో

గాజా అష్ట దిగ్బంధం

- రాకెట్లు, డ్రోన్లతో ఇజ్రాయెల్ సైన్యం భీకర దాడులు
- లెబనాన్, సిరియా నుంచి ఇజ్రాయెల్‌పై కొనసాగుతున్న దాడులు
- ఇరువైపులా 2,200 మందికి పైగా మృత్యువాత
- ఇజ్రాయెల్‌లో 1,200, గాజాలో 1,055 మంది బలి

6లో



'క్యాన్సర్ మానిటరింగ్'లో 353 పోస్టుల సృష్టి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రజలకు ప్రభుత్వ రంగంలోనే మెరుగైన, నాణ్యమైన క్యాన్సర్ వైద్య సేవల కల్పనకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. ఈ క్రమంలో విశాఖలో కేజీహెచ్, గుంటూరు జీజీహెచ్, కడప జీజీహెచ్‌లలో క్యాన్సర్ సెంటర్‌లతో పాటు, డీఎంఈ కార్యాలయంలో ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ కోసం ప్రభుత్వం 353 పోస్టులను కొత్తగా సృష్టించింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి డాక్టర్ మంజుల డి.హోస్మని ఉత్తర్వులిచ్చారు. 6 ప్రొఫెసర్, 5 అసోసియేట్, 14 అసిస్టెంట్ ప్రొఫెసర్, 90 స్టాఫ్ నర్స్, 90 జనరల్ డ్యూటీ అటెండెంట్ చొప్పున, మిగిలిన వాటిలో ఇతర పోస్టులను కేటాయించారు. 50 కి.మీ దూరంలో క్యాన్సర్ వైద్యసేవలను అందుబాటులోకి తెచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. లెవల్–1 క్యాన్సర్ సెంటర్‌గా గుంటూరును, లెవల్–2 సెంటర్లుగా కర్నూలు, విశాఖ ఆస్పత్రులను అభివృద్ధి చేస్తున్నారు.

క్లుప్తంగా...

సీఎం జగన్‌ను కలిసిన టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైశ్వాల్



సాక్షి,అమరావతి: సీఎం వైఎస్ జగన్‌ని ప్రపంచ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైశ్వాల్ కలిశారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆమె సీఎంతో భేటీ అయ్యారు. ఆమెతో పాటు సీఎంను కలిసిన వారిలో నైనా జైశ్వాల్ తల్లిదండ్రులు భాగ్యలక్ష్మి జైశ్వాల్, అశ్వనీకుమార్ జైశ్వాల్, సోదరుడు అగస్త్య జైశ్వాల్, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తదితరులున్నారు.

ఎస్వీ వేదిక్ వర్సిటీ వీసీగా రాణి సదాశివమూర్తి

సాక్షి, అమరావతి: తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వేదిక్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా ప్రొఫెసర్ రాణి సదాశివమూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఆమోదంతో దేవదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల్ వలవన్ బుధవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రొఫెసర్ రాణి సదాశివమూర్తి ప్రస్తుతం శ్రీవెంకటేశ్వర వేదిక్ యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌గా ఉన్నారు. ఇక నుంచి పూర్తి స్థాయి వైస్ చాన్సలర్‌గా కొనసాగనున్నారు.

విద్యుత్ ప్రమాద బాధితులకు పరిహారం చెల్లింపు

- 18 మందికి ఒక్కొక్కరికి రూ.5 లక్షలు చొప్పున అందజేత



కర్నూలు(సెంట్రల్): విద్యుత్ ప్రమాద బాధితులను ఆదుకోవాలని ఏపీఎస్‌పీడీసీఎల్‌ను ఏపీ లోకాయుక్త ఆదేశించింది. ఆప్తులను కోల్పోయిన నష్టానికి పరిహారం చెల్లించాలని బాధితులు కోరడం ఎంతమాత్రం తప్పుకాదని, వారిని అన్ని విధాల ఆదుకోవాల్సిన అవసరముందని లోకాయుక్త చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి అన్నారు. ఏపీలోని పలు జిల్లాల్లో జరిగిన విద్యుత్ ప్రమాదాల్లో 18 మంది చనిపోయారు. అయితే వారికి కొన్ని కారణాలరీత్యా పరిహారం చెల్లించలేమని ఏపీఎస్‌పీడీసీఎల్ తిరుపతి, విజయవాడ రీజియన్‌ల చైర్మన్ అండ్ ఎండీలు తిరస్కరించారు. దీంతో బాధితులు లోకాయుక్తను ఆశ్రయించడంతో వారికి పరిహారం ఇవ్వాల్సిందేనని 2023 ఆగస్ట్ 1న చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి ఏపీఎస్‌పీడీసీఎల్‌ను ఆదేశించారు. దీంతో బుధవారం లోకాయుక్త ఆదేశాల మేరకు ఒక్కో బాధితునికి రూ.5 లక్షలు చొప్పున పరిహారం ఇచ్చినట్లు ఏపీఎస్‌పీడీసీఎల్ సంస్థలు నివేదించడంతో కేసును మూసివేస్తున్నట్లు చైర్మన్ తుది తీర్పు చెప్పారు.

ఆర్థిక నేరాల విచారణకు ప్రత్యేక కోర్టులు నెలకొల్పాలి

- జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి

పాత గుంటూరు: ఆర్థిక నేరాలను విచారించడానికి ప్రత్యేకమైన కోర్టు విశాఖలోనే ఉందని, మరో 2 కోర్టులను విజయవాడ, తిరుపతిలో ఏర్పాటు చేయాలని జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి కోరారు. గుంటూరులో ఆయన సీజీఎస్టీ కమీషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా బుధవారం రాష్ట్ర సచివాలయంలో సీఎస్ జవహర్ రెడ్డిని కలిశారు. సీఎస్ మాట్లాడుతూ పన్ను ఎగవేతకు సంబంధించి రాష్ట్రంలో ఆర్థిక నేరాలు పెరుగుతున్నాయని, వీటి పరిష్కారానికి రాష్ట్రంలో మరిన్ని కోర్టులు అవసరమన్నారు. పన్ను ఎగవేతకు పాల్పడేవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దన్నారు. ఆర్థిక నేరాలకు సంబంధించి ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

జడ్జికి బెదిరింపు లేఖ!

- దర్యాప్తు చేస్తున్న కళ్యాణదుర్గం పోలీసులు

కళ్యాణదుర్గం: 'ఇల్లు ఖాళీ చేసి.. కళ్యాణదుర్గం వదలివెళ్లిపో. లేదంటే నీ అంతు చూస్తా' అంటూ అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం జూనియర్ సివిల్ జడ్జి సుభాన్‌కు ఓ ఆగంతకుడు బెదిరింపు లేఖ రాశాడు. ఈ విషయంపై జడ్జి సుభాన్ నేరుగా అనంతపురం జిల్లా జడ్జి, జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దీనిని సీరియస్‌గా తీసుకున్న ఉన్నతాధికారులు.. వెంటనే దర్యాప్తు చేసి దుండగుడిని అరెస్టు చేయాలని కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులును ఆదేశించారు. డీఎస్పీతో పాటు పట్టణ సీఐ తేజమూర్తి.. జడ్జిని కలిసి వివరాలు సేకరించినట్లు తెలిసింది. 10 రోజుల కిందట జరిగిన ఈ విషయం బయటకు పొక్కడంతో మీడియా ప్రతినిధులు ఆరా తీయగా.. కోర్టు సిబ్బంది తోసిపుచ్చారు.

హైకోర్టు జడ్జిలుగా

నలుగురి పేర్లు సిఫార్సు

- హైకోర్టు న్యాయమూర్తి పోస్టులకు నలుగురు న్యాయవాదుల పేర్లు సిఫారసు
- హరినాథ్, కిరణ్మయి, సుమతి, విజయ్ పేర్లు..
- సుప్రీంకోర్టు సీజే జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియం తీర్మానం
- రాష్ట్రపతి ఆమోదం తరువాత కేంద్రం నోటిఫికేషన్ జారీ
- ఈ నలుగురి నియామకంతో 31కి చేరనున్న హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్య



సాక్షి, అమరావతి/సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి పోస్టులకు నలుగురు న్యాయవాదుల పేర్లను కేంద్రానికి సిఫారసు చేస్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల కొలీజియం మంగళవారం సిఫారసు చేసింది. కొలీజియం సిఫారసు చేసిన వారిలో హైకోర్టులో డిప్యూటీ సొలిసిటర్ జనరల్ (డీఎస్‌జీ)గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న నూనేపల్లి హరినాథ్, న్యాయవాది మండవ కిరణ్మయి, ప్రభుత్వ న్యాయవాదిగా వ్యవహరిస్తున్న జగడం సుమతి, న్యాయవాదిగా ఉన్న న్యాపతి విజయ్ ఉన్నారు. ఈ నలుగురి పేర్లకు కేంద్రం ఆమోదముద్ర వేసిన తరువాత ప్రధానమంత్రి కార్యాలయం ద్వారా రాష్ట్రపతికి చేరతాయి. రాష్ట్రపతి ఆమోదముద్ర తరువాత వీరి పేర్లను నోటిఫై చేస్తూ కేంద్ర న్యాయశాఖ నోటిఫికేషన్ జారీచేస్తుంది. వాస్తవానికి ఈ ఏడాది ఫిబ్రవరి 22న హైకోర్టు అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా (ప్రస్తుతం సుప్రీంకోర్టు న్యాయమూర్తి) నేతృత్వంలోని కొలీజియం ఏడుగురు న్యాయవాదుల పేర్లను హైకోర్టు న్యాయమూర్తి పోస్టులకు సిఫారసు చేసింది. హరినాథ్, కిరణ్మయి, సుమతి, విజయ్, యర్రంరెడ్డి నాగిరెడ్డి, ఎస్.రవిప్రసాద్, అశ్వత్థనారాయణ పేర్లను సుప్రీంకోర్టుకు పంపింది. రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి కూడా ఈ పేర్లపై తమ అభిప్రాయాలు పంపారు. అనంతరం కేంద్ర హోంశాఖ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) ద్వారా రహస్య విచారణ జరిపి ఈ ఏడుగురి వివరాలు తెప్పించుకుంది. ఫిబ్రవరి నుంచి ఈ ఏడుగురి పేర్లు కేంద్రం వద్దే పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల ఈ ఏడుగురి పేర్లను కేంద్ర న్యాయశాఖ సుప్రీంకోర్టుకు పంపింది. ఈ ఏడుగురి పేర్లపై చర్చించేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్‌కిషన్ కౌల్, జస్టిస్ సంజీవ్ ఖన్నాలతో కూడిన కొలీజియం మంగళవారం ప్రత్యేకంగా సమావేశమైంది. అంతకుముందే ఈ ఏడుగురి గురించి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో గతంలో న్యాయమూర్తులుగా పనిచేసి ప్రస్తుతం సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా ఉన్నవారి అభిప్రాయాలు కూడా తీసుకుంది. మంగళవారం జరిగిన కొలీజియం సమావేశంలో హరినాథ్, కిరణ్మయి, సుమతి, విజయ్ పేర్లకు ఆమోదం తెలిపింది. న్యాయమూర్తులుగా ఈ నలుగురిని నియమించే విషయంలో వీరి నైతికనిష్ఠకు సంబంధించి కేంద్రం నుంచి ఎలాంటి ప్రతికూల నివేదికలు లేవని కొలీజియం తన తీర్మానంలో పేర్కొంది. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నలుగురు హైకోర్టు న్యాయమూర్తులుగా నియామకం అయ్యేందుకు అన్ని రకాలుగా అర్హులని స్పష్టం చేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసి ప్రస్తుతం సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ జితేంద్రకుమార్ మహేశ్వరి మాత్రం న్యాయపతి విజయ్ విషయంలో ఎలాంటి అభిప్రాయం వ్యక్తం చేయలేదని కొలీజియం తన తీర్మానంలో పేర్కొంది. ఏడుగురిలో మిగిలిన ముగ్గురి విషయంలో సుప్రీంకోర్టు నిర్ణయం ఏమిటన్నది ప్రస్తుతానికి తెలియరాలేదు. ప్రస్తుతం హైకోర్టులో సీజేతో సహా 27 మంది న్యాయమూర్తులున్నారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు సిఫారసు చేసిన నలుగురి పేర్లకు రాష్ట్రపతి ఆమోదముద్ర వేస్తే హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 31కి చేరుకుంటుంది.

నూనేపల్లి హరినాథ్

క్రిష్ణవేణి, బాలవెంకటరెడ్డి దంపతులకు 1972 జనవరి 12న ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రాతకోటలో జన్మించారు. 1987లో 10వ తరగతి హైదరాబాద్‌లో పూర్తిచేశారు. 1989లో ఇంటర్ పూర్తిచేశారు. 1994లో ఏలూరు సి.ఆర్.రెడ్డి న్యాయకళాశాల నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొంది.. అదే ఏడాది నవంబర్‌లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. సీనియర్ న్యాయవాది ఎస్.రవి వద్ద న్యాయవాదిగా వృత్తి జీవితాన్ని ఆరంభించారు. 2000 సంవత్సరం నుంచి స్వతంత్రంగా ప్రాక్టీస్ మొదలుపెట్టారు. సివిల్, క్రిమినల్, రాజ్యాంగ సంబంధిత కేసుల్లో పట్టు సాధించారు. ఎన్‌సీఎల్‌టీ, డీఆర్‌టీల్లో కూడా కేసులు వాదించారు. హైకోర్టులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తరఫున వాదనలు వినిపించారు. 2001 నుంచి 2004 వరకు హైకోర్టు కేంద్ర ప్రభుత్వ అదనపు స్టాండింగ్ కౌన్సిల్‌గా వ్యవహరించారు. 2010–14 వరకు కేంద్ర ప్రభుత్వ సీనియర్ ప్యానెల్ కౌన్సిల్‌గా విధులు నిర్వర్తించారు. 2012లో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 2015లో నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. 2020 నుంచి హైకోర్టులో డిప్యూటీ సొలిసిటర్ జనరల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

మండవ కిరణ్మయి

మండవ ఝాన్సీ, రామలింగేశ్వరరావు దంపతులకు 1970 జూలై 30న కృష్ణాజిల్లా కూచిపూడిలో జన్మించారు. ప్రాథమిక విద్యను కృష్ణాజిల్లా మొవ్వ మండలం బార్లపూడిలోను, సెకండరీ విద్యను విజయవాడలోను పూర్తిచేశారు. సికింద్రాబాద్ వెస్లీ ఉమెన్స్ కాలేజీలో ఇంటర్ చదివారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొంది.. 1994లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. ఇన్‌కంట్యాక్స్ కేసుల్లో మంచి పేరున్న జె.వి.ప్రసాద్ వద్ద న్యాయవాద వృత్తి జీవితాన్ని ఆరంభించారు. 2003లో ఆదాయపన్ను శాఖ జూనియర్ స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితులయ్యారు. 2016లో సీనియర్ స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితులయ్యారు. ఎక్కువగా ఇన్‌కంట్యాక్స్ సంబంధిత కేసులనే వాదించారు. ఐదువేలకు పైగా కేసుల్లో హైకోర్టు ముందు వాదనలు వినిపించారు. మొత్తం 23 సంవత్సరాల అనుభవంలో 14 సంవత్సరాలు ఆదాయపన్ను శాఖకు న్యాయవాదిగా వ్యవహరించారు.

న్యాపతి విజయ్

న్యాపతి ప్రమీల, సుబ్బారావు దంపతులకు 1974 ఆగస్టు 8న రాజమండ్రిలో జన్మించారు. అక్కడే ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తిచేశారు. 1997లో ఆంధ్రా యూనివర్సిటీ నుంచి లా డిగ్రీ పొంది.. 1998లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. ప్రస్తుతం హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావు వద్ద న్యాయవాదిగా వృత్తి జీవితాన్ని ఆరంభించారు. 2012 నుంచి స్వతంత్రంగా ప్రాక్టీస్ మొదలు పెట్టారు. సివిల్, క్రిమినల్, రెవెన్యూ, ట్యాక్స్, పర్యావరణ సంబంధిత కేసుల్లో మంచిపట్టు సాధించారు. క్రికెట్ అంటే ఎంతో మక్కువ. న్యాయవాదుల తరఫున ఎన్నో టోర్నమెంట్స్‌లో పాల్గొన్నారు.

జగడం సుమతి

జానకి, లక్ష్మీపతి దంపతులకు 1971 జూన్ 28న హైదరాబాద్‌లో జన్మించారు. తండ్రి లక్ష్మీపతి అకౌంటెంట్ జనరల్ (ఏజీ) కార్యాలయంలో డిప్యూటీ అకౌంటెంట్ జనరల్‌గా పనిచేశారు. సోదరులు, సోదరీమణులు ఉన్నతస్థానాల్లో స్థిరపడ్డారు. స్వస్థలం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పాండువారిపేట గ్రామం. 1 నుంచి 10వ తరగతి వరకు హైదరాబాద్ హోలీమేరి గరల్స్ హైస్కూల్‌లో చదివారు. ఇంటర్ జి.పుల్లారెడ్డి కాలేజీలో పూర్తిచేశారు. ఉస్మానియా వర్సిటీలో బీఏ పూర్తి చేసి, అదే వర్సిటీ నుంచి లా డిగ్రీ పొందారు. 1998లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. సీనియర్ న్యాయవాది బొజ్జా తారకం వద్ద వృత్తి జీవితాన్ని ఆరంభించారు. న్యాయవాది జి.వి.శివాజీ వద్ద కూడా జూనియర్‌గా పనిచేశారు. 2004–2009 వరకు హైకోర్టులో ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా పనిచేశారు. 2019లో జిల్లా, మండల పరిషత్‌లు, గ్రామ పంచాయతీలకు స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితులయ్యారు. 2020 నుంచి హైకోర్టులో జీపీగా కొనసాగుతున్నారు.

పేదింటి పండుగ

మొదటి పేజీ తరువాయి

అన్ని జిల్లాల్లో ఈ కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరగనున్నాయి.

ఉచితంగా స్థలం.. ఆపై అమిత సాయం

ఇళ్ల లబ్ధిదారులకు ఖరీదైన స్థలాలను ఉచితంగా పంపిణీ చేసిన సీఎం జగన్ ప్రభుత్వం అక్కడితో సరిపుచ్చకుండా మరో అడుగు ముందుకు వేసింది. ఇంటి నిర్మాణానికి యూనిట్‌కు రూ.1.80 లక్షలు బిల్లు మంజూరు చేస్తోంది. స్వయం సహాయక బృందాల ద్వారా లబ్ధిదారులైన మహిళలకు పావలా వడ్డీకి రూ.35 వేలు రుణ సాయం చేస్తున్నారు. ఉచితంగా ఇసుకను పంపిణీ చేయడం ద్వారా రూ.15 వేలు, స్టీల్, సిమెంట్, ఇలా 12 రకాల నిర్మాణ సామగ్రిని సబ్సిడీపై సరఫరా చేయడం ద్వారా మరో రూ.40 వేలు చొప్పున మొత్తంగా రూ.2.70 లక్షల చొప్పున అదనంగా లబ్ధి చేకూరుస్తున్నారు.

వసతుల రూపంలో మరో రూ.1.7 లక్షలు

ఉచితంగా స్థలంతోపాటు ఇంటి నిర్మాణానికి రూ.2.70 లక్షల చొప్పున ప్రయోజనం చేకూరుస్తూనే ప్రతి ఇంటికి ఉచితంగా మౌలిక సదుపాయాల కల్పన ద్వారా మరో రూ.1.70 లక్షల మేరకు అదనపు లబ్ధిని ప్రభుత్వం కల్పిస్తోంది. జగనన్న కాలనీల్లో ఉచితంగా నీటి, విద్యుత్ సరఫరా కనెక్షన్లు ఇవ్వడం, డ్రైన్లు, రోడ్లు లాంటి సకల వసతులను ప్రభుత్వం సమకూరుస్తోంది.




రాష్ట్రంలో వైఎస్సార్ జగనన్న కాలనీల సంఖ్య **17,005**

మొత్తం నిర్మాణం: 71,811.49 ఎకరాల్లో

పేదలకు పంపిణీ చేసిన స్థలాల మార్కెట్ విలువ (ప్రాంతాన్ని బట్టి): రూ.2.5 లక్షల నుంచి రూ.5 లక్షల పైగానే

పేదలకు ప్రభుత్వం ఇచ్చిన భూమి విలువ: రూ.75 వేల కోట్ల నుంచి రూ.1.5 లక్షల కోట్లు



	నిర్మాణం పూర్తయినవి	నిర్మాణంలో ఉన్నవి
1 సాధారణ ఇళ్లు	5,85,829	13.27 లక్షలు
2 టిడ్కో ఇళ్లు	1,57,566	1.04 లక్షలు

గృహ నిర్మాణాలకు ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు 21.76 లక్షలకు పైగా — సాధారణ ఇళ్లు 19.13 లక్షలు; టిడ్కో ఇళ్లు 2.62 లక్షలు

జగనన్న కాలనీల్లో శాశ్వత సదుపాయాల కల్పన

వ్యయం (రూ.కోట్లలో..)

- నీటి సరఫరా: 3,847.18
- విద్యుత్: 4,431.26
- ఇంటర్నెట్: 707.48
- రోడ్స్: 10,408
- డ్రైన్లు: 5,927.78
- ఆర్చ్‌లు: 347.34
- ఇంకుడు గుంతలు: 108
- ఫేజ్ 2- 7,131.96
- మొత్తం: 32,909

పథకం అమలులో కీలక ఘట్టాలు ఇలా



2020 డిసెంబర్: 25 లక్షల ఇళ్ల స్థలాల పంపిణీ. తొలిదశలో 15.60 లక్షల ఇళ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు.

28 ఏప్రిల్ 2022: పథకంలో రెండో దశకు శ్రీకారం. 1.24 లక్షల ఇళ్ల పట్టాలు పంపిణీ. 3.53 లక్షల ఇళ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు.

27 మే 2023: సీఆర్‌డీఏలో రూ.3,506 కోట్ల మార్కెట్ విలువ కలిగిన 1,402.58 ఎకరాల భూమి 50,793 మంది అక్కచెల్లెమ్మలకు పంపిణీ.

24 జూలై 2023: సీఆర్‌డీఏలో 47,071 పేదల ఇళ్ల నిర్మాణాలకు సీఎం జగన్ శంకుస్థాపన.

పార్కులు.. జిమ్.. కళ్లు చెదిరే కాలనీ!



పిల్లల కోసం ప్రత్యేకంగా పార్కులు.. వ్యాయామం కోసం జిమ్ సదుపాయాలతో కాకినాడ జిల్లా సామర్లకోట–ప్రత్తిపాడు రోడ్డులో అందంగా రూపుదిద్దుకున్న జగనన్న కాలనీని చూస్తే కళ్లు తిప్పుకోలేరు! లే అవుట్ అభివృద్ధికి ఏకంగా రూ.15 కోట్లు కేటాయించారు. రూ.4 కోట్లతో విద్యుత్తు సబ్ స్టేషన్, మూడు అంగన్‌వాడీ కేంద్రాల భవనాలను నిర్మించారు. పిల్లలకు ఆహ్లాదం కోసం ఏకంగా ఏడు పార్కులను నిర్మించడం విశేషం. ఇందులో ఓపెన్ జిమ్, చిల్డ్రన్ పార్కులు కూడా ఉన్నాయి. సామర్లకోట ఈటీసీ లేఅవుట్‌లో సుమారు 52 ఎకరాల్లో 2,412 మందికి మొదటి విడతలో ఇళ్లు మంజూరు చేశారు. 824 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. షేర్‌వాల్ టెక్నాలజీ ద్వారా నిర్మాణాలను పూర్తి చేశారు. కాలనీలో ఇళ్లను సీఎం జగన్ సందర్శించనున్నట్లు అధికారులు తెలిపారు. ఫోటో ఎగ్జిబిషన్‌ను కూడా తిలకిస్తారు. నవరత్నాలు–పేదలకు ఇళ్లు పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా నిర్మించిన జగనన్న ఇళ్లలో సామూహిక గృహ ప్రవేశ కార్యక్రమాన్ని గురువారం ఉదయం ఇక్కడి నుంచే ప్రారంభించనున్నారు. – సామర్లకోట

ప్రతి అడుగులో అన్నదాత సంక్షేమం

వ్యవసాయం, అనుబంధ రంగాలపై సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్



సమీక్షలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: చిరు ధాన్యాలను (మిల్లెట్స్) సాగు చేసే రైతులకు తోడుగా నిలిచేలా చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఏర్పాటు చేస్తున్న యూనిట్లను వినియోగించుకుంటూ మిల్లెట్స్‌ను ప్రాసెస్ చేయాలన్నారు. ఏటా రైతుల నుంచి తృణ ధాన్యాల కొనుగోలు పెరిగే అవకాశాలున్నందున ఆ మేరకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటును ప్రోత్సహించాలని సూచించారు. పీడీఎస్ (రేషన్ షాపులు) ద్వారా మిల్లెట్లను ప్రజలకు విస్తృతంగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకుని వాటి వినియోగం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై కరపత్రాల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాలతో పాటు పౌరసరఫరాల శాఖలపై బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్ సమీక్షించి పలు సూచనలు చేశారు.

పంట వేసే ముందే భూసార పరీక్షలు

ఏటా సీజన్‌లో పంటలు వేయటానికి ముందే తప్పనిసరిగా భూసార పరీక్షలు చేసి వాటి ఫలితాలతో కూడిన సర్టిఫికెట్లను రైతులకు అందించేలా చర్యలు తీసుకోవాలి. ఆర్బీకేల స్థాయిలో భూసార పరీక్షలు చేసే విధంగా అధికారులు అడుగులు ముందుకేయాలి. అందుకు అవసరమైన పరికరాలను ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచేలా చూడాలి. ముందుగానే భూసార పరీక్షలు చేయడం ద్వారా ఏ పంటలు వేయాలి? ఏయే రకాల ఎరువులు ఎంత మోతాదులో వేయాలన్న దానిపై రైతులకు అవగాహన కల్పిస్తూ పూర్తి వివరాలు అందించేలా ఉండాలి. దీనివల్ల అవసరమైన మేరకు మాత్రమే ఎరువుల ను వినియోగిస్తారు. తద్వారా రైతులకు పెట్టుబడి ఖర్చులు కలిసి వస్తాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. 2023–24 సీజన్‌కు సంబంధించి ''వైఎస్సార్ రైతు భరోసా'' రెండో విడత పెట్టుబడి సాయాన్ని నవంబర్ మొదటి వారంలో పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేయాలి. మన ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ నాలుగున్నరేళ్లలో పథకం ద్వారా రైతులకు రూ.31,005.04 కోట్లు అందజేసి తోడుగా నిలిచాం.

సుస్థిర జీవనోపాధి మార్గాలపై దృష్టి


వ్యవసాయంతో పాటు పాడిపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్న వారిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. వారికి సుస్థిర జీవనోపాధి మార్గాల కల్పనపై సమీక్ష జరగాలి. వ్యవసాయమే కాకుండా అనుబంధ రంగాల్లో మహిళలకు స్వయం ఉపాధి మార్గాలు బలోపేతం కావాలి. వైఎస్సార్ చేయూత కింద ఏటా ఇస్తున్న డబ్బులకు అదనంగా బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించడం ద్వారా పాడి సహా ఇతర స్వయం ఉపాధి మార్గాలను చూపాలి. తద్వారా గ్రామీణ మహిళల ఆర్థిక స్థితిగతులు ఎంతగానో మెరుగుపడతాయి. ఇప్పటికే మంజూరు చేసిన యూనిట్లు విజయవంతంగా నడిచేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. జగనన్న పాల వెల్లువ పథకం కింద అమూల్ ద్వారా పాల సేకరణ చేస్తున్నాం. ఈ కార్యక్రమం ద్వారా లక్షలాది మంది మహిళా పాడి రైతులు లబ్ధి పొందుతున్నారు. దీన్ని మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మీపై ఉంది. రాష్ట్రంలో మూగజీవాలకు పశుగ్రాసం, దాణా కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆర్బీకేను యూనిట్‌గా తీసుకుని సంపూర్ణ మిశ్రమ దాణాను అందించేందుకు చర్యలు తీసుకోవాలి.

ముందస్తు రబీ.. 10 లక్షల ఎకరాల్లో సాగు

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ముందస్తు రబీలో 10 లక్షల ఎకరాల్లో పంటలు వేసే అవకాశం ఉన్నట్లు సమీక్షలో అధికారులు వెల్లడించారు. ఖరీఫ్ పంటలు సాగవని ప్రాంతాల్లో రైతులు ముందస్తు రబీకి సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే శనగ సహా ఇతర అన్ని రకాల విత్తనాలను ఆర్బీకే స్థాయిలో అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. రబీలో సాగుచేసే శనగ విత్తనాలపై సబ్సిడీని 25 శాతం నుంచి 40 శాతానికి పెంచామన్నారు. విత్తనాల పంపిణీ చురుగ్గా సాగుతోందని, సుమారు లక్ష క్వింటాళ్ల శనగ విత్తనాలను సిద్ధం చేయగా, ఇప్పటికే 45 వేల క్వింటాళ్లను రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఎరువుల లభ్యతలో ఎలాంటి సమస్యా లేదని, రబీ సీజన్‌లో రైతుల అవసరాలకు తగిన విధంగా నిల్వలున్నాయని స్పష్టం చేశారు. ఖరీఫ్‌కు సంబంధించి ఇప్పటికే 85 శాతం ఇ–క్రాప్ పూర్తి చేశామని, అక్టోబరు 15 లోగా వంద శాతం లక్ష్యంగా ముందుకెళ్తున్నామన్నారు. జూన్, ఆగస్టులో వర్షాలు లేకపోవడం పంటల సాగుపై కొంత మేర ప్రభావం చూపిందన్నారు. ఈ కారణంగానే ఖరీఫ్ సీజన్‌లో 73 శాతం మేర పంటలు సాగైనట్లు చెప్పారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, తాడేపల్లిలోని డీఆర్‌ఓజీఓ– ఆర్‌టీపీఓ కేంద్రాల్లో ఔత్సాహికులైన వారికి కిసాన్ డ్రోన్లపై శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. ఇప్పటివరకూ 422 మందికి శిక్షణ అందించామన్నారు. నవంబర్ మూడోవారం నాటికి నాటికి మండలానికి ఒకరు చొప్పున శిక్షణ పూర్తవుతుందని, వీరి ద్వారా మిగతా వారికి శిక్షణ ఇప్పించే కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. సమీక్షలో వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, పాడి పరిశ్రమ మత్స్య శాఖల మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, ఏపీ అగ్రిమిషన్ వైస్ చైర్మన్ ఎంవీయస్ నాగిరెడ్డి, వ్యవసాయశాఖ సలహాదారు తిరుపాల్‌రెడ్డి, సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, వ్యవసాయశాఖ స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది, వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్, ఉద్యానవనశాఖ కమిషనర్ డాక్టర్ శ్రీధర్, ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ డాక్టర్ గెడ్డం శేఖర్‌బాబు, పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్, పౌరసరఫరాల సంస్థ ఎండీ వీరపాండియన్, పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ అమరేంద్రకుమార్, పౌరసరఫరాలశాఖ డైరెక్టర్ విజయ సునీత పాల్గొన్నారు.

ఇన్ఫోసిస్ రాకతో విశాఖకు మరిన్ని ఐటీ కంపెనీలు

- 16న విశాఖలో ఇన్ఫోసిస్ కార్యాలయాన్ని ప్రారంభించనున్న సీఎం జగన్
- రాష్ట్ర పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



సీతమ్మధార(విశాఖ ఉత్తర): ప్రముఖ ఐటీ దిగ్గజ సంస్థ ఇన్ఫోసిస్ తమ అతి పెద్ద కార్యాలయాన్ని విశాఖపట్నంలో ఏర్పాటు చేయడం వల్ల మరిన్ని ఐటీ కంపెనీలు తరలివస్తాయని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. వచ్చే ఐదేళ్లలో రెండు లక్షల నుంచి ఐదు లక్షల మందికి ఐటీ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఐటీ పరిశ్రమను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గత ఏడాది ఇన్ఫోసిస్ యాజమాన్యంతో చర్చలు జరిపారని తెలిపారు. అందువల్లే విశాఖలో అతిపెద్ద కార్యాలయం ఏర్పాటు చేయడానికి ఇన్ఫోసిస్ సంస్థ ముందుకువచ్చిందని వివరించారు. ఈ నెల 16వ తేదీన సీఎం వైఎస్ జగన్ విశాఖలో ఇన్ఫోసిస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తారని మంత్రి చెప్పారు. కంచరపాలెం పాలిటెక్నిక్ కాలేజీలో ఏర్పాటుచేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను కూడా ప్రారంభిస్తారని తెలిపారు. చంద్రబాబుకు రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఎటువంటి ఇబ్బంది లేదని, ఆయనకు ఆరోగ్య సమస్యలు వస్తే వెంటనే పరీక్షించేందుకు డాక్టర్లు 24 గంటలు అందుబాటులో ఉన్నారని పేర్కొన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్డు కుంభకోణంతో తనకు సంబంధం లేదని నారా లోకేశ్ బుకాయిస్తున్నాడని విమర్శించారు. హెరిటేజ్ భూములు కొన్నట్లుగా తనకు తెలియదని చెబుతున్న లోకేశ్... భూముల కొనుగోలు పత్రాలపై ఆయన ఎలా సంతకాలు చేశారని ప్రశ్నించారు.

గ్రామాల్లో సిమెంట్ రోడ్లకు నిధులు

- రూ.421 కోట్ల పనుల పూర్తికి ప్రభుత్వం చర్యలు

సాక్షి, అమరావతి: గ్రామాల్లో అంతర్గత సిమెంట్ రోడ్లు, మురుగు కాల్వలతో పాటు తారు, కంకర రోడ్ల నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వం మరింత వేగవంతం చేసింది. మండలాల వారీగా చకచకా కొత్త పనులు మంజూరు చేస్తోంది. వచ్చే ఏడాది మార్చి నెలాఖరులోగా మొత్తం రూ.421.80 కోట్ల వ్యయంతో గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు, తారు, కంకర రోడ్ల నిర్మాణ పనులు చేపట్టేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జూలై 10న ఉత్తర్వులిచ్చింది. ఇప్పటివరకు 312 మండలాల నుంచి రూ.195.41 కోట్ల విలువైన సిమెంట్ రోడ్లు, డ్రైనేజీల పనుల కోసం కలెక్టర్ల ద్వారా గ్రామీణాభివృద్ధి శాఖకు ప్రతిపాదనలు అందాయి. వాటిని అధికారులు పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా 79 మండలాల నుంచి అందిన రూ.48 కోట్ల పనులకు అనుమతులు మంజూరు చేశారు. ఉపాధి హామీ పథకం మెటీరియల్ కేటగిరి నిధుల నుంచి మండలానికి రూ.60 లక్షల చొప్పున ప్రభుత్వం ప్రత్యేకంగా కేటాయించింది. 42 గిరిజన మండలాలకు మాత్రం అదనంగా మరో రూ.60 లక్షలు కలిపి.. మొత్తంగా రూ.1.20 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేస్తోంది. నిధుల కేటాయింపుల మేరకు కొత్త పనుల మంజూరు ప్రక్రియ వేగంగా సాగుతోందని గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు తెలిపారు. పనులు పూర్తి సహా బిల్లుల చెల్లింపు ప్రక్రియను సమీక్షించేందుకు గ్రామీణాభివృద్ధి శాఖలో జిల్లాల వారీగా ప్రత్యేకాధికారులను నియమించారు. మరోవైపు.. ప్రభుత్వం ప్రతి వారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే వినతులతో పాటు ప్రజాప్రతినిధుల సూచనల మేరకు ప్రాధాన్యత క్రమంలో పనులను గుర్తిస్తున్నారు. సంబంధిత గ్రామ పంచాయతీల ఆమోదం తర్వాత ఆయా పనుల వివరాలను కలెక్టర్లు.. గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయానికి పంపిస్తున్నారు. జిల్లాల నుంచి వచ్చే ఈ పనుల వివరాలను గ్రామీణాభివృద్ధి శాఖ వెబ్‌పేజీలో నమోదు చేస్తున్నారు. అనంతపురం, అన్నమయ్య, శ్రీసత్యసాయి, ఏలూరు, ప్రకాశం, బాపట్ల, తూర్పు గోదావరి, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి పూర్తి స్థాయిలో వివిధ పనుల ప్రతిపాదనలు గ్రామీణాభివృద్ధి శాఖకు అందినట్లు అధికారులు వెల్లడించారు.

క్లుప్తంగా...

ఓటుకు కోట్లు కేసు విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఓటుకు కోట్లు కేసు విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఈ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబును ముద్దాయిగా చేర్చాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం జస్టిస్ ఎంఎం.సుందరేశ్, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారించింది. సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రా అందుబాటులో లేకపోవడం వల్ల కేసు విచారణను వాయిదా వేయాలని చంద్రబాబు తరఫు న్యాయవాది గుంటూరు ప్రభాకర్.. ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. దీనికి ఎమ్మెల్యే ఆళ్ల తరఫు న్యాయవాది అభ్యంతరం చెబుతూ.. చాలా రోజుల తర్వాత ఈ కేసు జాబితాలోకొచ్చిందని తదుపరి విచారణ తేదీని ఖరారు చేయాలని ధర్మాసనాన్ని అభ్యర్థించారు. దీనికి అనుమతించిన ధర్మాసనం నవంబర్ 8న తదుపరి విచారణ చేపడతామని తెలిపింది.

సీఐడీ విచారణకు నారాయణ అల్లుడు పునీత్

సాక్షి, అమరావతి: ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ కుంభకోణం కేసులో టీడీపీ సీనియర్ నేత, మాజీమంత్రి పి.నారాయణ అల్లుడు పునీత్‌ను బుధవారం సీఐడీ అధికారులు విచారించారు. ప్రధానంగా నారాయణ విద్యాసంస్థల నుంచి నిధుల మళ్లింపు అంశంపై ఆయన్ని ప్రశ్నించారు. ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌ను ఆనుకుని ఉన్న భూముల కొనుగోలు కోసం ఆ నిధులు వెచ్చించినట్టు సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది. బినామీల బ్యాంకు ఖాతాల్లోకి నిధులు మళ్లించి, వారి పేరిట భూములు కొనుగోలు చేశారని సీఐడీ ఆధారాలు సేకరించింది. ఆ ఆధారాలను చూపిస్తూ పునీత్‌ను సీఐడీ అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. పునీత్‌ను గురువారం కూడా విచారించనున్నారు.

పెద్దమ్మతో కలిసి ఫిర్యాదు!

జగన్ ప్రభుత్వం మాపై కక్ష సాధిస్తోంది.. అమిత్ షాను కలిసిన లోకేశ్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం తమపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందంటూ టీడీపీ నేత నారా లోకేశ్ బుధవారం ఢిల్లీలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు ఫిర్యాదు చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, చంద్రబాబు వదిన దగ్గుబాటి పురందేశ్వరి దగ్గరుండి మరీ లోకేశ్‌ను అమిత్‌షా వద్దకు తీసుకెళ్లడం గమనార్హం. వాస్తవానికి ఈ విషయాన్ని లోకేశ్, టీడీపీ నేతలు తొలుత బయటకు చెప్పలేదు. వారి కంటే ముందు పురందేశ్వరి దీన్ని ట్విట్టర్‌లో పోస్టు చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. పురందేశ్వరి సూచనలతోనే బీజేపీ రాష్ట్ర విభాగం అధికారికంగా మీడియా ప్రకటన విడుదల చేయడం కొసమెరుపు.

ఇంతకీ ఆమె ఏ పార్టీకి అధ్యక్షురాలు?

తాను అమిత్ షాను కలిసినట్లు మాత్రమే లోకేశ్ ట్విట్టర్‌లో పోస్టు చేశారు. అయితే ఏపీ బీజేపీ విడుదల చేసిన ప్రకటనలో మాత్రం చంద్రబాబును అరెస్టు చేయడం, విచారణ పేరుతో తనను సీఎం జగన్ ప్రభుత్వం వేధిస్తోందంటూ అమిత్‌షా దృష్టికి లోకేశ్ తీసుకెళ్లినట్లు పేర్కొంది. చివరికి తన తల్లి భువనేశ్వరి, భార్య బ్రాహ్మణిని కూడా ఇబ్బంది పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారంటూ లోకేశ్ ఫిర్యాదు చేసినట్లు ఏపీ బీజేపీ మీడియాకు ప్రకటన విడుదల చేసింది. తాజా పరిణామాలతో ఏపీ బీజేపీ అధ్యక్షురాలిగా ఉన్న పురందేశ్వరి టీడీపీ నాయకురాలిగా వ్యవహరిస్తున్నారంటూ బీజేపీ సీనియర్ నేతలు మండిపడుతున్నారు. బీజేపీని వదిలేసి టీడీపీ తరఫున వకాల్తా పుచ్చుకోవటాన్ని బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఈనాడులో వచ్చిన కథనాల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం, టీడీపీ నాయకులు చేసిన ఆరోపణలనే కేంద్ర ప్రభుత్వానికి లేఖలుగా పంపటాన్ని తప్పుబడుతున్నారు.

'రింగ్' మాస్టర్ అష్ట వంకర్లు

ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో లోకేశ్‌పై సీఐడీ ప్రశ్నల వర్షం

సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను ఎన్ని వంకర్లు తిప్పారో.. ఆ కేసులో నిందితుడు నారా లోకేశ్ సీఐడీ విచారణలో ప్రశ్నలకు అన్ని వంకర్లు తిరిగారు. చంద్రబాబు కుటుంబం, ఆయన అస్మదీయుల భూముల విలువ అమాంతంగా పెరిగేలా ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చిన తీరుపై సీఐడీ అధికారులు అడిగిన సూటి ప్రశ్నలకు లోకేశ్ నేల చూపులు చూశారు. తాను సభ్యుడిగా ఉన్న మంత్రివర్గ ఉప సంఘం ద్వారానే అక్రమాల కథ నడిపిన తీరును సీఐడీ ఆధారాలతో సహా ముందు పెట్టడంతో బిత్తరపోయారు. హెరిటేజ్ భూముల కొనుగోలు, లింగమనేని కుటుంబం నుంచి క్విడ్‌ప్రోకో కింద పొందిన కరకట్ట నివాసంపై ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోయారు. విచారణకు సహకరించకుండా దర్యాప్తును పక్కదారి పట్టించేందుకు యత్నించారు. ఈ కేసులో ఏ–14గా ఉన్న లోకేశ్‌ను సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు రెండో రోజు బుధవారం తాడేపల్లిలోని సీఐడీ కార్యాలయంలో విచారించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాగిన ఈ దర్యాప్తునకు సహకరించకుండా ఉండేందుకు లోకేశ్ అనేక ప్రయత్నాలు చేశారు. అయినా సిట్ బృందం తమదైన శైలిలో కీలక సమాచారాన్ని రాబట్టినట్టు తెలిసింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు ఆయన న్యాయవాది సమీప దూరంలో ఉండగా ఆడియో, వీడియో రికార్డింగ్ నిర్వహిస్తూ అధికారులు లోకేశ్‌ను విచారించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ దర్యాప్తునకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..

అలైన్‌మెంట్ మార్చాలని ఎందుకు ఒత్తిడి చేశారు?

ఇన్నర్ రింగ్ రోడ్డుతో పాటు అమరావతి కోర్ కేపిటల్‌పై టీడీపీ ప్రభుత్వ హయాంలో మంత్రివర్గ ఉప సంఘం ద్వారా అక్రమాల కథ నడిపిన తీరుపై సీఐడీ లోకేశ్‌పై ప్రశ్నల వర్షం కురిపించింది. జూనియర్ మంత్రి అయినప్పటికీ లోకేశ్‌కు ఉప సంఘంలో స్థానం కల్పించడంపై మొదటగా ప్రశ్నించింది. పేరుకు మంత్రివర్గ ఉప సంఘం అయినప్పటికీ ఇతర సభ్యులకంటే అందులో లోకేశ్, నారాయణదే హవా



అని, భూ సమీకరణ, ఇన్నర్‌రింగ్ రోడ్డుకు భూసేకరణపై వారే కీలకంగా వ్యవహరించినట్టు సీఐడీ ఆధారాలు సేకరించింది. వాటిని లోకేశ్‌కు చూపిస్తూ ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చాలని సీఆర్‌డీఏ అధికారులపై ఎందుకు ఒత్తిడి చేశారని ప్రశ్నించింది. తామేమీ ఒత్తిడి చేయలేదని లోకేశ్ బుకాయించారు. మంత్రివర్గ ఉపసంఘం, టీడీపీ ప్రభుత్వ పెద్దల ఒత్తిడితోనే అలైన్‌మెంట్‌ను మార్చినట్లు అప్పటి సీఆర్‌డీఏ అధికారులు వాంగ్మూలం ఇచ్చిన అంశాన్ని సీఐడీ అధికారులు ప్రస్తావించడంతో లోకేశ్ షాక్ తిన్నారు. దాంతో ఆయన నోట మాట రాలేదని సమాచారం. వెంటనే తన న్యాయవాదితో సంప్రదించి చెబుతానని చెప్పారు. న్యాయవాదితో మాట్లాడిన తరువాత కూడా ఆయన ఈ అంశంపై సమాధానం దాట వేసేందుకే ప్రయత్నించారు. ముందుగానే సీఆర్‌డీఏ అధికారులతో ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను ఖరారు చేయించి, దానినే మాస్టర్‌ప్లాన్‌లో చేర్పించి సింగపూర్‌కు చెందిన కన్సల్టెన్సీ ద్వారా ఆమోదింపజేయడం అంటే అక్రమమే కదా.. అని అధికారులు ప్రశ్నించడంతో లోకేశ్ మౌనంగా ఉండిపోయారు. మంత్రివర్గ ఉపసంఘం వ్యవహారం అంతా బూటకమని, ఆ ముసుగులో చంద్రబాబు, నారాయణ, లింగమనేని కుటుంబాల భూముల విలువ అమాంతంగా పెంచుకున్నారని సీఐడీ కీలక ఆధారాలు చూపించడంతో లోకేశ్ నిశ్చేష్టుడయ్యారు.

హెరిటేజ్ భూముల అంశంపై అసహనం

ఇన్నర్ రింగ్ రోడ్డును ఆనుకుని హెరిటేజ్ ఫుడ్స్ భూములు కొన్న అంశంపై సీఐడీ సూటి ప్రశ్నలకు లోకేశ్ తీవ్ర అసహనానికి గురయ్యారు. ఏ ప్రాతిపదికన ఆ ప్రాంతంలో భూములు కొనాలని హెరిటేజ్ ఫుడ్స్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో నిర్ణయం తీసుకున్నారని అధికారులు వేసిన ప్రశ్నకు ఆయన సూటిగా సమాధానమివ్వలేదు. ప్రస్తుతం తాను హెరిటేజ్ ఫుడ్స్‌లో డైరెక్టర్‌గా లేనని, ఆ విషయాలు తనకు తెలియవని అన్నారు. భూములు కొనాలని తీర్మానించిన సమయంలో మీరే డైరెక్టర్‌గా ఉన్నారు కదా అనే ప్రశ్నకు మాత్రం సమాధానం దాటవేయడం గమనార్హం.

కరకట్ట నివాసం అంశంపై కస్సుబుస్సు

లింగమనేని కుటుంబం నుంచి క్విడ్‌ప్రోకో కింద పొందిన కరకట్ట బంగ్లాపై సీఐడీ ప్రశ్నించడంతో లోకేశ్ తత్తరపాటుకు గురై అధికారులపై కస్సుబుస్సులాడారు. ఆ ఇంటికి తాము అద్దె చెల్లించామన్నారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి ఆదాయ పన్ను రిటర్న్‌లను అధికారులు చూపిస్తూ ప్రశ్నించడంతో ఆయన తీవ్ర అసహనానికి గురయ్యారు. **తన తల్లి ఆదాయ పన్ను రిటర్న్‌ను ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు.** దర్యాప్తులో భాగంగా ఏ పత్రాలనైనా సంబంధిత శాఖలను సంప్రదించి తీసుకునే వెసులుబాటు కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థలకు ఉందనే అవగాహన ఆయనకు లేకపోవడం విడ్డూరం. లింగమనేని రమేశ్ ఆ కరకట్ట నివాసాన్ని ఉచితంగా ఇచ్చానని ఓసారి, కాదు దేశ భక్తితో ప్రభుత్వానికి ఉచితంగా ఇచ్చానని మరోసారి చెప్పిన విషయాలను అధికారులు ప్రస్తావించారు. దాంతో అసలు తనకు ఆ కరకట్ట నివాసం గురించి తెలియదని లోకేశ్ బుకాయించారు. మంత్రి హోదాలో మీరు నివసించిన ఇంటి గురించి తెలియదా... అని అధికారులు రెట్టించి అడిగేసరికి సమాధానం దాటవేశారు. ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ కుంభకోణానికి సంబంధించి మరికొన్ని కీలక వ్యవహారాలపై లోకేశ్‌ను సీఐడీ అధికారులు ప్రశ్నించారు. కానీ ఆయన నుంచి సరైన సమాధానం రాలేదు. వీలైనంతవరకు దర్యాప్తునకు సహకరించకుండా విషయాన్ని పక్కదారి పట్టించేందుకే యత్నించారు. పలువురు అధికారుల **పేర్లను ప్రస్తావిస్తూ వారిని ప్రశ్నించాలని సీఐడీకి** సూచించడం హాస్యాస్పదంగా మారింది. దర్యాప్తు అధికారుల ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సిన నిందితుడే ఇతరులను ప్రశ్నించాలని చెబుతుండటం విడ్డూరంగా ఉందని సీఐడీవర్గాలు వ్యాఖ్యానించాయి. అవసరమైతే మరోసారి విచారణకు రావల్సి ఉంటుందని సీఐడీ అధికారులు లోకేశ్‌కు చెప్పి **బుధవారం విచారణ ప్రక్రియను ముగించారు.**

సంబంధం లేని ప్రశ్నలు వేశారు: లోకేశ్

సీఐడీ అధికారులు తనకు ఏమాత్రం సంబంధం లేని ప్రశ్నలు వేశారని లోకేశ్ చెప్పారు. రెండో రోజు విచారణ అనంతరం సీఐడీ కార్యాలయం బయట మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మిస్తే హెరిటేజ్ ఫుడ్స్ భూములు కోల్పోతుందని ఈ విచారణ ద్వారా తనకు తెలిసిందన్నారు. కరకట్ట నివాసానికి తన తల్లి అద్దె చెల్లించారన్నారు. తన తల్లి ఆదాయ పన్ను రిటర్న్‌లను అధికారులు ఎలా సేకరిస్తారని ప్రశ్నించారు. దీనిపై న్యాయ పోరాటం చేస్తానన్నారు. సాక్షి పత్రికలో షేర్లను కొందరు కొన్నట్లుగా తమ హెరిటేజ్ ఫుడ్స్ షేర్లను లింగమనేని కొనలేదని వ్యాఖ్యానించారు.

'సాక్షి' ప్రశ్నలకు తత్తరపాటు

ఇన్నర్ రింగ్ రోడ్డు కుంభకోణంలో లోకేశ్ పాత్రపై 'సాక్షి' ప్రతినిధులు ప్రశ్నించడంతో ఆయన తీవ్ర అసహనానికి గురయ్యారు. సాక్షి పత్రికపై అసత్య ఆరోపణలు చేసి విషయాన్ని పక్కదారి పట్టించేందుకు యత్నించారు. కానీ సాక్షి ప్రతినిధులు సూటి ప్రశ్నలు సంధించడంతో తత్తరపాటుకు గురయ్యారు. ఇతర మీడియా ప్రతినిధుల ప్రశ్నలకు కూడా తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. లోకేశ్‌తో సాక్షి, ఇతర మీడియా ప్రతినిధుల సంభాషణ ఇలా సాగింది..

సాక్షి: మీరు మంత్రివర్గ ఉప సంఘంలో సభ్యుడయ్యాకే ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చారని, హెరిటేజ్ ఫుడ్స్‌కు భూములు కొన్నారన్న అభియోగంపై మీ స్పందన ఏమిటి?

లోకేశ్: మంత్రివర్గ ఉప సంఘం సభ్యుడిగా నేను ఒత్తిడి చేసి ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పులు చేశానని సీఐడీ అంటోంది. కానీ అది నా శాఖకు ప్రమేయం లేని అంశం. అదే చెప్పా.

సాక్షి: ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ హెరిటేజ్ ఫుడ్స్ భూములు ఉన్న కంతేరు వైపు ఎందుకు మళ్లింది?

లోకేశ్: సీఐడీ అధికారులు నాకు బాహుబలి సినిమా చూపించారు. ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ గూగుల్ మ్యాప్ చూపించి ప్రశ్నించారు. ఆ రోడ్డు నిర్మిస్తే హెరిటేజ్ ఫుడ్స్ భూములు కోల్పోతుందని నాకు అర్థమైంది.

సాక్షి: క్విడ్‌ప్రోకో కిందే లింగమనేని మీకు కరకట్ట బంగ్లా ఇచ్చారని సీఐడీ అభియోగం మోపింది కదా?

లోకేశ్: మాకు క్విడ్ ప్రోకో అలవాటు లేదు. అలా మా హెరిటేజ్ ఫుడ్స్‌లో ఎవరూ పెట్టుబడులు పెట్టలేదు.

సాక్షి: మరి మీకు మాత్రమే లింగమనేని ఆ కరకట్ట బంగ్లాను ఎందుకు ఇచ్చారు?

లోకేశ్: ఆ ఇంటికి మేము అద్దె చెల్లిస్తున్నాం. ప్రభుత్వానికి ఆ మేరకు లేఖ కూడా రాశాం.

సాక్షి: అదే నిజమైతే 2019కు ముందు ఎందుకు అద్దె చెల్లించలేదు?

లోకేశ్: (వెంటనే సమాధానం చెప్పలేక మౌనం వహించారు. కాసేపటికి తేరుకుని..) ఆ విషయం నాకు తెలీదు. నాకు తెలిసినంతవరకు ఇప్పుడు అద్దె చెల్లిస్తున్నాం. మా అమ్మ ఐటీ రిటర్న్ రికార్డులు సీఐడీకి ఎలా వచ్చాయి? దీనిపై న్యాయపోరాటం చేస్తాం.

సాక్షి: మీ సన్నిహితుడు కిలారు రాజేశ్ ఎందుకు పరారయ్యారు?

లోకేశ్: ఆయన గురించి నాకేం తెలుస్తుంది? ఎక్కడ ఉన్నారో నాకు తెలీదు

ఇతర మీడియా ప్రతినిధులు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వ్యవస్థలను మేనేజ్ చేసి చంద్రబాబును జైలుకు పంపారు అని మీరు అంటున్నారు. జ్యుడిషియల్ రిమాండ్ విధించేది కోర్టులు కదా?

లోకేశ్: ఈ కేసులో ఎఫ్ఐఆర్ వేసింది జగన్ ప్రభుత్వమే. అన్ని వ్యవస్థలను మేనేజ్ చేసి చంద్రబాబును జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపారు.

మీడియా ప్రతినిధులు: మీరు మళ్లీ ఢిల్లీ వెళ్లిపోతారా?

లోకేశ్: నేను ఎక్కడికి వెళ్తానో మీకు చెప్పాలా? అది మీకు అనవసరం. నేను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిని. ఎక్కడికి వెళ్లినా షెడ్యూల్ ఇస్తా.

ఫైబర్ నెట్ కుంభకోణం సూత్రధారి బాబే

- నిబంధనలకు విరుద్ధంగా టెండర్ల కేటాయింపు
- అస్మదీయ కంపెనీలకు అక్రమ నిధుల మళ్లింపు
- అందుకే అరెస్ట్ చేసేందుకు పీటీ వారెంట్‌ను ఆమోదించండి
- న్యాయస్థానాన్ని కోరిన సీఐడీ
- చంద్రబాబు న్యాయవాదుల పిటిషన్‌ను తిరస్కరించిన కోర్టు
- నేడు తీర్పు

సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో ఫైబర్ నెట్ ప్రాజెక్ట్ టెండర్ల కేటాయింపులో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు భారీ అవినీతికి పాల్పడ్డారని సీఐడీ.. న్యాయస్థానానికి నివేదించింది. పరస్పర ప్రయోజనాల నిరోధక చట్టాన్ని ఉల్లంఘించి మరీ అస్మదీయుల కంపెనీ టెరాసాఫ్ట్‌కు టెండర్లు కట్టబెట్టారని ఆధారాలతో సహా వెల్లడించింది. ఇప్పటికే స్కిల్ స్కామ్ కేసులో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న చంద్రబాబును ఫైబర్ నెట్ కుంభకోణం కేసులో అరెస్ట్ చేసేందుకు పీటీ వారెంట్‌ను ఆమోదించాలని న్యాయస్థానాన్ని కోరింది. ఫైబర్ నెట్ కుంభకోణంలో చంద్రబాబును అరెస్ట్ చేసేందుకు పీటీ వారెంట్ జారీ చేయాలన్న సీఐడీ పిటిషన్‌ను విజయవాడ ఏసీబీ న్యాయస్థానం బుధవారం విచారించింది. ఈ కేసులో తమ వాదనలు వినాలని చంద్రబాబు న్యాయవాదులు దాఖలు చేసిన 'రైట్ టు ఆడియెన్స్' పిటిషన్‌ను న్యాయస్థానం తిరస్కరించింది. అనంతరం సీఐడీ తరఫున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ వివేకానంద వాదనలు వినిపిస్తూ.. చంద్రబాబు సన్నిహితుడైన వేమూరి హరికృష్ణకు చెందిన టెరాసాఫ్ట్ కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా టెండర్లు కట్టబెట్టారని చెప్పారు. ఏపీ ఈ-గవర్నెన్స్ కౌన్సిల్‌లో డైరెక్టర్‌గా ఉన్న వేమూరి హరికృష్ణను ఈ ప్రాజెక్ట్ టెండర్ల టెక్నికల్ ఎవాల్యుయేషన్ కమిటీలో సభ్యుడిగా చేర్చారన్నారు. ఆయన కంపెనీ టెరాసాఫ్ట్ టెండర్లలో పాల్గొంటుండగా ఆయన్నే కమిటీలో చేర్చడం పరస్పర ప్రయోజనాల నిరోధక చట్టానికి విరుద్ధమని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. బ్లాక్ లిస్టులో ఉన్న టెరాసాఫ్ట్ కంపెనీకి టెండర్లలో పాల్గొనే అవకాశం కల్పించడం ద్వారా అవినీతికి దారులు తెరిచారని తెలిపారు. అంతేగాక నిబంధనలకు విరుద్ధంగా టెండర్ల గడువును వారం రోజులు పొడిగించారని చెప్పారు. మనీ ల్యాండరింగ్‌కు పాల్పడుతూ 10 బ్యాంకు ఖాతాల్లోకి రూ.114 కోట్ల అక్రమ నిధులు మళ్లించినట్టు సీఐడీ దర్యాప్తులో వెల్లడైందని తెలిపారు. ఫాస్ట్‌లేన్ కంపెనీ, టెరాసాఫ్ట్, ఫ్యూచర్ స్పేస్, అభిజ్ఞ, నీలిమ, నెట్ ఇండియా, కోఫెల్, నెట్‌టాప్స్ అనే కంపెనీలకు చెందిన మొత్తం 10 ఖాతాలకు అక్రమంగా రూ.114 కోట్లు మళ్లించిన వివరాలను కోర్టుకు సమర్పించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి పదవిని దుర్వినియోగం చేస్తూ కుంభకోణంలో కీలకపాత్ర పోషించడం ద్వారా ప్రజాధనం దోపిడీకి పాల్పడ్డారని చెప్పారు. ఈ కేసులో మరింత సమగ్ర దర్యాప్తునకు ఆయన్ని అరెస్ట్‌చేయాల్సిన అవసరం ఉన్నందున పీటీ వారెంట్‌ను ఆమోదించాలని ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ వివేకానంద కోరారు. ఈ కేసులో వాదనలు పూర్తికావడంతో న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. గురువారం తీర్పు వెలువరించనుంది.

ఇన్నర్ కేసులో చంద్రబాబుకు తాత్కాలిక ఊరట

▶ మొదటి పేజీ తరువాయి

వాదనలు వినిపించారు. సీఐడీ తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్, స్పెషల్ పీపీ యడవల్లి నాగవివేకానంద వాదించారు.

అప్పటివరకు రక్షణ కల్పించండి..

అంతకుముందు సిద్దార్థ లూథ్రా తదితరులు వాదనలు వినిపిస్తూ.. 2022లో కేసు నమోదు చేశారని, ఇప్పటివరకు చంద్రబాబుకు ఎలాంటి నోటీసు ఇవ్వడంగానీ, విచారణకు పిలవడంగానీ చేయలేదని చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబుకు ఏసీబీ కోర్టు రిమాండ్ విధించిన తరువాతే ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో సీఐడీ పీటీ వారెంట్ దాఖలు చేసిందన్నారు. పీటీ వారెంట్‌పై ఏసీబీ కోర్టు విచారించి చంద్రబాబు కస్టడీకి అనుమతినిస్తే తాము దాఖలు చేసిన ఈ ముందస్తు బెయిల్ పిటిషన్ నిరర్థకం అవుతుందని చెప్పారు. డీమ్డ్ కస్టడీగా పరిగణించలేమని హైకోర్టు చెప్పిన నేపథ్యంలోనే తాము ఈ ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశామని తెలిపారు. అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తూ ఉత్తర్వులు జారీచేయాలని కోరారు. విచారణను ఈ నెల 16కి వాయిదా వేయాలని, అప్పటి వరకు రక్షణ కల్పించాలని కోరారు.

ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వొద్దు..

తరువాత సీఐడీ తరఫున ఏజీ శ్రీరామ్ తదితరులు వాదనలు వినిపిస్తూ.. వాదనలు వినిపించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఒకవేళ విచారణను 16కి వాయిదా వేస్తే పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని కోర్టుకు తెలిపారు. ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో బెయిల్ కోసం చంద్రబాబు గతంలో దాఖలు చేసిన పిటిషన్‌లోనే తాము అన్ని వివరాలతో కౌంటర్ దాఖలు చేశామన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎలాంటి మార్పు లేదని చెప్పారు. చంద్రబాబు కస్టడీ కోసం సీఐడీ దాఖలు చేసిన పీటీ వారెంట్ నెలరోజులుగా ఏసీబీ కోర్టులో పెండింగ్‌లో ఉందన్నారు. ఫైబర్ గ్రిడ్ కేసులో హైకోర్టు ఇప్పటికే చంద్రబాబు ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టేసిందని తెలిపారు. పీటీ వారెంట్‌పై విచారణ కొనసాగించుకోవచ్చునని హైకోర్టు ఇప్పటికే ఉత్తర్వులిచ్చిందని చెప్పారు. ఫైబర్ గ్రిడ్ కేసుకు, ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసుకు సారూప్యత ఉందని వివరించారు. చంద్రబాబు కోరుకున్న విధంగా ఈ కేసులో ఏ రక్షణ కల్పించినా, గత ఉత్తర్వులకు భిన్నంగా వ్యవహరించినట్లవుతుందని చెప్పారు. ఏసీబీ కోర్టులో పీటీ వారెంట్‌పై జరుగుతున్న విచారణను కొనసాగనివ్వాలని కోరారు. చంద్రబాబుకు అనుకూలంగా ఏ రకమైన ఉత్తర్వులు ఇవ్వాల్సిన అవసరం లేదని కోర్టుకు విన్నవించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి ఈ నెల 16వ తేదీ వరకు పీటీ వారెంట్ విషయంలో ఏరకంగానూ ముందుకెళ్లొద్దని ఏసీబీ కోర్టును ఆదేశించారు. విచారణను అదే రోజుకు వాయిదా వేశారు.

అంగళ్లు కేసులో పిటిషన్‌పై విచారణ నేటికి వాయిదా

అన్నమయ్య జిల్లా అంగళ్లు వద్ద టీడీపీ శ్రేణులు సాగించిన విధ్వంసం కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఈ నెల 12వ తేదీ వరకు అరెస్ట్ చేయబోమని ముదివీడు పోలీసులు హైకోర్టుకు నివేదించారు. అలాగే ఈ కేసులో చంద్రబాబుపై అదేరోజు వరకు పీటీ వారెంట్ కూడా దాఖలు చేయబోమని పోలీసుల తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ దుష్యంత్‌రెడ్డి కోర్టుకు చెప్పారు. ఈ కేసులో అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదనలు వినిపించనున్నారని, అందువల్ల విచారణను గురువారానికి వాయిదా వేయాలని కోరారు. వాయిదాకు చంద్రబాబు తరఫు న్యాయవాదులు సైతం అభ్యంతరం చెప్పలేదు. దీంతో న్యాయస్థానం విచారణను గురువారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. అంగళ్ల కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ చంద్రబాబు మంగళవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

స్కిల్ కుంభకోణంలో బెయిలివ్వాలని చంద్రబాబు పిటిషన్.. నేడు విచారణ

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో తనకు బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరిస్తూ ఏసీబీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ చంద్రబాబునాయుడు హైకోర్టులో బుధవారం పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం తేలేంతవరకు కనీసం మధ్యంతర బెయిల్ అయినా మంజూరు చేయాలని కోర్టును అభ్యర్థించారు. తాను చట్టాన్ని గౌరవించే వ్యక్తిని, సీఐడీ దర్యాప్తునకు అన్ని విధాలుగా సహకరిస్తానని పిటిషన్‌లో పేర్కొన్నారు. బెయిల్ మంజూరు సందర్భంగా ఎలాంటి షరతులు విధించినా వాటికి కట్టుబడి ఉంటానని తెలిపారు. కస్టడీ తరువాత తాను దాఖలు చేస్తున్న తొలి బెయిల్ పిటిషన్ ఇదేనన్నారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే ఈ కేసు నమోదు చేశారని తెలిపారు. ఈ వ్యాజ్యంపై హైకోర్టు గురువారం విచారించనుంది.

స్కిల్ స్కాంలో నేరం జరగలేదని నిరూపించగలరా?

మీడియా సమక్షంలో ఈ స్కాంపై చర్చకు సిద్ధమా?

వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో నేరం జరగలేదని నిరూపించగలరా? ఒక్క ఆధారమైనా చూపించగలరా అని టీడీపీ నేతలకు వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి సవాల్ విసిరారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు (జైల్లో ఉన్న నేపథ్యంలో) తరఫున నారా లోకేశ్, ఆ పార్టీ నాయకులు మీడియా సమక్షంలో చర్చకు సిద్ధమా అని చాలెంజ్ చేశారు. లేదంటే చేసిన తప్పునకు ప్రజలకు క్షమాపణ చెప్పాలని, అప్పుడే టీడీపీకి ప్రజల ముందుకు వెళ్లే అర్హత వస్తుందని హితోపదేశం చేశారు. ఆయన బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ స్కిల్ స్కాంలో సాక్ష్యాధారాలు బలంగా ఉన్నందువల్లే చంద్రబాబును కోర్టు రిమాండ్‌కు పంపిందన్నారు. ప్రొటోకాల్ ప్రకారం అరెస్టు చేయలేదనే చంద్రబాబు న్యాయవాదులు కోర్టుల్లో వాదిస్తున్నారేగానీ నేరం జరగలేదని చెప్పడంలేదని గుర్తుచేశారు. టీడీపీ నాయకులు కూడా రాజకీయంగా ఎదుర్కోలేక బాబును అరెస్ట్ చేశారంటున్నారని, నేరం జరగలేదని చెప్పడంలేదని అన్నారు. సజ్జల రామకృష్ణారెడ్డి ఇంకా ఏమన్నారంటే...

లేని ప్రాజెక్టును ఉన్నట్లుగా చూపించి ప్రభుత్వ ఖజానా నుంచి రూ.371 కోట్లు కొట్టేసేందుకే చంద్రబాబు ఈ పథకాన్ని సృష్టించారు. స్కిల్ స్కాంలో సూత్రధారి, పాత్రధారి, లబ్ధిదారు చంద్రబాబే. ఈ కుంభకోణంపై టీడీపీ సర్కారు హయాంలోనే ఏసీబీ విచారణ మొదలుపెట్టింది. ఆ విచారణను బాబు అడ్డుకొన్నారు. ఆధారాలను, ఫైళ్లను మాయం చేయించారు. షాడో ఫైల్ ఉందని తెలిస్తే దాన్ని కూడా మాయం చేసి ఉండేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఈ కుంభకోణంపై 2021లో కేసు నమోదు చేసి నలుగురిని అరెస్టు చేసింది. ఈడీ కూడా నలుగురిని అరెస్ట్ చేసింది. ఈ స్కాం నుంచి తప్పించుకోలేమని తెలుసు కాబట్టే కేసును కొట్టేయించుకోవాలని చూస్తున్నారు. అది అసాధ్యం. చంద్రబాబు దోషి అని ప్రజలందరూ నిర్ధారణకు వచ్చారు. ఆయన విచారణను ఎదుర్కొని నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాల్సిన సమయం వచ్చింది.

వ్యవస్థలను మేనేజ్ చేయగల సత్తా గతంలో బాబుకు బాగా ఉండేది. ఈ కేసును కూడా చాపకిందకు నెట్టేద్దామనుకుంటే కుదరడంలేదు. దీనితో పాటు ఫైబర్ నెట్, టిడ్కో హౌసింగ్, ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులు ఉన్నాయి. ఈ కేసుల్లో ముడుపులు తీసుకుని చంద్రబాబుకు అందజేశారని ఐటీ శాఖ బయటపెట్టిన పెండ్యాల శ్రీనివాస్, కిలారు రాజేశ్‌లపై సీఐడీ దృష్టి పెట్టినట్లు ఉప్పందగానే వారిద్దరినీ రాత్రికి రాత్రే విదేశాలకు

ఇన్నర్ రింగ్ రోడ్డు స్కాంలో పక్కా ఆధారాలు

మమ్మల్నేం పీకుతారన్న లోకేశ్.. చంద్రబాబును అరెస్ట్ చేయగానే ఢిల్లీలో దాక్కున్నాడు. నెలన్నర తర్వాత నిన్న వచ్చి.. ఇన్నర్ రింగ్ రోడ్డే లేని దాంట్లో కుట్ర ఏముంటుంది అంటున్నాడు. ఏ ఆదాయం లేకుండా హెరిటేజ్ కోసం ఇక్కడే ఎందుకు భూములు కొన్నారు? లింగమనేని గెస్ట్ హౌస్‌లో ఉన్నాక, వారికోసం అలైన్‌మెంట్ పక్కకు జరపలేదా? రాని ప్రాజెక్టులో లాభం ఏముంటుంది అంటున్నారు. కట్టి ఉంటే కాంట్రాక్టుల్లో కూడా మింగేసే వారు కాదా? హత్యకు కుట్రకు చేసి.. హత్య చేయలేదు..అమలు చేయలేకపోయాం అంటే ఊరుకుంటారా? అమరావతి అంతా కుట్రే. అది అమలై ఉంటే లక్షల కోట్లు కొట్టేసి ఉండేవారు. కాకుండానే రైతులను, జనాన్ని, కంపెనీలను, ప్రభుత్వాలను మోసం చేసి వేల కోట్లు సంపాదించుకున్నారు. ఎవరు ప్రశ్నిస్తారులే అనే అహంకారంతో బరితెగించి చంద్రబాబు ఈ స్కాములు చేశారు.

చంద్రబాబు జంప్ చేయించారు. షాపూర్‌జీ పల్లోంజీ, ఎల్ అండ్ టీ నుంచి రూ.118 కోట్లు ముడుపులు దండుకున్న వ్యవహారంలో ఐటీ శాఖ నోటీసులకు సమాధానం చెప్పడంలోనూ సాంకేతిక కారణాలతో తప్పించుకునేందుకు బాబు ప్రయత్నించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని రెండెకరాల నుంచి లక్షల కోట్లకు ఎదిగిన చంద్రబాబుకు ఏ కేసూ విచారణకు రాక ముందే దానిని కప్పేయడం బాగా తెలిసిన విద్య. ఆయన అక్రమాస్తులపై పది మంది వరకూ కోర్టుల్లో వేసిన కేసుల్లో సాంకేతిక కారణాలు చూపి స్టేలు తెచ్చుకుని చంద్రబాబు బతుకుతున్నారు. ఫోక్స్ వ్యాగన్ కార్ల పరిశ్రమ వ్యవహారంలో ఇదే రీతిలో జరిగితే అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి సీబీఐ విచారణ జరిపించారు. దారిమళ్లిన సొమ్మును వసూలు చేసి ఖజానాలో జమ చేయించారు.

పేరుకు బీజేపీ అయినా.. ఆమె టీడీపీ అధ్యక్షురాలే

చంద్రబాబు వదిన పురందేశ్వరి పేరుకు బీజేపీ అయినా టీడీపీ అధ్యక్షురాలిగానే వ్యవహరిస్తున్నారు. ఢిల్లీకి వెళ్లి చంద్రబాబును విడుదల చేయించే ప్రయత్నంలో ఆమె ఉన్నట్లున్నారు. అవసరమైతే బీజేపీలో టీడీపీని కలిపేస్తామని కూడా చెబుతున్నారు. కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు కూడా ఆమె చంద్రబాబు కోసం పని చేశారు. ఎన్టీఆర్ ఫ్యామిలీ మొత్తం చంద్రబాబు కోసం తండ్రిని ఏదైనా చేయడానికి కూడా వెనకాడలేదు. మద్యంపై పురందేశ్వరివి రాజకీయ ఆరోపణలే. మద్యం అమ్మకాలు తగ్గాయి. ఆదాయం పెరిగింది. ఇంకెక్కడ స్కాం ఉన్నట్టు?.

చట్టప్రకారమే నారాయణను విచారిస్తాం

- హైకోర్టుకు నివేదించిన అదనపు పీపీ
- విచారణ ముగించిన హైకోర్టు

సాక్షి, అమరావతి: ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో మాజీ మంత్రి పొంగూరు నారాయణను తదుపరి విచారించదలచుకుంటే ఆయన్ని ఇంటివద్దే న్యాయవాది సమక్షంలో విచారించాలని సీఐడీ అధికారులకు హైకోర్టు స్పష్టం చేసింది. ఇన్నర్ కేసులో నారాయణను విచారించే నిమిత్తం జారీచేసిన నోటీసు గడువు ముగిసిన నేపథ్యంలో తదుపరి విచారించదలచుకుంటే విచారణకు హాజరయ్యేందుకు ఆయనకు సహేతుక గడువునివ్వాలని చెప్పింది. విచారణ విషయంలో హైకోర్టు గతంలో నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించాలని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బి.వి.ఎల్.ఎన్.చక్రవర్తి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో ఈ నెల 4న విచారణకు హాజరుకావాలంటూ సీఐడీ జారీచేసిన నోటీసును రద్దుచేయాలని కోరుతూ నారాయణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై జస్టిస్ చక్రవర్తి బుధవారం విచారించారు. సీఐడీ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ దుష్యంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. నారాయణకు ఇచ్చిన నోటీసు గడువు ముగిసిందన్నారు. అందువల్ల ఈ పిటిషన్‌లో కేసు వాస్తవాల్లోకి వెళ్లడంగానీ, తదుపరి ఉత్తర్వులు ఇవ్వడంగానీ అవసరం లేదన్నారు. ఒకవేళ నారాయణను విచారించాలనుకుంటే తిరిగి ఆయనకు తాజాగా నోటీసు జారీచేయడం జరుగుతుందని చెప్పారు. ఆయన్ని చట్టప్రకారమే విచారిస్తామన్నారు. అందువల్ల ఈ పిటిషన్‌ను మూసివేయాలని కోరారు. ఇందుకు న్యాయమూర్తి అంగీకరిస్తూ ఆ మేరకు ఉత్తర్వులు జారీచేశారు.

సెలవుపై రాజమండ్రి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ రాహుల్ ఐదు రోజులు సెలవుపై వెళ్తున్నారు. ఆ విషయాన్ని ఆయన బుధవారం తెలిపారు. ఇటీవల మరణించిన భార్య దిన కార్యక్రమాల నేపథ్యంలో ఈ నెల 16వ తేదీ వరకు సెలవు పెట్టారు.



భాగం కంటే మొత్తం అనేది ఎప్పుడూ ఎక్కువే.
- యూక్లిడ్

సాక్షి
గురువారం, 12 అక్టోబర్ 2023

ఆలోచన రేపుతున్న ఎంపిక

ఏటా ఇచ్చే పురస్కారాలు సైతం విజేతల ఎంపిక, వారు చేసిన కృషి రీత్యా విశిష్టంగా నిలుస్తాయి. రాయల్ స్వీడిష్ అకాడెమీ ఆఫ్ సైన్సెస్ ఈ ఏడాదికి గాను ఇప్పటి దాకా ప్రకటించిన పురస్కారాల్లో కొన్ని అలాంటివే! స్వెరిజెస్ రిక్స్‌బ్యాంక్ ప్రైజ్ అనే పేరు కన్నా ఆల్ఫ్రెడ్ నోబెల్ స్మారకార్థం ఇచ్చే 'నోబెల్ పురస్కారం'గానే ప్రసిద్ధమైన ఈ గౌరవం దక్కిన ఇద్దరు మహిళల గురించి ఇప్పుడు ప్రపంచమంతా ఆసక్తి కనబరుస్తోంది. మహిళా శ్రామికశక్తిపై విస్తృత పరిశోధన జరిపిన ఆర్థిక శాస్త్రవేత్త క్లాడియా గోల్డిన్‌కు అర్థశాస్త్రంలో నోబెల్ ప్రైజ్, అలాగే ఇరాన్‌లో జైలులో మగ్గుతున్న మానవ హక్కుల ఉద్యమ కారిణి నర్గిస్ మొహమ్మదీకి నోబెల్ శాంతి బహుమతి దక్కడం వారు దీర్ఘకాలంగా చేస్తున్న కృషికి అతి పెద్ద అంతర్జాతీయ గుర్తింపు. ఈ ఇద్దరి ఎంపిక వేతనాల్లో స్త్రీ పురుష వ్యత్యాసం మొదలు లింగ సమానత్వం దాకా అనేక అంశాలపై మరోసారి చర్చ రేపుతోంది.

గోల్డిన్ కృషికి అర్థశాస్త్రంలో నోబెల్ పురస్కారం దక్కడం బాగున్నా, అందులోనూ వైచిత్రి ఉంది. ఆమె నాలుగు దశాబ్దాల కృషి అంతా శ్రామిక విపణుల్లో మహిళలు, లింగ సమానత్వం గురించి! విచిత్రం ఏమిటంటే 1969లో అర్థశాస్త్రంలో నోబెల్ బహుమతిని స్థాపించినప్పటి నుంచి నిన్నటి వరకు ఆ పురస్కారం దక్కింది ఇద్దరంటే ఇద్దరు మహిళలకే! అదీ వేరేవాళ్ళతో కలసి! ఆ గౌరవం దక్కిన మూడో మహిళ గోల్డినే! పైగా, ఒక మహిళకు ఒంటరిగా అర్థశాస్త్రంలో నోబెల్ దక్కడమూ ఇదే ప్రప్రథమం. నోబెల్ బహుమతుల్లో లింగ అసమానత్వంపై విమర్శలు వస్తున్న వేళ లేబర్ మార్కెట్‌లో మహిళా విజయం లోతుపాతులు విశ్లేషించిన గోల్డిన్‌కు ఈ గౌరవం దక్కడం గమనార్హం.

హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసరైన గోల్డిన్ అమెరికాలోని శ్రామిక విపణినీ, అలాగే వేతనాల్లో లింగ అసమానత్వానికి కారణాలనూ నాలుగు దశాబ్దాలుగా లోతుగా అధ్యయనం చేస్తూ వచ్చారు. 200 ఏళ్ళ అమెరికా చరిత్రను లోతుగా విశ్లేషిస్తూ, చారిత్రకంగా స్త్రీ పురుషుల ఆదాయాల్లో తేడాకు ప్రధానంగా చదువు, వివిధ రకాల ఉద్యోగాలే కారణమని తేల్చారు. వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థ నుంచి పారిశ్రామిక ఆధారిత వ్యవస్థ వైపు దేశం మారడంతో శ్రామిక విపణిలో వివాహిత స్త్రీల భాగస్వామ్యం పడిపోయిందనేది ఆమె అధ్యయన సారం. ఆ తర్వాత 20వ శతాబ్దంలో సర్వీసుల పరిశ్రమ వృద్ధి చెందడంతో, మరింత విద్యావంతులైన మహిళలు రంగంలోకి వచ్చారు. గర్భనిరోధక విధానాల లాంటివి ఆరోగ్యరంగంలో వ్యాప్తిలోకి వచ్చాయి. తత్ఫలితంగా, శ్రామికశక్తిలోకి మహిళలు మళ్ళీ ప్రవేశించారు. కానీ, అప్పటికే తలెత్తిన అంతరం మాత్రం పూడిపోలేదు. ముఖ్యంగా, తొలిచూలుతో ఈ తేడా తలెత్తుతోందని గోల్డిన్ పరిశోధన.

ఇక, మరణశిక్షకు వ్యతిరేకంగా గళం విప్పినందుకూ, దేశంలో మహిళలకు సైతం సమాన హక్కులు ఉండాలని కోరినందుకూ ఇరాన్‌లో కటకటాలు లెక్కపెడుతున్న నర్గిస్ పోరాటం మరో పెద్ద కథ. ఇప్పటికి ఆమె 13 సార్లు అరెస్టయి, అయిదుసార్లు దోషిగా తీర్మానమై, 31 ఏళ్ళ జైలుశిక్షను ఎదుర్కొంటోంది. 2022 నాటి డబ్ల్యూఈఎఫ్ గ్లోబల్ జెండర్ గ్యాప్ నివేదికలో అట్టడుగున అఫ్గానిస్తాన్, పాకిస్తాన్‌లతో పాటు నిలిచిన దేశంగా ఇరాన్ పేరుమోసింది. అలాంటి దేశాల్లో నర్గిస్ లాంటి మహిళలు కడకు తమ ఉనికిని కాపాడుకొనేందుకు సైతం పోరాడాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో అటు క్లాడియా గోల్డిన్ అధ్యయనానికీ, ఇటు నర్గిస్ మొహమ్మదీ అలుపెరుగని పోరాటానికీ నోబెల్ గుర్తింపు రావడం ఆనందదాయకం.

సరిగ్గా గోల్డిన్‌కు నోబెల్ ప్రకటించిననాడే మన దేశంలో వార్షిక 'పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే' (పీఎల్ఎఫ్ఎస్) విడుదలైంది. గత 2022 జూలై నుంచి ఈ 2023 జూన్‌కి సంబంధించిన ఈ సర్వే శ్రమజీవుల్లో మహిళల సంఖ్య మునుపటి కన్నా కొద్దిగా పెరిగిందని పేర్కొంది. అయితే, అది సహజ మైన పెరుగుదల కాక కరోనా తర్వాత కుటుంబ ఆదాయాలు దెబ్బతినడంతో తప్పని పరిస్థితుల్లో వచ్చిన పాలపొంగు అని విశ్లేషకుల అభిప్రాయం. వెరసి, లోతుగా గమనిస్తే భారత్‌లోనూ మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్యం రేటు ఇవాళ్టికీ తక్కువగానే ఉందన్నది విచారకరమైన వాస్తవం. ఇది మారాలంటే... అర్థవంతమైన ఉపాధి, అదే సమయంలో మహిళా శ్రామికశక్తి భాగస్వామ్యం పెరిగేలా విధాన నిర్ణయాలు తీసుకోవాల్సిన బాధ్యత మన ప్రభుత్వాలది. అందుకు ప్రొఫెసర్ గోల్డిన్ అధ్యయనం నుంచి భారతదేశం సైతం పాఠాలు నేర్వాలి.

ఏ దేశమైనా సరే ఆర్థిక పురోగతి సాధించినంత మాత్రాన శ్రామిక విపణిలో లింగ వ్యత్యాసం దానంతట అది తగ్గిపోదని గోల్డిన్ నిరూపించారు. అలాగే, సామాజిక, వ్యవస్థాపరమైన అవరోధాలు ఉన్నంత కాలం కేవలం స్త్రీ విద్య సైతం శ్రామికశక్తిలో లింగ అంతరాల్ని తగ్గించలేదు. సాంప్రదాయిక సమాజాల్లో పిల్లల పెంపకమూ ఓ కీలకాంశం. విధాన నిర్ణేతలు వీటిని దృష్టిలోఉంచుకోవాలి. లింగ కోణం నుంచి అర్థశాస్త్ర అధ్యయనం ప్రధాన స్రవంతిలో భాగం కాదన్న భావనల్ని గోల్డిన్ బద్దలుకొట్టారు. అమెరికా నుంచి ఇరాన్ దాకా ప్రపంచంలో ప్రతి చోటా ఇవాళ్టికీ ఆడవారి పరిస్థితి ఒకేలా ఉంది. ఇవాళ పురుషుల్లో నూటికి 80 మంది ఉద్యోగాల్లో ఉంటే, ప్రపంచ మహిళా జనాభాలో కేవలం సగం మందే వేతన ఉపాధి పొందుతున్నారు. అదీ మగవాళ్ళ కన్నా తక్కువ వేతనాలకే పనిచేస్తూ, వృత్తిలో ఉన్నత శిఖరాల అధిరోహణకు అవకాశాలూ తక్కువే. అందుకే, లింగ సమానత్వ సాధనలో ప్రపంచం ప్రయాణించాల్సిన దూరం ఇంకా ఎంతో ఉంది. ఆ దిశలో నోబెల్ విజేతలైన గోల్డిన్ అధ్యయనం, నర్గిస్ పోరాటం మనకు తాజా మార్గదర్శకాలు.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం,
వర్ష ఋతువు భాద్రపద మాసం,
తిథి: బ.త్రయోదశి రా.7.14 వరకు, తదుపరి చతుర్దశి,
నక్షత్రం: పుబ్బ ప.12.13 వరకు, తదుపరి ఉత్తర,
వర్జ్యం: రా.8.08 నుండి 9.53 వరకు,
దుర్ముహూర్తం: ఉ.9.49 నుండి 10.37 వరకు,
తదుపరి ప.2.31 నుండి 3.18 వరకు,
అమృత ఘడియలు: లేవు

సూర్యోదయం: 5.55 **సూర్యాస్తమయం:** 5.38
రాహుకాలం: ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం: ఉ.6.00 నుండి 7.30 వరకు

గురుకులాలపైనా గురివింద రాతలేనా రామోజీ?

2019 ఫిబ్రవరిలో ఎన్నికల స్టంట్‌కే టీడీపీ ప్రభుత్వం ఎస్సీ గురుకులాల ఏర్పాటు నిర్ణయం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 177 గురుకులాలకు నాడు-నేడుతో మహర్దశ .. హాస్టళ్ల అభివృద్ధికి రూ.318 కోట్లు ఖర్చు.. అమ్మఒడితో నాలుగేళ్లలో రూ.443 కోట్లు జమ

టీడీపీ ప్రభుత్వ హయాంలో కేవలం 49 మందికే ఎన్ఐటీ, ఐఐటీ, ఎంబీబీఎస్‌ల్లో ప్రవేశాలు

ప్రస్తుత ప్రభుత్వం నాలుగేళ్ల పాలనలోనే 310 మందికి ప్రవేశాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులు సాధిస్తున్న అద్భుత ఫలితాలు పెత్తందారుల విష పత్రిక 'ఈనాడు'కు కనిపించడం లేదు. దాదాపు పదేళ్ల కేసీఆర్ పాలనతో నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనను పోల్చి రామోజీ పైశాచిక ఆనందం పొందడమే ఇందుకు నిదర్శనం. ఇందులో భాగంగానే బుధవారం తన పచ్చ పత్రిక ఈనాడులో 'నాలుగేళ్లలో ఒకే ఒక్క ఎస్సీ గురుకులం!' అంటూ యథేచ్ఛగా తనకలవాటైన రీతిలో ఒక అసత్య కథనం వండివార్చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో దేశంలోనే ప్రశంసలందుకున్న గురుకులాలపై ఈ గురివింద రాతలేల రామోజీ అంటూ సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఈనాడు కథనాన్ని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ అధికారులు ఖండించారు. ఎస్సీ గురుకులాల విషయంలో వాస్తవ అంశాలను ఫ్యాక్ట్ చెక్ రూపంలో వెల్లడించారు. అసలు నిజాలివిగో..

చంద్రబాబు ఎన్నికల స్టంట్‌లో భాగంగా..

రాష్ట్రంలోని వివిధ రంగాల్లో గత ప్రభుత్వం ఫలానా పనిచేసిందని చెప్పుకోవడానికి ఏమీ లేక 'ఈనాడు' ప్రతి విషయాన్ని పొరుగు రాష్ట్రమైన తెలంగాణతో పోల్చడం మొదలెట్టింది. రాష్ట్ర విభజన తర్వాత ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ ఆధ్వర్యంలో 168 పాఠశాలలు ఉన్నాయి. టీడీపీ హయాంలో 21 స్కూళ్లను మంజూరు చేస్తే ఇందులో 15 స్కూళ్లు ఎన్నికలకు రెండు నెలల ముందు అంటే ఫిబ్రవరి 2019లో మంజూరు చేశారు. ఎస్సీల ఓట్లను కొల్లగొట్టాలనే ఉద్దేశంలో భాగంగానే ఈ పనిచేశారు తప్ప నిజమైన చిత్తశుద్ధితో కాదనేది దీన్నిబట్టే అర్థమవుతోంది. ఆ 15 గురుకులాలకు సంబంధించి ఎలాంటి భూసేకరణ చేపట్టకపోవడమే ఇందుకు నిదర్శనం. కేవలం కాగితాల మీద మాత్రమే గురుకులాలను మంజూరుచేసినట్టు గొప్పగా చూపించారు. కనీసం వాటికి చంద్రబాబు శంకుస్థాపన కూడా చేయలేదు. అయినప్పటికీ గత ప్రభుత్వం గొప్పగా చేసిందంటూ 'ఈనాడు' పచ్చి అబద్ధాలను వండివార్చింది.

రూ.91 కోట్లతో సకల వసతులు..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యా రంగాన్ని తన ప్రాధాన్యత రంగాల్లో ఒకటిగా చేసుకుంది. ఇందులో భాగంగా నిరుపేద విద్యార్థులు ఉండే 177 ఎస్సీ గురుకుల పాఠశాలల్లో నాడు-నేడు కింద రూ.91 కోట్లు ఖర్చు పెట్టి సకల వసతులు కల్పించింది. పక్కా భవనాలు, తరగతి గదులు, మంచి బోర్డులు, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు, ఫర్నిచర్, టాయిలెట్లు, తాగునీరు, మరమ్మతులు, ప్రహరీలు.. ఇలా అన్నిరకాల సదుపాయాలతో వాటి రూపురేఖలు మార్చింది. అంతేకాకుండా ఎస్సీ గురుకులాల్లో పనిచేస్తున్న 756 మంది టీచర్లకు ఇంగ్లిష్‌లో ప్రావీణ్యాన్ని పెంచేలా శిక్షణ కూడా అందించింది. టీడీపీ ప్రభుత్వం తన ఐదేళ్ల పాలనలో ఒక్కటంటే ఒక్క గురుకులంలో మరమ్మతులు చేస్తే ఒట్టు. మరి ఆనాడు 'ఈనాడు' వీటిపై ఏనాడూ పెన్నెత్తింది లేదు.

గురుకుల హాస్టళ్ల అభివృద్ధికి రూ.318 కోట్లు

గురుకులాలను తీర్చిదిద్దడంతోనే పరిమితం కాకుండా వాటికి అనుబంధంగా ఉండే హాస్టళ్లను సైతం ప్రభుత్వం ఆధునికీకరించనుంది. హాస్టళ్ల బాగు కోసం రూ.121 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేయనుంది. దీంతోపాటు సిబ్బంది నివాసాలు, వంటశాలల ఆధునికీకరణ, కాంపౌండ్ వాల్స్, సుందరీకరణ పనులకు మరో రూ.197 కోట్లను ఖర్చు చేయనుంది. మొత్తంగా గురుకుల హాస్టళ్లలో నాడు - నేడు కింద రూ.318 కోట్లతో పనులు ప్రారంభం కానున్నాయి.

నాణ్యమైన విద్యకోసం విప్లవాత్మక చర్యలు

గురుకులాల్లో గతంలో ఎన్నడూ చేయని విధంగా నాణ్యమైన విద్యకోసం ప్రభుత్వం అనేక విప్లవాత్మక చర్యలు చేపట్టింది. అన్ని స్కూళ్లలోనూ ఇంగ్లిష్ మీడియంను ప్రవేశపెట్టింది. పిల్లలందరికీ జగనన్న విద్యా కానుక ద్వారా కిట్లను అందించింది. ఏటా స్కూలు తెరవకముందే ఈ కిట్లన్నీ విద్యార్థులకు సకాలంలో అందుతున్నాయి. గత ప్రభుత్వం హయాంలో అక్టోబర్-నవంబర్ వచ్చే వరకు కూడా పాఠ్యపుస్తకాలు అందని పరిస్థితి ఉండేది. ఇచ్చే యూనిఫామ్‌లు కూడా నాసిరకంగా ఉండేవి. జగనన్న విద్యాకానుక లాంటి కార్యక్రమం గతంలో ఎప్పుడూ లేదు. అసలు అలాంటి ఆలోచనే గత ప్రభుత్వం చేయలేదు. ఈ విషయం ఎల్లో పత్రికాధిపతి రామోజీకి తెలియదనుకోవాలా?

అమ్మఒడి ద్వారా రూ.443 కోట్లు

అన్నిరకాల గురుకుల పాఠశాలల విద్యార్థులకు ఉచిత హాస్టల్ సదుపాయం ఉన్నప్పటికీ ప్రభుత్వం వారికి కూడా జగనన్న అమ్మఒడి పథకాన్ని అందించింది. పిల్లల తల్లులకు ఈ పథకం కింద ఏటా రూ.15 వేలు అందిస్తోంది. ఎస్సీ గురుకులాల విద్యార్థుల తల్లులకు 4 ఏళ్ల కాలంలో రూ.443 కోట్లను అమ్మఒడి కింద ప్రభుత్వం అందించింది. గత ప్రభుత్వం హయాంలో గురుకుల విద్యార్థులకు ఒక్కొక్కరికి పదో తరగతి వరకూ నెలకు కేవలం రూ.850, ఇంటర్ విద్యార్థులకు రూ.1,050 చెల్లించేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ మొత్తాలను 10వ తరగతి వరకూ ప్రతి విద్యార్థికి రూ.1,400, ఇంటర్ వరకూ రూ.1,600లకు పెంచడం విశేషం. దీంతోపాటు డిజిటల్ బోధనలో భాగంగా 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు కూడా పంపిణీ చేసింది. ఇప్పుడు మరింత ముందడుగు వేస్తూ 6వ తరగతి నుంచి ఆపై తరగతుల వరకూ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్ల (ఐఎఫ్‌పీ) ఏర్పాటు చేసి బోధనలో మరో విప్లవం తెచ్చింది. ఇలాంటి కార్యక్రమాలు గత ప్రభుత్వ హయాంలో ఎందుకు లేవు? ఇలా ఎందుకు ఆలోచించలేకపోయారని చంద్రబాబు ప్రభుత్వాన్ని ఈనాడు ఒక్కసారైనా ప్రశ్నించింది లేదు.

ఉన్నత విద్యా సంస్థల్లో పెరిగిన ప్రవేశాలే నిదర్శనం

చంద్రబాబు ఐదేళ్ల పాలనలో ఎస్సీ గురుకులాల నుంచి ఐఐటీలకు ఆరుగురు, వైద్య విద్యా సంస్థలకు 16 మంది, ఎన్ఐటీలకు 27 మంది మాత్రమే ఎంపికయ్యారు. ఇక వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఒక్క ఐఐటీల్లోనే 51 మంది ప్రవేశాలు పొందారు. పలు వైద్య విద్యా సంస్థల్లో 60 మందికి, ఎన్ఐటీల్లో 199 మందికి సీట్లు లభించాయి. గత టీడీపీ ప్రభుత్వానికి, ఇప్పటికీ చదువుల్లో ఉన్న తేడాకు నిదర్శనం ఇది. అంతేకాకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో 2 క్రీడా పాఠశాలలను కూడా ఏర్పాటు చేసింది. పెదవేగిలో బాలురకు, పోలసానిపల్లిలో బాలికలకు ఇవి అందుబాటులో ఉన్నాయి. సాంఘిక సంక్షేమ వసతి గృహాల విషయానికొస్తే 2014-19 మధ్య ఒక్క హాస్టల్‌ను కూడా టీడీపీ ప్రభుత్వం కొత్తగా మంజూరు చేయలేదు. పైగా 648 హాస్టళ్లను మూసేసి వీటన్నింటినీ గురుకుల పాఠశాలల్లో కలిపేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక కొత్తగా 7 వసతి గృహాలను మంజూరు చేసింది. అంతర్జాతీయ స్థాయిలో ఎస్సీ గురుకుల విద్యార్థుల ప్రతిభ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో అంతర్జాతీయ స్థాయిలోనూ ఎస్సీ గురుకుల విద్యార్థులు సత్తా చాటుతున్నారు. గత రెండేళ్లుగా అమెరికాకు చెందిన 'కెనడీ లూగర్ - యూత్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ స్టడీ ప్రోగ్రామ్'కు ఏపీ ఎస్సీ గురుకుల విద్యార్థులు ఎంపికయ్యారు. అలాగే ఏటా కేంద్ర ప్రభుత్వం నిర్వహించే 'అటల్ టింకరింగ్ ల్యాబ్ మారథాన్'లోనూ ఎస్సీ గురుకుల విద్యార్థులు రాష్ట్ర ఖ్యాతిని నిలిపారు. గతేడాది జాతీయ స్థాయిలో 7 వేల ప్రాజెక్టులు పోటీపడగా టాప్ 10లో విశాఖ ఎస్సీ గురుకుల విద్యార్థినులు రూపొందించిన డాక్టర్ రోబోకు స్థానం దక్కడం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గురుకులాలను ఏ స్థాయిలో అభివృద్ధి చేసిందో చెప్పడానికి నిదర్శనం.

నిజాలు దాచి దాగుడు'మూత'లు

సాక్షి, అమరావతి: పరిశ్రమలకు అవసరమైన నిపుణులైన మానవ వనరులను సమకూర్చకుండా నైపుణ్య శిక్షణ కేంద్రాలను మూసివేస్తున్నారంటహో అంటూ ఎల్లో మీడియా రోత రాతలు రాస్తున్నా అధికారిక గణాంకాలు నిజం చెప్పకుండా ఉంటాయా? ఈ ప్రభుత్వం వచ్చాక నాలుగున్నరేళ్లలో 14.26 లక్షల మంది శిక్షణ పొందారంటే అవి పని చేస్తున్నట్లే కదా? స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో జరిగిన అవినీతిని కప్పిపుచ్చడం, చంద్రబాబు అరెస్టు తరువాత ఆ కేంద్రాలు రాత్రికి రాత్రే మూతబడ్డాయంటూ దుష్ప్రచారం చేయడమే లక్ష్యంగా ఈనాడు దినపత్రిక పుంఖాను పుంఖాలుగా కథనాలను ప్రజలపైకి వదులుతోంది. పరిశ్రమలకు నైపుణ్యం కలిగిన మానవ వనరులను స్థానికంగానే అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంతో స్కిల్ హబ్స్, స్కిల్ కాలేజీలను నెలకొల్పి శిక్షణ అందిస్తుంటే రామోజీ భరించలేకపోతున్నట్టుంది.

- **ఈనాడు ఆరోపణ:** చంద్రబాబును జైలుకు పంపడానికే నైపుణ్య కేంద్రాలను ప్రభుత్వం అస్త్రంగా వాడుకుందే తప్పించి పరిశ్రమలకు అవసరమైన మానవ వనరులను తీర్చిదిద్దే కేంద్రాలుగా వాటిని భావించడం లేదు. యువత ఉపాధి వెతుక్కుంటూ పొరుగు రాష్ట్రాలకు వెళ్లడం మినహా మరో మార్గం ఉందా?
- **వాస్తవం:** రాష్ట్రంలోని అన్ని నైపుణ్య, వృత్తి విద్యా విభాగాలను నైపుణ్యాల అభివృద్ధి, శిక్షణ విభాగం (ఎస్ అండ్ టీ) అనే ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి ఇంటిగ్రేటెడ్ స్కిల్ డెవలప్‌మెంట్ ఎకో సిస్టమ్‌ను ప్రభుత్వం సృష్టించింది. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ అందించేలా ఎస్ అండ్ టీ విభాగం పనిచేస్తోంది. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా సాంకేతిక, వృత్తి విద్య శిక్షణ అందించడం ద్వారా నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తిని ఎస్అండ్‌టీ సృష్టించింది. గత నాలుగున్నరేళ్లలో 14,26,515 మందికి నైపుణ్య శిక్షణ అందిస్తే రాజకీయ ప్రయోజనాల కోసం విమర్శించటం ఎంత వరకు సహేతుకం?

2019 నుంచి 'ఎస్ అండ్ టీ' సాధించిన పురోగతి ఇలా

ఆర్థిక సంవత్సరం	శిక్షణ ఇచ్చినది
2019-20	5,79,173
2020-21	4,23,995
2021-22	1,94,696
2022-23	1,83,617
2023-24	45,034
మొత్తం	14,26,515

- **ఈనాడు ఆరోపణ:** పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య మానవ వనరులను సమకూరుస్తామని చెప్పడమే కానీ ఆ దిశగా ప్రభుత్వం చేపట్టిన చర్యలు లేవు. చంద్రబాబుపై ఉన్న కోపంతో ఉన్న కేంద్రాలను ఒక్కొక్కటిగా మూసేస్తోంది.
- **వాస్తవం:** భవిష్యత్ ఉద్యోగాలకు అనుగుణంగా నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించడం కోసం సరికొత్త 'క్యాస్కేడింగ్ స్కిల్ ఎకో సిస్టమ్‌ను 2022 అక్టోబర్ నుంచి ఎస్అండ్‌టీ విభాగం రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి తీసుకొచ్చింది. స్థానిక, అంతర్జాతీయ స్థాయిలో నైపుణ్యాల అవసరాలను తీర్చడానికి క్యాస్కేడింగ్ స్కిల్ ఎకో సిస్టమ్ కింద కొన్ని విభాగాలను ఏర్పాటు చేశారు.
- **స్కిల్ యూనివర్సిటీ:** రాష్ట్రస్థాయిలో నైపుణ్య విశ్వవిద్యాలయం మొత్తం శిక్షణ వ్యవస్థ పనితీరును పర్యవేక్షిస్తుంది. స్కిల్స్ యూనివర్సిటీ కోసం తిరుపతిలో 50 ఎకరాల స్థలాన్ని కేటాయించగా పనులు కొనసాగుతున్నాయి.
- **స్కిల్ కాలేజీలు:** ఉన్నత స్థాయి నైపుణ్య శిక్షణ అందించేలా పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయిలో 26 నైపుణ్య కళాశాలలు ఏర్పాటయ్యాయి. కంపెనీల అవసరాలను తీర్చేలా అత్యాధునిక కోర్సులను ఈ కాలేజీల్లో అందిస్తున్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సంస్థలైన సీఈఎంఎస్, ఐఐటీటీఎం, ఎస్ఐహెచ్ఎం, ఏఎన్‌యూ, జేఎన్‌టీయూకే లాంటి ఇన్‌స్టిట్యూట్‌ల సహకారంతో వీటి ని నెలకొల్పారు. ఎన్ఎస్‌క్యూఎఫ్ లెవెల్ 4.5 నుంచి 6 స్థాయి కోర్సులకు ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు.
- **స్కిల్ హబ్స్:** జిల్లా, రాష్ట్ర స్థాయి పారిశ్రామిక మానవ వనరుల అవసరాలను 192 స్కిల్ హబ్‌లు తీరుస్తాయి. ప్రభుత్వ ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలల్లో స్కిల్ హబ్స్ ఏర్పాటయ్యాయి. ఇక్కడ ఎన్ఎస్‌క్యూఎఫ్ లెవెల్ 4 వరకు కోర్సులను అందిస్తారు. వీటి ద్వారా 15,260 మందికి శిక్షణ అందించారు.
- **స్కిల్ స్పోక్స్:** రాష్ట్రంలో ఏర్పాటైన పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులకు శిక్షణ ఇచ్చి ప్లేస్‌మెంట్ కల్పించేలా స్కిల్ స్పోక్స్‌లను ఏర్పాటు చేశారు. 2019 నుంచి ఇప్పటి వరకు శిక్షణ పొందిన 16,492 మందిలో 15,487 మందికి (94% ప్లేస్‌మెంట్స్) ఉపాధి కల్పించారు.
- **స్కిల్ ఇంటర్నేషనల్:** అంతర్జాతీయ స్థాయిలో విదేశీ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవడం కోసం స్కిల్ ఇంటర్నేషనల్ నైపుణ్య శిక్షణను అందుబాటులోకి తెచ్చారు. ఇందుకోసం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ పలు అంతర్జాతీయ సంస్థలైన ఎన్ఎస్‌డీసీ ఇంటర్నేషనల్, బ్రిటన్‌కు చెందిన టీకేటీ ఇంటర్నేషనల్, డొమెస్టిక్ వర్కర్స్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్, ఇన్‌లింబి లాంటి సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంది. మే 2023 నుంచి ఇప్పటి వరకు జర్మనీలో పని చేయడానికి 11 మంది నర్సులకు ఆఫర్లు జారీ చేయగా మరో 78 మంది నర్సింగ్ అభ్యర్థులు జర్మన్ ట్రైనర్స్ ద్వారా శిక్షణ పొందుతున్నారు.
- **ఈనాడు ఆరోపణ:** కార్మికుల కొరతతో మూడు షిఫ్టుల్లో పరిశ్రమలను నడపడం కష్టంగా మారింది. సిబ్బందితో రెండు షిఫ్టుల్లో పనిచేయిస్తున్నారు.
- **వాస్తవం:** కార్మికుల కొరత కారణం అన్నది వాస్తవం కాదు. గత నాలుగున్నరేళ్లలో ప్రధానంగా అందించిన నైపుణ్య శిక్షణ గణాంకాలే ఇందుకు నిదర్శనం.

- ఏపీఎస్ఎస్‌డీసీ ద్వారా **12,59,541** మందికి శిక్షణ
- సీడాప్ ద్వారా **71,056** మందికి శిక్షణ
- ఎన్‌ఏసీ ద్వారా **21,914** మందికి శిక్షణ
- డీటీఈ పాలిటెక్నిక్ ద్వారా **26,456** మందికి శిక్షణ
- ఐటీఐల ద్వారా **41,548** మందికి శిక్షణ

ఇదేమి పప్పు కథ!

- కందిపప్పుపై ఈనాడు తప్పుడు కథనం
- వాస్తవాల వక్రీకరణతో ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం
- చంద్రబాబు హయాంలో రెండేళ్లు కనిపించని కందిపప్పు పంపిణీ
- కిలో కందిపప్పు రూ.40 నుంచి రూ.120కి పెంచి విక్రయం
- ఎన్నికలకు చివరి ఏడాదిలో రెండు కిలోల డ్రామా
- దోపిడీ కోసమే పండుగ కానుక పేరుతో పంపిణీలు
- అప్పుడు కళ్లుండీ కనపడనట్లే నటించిన రామోజీ
- ఇప్పుడు కోడుగుడ్డుపై ఈకలు లాగే ప్రయత్నం
- రాష్ట్రానికి 50 వేల టన్నులు కేటాయించాలని కేంద్రానికి ప్రభుత్వం వినతి
- ఈ ఖరీఫ్‌లో రైతుల నుంచి కందులు కొనేలా చర్యలు

సాక్షి, అమరావతి: చంద్రబాబు హయాంలో సుమారు రెండేళ్ల పాటు కందిపప్పు కనిపించలేదు. అక్కడక్కడా అరకొరగానే పంపిణీ చేశారు. అందులోనూ నిలకడలేని సబ్సిడీ రేట్లు. కిలో కందిపప్పును రూ.40 నుంచి రూ.120 వరకు పెంచి విక్రయించారు. పుచ్చు, పురుగులు పట్టిన పప్పును అంటగట్టేవారు. పొయ్యిపై పెడితే గ్యాస్ అయిపోయేది కానీ పప్పు మాత్రం ఉడికేది కాదు. చంద్రబాబు ప్రజా పంపిణీ వ్యవస్థ ఎంత గొప్పగా నడిపించారో చెప్పడానికి ఇదొక మచ్చుతునక మాత్రమే. ఇదంతా రామోజీకీ తెలుసు. అయినా అనుంగుడు చంద్రబాబు పాలనను గొప్పగా చిత్రీకరించడానికి కళ్లు మూసుకొని కనపడనట్లు నటిస్తున్నారు. ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇంటింటికీ నేరుగా సంక్షేమం అందుతోంది. పారదర్శక విధానాలతో ప్రజలంతా సంతోషంగా జీవిస్తున్నారు. ఫలితంగా ప్రజలను మభ్య పెట్టే రాతల్లో ఆరితేరిన రామోజీరావు తన పప్పులు ఉడకట్లేదని గ్రహించి కోడుగుడ్డుపై ఈకలు లాగే పని పెట్టుకున్నారు. అందుకే ఈనాడులో బుధవారం 'పండుగకు పప్పన్నమూ దూరమే' అంటూ ఓ తప్పుడు కథనం ప్రచురించారు. అసలు వాస్తవాలేమిటో చూద్దాం..

బాబు పాలనలో చివరి ఏడాది ఎన్నికల డ్రామా: చంద్రబాబు పాలనలో 2014 సెప్టెంబర్ - 2015 జూలై మధ్య కంది పప్పు ఊసే లేదు. 2015 ఆగస్టు నుంచి 2017 ఫిబ్రవరి వరకు కార్డుకు కిలో చొప్పున అదీ.. రేటు రూ.50 నుంచి రూ.120 మధ్య పెంచి విక్రయించారు. 2015 డిసెంబర్‌లో ఏకంగా రూ.90కి పెంచారు. 2016 జూలై నుంచి 2017 ఫిబ్రవరి మధ్య రూ.120 చేశారు. 2018లో కందిపప్పు బహిరంగ మార్కెట్‌లో రూ.63 ఉన్నప్పుడు కేవలం రూ.23 రాయితీ ఇచ్చారు. చివరి ఏడాది మాత్రం ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని 2 కిలోల కందిపప్పు డ్రామా ఆడారు. ఆఖరు ఏడాదిలో 2 కిలోల చొప్పున 77 వేల టన్నులు ఇస్తే.. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో మొత్తం కందిపప్పు పంపిణీ చేసింది కేవలం 93 వేల టన్నులు మాత్రమే. ఇందు కోసం రూ.1605 కోట్లు ఖర్చు చేసింది. కానీ, ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటివరకు 3.15 లక్షల టన్నుల కందిపప్పు పంపిణీ చేసింది. ఇందుకు రూ.3,084 కోట్లు ఖర్చు చేసింది. బహిరంగ మార్కెట్లో కందిపప్పు కిలో ధర రూ.115 ఉన్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వం రూ.48 సబ్సిడీ ఇచ్చి నాణ్యమైన పప్పును రూ.67కి పంపిణీ చేసింది. కరోనా సమయంలో పూర్తి ఉచితంగా అందించింది. కానీ, చంద్రబాబు ప్రభుత్వం కొన్ని సందర్భాల్లో కేవలం గిరిజన ప్రాంతాలకు, మరికొన్ని సార్లు మున్సిపాల్టీలు, పట్టణ కార్డుదారులకు మాత్రమే విభజించి పంపిణీ చేశారు.

కేంద్రానికి ప్రతిపాదనలు: దేశవ్యాప్తంగా పప్పు ధాన్యాల కొరత వేధిస్తోంది. అందుకే మార్కెట్‌లో రేట్లు భారీగా పెరిగాయి. కేంద్రం వద్ద కూడా నిల్వలు లేవు. అయితే రాష్ట్రంలో వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా 50 వేల టన్నుల కంది పప్పును కేటాయించాలని ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రభుత్వం కేంద్ర వినియోగదారులు, వ్యవహారాల శాఖను కోరింది. దీంతో కర్ణాటకలో ఉన్న బఫర్ స్టాక్ నుంచి 9,764 టన్నుల కందులు కేంద్రం రాష్ట్రానికి కేటాయించింది. ఈ పప్పు నాణ్యత ప్రమాణాలకు తగ్గట్టుగా లేకపోవడంతో ఏపీ పౌర సరఫరాల సంస్థ అధికారులు తిరస్కరించారు. జూలై, సెప్టెంబర్‌లో మరోసారి కేంద్రానికి ప్రభుత్వం కందిపప్పు కేటాయింపుల కోసం ప్రతిపాదనలు పంపించింది. స్పందన లేకపోవడంతో పౌర సరఫరాల సంస్థ ఎంఎల్ఎస్ పాయింట్లలోని స్టాక్ మొత్తాన్ని పంపిణీకి విడుదల చేసింది. ప్రస్తుతం హైదరాబాద్ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ అసోసియేషన్ లిమిటెడ్ అన్ని పన్నులతో కలిపి కిలో కందిపప్పును రూ.133.23కు సరఫరాల చేసేందుకు అంగీకరించింది. దీనితో పాటు ఈ ఖరీఫ్‌లో డిసెంబర్ నుంచి స్థానిక రైతుల ద్వారా 20 వేల టన్నుల కందులు మార్కెట్ రేటు ప్రకారం కొనుగోలుకు పౌర సరఫరాల సంస్థ సన్నాహాలు చేస్తోంది.

రూ.27 వేల కోట్లు ఖర్చు: గత ప్రభుత్వం ఐదేళ్లలో నాన్ సార్టెక్స్ బియ్యం, కందిపప్పు, పంచదార పంపిణీకి రూ.14,631 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. ఐసీడీఎస్, మధ్యాహ్న భోజనానికి కూడా కలిపి మొత్తం 15,356 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. వైఎస్ జగన్ ప్రభుత్వం ఇప్పటి వరకు పీడీఎస్‌కి రూ.26,451 కోట్లు ఖర్చు చేయడం విశేషం. ఐసీడీఎస్, మధ్యాహ్న భోజన పథకానికి కూడా కలిపి మొత్తం రూ.27,090 కోట్లు వెచ్చించింది. పైగా, చంద్రబాబు ప్రభుత్వం నాసిరకం బియ్యం పంపిణీ చేస్తే, వైఎస్ జగన్ ప్రభుత్వం నాణ్యమైన సార్టెక్స్ బియ్యం పంపిణీ చేస్తోంది. దీంతోపాటు ప్రజారోగ్యం దృష్ట్యా పౌష్టికాహారం అందించడానికి అన్ని జిల్లాల్లో ఫోర్టిఫైడ్ గోధుమ పిండి పంపిణీ చేస్తోంది. ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో తొలి దశలో భాగంగా రాగులు, జొన్నలు పంపిణీ చేస్తోంది. చంద్రబాబు ఆర్భాటాల కోసం ప్రయోగాత్మకంగా ఎంపిక చేసిన కొన్ని ప్రాంతాల్లోనే బియ్యానికి బదులుగా రాగులు, జొన్నలు ఇస్తూ మధ్యలో చేతులెత్తేశారు.

దోపిడీ కోసమే పండుగ కానుకలు: చంద్రబాబు హయాంలో పండగల పేరుతో ప్రజా పంపిణీ వ్యవస్థను హెరిటేజ్‌కు, అనుయాయులకు దోచి పెట్టడానికి మాత్రమే ఉపయోగించారు. నిబంధనలకు విరుద్ధంగా, టెండర్లు లేకుండా ఇష్టం వచ్చిన ధరలకు సరుకులు కొని ప్రజాధనాన్ని మింగేశారు. 2013లో అమ్మ హస్తం పేరిట సబ్సిడీపై తెల్ల కార్డుదారులకు ఇచ్చే 9 రకాల నిత్యావసరాల్లో పామాయిల్ ఉండేది. దీనిని చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలగించింది. కేవలం పండుగుల సమయంలోనే అరకొరగా ఇచ్చేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొలువుదీరిన నాటి నుంచి రాష్ట్రంలో ప్రతి రోజూ సంక్షేమ పండగ జరుగుతూనే ఉంది. ఇప్పుడు పేదలు కూడా వారికి నచ్చిన ఆహారం తింటున్నారు.

కందిపప్పు కొనుగోలుకు సన్నాహాలు

50 వేల టన్నుల కందులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరాం. ప్రస్తుత పంపిణీకి సరిపడా నిల్వలు లేకపోవడంతో హైదరాబాద్ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ అసోసియేషన్ లిమిటెడ్ (హెచ్ఏసీఏ) ద్వారా సేకరించుకోవాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. ఈ వారంలో హెచ్ఏసీఏ ప్రతినిధులతో సంప్రదింపులు చేసి నాణ్యతను పరిశీలించి కొనుగోలుకు ముందుకెళ్తాం. ఈ ఖరీఫ్‌లో రైతుల నుంచి కందులు కొనుగోలు చేయనున్నాం. కందుల కొనుగోలుపై ప్రచారం చేయాలని కలెక్టర్లను ఆదేశించాం. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం గత నెలలో టేక్ హోమ్ రేషన్ పథకాన్ని ప్రారంభించి గర్భిణులు, బాలింతలకు ఇంటి వద్దకే బియ్యం, కందిపప్పు, నూనె, ఇతర సరుకులను సరఫరా చేస్తోంది. ఈ పథకానికి ఎటువంటి అంతరాయం కలగకుండా ప్రాధాన్యత క్రమంలో కంది పప్పు నిల్వలను కేటాయించాం. దేశవ్యాప్తంగా కూడా పప్పు ధాన్యాల కొరత తీవ్రంగా వేధిస్తోంది.

-అరుణ్ కుమార్, కమిషనర్, పౌరసరఫరాల శాఖ

కొబ్బరికి మహర్దశ



'వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రొడక్ట్'గా ఎంపిక

- కోనసీమకు నేడు కేంద్ర బృందం
- క్వాయర్ యూనిట్, ఎఫ్‌పీవో, డ్వాక్రా సంఘాల పరిశీలన
- విలువ ఆధారిత ఉత్పత్తుల ప్రోత్సాహంపై వివరాల సేకరణ
- కొబ్బరి కొత్త ప్రాజెక్టులు వచ్చేందుకు అవకాశం

సాక్షి అమలాపురం: ఒకవైపు పరిశ్రమల లోటు తీర్చడం.. మరోవైపు స్థానికంగా పండే పంటలను ఉప ఉత్పత్తులుగా తయారు చేస్తే రైతుకు లాభసాటి ధర వస్తుందనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు రైతుల్లో కొత్త ఆశలు రేకెత్తిస్తున్నాయి. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో వరి తరువాత అతి పెద్ద సాగు కొబ్బరి. దశాబ్దాల కాలం నుంచి సాగవుతున్నా.. వీటి విలువ ఆధారిత పరిశ్రమలు స్థానికంగా లేకపోవడంతో కొబ్బరి మార్కెట్ తరచు ఒడుదొడుకులకు లోనవుతోంది. రాష్ట్రంలో సుమారు మూడులక్షల ఎకరాల్లో కొబ్బరి సాగవుతుండగా.. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోనే 1.78 లక్షల ఎకరాల్లో సాగులో ఉంది. దీన్లో ఒక్క డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోనే సుమారు 1.10 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగవుతోంది. గోదావరి జిల్లాలోనే ఏడాదికి 124.72 కోట్ల కాయల దిగుబడి వస్తున్నట్లు అంచనా. ఇంత పెద్ద దిగుబడి వస్తున్నా తరచు కొబ్బరి సంక్షోభంలో కూరుకుపోవడాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఒక జిల్లా.. ఒక ఉత్పత్తి (వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రొడక్ట్)కు కొబ్బరిని ఎంపిక చేసింది. ఈ పథకం కింద జిల్లాలో ఏయే పరిశ్రమలు ఏర్పాటు చేయాలనేదానిపై జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఒక జిల్లా.. ఒక ఉత్పత్తి ప్రోత్సాహంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇన్వెస్ట్ ఇండియా బృందం గురువారం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో క్షేత్రస్థాయిలో పర్యటించనుంది. హరిప్రీత్ సింగ్ నేతృత్వంలోని బృందం సభ్యులు ముమ్మిడివరం వద్ద ఉన్న వర్జిన్ కోకోనట్ ఆయిల్ యూనిట్‌ను, పేరూరులో మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీల) ఆధ్వర్యంలోని కొబ్బరి తాడు పరిశ్రమను, మామిడికుదురు మండలం పాశర్లపూడిలో క్వాయర్ బొమ్మల దుకాణం, క్వాయర్ మాట్ యూనిట్, చీపుర్ల యూనిట్, కోప్రా యూనిట్, చార్‌కోల్ యూనిట్‌లను సందర్శించనున్నారు. ఉద్యానశాఖతోపాటు జిల్లా పరిశ్రమలశాఖ, డీఆర్‌డీఏ, కేవీఐబీ, హ్యాండ్ లూమ్ అధికారులు వారికి జిల్లాలో కొబ్బరి పరిశ్రమల అవసరాన్ని, అవకాశాలను వివరించనున్నారు.



మామిడికుదురు మండలం పాశర్లపూడి ప్రాంతంలో మహిళలు తయారు చేసిన క్వాయర్ బొమ్మల ప్రదర్శన (ఫైల్)

వందకుపైగా ఉప ఉత్పత్తులు

కొబ్బరి నుంచి వందకుపైగా ఉప ఉత్పత్తులను తయారు చేసే అవకాశం ఉంది. కానీ ఉమ్మడి గోదావరి జిల్లాల్లో చెప్పుకొనే స్థాయిలో పెద్ద పరిశ్రమలు లేవు. ఒకటి రెండు ఉన్నా అవి కేవలం క్వాయర్ పరిశ్రమలు మాత్రమే. ఇక్కడ పలు రకాల ఉత్పత్తులను తయారు చేసే పరిశ్రమలను ఏర్పాటు చేయవచ్చని ప్రణాళిక సిద్ధం చేశారు. పరిశ్రమలు ఏర్పాటైతే స్థానికంగా యువతతోపాటు మహిళా స్వయంశక్తి సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు అధికంగా మేలు జరుగుతుంది. కొబ్బరికి స్థానికంగా డిమాండ్ పెరిగి మంచి ధర లభిస్తుందని రైతులు ఆశిస్తున్నారు.

కుల ధ్రువీకరణ పత్రం ఇక శాశ్వతం

▶ మొదటి పేజీ తరువాయి

అందుబాటులో ఉంటాయి. కులం, స్థానికత, పుట్టిన తేదీ సర్టిఫికెట్ల నిబంధనలకు సంబంధించి జీవో ఎంఎస్ నంబర్ 469, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు సంబంధించి జీవో ఎంఎస్ నంబర్ 484ను తాజాగా విడుదల చేసింది. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీకి పలు మార్గదర్శకాలు ఇచ్చింది. వాటికి సంబంధించి అన్ని శాఖలకు త్వరలో శిక్షణ కూడా ఇవ్వనున్నారు. ఏటా కుల, ఆదాయ ధ్రువీకరణకు సంబంధించి 1.20 కోట్ల సర్టిఫికెట్లను రెవెన్యూ శాఖ జారీ చేస్తోంది. కొత్త నిబంధనలతో 95 శాతం సర్టిఫికెట్ల జారీ తగ్గిపోనుంది.

ప్రభుత్వ శాఖలు మళ్లీ మళ్లీ అడగకూడదు..

సంక్షేమ పథకాల కోసం వచ్చే లబ్ధిదారులను ఆయా ప్రభుత్వ శాఖలు తాజా కుల ధ్రువీకరణ పత్రాలు అడుగుతున్నాయి. దీనివల్ల ప్రజలు వాటికోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సివస్తోంది. గతేడాది 52 లక్షల కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారు. అలాగే ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 42 లక్షలకుపైగా పత్రాలు అందజేశారు. వాటికి సంబంధించిన డేటా బేస్ మొత్తం మీసేవ, ఏపీ సేవ కేంద్రాల్లో ఉంది. వాటిద్వారా ఈ సర్టిఫికెట్లను ఎలాంటి విచారణ లేకుండా మళ్లీ జారీ చేసేలా కొత్త నిబంధనలు రూపొందించారు. వీటి ప్రకారం.. ఒకసారి జారీ చేసిన కుల ధ్రువీకరణ పత్రం ఎప్పుడైనా చెల్లుబాటవుతుంది. లబ్ధిదారుడు గతంలో జారీ చేసిన సర్టిఫికెట్ సమర్పించినప్పుడు ప్రభుత్వ శాఖలు మళ్లీ తాజా సర్టిఫికెట్‌ను అడగకూడదు. అలాగే మీసేవ ద్వారా గతంలో కుల ధ్రువీకరణ పత్రం పొందిన వారికి ఎ-కేటగిరీ సేవగా తక్షణమే తాజా ధ్రువీకరణ పత్రాన్ని ఇవ్వాలి. వారి కుల నిర్ధారణ కోసం తహశీల్దార్, ఇతర అధికారులు దానిపై మళ్లీ విచారణ చేయాల్సిన అవసరం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఒకవేళ లబ్ధిదారుడి తండ్రి, సోదరులు ఎవరైనా గతంలో కుల ధ్రువీకరణ పత్రం పొంది ఉంటే వారి బంధుత్వాన్ని పౌరసరఫరాల శాఖ డేటాబేస్ ద్వారా నిర్ధారించుకుని ఈకేవైసీ పూర్తయితే విచారణ లేకుండా వెంటనే సర్టిఫికెట్ జారీ చేయాలి. ఈకేవైసీ పెండింగ్‌లో ఉంటే గ్రామ, వార్డు సచివాలయాల్లో దాన్ని పూర్తి చేసి సర్టిఫికెట్ అందించాలి. ఓబీసీ, ఈడబ్ల్యూఎస్, ప్రభుత్వ ఉద్యోగాలు, పథకాల కోసం ప్రస్తుత విధానంలోనే సర్టిఫికెట్లు జారీ చేయాలని ప్రభుత్వం పేర్కొంది.

ఆదాయ ధ్రువీకరణకు ఆరు దశల నిర్ధారణే

దారిద్య్ర రేఖకు దిగువన ఉన్నవారి (బీపీఎల్) గురించి తెలుసుకోవడానికి, విద్యా సంస్థల్లో స్కాలర్‌షిప్‌లు, ప్రభుత్వ పథకాలు, ఫీజు మినహాయింపులు పొందేందుకు ఆదాయ ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా మారింది. గత రెండేళ్లలో 75 లక్షల ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారు. వీటికోసం రెవెన్యూ అధికారులు ప్రతిసారి విచారణ చేయకుండా గ్రామ, వార్డు సచివాలయాల్లో నిర్వహించే 6 దశల నిర్ధారణ ప్రక్రియనే ఉపయోగించుకోవాలని ప్రభుత్వం ఆయా శాఖలకు తాజాగా స్పష్టం చేసింది. సంక్షేమ, విద్యా, ఇతర శాఖలు తమ పథకాల అమలుకు సంబంధించి ఇకపై ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అవసరం లేదు. 6 దశల నిర్ధారణ ప్రక్రియనే ఇందుకు వినియోగించుకోవాలి. ఒకవేళ అందులో దరఖాస్తుదారులు ఎంపిక కాకపోతే ఆ శాఖలు సమాచారాన్ని గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా రెవెన్యూ శాఖకు పంపాలి. పది, ఇంటర్ విద్యార్థుల డేటాబేస్‌ను విద్యా శాఖలు గ్రామ, వార్డు సచివాలయాలకు పంపితే అక్కడ 6 దశల నిర్ధారణ ప్రక్రియతో వారి ఆదాయ స్థాయిని నిర్ధారిస్తారు. ఒకవేళ అక్కడ విద్యార్థులు అర్హత సాధించకపోతే ఆ వివరాలను ఆయా శాఖలు గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా రెవెన్యూ శాఖకు పంపాలి. రెవెన్యూ శాఖ విచారణ చేసి వారికి సర్టిఫికెట్లు జారీ చేస్తుంది. స్కాలర్‌షిప్‌లు, పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు ఆరు దశల నిర్ధారణ ప్రక్రియ సరిపోతుంది. ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు, ఇతర కేంద్ర ప్రభుత్వ అవసరాల కోసం జారీ చేసే సర్టిఫికెట్లకు కూడా ప్రస్తుత విధానాన్నే కొనసాగించాలి.

మొల్ల రచనా శైలి రమణీయమైనది


సజ్జలను సన్మానిస్తున్న నాయకులు

సాక్షి, అమరావతి: కవయిత్రి మొల్ల శాలివాహన ముద్దుబిడ్డ అని.. ఆమె రాసిన రామాయణం 'మొల్ల రామాయణం'గా ఎంతో ప్రసిద్ధి చెందిందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి కొనియాడారు. ఆమె రచనా శైలి రమణీయమైనదన్నారు. కవులు, కళాకారులు, సాహితీవేత్తలను గౌరవించే ప్రభుత్వం తమదన్నారు. ఇటీవల రాష్ట్ర ఉత్సవంగా కవయిత్రి 'మొల్ల' జయంతిని ప్రకటిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసిన నేపథ్యంలో పలువురు శాలివాహన సోదరులు బుధవారం తాడేపల్లిలో సజ్జలను కలిశారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం సజ్జల మాట్లాడుతూ.. రామాయణాన్ని తెలుగులో రాసిన తొలి కవయిత్రిగా ఆమె ఎంతో పేరు ప్రఖ్యాతలు సంపాదించారన్నారు. అందుకే ప్రభుత్వం మొల్ల జయంతి అయిన మార్చి 13వ తేదీని రాష్ట్ర ఉత్సవంగా చేయాలని నిర్ణయించి జీవో విడుదల చేసిందని చెప్పారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాన్ని నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ ప్రకాశం జిల్లా డైరెక్టర్ పి.చెన్నకేశవులు, కృష్ణా జిల్లా డైరెక్టర్ మాణిక్యమ్మ, గుంటూరు జిల్లా వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు నాగమల్లేశ్వరి, దుర్గాప్రసాద్, చౌదయ్య తదితరులు పాల్గొన్నారు.

హెరిటేజ్, కుల రియల్టర్ల కోసమే 'ఇన్నర్' అలైన్‌మెంట్ మార్పు

1,109వ రోజు రిలే దీక్షలో బహుజన నేతలు



తాడికొండ: హెరిటేజ్ సంస్థ, కులరియల్టర్ల లబ్ధి కోసమే చంద్రబాబు, లోకేశ్ ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను పలుమార్లు మార్పు చేశారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు విమర్శించారు. దీంతో ఆ ప్రాంతంలో స్థలాలు కొనుగోలు చేసిన బినామీల ద్వారా కోట్ల రూపాయలు చేతులు మారాయన్నారు. ప్రస్తుత ప్రభుత్వ చర్యలతో రాజధాని 29 గ్రామాల్లోని పేదలందరికీ న్యాయం జరుగుతున్నందునే కులవాదులంతా గగ్గోలు పెడుతూ ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,109వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో బుధవారం పలువురు మాట్లాడారు. ఈ ప్రాంతంలో అవినీతి పట్టపగ్గాలు లేకుండా చేసినందుకే మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాల్లో ప్రజలు టీడీపీని తరిమి కొట్టారన్నారు. మరిది రాజకీయ మనుగడను కాపాడేందుకే బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పనిచేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని దోపిడీ చేసి పేదలకు సంక్షేమాన్ని దూరం చేసినందుకే.. బాబు జైలు పాలయ్యాడన్నారు. రాజధాని ప్రాంతంలో జోన్‌ల పేరుతో బాబు చేసిన మాయలు కూడా త్వరలోనే బయటకు రావడం ఖాయమని తెలిపారు. నాయకులు కారుమూరి పుష్పరాజు, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

పని ఇప్పిస్తానంటూ విద్యార్థుల అపహరణకు యత్నం

- రైలులో బెంగళూరుకు తరలించేందుకు ఓ వ్యక్తి యత్నం
- టీటీఐ అప్రమత్తతతో తల్లిదండ్రుల చెంతకు ముగ్గురు పిల్లలు


విద్యార్థులను రైల్వే పోలీస్‌తో కలిసి అప్పగిస్తున్న టీటీఐ వెంకట్

గుంతకల్లు: పని ఇప్పిస్తామని మాయమాటలు చెప్పి ముగ్గురు విద్యార్థులను బెంగళూరుకు తరలించేందుకు ఓ గుర్తు తెలియని వ్యక్తి యత్నించాడు. టీటీఐ సమయస్ఫూర్తితో వ్యవహరించి విద్యార్థులను రక్షించి తల్లిదండ్రుల చెంతకు చేర్చాడు. జోధ్‌పూర్ నుంచి బెంగళూరుకు వెళ్లే జోధ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలు (16531) మంగళవారం రాత్రి 7.50 గంటలకు గుంతకల్లు జంక్షన్ నుంచి బయలుదేరింది. ఇందులో ఉన్న టికెట్ ట్రావెలింగ్ ఇన్‌స్పెక్టర్ (టీటీఐ) ఎం.వెంకట్ ఎస్-1 కోచ్‌లో ఓ ప్రయాణికుడిని టికెట్ ఉందా అని ప్రశ్నించగా..తన స్నేహితుడు పక్క బోగీలో ఉన్నాడని ,అతడి వద్ద టికెట్ ఉందని, వెళ్లి తీసుకొస్తానని చెప్పి ఆ వ్యక్తి వెళ్లిపోయాడు. ఎంత సేపటికీ తిరిగి రాకపోవడంతో తోటి ప్రయాణికులతో టీటీఐ అతడి గురించి ఆరా తీశాడు. అతనికి సంబంధించిన ముగ్గురు పిల్లలు ఇక్కడే పైన బెర్తులో ఉన్నారని చెప్పారు. టీటీఐ ఆ విద్యార్థులను ప్రశ్నించగా..తమకు బెంగళూరులో ఉద్యోగాలు ఇప్పిస్తాననడంతో అతని వెంట వచ్చామని తాము గుంతకల్లులోని గంగానగర్‌కి చెందిన వారమని, తమ పేర్లు జనార్దన్, హుసేనీ, బబ్బూర్ అహమ్మద్ అని వివరించారు. తమ ఇంటికి సమీపంలోని ప్రైవేట్ స్కూల్‌లో 8, 9వ తరగతులు చదువుకుంటున్నామని తెలిపారు. దీంతో అప్రమత్తమైన టీటీఐ వారి తల్లిదండ్రుల సెల్ నంబర్లు తీసుకుని వారికి సమాచారమిచ్చారు. రైలు అనంతపురం స్టేషన్ దాటిపోవడంతో ధర్మవరం రైల్వేస్టేషన్‌లో విద్యార్థులను దింపి, వారిని కర్ణాటక ఎక్స్‌ప్రెస్‌లో గుంతకల్లుకు చేర్చి.. రైల్వే పోలీసుల సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు.

ఊరంతా వెతికారు..

సాయంత్రం స్కూల్ నుంచి ఇంటికి వచ్చిన ఈ ముగ్గురు విద్యార్థులు ఆడుకునేందుకు ఇంటి సమీపంలోని పార్కుకు వెళ్లారు. అక్కడ ఓ గుర్తు తెలియని వ్యక్తి వీరికి మాయమాటలు చెప్పాడు. తన వెంట వస్తే డబ్బులు ఇవ్వడంతో పాటు పని కూడా ఇప్పిస్తానని తీసుకుపోయాడు. ఇంటికి ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో విద్యార్థుల కుటుంబసభ్యులు ఊరంతా వెతికారు. ఎక్కడా కనపడకపోవడంతో ఉదయాన్నే పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఆలోచిస్తుండగా టీటీఐ ఫోనులో సమాచారమివ్వడంతో ఊపిరి పీల్చుకున్నారు.

గవర్నర్‌కు దుర్గగుడి, శ్రీశైలం దసరా ఉత్సవాల ఆహ్వానాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ)/శ్రీశైలం టెంపుల్: విజయవాడ శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, శ్రీశైలంలోని శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల దేవస్థానంలో ఈ నెల 15వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న దసరా మహోత్సవాల ఆహ్వాన పత్రికలను బుధవారం వేర్వేరుగా అందజేశారు. విజయవాడలోని రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో కెఎస్ రామారావు, శ్రీశైలం దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షుడు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈవో డి.పెద్దిరాజు కలిసి ఉత్సవాలకు హాజరుకావాలని కోరారు. అనంతరం ఆలయాల అర్చకులు వేద ఆశీర్వచనం పలకగా, ఈవో, చైర్మన్లు స్వామి, అమ్మవార్ల శేషవస్త్రాలు, లడ్డూ ప్రసాదాలు అందజేశారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు.

ఏపీఎస్పీ హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్య


క్వార్టర్స్ భవనం నుంచి దూకి మృతి


నీలకంఠారెడ్డి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కడప: కడప శివారులోని భాకరాపేట వద్ద గల ఏపీఎస్పీ 11వ బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ నీలకంఠారెడ్డి (54) బుధవారం సాయంత్రం ఆత్మహత్యకు పాల్పడ్డారు. బెటాలియన్ క్వార్టర్స్ భవనం నుంచి దూకడంతో అక్కడికక్కడే మరణించారు. క్వార్టర్స్‌లో భార్య, భర్త మాత్రమే నివాసం ఉంటున్నారు. నీలకంఠారెడ్డి స్వగ్రామం అనంతపురం జిల్లా తాడిపత్రి. ఉద్యోగాల్లో స్థిరపడిన ఇద్దరు పిల్లలకు పెళ్లిళ్లు చేశారు. తన పైఅధికారుల వేధింపులు భరించలేకే నీలకంఠారెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డారని సహచర పోలీసులు చెబుతున్నారు. ఈ ఘటనపై సిద్దవటం ఎస్సై లక్ష్మీనారాయణ కేసు నమోదు చేశారు. క్వార్టర్స్ భవనం పైనుంచి కాలుజారి పడిపోవటం వల్ల మరణించినట్టు ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారు.

సర్క్యులర్ పాసింజర్ రైళ్లు నడపాలి

- జోనల్ కమిటీ సమావేశంలో సభ్యుల ప్రతిపాదన
- 'కనెక్ట్ టు ఆంధ్ర' సీనియర్ కన్సల్టెంట్ ప్రశాంత్‌రెడ్డి వెల్లడి



తెనాలి: గుంటూరు-తెనాలి-విజయవాడ మధ్య సర్క్యులర్ పాసింజర్ రైళ్లు నడపాలని దక్షిణ మధ్య రైల్వే జోనల్ ప్రయాణికుల సంప్రదింపుల కమిటీ సమావేశంలో ప్రతిపాదించినట్లు ఆ కమిటీ సభ్యుడు కేబీ ప్రశాంత్‌రెడ్డి చెప్పారు. దీన్ని తీర్మానం చేసి రైల్వే బోర్డుకు పంపాలని విన్నవించామని, ఆ వెంటనే రైల్వే మంత్రిత్వశాఖ ఆమోదం కోసం ప్రజాప్రతినిధుల సహకారంతో కృషి చేస్తామని తెలిపారు. గుంటూరు జిల్లా కొల్లిపరకు చెందిన కేబీ ప్రశాంత్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళిక విభాగంలోని 'కనెక్ట్ టు ఆంధ్ర'కు సీనియర్ కన్సల్టెంట్‌గా ఉన్నారు. క్షయ రోగులకు సాయం అందించటంలో చేసిన కృషికి 'నిక్షయమిత్ర' అవార్డును స్వీకరించారు. ఇటీవల జోనల్ ప్రయాణికుల సంప్రదింపుల కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. తొలి సమావేశంలో పాల్గొని ప్రశాంత్‌రెడ్డి బుధవారం తెనాలిలో విలేకరులతో మాట్లాడారు. పల్నాడు ఎక్స్‌ప్రెస్‌ను రేపల్లె నుంచి నడపాలని, బిట్రగుంట-తెనాలి పాసింజర్‌ను రేపల్లె-విజయవాడ ప్యాసింజర్‌తో లింకు కలపాలని కోరారు. ప్రతిరోజూ ఉదయం తిరుపతికి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ నడపాలనీ, ఇటీవల ప్రవేశపెట్టిన విజయవాడ-చెన్నై వందేభారత్ రైలును వయా రేణిగుంట కాకుండా తిరుపతి మీదుగా నడపాలని ప్రతిపాదించినట్లు తెలిపారు.

జ్యోతిసురేఖ, కోనేరు హంపికి ఘన స్వాగతం



గన్నవరం విమానాశ్రయంలో వెన్నం జ్యోతి సురేఖ, కోనేరు హంపికి స్వాగతం పలుకుతున్న శాప్ అధికారులు, నలంద, కేఎల్‌యూ విద్యార్థులు

విమానాశ్రయం(గన్నవరం): చైనాలో జరిగిన ఆసియా క్రీడల అర్చరీ విభాగంలో మూడు స్వర్ణ పతకాలు సాధించిన వెన్నం జ్యోతిసురేఖకు గన్నవరం విమానాశ్రయంలో బుధవారం ఘన స్వాగతం లభించింది. గేమ్స్ ముగిసిన అనంతరం ఢిల్లీ చేరుకున్న సురేఖ ఎయిరిండియా విమానంలో ఉదయం ఇక్కడికి చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆమెకు శాప్ అధికారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, బంధుమిత్రులు, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏషియన్ గేమ్స్‌లో మూడు స్వర్ణ పతకాలు సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు. స్వాగతం పలికిన వారిలో శాప్ ఏవో పి.రామకృష్ణ, ఏడీ రమణ, చీఫ్ కోచ్ అజీజ్, సురేఖ తల్లిదండ్రులు సురేంద్ర, శ్రీదుర్గ, నలంద విద్యానికేతన్, కేఎల్‌యూ విద్యార్థులు ఉన్నారు. అలాగే ఏషియన్ గేమ్స్‌లో చెస్‌లో మహిళల టీమ్ విభాగంలో వెండి పతకం సాధించిన కోనేరు హంపికి కూడా శాప్ అధికారులు, బంధుమిత్రులు ఘన స్వాగతం పలికారు.

● తెలంగాణ

అరెరె.. మర్చిపోయా!

"అతనూ.. మన ఆఫీస్‌లో పనిచేస్తాడే.. పేరేంటో మర్చిపోయానబ్బా" "నిన్ననే నెట్‌ఫ్లిక్స్‌లో చూశా సినిమా చాలా బాగుంది.. పేరేంటంటే, నోట్లో నానుతూనే ఉంది.. గుర్తు రావడం లేదు" "మమ్మీ.. బైక్ కీస్ కనపడటం లేదు, కాస్త చూడు ఎక్కడ పెట్టానో గుర్తురావడం లేదు" ఇలాంటి మాటలు మీరు తరచుగా అంటుంటే.. లేదా ఎవరి నుంచైనా వింటుంటే.. సిల్లీగా తీసుకోకండి. ఎందుకంటే ఇది కూడా ఒక వ్యాధి. దాని పేరు సూడో డిమెన్షియా!

– సాక్షి, హైదరాబాద్

బాగా తెలిసిన వ్యక్తుల పేర్లను మర్చిపోవడం, మన బండి తాళాలను తరచుగా వెతుక్కోవడం, ఒకటి రెండ్రోజుల క్రితం చూసిన సినిమా పేరు కూడా గుర్తు లేకపోవడం.. ఈ లక్షణాలను వైద్యులు 'సూడో-డిమెన్షియా'గా పేర్కొంటున్నారు. డిమెన్షియా అనేది ఓ వయసు దాటాక వృద్ధాప్యంలో చుట్టుముట్టే వ్యాధి కాగా.. ప్రస్తుతం యువతపై కూడా ఇది ప్రభావం చూపుతోంది. దీని బారిన పడిన రోగులకు తరచుగా ఏకాగ్రత, జ్ఞాపకశక్తి లోపించడం నిరాశ లేదా అతిగా ఆలోచించడం వంటి లక్షణాలు ఉంటాయి.

కేసులు పెరుగుతున్నాయి...

ప్రధానంగా అధిక ఒత్తిడి, మల్టీ టాస్కింగ్, తద్వారా చోటు చేసుకుంటున్న నిస్పృహ, నిరాశ.. వంటివి ఈ పరిస్థితికి కారణం. ఫోర్టిస్ మెమోరియల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన న్యూరాలజీ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్ గుప్తా మాట్లాడుతూ, "యువతలో గణనీయంగా మతిమరుపు కేసులు పెరుగుతున్నాయి. ఇటువంటి సమస్యల నుంచి పరిష్కారం కోరుతూ నెలలో కనీసం 5–10 మంది వరకూ 50 ఏళ్ల లోపు వారు మమ్మల్ని సంప్రదిస్తున్నారు" అని చెప్పారు. "ప్రస్తుతం యువతలో కెరీర్–సంబంధిత ఒత్తిడి బాగా ఉంటోంది. తద్వారా అధిక పనిభారం సర్వసాధారణమైంది. సోషల్ స్టేటస్ గురించి ఆందోళన కూడా దీనికి తోడవుతోంది. ఇలాంటివన్నీ మెదడుపై తీవ్ర ఒత్తిడిని కలిగిస్తాయి, అది సమాచారాన్ని పూర్తిగా ప్రాసెస్ చేయడమనే దాని విధి నిర్వహణకు ఆటంకం కలిగిస్తుంది, ఎక్కువ సమయం పాటు ప్రాసెసింగ్ చేసే 'మల్టీ టాస్కింగ్' కూడా జ్ఞాపకశక్తిని కోల్పోయేలా చేస్తుంది" అని డాక్టర్ గుప్తా చెప్పారు.

మెమొరీ.. మెదడే దారి..

"ఓ విషయంపై శ్రద్ధ పెట్టడం, దాన్ని స్వీకరించడం అనంతరం దాన్ని నిలుపుకోవడం.. ఇలా జ్ఞాపకశక్తి మూడు భాగాలుగా రూపుదిద్దుకుంటుంది. దీనిలో ప్రతి దశకు మెదడు నుంచి సహకారం అవసరం, కానీ అధిక స్థాయి పని ఒత్తిడి దాని పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. సూడో డిమెన్షియా వెనుక కారణాల గురించి తెలుసుకున్న తర్వాత కొద్దిపాటి ప్రయత్నం ద్వారా దాన్ని అదుపులో ఉంచుకోవచ్చు. ఏకాగ్రత సాధించేందుకు ప్రయత్నించడం, డిప్రెషన్‌కు చికిత్స తీసుకోవడం వల్ల పరిస్థితి మెరుగుపడుతుంది, ఆందోళన తగ్గుతుంది" అని గుప్తా వివరించారు.

తల్లిదండ్రులకు అన్నం పెట్టని కొడుకుకు 3 రోజుల జైలు

సంగెం: తల్లిదండ్రులకు అన్నం పెట్టకుండా దూషించిన కొడుకుకు 3 రోజుల జైలుశిక్ష విధిస్తూ వరంగల్ సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ తీర్పునిచ్చారు. వరంగల్ జిల్లా సంగెం మండలం గవిచర్ల గ్రామానికి చెందిన బుట్టి ఉపేంద్ర, నర్సయ్య దంపతులకు శ్రీను, రాజులు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. ఉన్న ఇల్లు, వ్యవసాయ భూములను కొడుకులిద్దరికీ పంచి ఇచ్చి ఓ రేకుల షెడ్‌లో తల్లిదండ్రులు కాలం వెళ్లదీస్తున్నారు. పెద్ద కొడుకు శ్రీను, కోడలు మంజుల ఆ వృద్ధ దంపతులకు అన్నం పెట్టకపోగా దూషించి కొట్టడం, ఇంట్లోనుంచి వెళ్లగొట్టడం చేస్తున్నారు. దీంతో వారు పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి కుమారుడు, కోడలిని కోర్టులో హాజరుపరిచారు. కోడలు మంజులకు రూ.1,200 జరిమానా, కుమారుడు శ్రీనుకు 3 రోజుల జైలు శిక్ష విధిస్తూ సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ గుర్రం వీరస్వామి తీర్పు చెప్పారు.

16 తర్వాత బీజేపీ అభ్యర్థుల తొలి జాబితా

- నోటిఫికేషన్ వెలువడేలోగా మేనిఫెస్టోతో చార్జ్‌షీట్ విడుదల
- బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్

సాక్షి, హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోగా బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోతో పాటు కేసీఆర్ సర్కార్‌పై చార్జ్‌షీట్ కూడా విడుదల చేస్తామని ఆ పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. అదేవిధంగా ఈనెల 16వ తేదీ తర్వాత బీజేపీ అభ్యర్థుల తొలిజాబితా ప్రకటిస్తామన్నారు. బుధవారం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ...రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో పోటీకి అన్ని వర్గాలకు బీజేపీ సముచిత స్థానం కల్పిస్తుందని స్పష్టం చేశారు. బీజేపీ నేతలు వాస్తవాలు చెబుతుంటే వాటికి సరైన సమాధానం చెప్పలేక మంత్రి కేటీరామారావు సంస్కారం లేకుండా నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. పెద్దవారిని తిడితే పెద్దవాణ్ణి అయిపోతానని కేటీఆర్ అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. తాను సీఎం కాలేననే ఫ్రస్టేషన్‌లో స్థాయికి మించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ వ్యతిరేక పవనాలు బలంగా వీస్తున్నాయన్నారు. బీజేపీకి ప్రజల్లో ఆదరణ పెరిగి అధికార పార్టీ నేతలు, మంత్రుల కాళ్లకింద భూమి కదులుతుంటే విచక్షణ కోల్పోయి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం కలిసికట్టుగా అవకాశవాద రాజకీయాలకు పాల్పడుతున్నాయని, వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలిపించడం ద్వారా ఈ పార్టీలకు ప్రజలు సరైన గుణపాఠం చెప్పడం ఖాయమని వ్యాఖ్యానించారు.

క్లుప్తంగా...

శ్రీశారదాపీఠాధిపతులకు శ్రీశైలం నవరాత్రుల ఆహ్వానం


స్వరూపానందేంద్ర సరస్వతికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఈవో పెద్దిరాజు

సింహాచలం: విజయదశమిని పురస్కరించుకుని శ్రీశైలం దేవస్థానంలో జరిగే భ్రమరాంబికాదేవి శరన్నవరాత్రి మహోత్సవాల ఆహ్వాన పత్రికను విశాఖ శ్రీశారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతికి బుధవారం అందజేశారు. ఉత్సవాల్లో పాల్గొనాలని దేవస్థానం పండితులు, అధికారులు కోరారు. ఫిబ్రవరిలో చేపడుతున్న ఆలయ కుంభాభిషేకం గురించి వివరించారు. వైదిక, ఆగమ పద్ధతులను కచ్చితంగా పాటించాలని ఈ సందర్భంగా ఈవో పెద్దిరాజుకు స్వరూపానందేంద్ర సరస్వతి సూచించారు.

శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల జనవరి కోటా విడుదల

- 18న లక్కీ డిప్..23న అంగప్రదక్షిణం టోకెన్లు ఆన్‌లైన్‌లో..
- 24న ఎస్ఈడీ కోటా.. 25న గదులు బుకింగ్

తిరుమల: 2024 జనవరికి సంబంధించి తిరుమల శ్రీవారి సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళపాదపద్మారాధన ఆర్జిత సేవల ఆన్‌లైన్ లక్కీడిప్ కోసం అక్టోబర్ 18న ఉదయం 10 గంటల నుండి 20న ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకోవచ్చని టీటీడీ తెలిపింది. లక్కీడిప్‌లో టికెట్లు పొందిన వారు అక్టోబర్ 22న మధ్యాహ్నం 12 గంటల్లోపు రుసుం చెల్లించి వాటిని ఖరారు చేసుకోవాలి. కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్ సేవ, సహస్రదీపాలంకార సేవా టికెట్లను అక్టోబర్ 21న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. వర్చువల్ సేవా టికెట్లను అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేస్తారు. అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను అక్టోబర్ 23న ఉదయం 10 గంటలకు, శ్రీవాణి ట్రస్ట్ బ్రేక్ దర్శనం, గదుల కోటాను 11 గంటలకు..వృద్ధులు, దివ్యాంగుల దర్శన టోకెన్ల కోటాను మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేస్తారు. ప్రత్యేక ప్రవేశ దర్శనం (ఎస్ఈడీ) రూ.300 టికెట్ల కోటాను అక్టోబర్ 24న ఉదయం 10 గంటలకు, తిరుమల, తిరుపతిలో వసతి గదుల బుకింగ్‌ను 25న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. ఈ ఏడాది డిసెంబర్‌కు సంబంధించి అక్టోబర్ 27న ఉదయం 11 గంటలకు శ్రీవారి సేవ కోటాను, ఉదయం 12 గంటలకు నవనీత సేవ కోటాను, మధ్యాహ్నం 3 గంటలకు పరకామణి సేవ కోటాను విడుదల చేస్తారు. https://tirupatibalaji.ap.gov.in వెబ్‌సైట్‌లో సేవా టికెట్లను బుక్ చేసుకోవాలని టీటీడీ కోరింది.

పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): సదరన్ రైల్వే జోన్‌లో జరుగుతోన్న ట్రాఫిక్ బ్లాక్ పనుల కారణంగా విజయవాడ డివిజన్ మీదుగా ఆ మార్గంలో నడిచే పలు రైళ్లను పూర్తిగాను, పాక్షికంగా రద్దు చేసినట్లు రైల్వే అధికారులు బుధవారం తెలిపారు. సూళ్లూరుపేట-నెల్లూరు (06745) రైలు ఈ నెల 12, 21, 24, 28, 31, నవంబర్ 4 తేదీల్లో, నెల్లూరు-సూళ్లూరుపేట (06746) రైలు ఈ నెల 12, 17, 24, 31 తేదీల్లోను, సూళ్లూరుపేట-నెల్లూరు (06751)రైలు ఈ నెల 12, 17, 24, 31 తేదీల్లో, గూడూరు-సూళ్లూరుపేట (06750)రైలు ఈ నెల 12, 17, 24, 31 తేదీల్లో రద్దు చేసినట్లు చెప్పారు. విజయవాడ-చెన్నై సెంట్రల్ (12711/12712) రైలు ఈ నెల 17, 24, 31 తేదీల్లో, గూడూరు-చెన్నై సెంట్రల్ మధ్య పాక్షికంగా రద్దు చేసినట్లు వెల్లడించారు.

రీ షెడ్యూల్ రైళ్లు....

త్రివేండ్రం సెంట్రల్-సికింద్రాబాద్ (17229) రైలు ఈ నెల 9, 11, 13, 14 తేదీల్లో 2.5 గంటలు ఆలస్యంగా నడవనుంది. చెన్నై సెంట్రల్-విజయవాడ (12712) రైలు ఈ నెల 10, 2,1, 28, నవంబర్ 4 తేదీల్లో చెన్నై సెంట్రల్ నుంచి 45 నిమిషాలు ఆలస్యంగా బయలుదేరుతుంది. చెన్నై సెంట్రల్-హౌరా (12840) రైలు ఈ నెల 12న చెన్నై సెంట్రల్‌లో 90 నిమిషాలు ఆలస్యంగా బయలుదేరుతుంది. అదే రైలు ఈ నెల 10, 24, 31 తేదీల్లో చెన్నై సెంట్రల్‌లో 45 నిమిషాలు ఆలస్యంగా నడుస్తుంది.

● తెలంగాణ

ఒకరోజు యూకే డిప్యూటీ హైకమిషనర్‌గా రితికాప్రసాద్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని డిప్యూటీ హైకమిషన్ (యూకే) నిర్వహించిన కాంటెస్ట్‌లో విజేతగా నిలిచిన రితికా ప్రసాద్ ఒకరోజు డిప్యూటీ హైకమిషనర్‌గా కొనసాగారు. రితికా ప్రసాద్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిస్)లో ఆర్గనైజేషన్‌లో స్పెషలైజేషన్‌తో పబ్లిక్ పాలసీ అండ్ గవర్నెన్స్‌లో మాస్టర్స్ డిగ్రీ చేస్తున్నారు. అలాగే ఆమె ఢిల్లీ యూనివర్సిటీ నుంచి పొలిటికల్ సైన్స్‌లో అండర్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. రితికా జీ-20కి సంబంధించి ఇటీవలి ప్రచురణతో సహా పలు అకడమిక్ కార్యక్రమాలు, పాలసీ బ్రీఫ్‌లో భాగస్వామ్యమయ్యారు. జెండర్, హెల్త్‌కు సంబంధించిన అంశాలు, పర్యావరణ సుస్థిరత పట్ల ఆమెకు ఆసక్తి ఉన్నట్లు చెప్పారు. ఒకరోజు డిప్యూటీ హైకమిషనర్‌గా బాధ్యత తీసుకున్న తర్వాత తొలి ఎంగేజ్‌మెంట్‌లో భాగంగా జి.నారాయణమ్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ప్యానెల్ చర్చల్లో పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఐరాస మానవ హక్కుల సంస్థలో రష్యాకు దక్కని స్థానం

ఐక్యరాజ్యసమితి: అంతర్జాతీయంగా మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్న ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల సంస్థ(హెచ్ఆర్సీ)లో రష్యాకు స్థానం దక్కలేదు. ఈ కౌన్సిల్‌లో రష్యాకు గతంలో సభ్యత్వం ఉండేది. ఉక్రెయిన్‌పై ఏకపక్షంగా దండయాత్రకు దిగిన రష్యాను గత ఏడాది కౌన్సిల్ నుంచి తొలగించారు. కౌన్సిల్‌లో ఖాళీగా ఉన్న రెండు స్థానాలకు తాజాగా ఎన్నికలు నిర్వహించారు. వీటిని బల్గేరియా, అల్బేనియా దక్కించుకున్నాయి. ఐరాస సభ్యదేశాల సంఖ్య 193. ఇందులో వేర్వేరు దేశాలకు వేర్వేరు సంఖ్యలో ఓట్లు ఉన్నాయి. ఐరాస సాధారణ సభలో జరిగిన ఎన్నికల్లో బల్గేరియాకు 160, అల్బేనియాకు 123, రష్యాకు కేవలం 83 ఓట్లు లభించాయి. రష్యాకు ఓటమి ఎదురైంది.

మిజోరం స్పీకర్ రాజీనామా

బీజేపీలో చేరికకు రంగం సిద్ధం

ఐజ్వాల్: ఎన్నికల రాష్ట్రం మిజోరంలో ఎమ్మెల్యేల రాజీనామాల పర్వం కొనసాగుతోంది. తాజాగా అసెంబ్లీ స్పీకర్, అధికార మిజో నేషనల్ ఫ్రంట్ నేత లాల్‌రిన్లియానా సైలో తన పదవికి, శాసన సభ్యత్వానికి రాజీనామా చేశారు. రాష్ట్రాభివృద్ధి కోసం త్వరలో బీజేపీలో చేరనున్నట్టు బుధవారం ప్రకటించారు. గురువారం ఆయన కాషాయ తీర్థం పుచ్చుకుంటారని సమాచారం. గత ఎనిమిది రోజుల్లో రాష్ట్రంలో ఏకంగా ఏడుగురు ఎమ్మెల్యేలు రాజీనామా చేశారు. వీరిలో ఇద్దరు కాంగ్రెస్ నేతలు కాగా మిగతా ఐదుగురు జోరాం పీపుల్స్ మూవ్‌మెంట్ మద్దతున్న స్వతంత్రులు.

న్యూస్‌క్లిక్‌పై సీబీఐ ఎఫ్ఐఆర్

న్యూఢిల్లీ: విదేశీ విరాళాల (నియంత్రణ) చట్టం ఉల్లంఘన కేసులో న్యూస్‌క్లిక్ వార్తా పోర్టల్, దాని వ్యవస్థాపకుడు ప్రబీర్ పురకాయస్థపై సీబీఐ బుధవారం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. సంస్థ కార్యాలయం, ఆయన నివాసాల్లో మరోసారి సోదాలు కూడా నిర్వహించింది. న్యూస్‌క్లిక్, ప్రబీర్‌తో పాటు వరల్డ్ వైడ్ మీడియా హోల్డింగ్ మేనేజర్ జేసన్ ఫెచర్, ఐటీ కన్సల్టెన్సీ సంస్థను నడిపే అమెరికా మిలియనీర్ నెవిలీ రాయ్ సింగం తదితరులను కూడా నిందితులుగా చేర్చింది. నాలుగు విదేశీ మూలాల నుంచి అక్రమంగా రూ.28.46 కోట్ల మేరకు న్యూస్‌క్లిక్‌కు అందినట్టు సీబీఐ ఆరోపించింది.

అఫ్గానిస్తాన్‌లో మళ్లీ భూకంపం

కాబూల్: అఫ్గానిస్తాన్‌లో మళ్లీ భూకంపం సంభవించింది. ఇది రిక్టర్ స్కేల్‌పై 6.3గా నమోదయ్యింది. బుధవారం తెల్లవారుజామున 6.11 గంటలకు భూమి కంపించింది. పశ్చిమ అఫ్గానిస్తాన్‌లో హెరాత్ నగరానికి 29 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం నమోదైనట్లు అమెరికా జియోలాజికల్ సర్వే సంస్థ ప్రకటించింది.

గాజా అష్ట దిగ్బంధం

రాకెట్లు, డ్రోన్లతో ఇజ్రాయెల్ సైన్యం భీకర దాడులు | భవనాల శిథిలాల కిందే మృతదేహాలు

- ఇజ్రాయెల్‌పై రాకెట్లు ప్రయోగిస్తున్న హమాస్
- ఇరువైపులా 2,200 మంది మృత్యువాత
- ఇజ్రాయెల్‌లో 1,200, గాజాలో 1,055 మంది బలి
- గాజాకు ఆహారం, విద్యుత్ సరఫరా బంద్
- ఆసుపత్రుల్లో నిండుకున్న ఔషధాలు
- బందీల భద్రతపై కుటుంబ సభ్యుల్లో ఆందోళన
- లెబనాన్, సిరియా నుంచి ఇజ్రాయెల్‌పై కొనసాగుతున్న దాడులు

జెరూసలేం/టెల్ అవివ్/న్యూఢిల్లీ: హమాస్ మిలిటెంట్లను తుదముట్టించడమే ధ్యేయంగా వారి పాలనలో ఉన్న గాజా ప్రాంతాన్ని ఇజ్రాయెల్ సైన్యం చుట్టుముట్టింది. పూర్తిగా దిగ్బంధించింది. గాజాలో ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు బాంబుల మోత మోగిస్తున్నాయి. రాకెట్లు, డ్రోన్లతో విరుచుకుపడుతున్నాయి. ఈ దాడుల్లో పదుల సంఖ్యలో భవనాలు ధ్వంసమవుతున్నాయి. సామాన్య ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. నేలకూలుతున్న భవనాలు, ఎగిసిపడుతున్న దుమ్ము ధూళి, పొగ.. గాజా అంతటా ఇవే దృశ్యాలు కనిపిస్తున్నాయి. పరిస్థితి హృదయవిదారకంగా మారింది. శిథిలాల కింద ఎన్ని మృతదేహాలు ఉన్నాయో తేలడం లేదు. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం బుధవారం ఐదో రోజుకు చేరుకుంది. హమాస్ ముష్కరులు ఇజ్రాయెల్‌పై రాకెట్ల దాడి కొనసాగిస్తూనే ఉన్నారు. దక్షిణ ఇజ్రాయెల్‌లోని ఆష్కెలాన్ సిటీపై బుధవారం భారీగా రాకెట్లను ప్రయోగించారు. ఇరువైపులా ఇప్పటివరకు 2,200 మంది చనిపోయారు. తమ దేశంలో 155 మంది సైనికులు సహా 1,200 మందికిపైగా జనం ప్రాణాలు కోల్పోయారని ఇజ్రాయెల్ అధికారులు ప్రకటించారు. గాజాలో కనీసం 1,055 మంది బలయ్యారు. వీరిలో 260 మంది చిన్నారులు, 230 మంది మహిళలు ఉన్నట్లు స్థానిక అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే పరిస్థితి కనిపిస్తోంది. మరోవైపు, ఉత్తర ఇజ్రాయెల్ సరిహద్దుల్లో లెబనాన్, సిరియా నుంచి తీవ్రవాదులు ఇజ్రాయెల్ సైన్యంపై దాడికి దిగుతున్నారు. ఇరువర్గాల మధ్య కాల్పులు కొనసాగుతున్నాయి. ఇది మరింత తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

క్షతగాత్రులతో నిండిపోయిన గాజా ఆసుపత్రులు

దారులన్నీ మూసుకుపోవడంతో గాజాలో ఆహారం, ఇంధనం, ప్రాణాధార ఔషధాలు నిండుకున్నాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అంధకారం అలుముకుంది. ఆసుపత్రులన్నీ ఇప్పటికే క్షతగాత్రులతో నిండిపోయాయి. ఔషధాలు, వైద్య పరికరాలు లేకపోవడంతో బాధితులకు వైద్యం అందించలేకపోతున్నారు. ఇతర దేశాల నుంచి గాజాకు ఔషధాల సరఫరా కోసం సురక్షిత కారిడార్లు ఏర్పాటు చేయాలని స్వచ్ఛంద సంస్థలు కోరుతున్నాయి. గాజాలోని ఏకైక విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఇంధనం లేకపోవడంతో మూతపడింది. ఇంధన సరఫరాను ఇజ్రాయెల్ నిలిపివేసింది. ప్రస్తుతం కరెంటు కోసం కొన్నిచోట్ల జనరేటర్లు ఉపయోగిస్తున్నారు. ఈజిప్టు కూడా తమ సరిహద్దును మూసివేసింది. గాజా నుంచి రాకపోకలను అనుమతించడం లేదు. గాజాలో 2,50,000 మందికిపైగా ప్రజలు సొంత ఇళ్లు వదిలేసి, ఐక్యరాజ్యసమితి శిబిరాల్లో ఆశ్రయం పొందుతున్నారు. గాజా చుట్టూ ఇజ్రాయెల్ సైన్యం మోహరించడంతో బయటకు వెళ్లే మార్గం లేకుండాపోయింది. గాజాలో ఇప్పుడు భద్రమైన స్థలం అంటూ ఏదీ లేదని స్థానికులు చెబుతున్నారు.

బందీలను ఎక్కడ దాచారో?

ఇజ్రాయెల్‌లో హమాస్ మిలిటెంట్లు అపహరించిన 150 మందికిపైగా జనం జాడ ఇంకా తెలియరాలేదు. హమాస్ చేతిలో బందీలుగా ఉన్నవారి క్షేమ సమాచారాలు తెలియక వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ముందస్తు హెచ్చరికలు లేకుండా గాజాపై ఇజ్రాయెల్ దాడి చేసిన ప్రతిసారీ ఒక్కో బందీని చంపేస్తామని హమాస్ సాయుధ విభాగం హెచ్చరికలు జారీ చేసింది. హమాస్ అపహరించిన 150 మందిలో ఇజ్రాయెల్ సైనికులు, మహిళలు, చిన్నారులు కూడా ఉన్నారు. గాజాలో రహస్య సొరంగాల్లోకి వారిని తరలించినట్లు ఇజ్రాయెల్ అనుమానిస్తోంది.


గాజాపైకి కాల్పులు జరుపుతున్న ఇజ్రాయెల్ శతఘ్నులు

ఇజ్రాయెల్‌లో 40 మంది చిన్నారుల హత్య!

హమాస్ మిలిటెంట్లు రాక్షసంగా ప్రవర్తించారు. ఇజ్రాయెల్‌లో 40 మంది చిన్నారులను పాశవికంగా హత్య చేశారు. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ వార్తా సంస్థ వెల్లడించింది. హమాస్ దాడులు చేసిన ప్రాంతాల్లో 40 మంది పసిబిడ్డల మృతదేహాలు లభ్యమయ్యాయని ఇజ్రాయెల్ సైన్యం తెలియజేసినట్లు పేర్కొంది. బాధిత చిన్నారుల మృతదేహాల్లో కొన్నింటికి తలలు దారుణంగా నరికేసి ఉన్నాయని వివరించింది.

గాజాలో ఆకలి కేకలు

ఆహారం, తాగునీరు లేక గాజా ప్రజలు అల్లాడిపోతున్నారు. బయటి నుంచి ఎలాంటి సరఫరాలూ వచ్చే మార్గం లేక 23 లక్షల మంది గాజాపౌరులు హాహాకారాలు చేస్తున్నారు. నిజానికి 2007 నుంచే గాజాను ఇజ్రాయెల్ పూర్తిగా తన గుప్పెట్లో ఉంచుకుంది. అక్కడికి ఎలాంటి సరఫరాలైనా ప్రధానంగా ఇజ్రాయెల్ గుండా, దాని అనుమతితో వెళ్లాల్సిందే. గాజా గగనతలం, ప్రాదేశిక జలాలతో పాటు మూడు ప్రధాన సరిహద్దు ప్రాంతాల్లో రెండింటిని ఇజ్రాయెలే పూర్తిగా నియంత్రిస్తోంది. మూడో సరిహద్దు ఈజిప్టు నియంత్రణలో ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో అంతర్జాతీయ సమాజం జోక్యం చేసుకోవాలని, గాజాకు అత్యవసర ఆహార పదార్థాలు, ఇతర సదుపాయాలు అందేలా చూడాలని పాలస్తీనా విమోచన సంస్థ ఎగ్జిక్యూటివ్ కమిటీ ప్రధాన కార్యదర్శి హుసేన్ అల్ షేక్ విజ్ఞప్తి చేశారు. గాజాలో ఐరాస శిబిరాల్లో తలదాచుకుంటున్న 1.8 లక్షల మందికి ఎలాంటి ఆహార సరఫరాలూ అందడం లేదని ఐరాస రిలీఫ్ అండ్ వర్క్స్ ఏజెన్సీ వెల్లడించింది.


గాజాపై ఇజ్రాయెల్ వైమానిక దాడి అనంతరం దట్టంగా వెలువడుతున్న పొగ

హమాస్ దుశ్చర్యను ఖండించిన జో బైడెన్

ఇజ్రాయెల్‌పై హమాస్ దాడిని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మరోసారి ఖండించారు. ఈ దాడి ముమ్మాటికీ రాక్షస చర్య అని అభివర్ణించారు. ఇజ్రాయెల్‌కు అండగా ఉంటామని ఉద్ఘాటించారు. ఈ పరిణామాన్ని సానుకూలంగా మార్చుకోవాలని ఎవరూ చూడొద్దని హెచ్చరించారు. అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ ఇజ్రాయెల్‌కు చేరుకున్నారు. ఇజ్రాయెల్‌కు మద్దతు తెలియజేయడానికే ఆయన స్వయంగా వచ్చినట్లు సమాచారం. జో బైడెన్‌తోపాటు అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూతో ఫోన్‌లో మాట్లాడారు. తాజా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇజ్రాయెల్‌లో హమాస్ దాడిలో తమ పౌరులు 14 మంది మరణించారని జో బైడెన్ నిర్ధారించారు. అలాగే కనీసం 20 మంది అమెరికన్లు కనిపించకుండాపోయినట్లు సమాచారం. హమాస్ దాడిలో ఫ్రాన్స్, జర్మనీ, రష్యా, ఆస్ట్రేలియా పౌరులు కూడా మృతి చెందారు. గాజాను ఇజ్రాయెల్ సైన్యం దిగ్బంధించడాన్ని తుర్కియే అధ్యక్షుడు రిసెప్ తయాప్ ఎర్డోగాన్ ఖండించారు. పాలస్తీనా పౌరుల మానవ హక్కులపై దాడి చేయొద్దని డిమాండ్ చేశారు. ఘర్షణకు తెరదించాలని, కాల్పుల విరమణ పాటించాలని ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫతా ఎల్–సిసీ ఇజ్రాయెల్, హమాస్‌కు విజ్ఞప్తి చేశారు.

భారత రాయబార కార్యాలయం భరోసా

ఇజ్రాయెల్‌లో తాజా పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని టెల్ అవివ్‌లోని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. ఇజ్రాయెల్‌లోని భారతీయులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రశాంతంగా ఉండాలని సూచించింది. అప్రమత్తంగా ఉండాలని పేర్కొంది. ఏదైనా సహాయం కావాలంటే తమను సంప్రదించాలని తెలియజేసింది. భద్రత విషయంలో స్థానిక అధికారుల మార్గదర్శకాలు పాటించాలని కోరింది.

ఇజ్రాయెల్‌దే పైచేయి!

హమాస్‌పై ఇజ్రాయెల్ సైన్యం క్రమంగా పైచేయి సాధిస్తోంది. గాజాలో హమాస్ అధీనంలో ఉన్న ప్రాంతాలను సైన్యం స్వాధీనం చేసుకుంటోంది. హమాస్ స్థావరాలపై దాడులను తీవ్రతరం చేస్తోంది. గాజా విషయంలో ఇక మునుపటి స్థితికి వెళ్లడం దాదాపు అసాధ్యమని ఇజ్రాయెల్ రక్షణ శాఖ మంత్రి యోవ్ గల్లాంట్ తాజాగా ప్రకటించారు. హమాస్‌పై ఇక పూర్తిస్థాయి యుద్ధానికి సిద్ధమైనట్లు వెల్లడించారు. గాజా నుంచి హమాస్ మిలిటెంట్లను ఏరిపారేస్తామని తేల్చిచెప్పారు. వారికి శిక్ష తప్పదని స్పష్టం చేశారు.

భారత విదేశాంగ శాఖ హెల్ప్‌లైన్


శిథిలాల నుంచి చిన్నారిని సురక్షితంగా బయటకు తీసుకొస్తున్న సిబ్బంది

ఇజ్రాయెల్, గాజాలో ఉన్న భారతీయులకు సహకరించేందుకు, ఎప్పటికప్పుడు సమాచారం అందించేందుకు భారత విదేశాంగ శాఖ ఢిల్లీలో కంట్రోల్ రూమ్, టెల్ అవివ్, రమల్లాలో ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేసింది. ఇజ్రాయెల్‌లో ప్రస్తుతం 18 వేల మంది భారతీయులు ఉన్నట్లు అంచనా. 1800118797, +91-11 23012113, +91-11-23014104, +91-11-23017905 +919968291988, +97235226748, +972-543278392, +970-592916418 నంబర్లకు ఫోన్ చేసి, సమాచారం తెలుసుకోవచ్చని విదేశాంగ శాఖ సూచించింది.

వివాహిత 26 వారాల గర్భవిచ్ఛిత్తి కేసులో... సుప్రీం భిన్న తీర్పులు

- పిండం గుండె ఆపేయాలని ఏ కోర్టు చెప్పుదన్న జస్టిస్ హిమా కోహ్లీ
- గర్భవిచ్ఛిత్తిలో మహిళ నిర్ణయాన్ని గౌరవించాలన్న జస్టిస్ నాగరత్న
- ఏకాభిప్రాయానికి రాలేకపోవడంతో ప్రధాన న్యాయమూర్తికి సిఫారసు

న్యూఢిల్లీ: గర్భ విచ్ఛిత్తికి సంబంధించిన ఒక కేసులో అత్యున్నత న్యాయస్థానం ఏకాభిప్రాయానికి రాలేకపోయింది. సుప్రీం కోర్టులో ద్విసభ్య బెంచ్ బుధవారం భిన్న తీర్పుల్ని వెలువరించింది ఒక వివాహిత గర్భం దాల్చిన 26 వారాలకు గర్భవిచ్ఛిత్తి కోరుతూ కోర్టును ఆశ్రయించింది. దీనిపై ఎయిమ్స్ ఇచ్చిన నివేదికను పరిశీలించిన సుప్రీంకోర్టు బెంచ్‌లోని న్యాయమూర్తి జస్టిస్ హిమ కోహ్లి పిండం గుండె ఆపేయాలని ఏ కోర్టు అయినా ఎందుకు చెబుతుందని ప్రశ్నిస్తూ గర్భవిచ్ఛిత్తికి నిరాకరించారు. సుప్రీం బెంచ్‌లో మరో న్యాయమూర్తి జస్టిస్ బి.వి. నాగరత్న దాంతో విభేదించారు. మహిళ నిర్ణయాన్ని తప్పనిసరిగా గౌరవించాలని అన్నారు. వివరాల్లోకి వెళితే........

ఇద్దరు పిల్లలున్న ఒక వివాహిత మూడోసారి గర్భం దాల్చింది. అప్పటికే కుంగుబాటు సమస్యతో బాధపడుతున్న ఆమె మానసికంగా, ఆర్థికంగా తాను మరో పిల్లని పెంచడానికి సంసిద్ధంగా లేనని, అందుకే గర్భవిచ్ఛిత్తికి అనుమతినివ్వాలని సుప్రీం కోర్టుని ఆశ్రయించింది. గర్భం దాల్చి 26 వారాల కావడంతో ఎయిమ్స్‌లో వైద్యులు ఆమెని పరీక్షించి అబార్షన్ వల్ల ఎలాంటి ప్రమాదం లేదని అక్టోబర్ 6న నివేదిక కూడా ఇచ్చారు. ఈ పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు గర్భవిచ్ఛిత్తికి అనుమతినిస్తూ అక్టోబర్ 9న తీర్పు చెప్పింది.ఆ మహిళకు అబార్షన్ చేయాలని ఎయిమ్స్ వైద్యాధికారుల్ని ఆదేశించింది. అబార్షన్‌కు ముందు ఎయిమ్స్ డాక్టర్లు ఆమెని పరీక్షించి గర్భవిచ్ఛిన్నం చేసినా శిశువు సజీవంగానే ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఇదే విషయాన్ని స్పష్టంగా చెబుతూ మరో నివేదిక ఇచ్చారు. దీంతో కేంద్ర ప్రభుత్వం గర్భవిచ్ఛిత్తి నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాల్సిందిగా అక్టోబర్ 10న మరో పిటిషన్ దాఖలు చేసింది. అత్యవసరంగా బుధవారం ఆ పిటిషన్‌ను విచారించిన సుప్రీం బెంచ్ తొలుత ఎయిమ్స్‌లో మరో వైద్య బృందం గర్భవిచ్ఛిత్తి వల్ల వచ్చే ప్రమాదేమేమీ లేదని ఇచ్చిన నివేదికను ప్రస్తావించింది. అక్టోబర్ 6 న అబార్షన్‌కు ప్రమాదం లేదని వైద్యులు ఎందుకు నివేదిక ఇచ్చారు ? ఎందుకు ఆ దాపరికం ? నాలుగు రోజుల్లోనే ఎలా పరిస్థితి మారింది ? అని ప్రభుత్వం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటిపై న్యాయమూర్తులు ప్రశ్నల వర్షం కురిపించారు. గర్భవిచ్ఛిన్నం చేసినా శిశువు బతికే ఉంటుందని అంటే ఏ కోర్టు అయినా పిండం గుండె ఆపేయమని ఎందుకు చెబుతుంది ? అంటూ జస్టిస్ హిమాకోహ్లీ ప్రశ్నించారు. నా వరకు నేనైతే అలాంటి పని చేయలేనన్న జస్టిస్ హిమ గర్భవిచ్ఛిత్తికి నిరాకరించారు. మరో న్యాయమూర్తి జస్టిస్ నాగరత్న అక్టోబర్ 9న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుని ప్రస్తావించారు. ఇప్పటికీ ఆ మహిళ గర్భం తీసివేయడం పట్ల సుముఖంగా ఉన్నందున ఆమె నిర్ణయాన్ని గౌరవించాలంటూ గర్భవిచ్ఛిత్తికి అనుమతినిస్తూ తీర్పు చెప్పారు. ఆ మహిళ సామాజిక ఆర్థిక పరిస్థితులతో పాటు ఆమె శారీరక, మానసిక పరిస్థితుల దృష్ట్యా గర్భవిచ్ఛిత్తి చేయడమే సరైనదన్నారు. ఇద్దరు న్యాయమూర్తులు ఏకాభిప్రాయానికి రాలేకపోవడంతో ఈ కేసుని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్‌కు పరిశీలనకు సిఫారసు చేశారు.

హమాస్ దాడి వెనుక...

- పశ్చిమాసియాలో మారుతున్న బలాబలాలతో ఆందోళన
- అరబ్ దేశాలతో ఇజ్రాయెల్ సాన్నిహిత్యంతో కలవరం
- అన్నివిధాలా ఇరుకున పెట్టడమే లక్ష్యంగా నెత్తుటేర్లు

ఇజ్రాయెల్‌పై హమాస్ మెరుపుదాడి ఒక్క ఆ దేశాన్నే గాక ప్రపంచమంతటినీ నిర్ఘాంతపరిచింది. నెలల తరబడి పక్కాగా ప్రణాళిక వేసుకుని మరీ చేసిన ఈ దాడి వెనక, ఇదే సమయాన్ని ఎంచుకోవడం వెనక కారణాలపై చర్చోపచర్చలు జరుగుతున్నాయి. ఒకరకంగా పాలస్తీనియన్ల పట్ల ఇజ్రాయెల్ ప్రభుత్వ మితిమీరిన దూకుడు విధానాలు ఈ దాడిని సమర్థించునేందుకు హమాస్‌కు అవకాశం కూడా కల్పించినట్టు కన్పిస్తోంది.

ఇజ్రాయెల్‌పై అక్టోబర్ 7న తెల్లవారుతూనే ఉరుముల్లేకుండానే పిడుగులు పడ్డాయి. జనం పిట్టల్లా రాలిపోయారు. రక్తం ఏరులై పారింది. బందీలుగా చిక్కిన వంద మందికి పైగా సైనికులు, పౌరులు నరకం చూస్తున్నారు. ఇంతటి ఉత్పాతానికి కారణమైన పాలస్తీనా మిలిటెంట్ సంస్థ హమాస్ దాడి గురించి ఇప్పుడు అంతటా చర్చ జరుగుతోంది. పశ్చిమాసియాలో మారుతున్న రాజకీయ బలాబలాలు, నానాటికీ పెరుగుతున్న ఇజ్రాయెల్ దూకుడు దాన్ని ఇందుకు పురిగొల్పిన కారణాల్లో ప్రధానమైనవని భావిస్తున్నారు.

ఇప్పుడే ఎందుకు?

హమాస్‌ను తాజా దాడి వెనక ప్రధానంగా మూడు కారణాలు కన్పిస్తున్నాయి. వాటిలో ప్రధానమైనది అతివాద ఇజ్రాయెల్ సర్కారు దూకుడు విధానాలు. ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్, జెరూసలేంల్లో యూదు సెటిలర్ల హింసను అది బాహాటంగా ప్రోత్సహించడం పాలస్తీనియన్ల ఆగ్రహానికి కారణమైంది. చివరికి ప్రతీకారేచ్ఛగా మారింది. సరిగ్గా అదే సమయంలో వెస్ట్‌బ్యాంక్‌లో పెరుగుతున్న ఉద్రిక్తత కారణంగా దక్షిణాది నుంచి సైన్యాన్ని ఇజ్రాయెల్ ఉత్తరానికి తరలించడం హమాస్‌కు కలిసొచ్చింది.

అరబ్–ఇజ్రాయెల్ బంధం

అరబ్ దేశాలతో సాధారణ సంబంధాల స్థాపనకు ఇజ్రాయెల్ చేస్తున్న ప్రయత్నాలు కాస్తో కూస్తో ఫలించేలా కన్పిస్తుండటం హమాస్‌ను కలవరపరిచిన రెండో అంశం. కొంతకాలంగా పాలస్తీనా విషయంలో ఇజ్రాయెల్‌పై అరబ్ దేశాల ఒత్తిడి తగ్గుతూ వస్తుండటం మరింత ఆందోళనకు కారణమైంది. ఇదే సమయంలో అరబ్ దేశాల పెద్దన్నగా భావించే సౌదీ అరేబియా ఇజ్రాయెల్‌తో పలు కీలక ఒప్పందాలు కుదుర్చుకునే దిశగా అడుగులు వేస్తుండటంతో హమాస్ అప్రమత్తమైంది. ఇదిలాగే కొనసాగితే పాలస్తీనాకు పూర్తి స్వాతంత్ర్యం ఇక కల్లోని మాటేనన్న అంచనాకు వచ్చింది.

ఇరాన్ దన్ను

ఇరాన్‌తో కొన్నేళ్ల కిందటి దాకా క్షీణ దశలో ఉన్న సంబంధాలను హమాస్ క్రమంగా పట్టాలకెక్కించుకుంటూ వచ్చింది. 2022లో హమాస్ ప్రతినిధుల బృందం సిరియాలో ఇరాన్ నేతలతో పలుమార్లు భేటీ అయింది. అనంతరం లెబనాన్, ఇరాన్‌లలో జరిగిన పలు సమావేశాల ద్వారా సంబంధాల పునరుద్ధరణ జోరందుకుంది. ఇవన్నీ ఇజ్రాయెల్‌పై భారీ ఆకస్మిక దాడికి కావాల్సిన హేతుబద్ధమైన కారణాలు, అవకాశాలతో పాటు సాయుధ, ఆర్థిక తదితర వనరులను కూడా హమాస్‌కు చేకూర్చాయి.



ఇప్పుడేం జరగనుంది?

ముస్లింలకు అతి పవిత్రమైన అల్ అక్సా మసీదు వద్ద యథాతథ స్థితిని ఇజ్రాయెల్ ఉల్లంఘించకుండా చూడాలన్న స్వల్పకాలిక లక్ష్యాన్ని ఈ దాడి ద్వారా హమాస్ సాధించినట్టే కన్పిస్తోంది. కానీ దీర్ఘకాలంలో సాధించదలచిన ఇజ్రాయెల్ వినాశనం, ముస్లిం రాజ్య ఏర్పాటు లక్ష్యాలు నెరవేరడం దేవుడెరుగు, గాజా స్ట్రిప్‌ను నామరూపాల్లేకుండా చేయకుండా ఇజ్రాయెల్‌ను అడ్డుకోవడమే హమాస్‌కు తలకు మించిన భారం కాగలదంటున్నారు. ఇజ్రాయెలీ బందీలను అడ్డుపెట్టుకున్నంత కాలమే హమాస్ ఆటలు సాగేలా కన్పిస్తున్నాయి.

అంతమెప్పుడు?

ఈ పోరుకు ముగింపు ఎప్పుడు, ఎలా జరగనుందన్నది ప్రస్తుతానికైతే అస్పష్టమే. దీనికి సమీప భవిష్యత్తులో ఏదో రకంగా తెర పడాలంటే బహుశా అంతర్జాతీయ సమాజపు జోక్యమే ఏకైక మార్గమని భావిస్తున్నారు. ఆ సందర్భంగా తన దగ్గర బందీలుగా ఉన్న ఇజ్రాయెలీ సైనికులు, పౌరులకు బదులుగా ఖైదులో ఉన్న పాలస్తీనియన్లను విడిపించుకోవడం హమాస్ ఉద్దేశంగా కనిపిస్తోంది. ఆలోపు ఇజ్రాయెల్ భారీ ప్రతీకార దాడులకు దిగకుండా అడ్డుకునేందుకు కూడా బందీలు ఉపయోగపడతారని భావిస్తోంది. గాజాలో పౌర ఆవాసాలపై ఇజ్రాయెల్ భూతల దాడులకు దిగిన మరుక్షణం బందీలను హతమార్చడం మొదలు పెడతామని హమాస్ అధికార ప్రతినిధి అబూ ఉబైదా ఇప్పటికే హెచ్చరించాడు. ఈ నేపథ్యంలో గాజాలోకి చొచ్చుకెళ్లి దాడులకు దిగడంపై ఇజ్రాయెల్ ఇప్పటికైతే ఆచితూచి వ్యవహరించాల్సి వస్తోంది. మరోవైపు ఈ దాడి ద్వారా గాజా, వెస్ట్‌బ్యాంక్ ప్రాంతాల్లో తనకు పెరిగిన ప్రతిష్ట రాజకీయంగా మరింతగా బలపడేందుకు పనికొస్తుందని కూడా హమాస్ ఆశిస్తోంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

పట్టాలు తప్పిన నార్త్ ఈస్ట్ ఎక్స్‌ప్రెస్ కోచ్‌లు.. ఐదుగురి మృతి!

బక్సర్: నార్త్ ఈస్ట్ ఎక్స్‌ప్రెస్ కోచ్‌లు బిహార్‌లోని బక్సర్ జిల్లా రఘునాథ్‌పూర్ రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలు తప్పాయి. ఈ రైలు ఢిల్లీ నుంచి అస్సాంకు బయలుదేరింది. బుధవారం రాత్రి 9.35 గంటలకు కొన్ని కోచ్‌లు పట్టాలు తప్పినట్లు రైల్వే అధికారులు చెప్పారు. ఈ ప్రమాదంలో ఐదుగురు మృతి చెందినట్లు సమాచారం. 100 మందికిపైగా ప్రయాణికులు గాయపడినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న వెంటనే అధికారులు రంగంలోకి దిగారు. సహాయక చర్యలు ప్రారంభించారు. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. రైలు కోచ్‌లు పట్టాలు తప్పడం వెనుక కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.


పట్టాలు తప్పిన నార్త్ ఈస్ట్ ఎక్స్‌ప్రెస్ బోగీలు


మేరా యువ భారత్ వేదికకు కేంద్ర కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ: యువతలో నైపుణ్యాల అభివృద్ధి కోసం మేరా యువ భారత్(మై భారత్) అనే స్వతంత్ర ప్రతిపత్తిగల సంస్థ ఏర్పాటుకు బుధవారం కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో జరిగిన కేబినెట్ సమావేశంలో యువతలో నైపుణ్యాల అభివృద్ధి, నాయకత్వ లక్షణాల పెంపు కోసం ఒక వేదికను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ విలేకరులకు వెల్లడించారు. అక్టోబర్ 31న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని ఈ సంస్థను జాతికి అంకితం చేయనున్నారు. యువతలో నైపుణ్యాలను, ఆకాంక్షలను వెలికి తీయడమే లక్ష్యంగా ఆ సంస్థ పనిచేస్తుందన్నారు. మరోవైపు కేబినెట్ సమావేశంలో కొన్ని ఖనిజాలకు సంబంధించిన రాయల్టీ రేట్లను నిర్ణయించారు. లిథియం, నియోబియం ఖనిజాలకు 3%, అరుదుగా లభించే రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ (ఆర్ఈఈ)లకు ఒక్క శాతం రాయల్టీ నిర్ణయిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

'పఠాన్‌కోట్' సూత్రధారి షహీద్ లతీఫ్ హతం

- పాకిస్తాన్‌లో దుండగుల కాల్పుల్లో మృతి
- సోదరుడు హరీస్ హషీం సైతం హతం

న్యూఢిల్లీ: 2016లో పంజాబ్‌లోని పఠాన్‌కోట్‌లో భారత వైమానిక దళం(ఐఏఎఫ్) స్థావరంపై దాడి వెనుక సూత్రధారి, పాకిస్తాన్‌కు చెందిన జైషే మొహమ్మద్ ఉగ్రవాది షహీద్ లతీఫ్, అతడి సోదరుడు హరీస్ హషీం హతమయ్యారు. బుధవారం ఉదయం పాకిస్తాన్‌లోని సియాల్‌కోట్ జిల్లాలో గుర్తుతెలియని దుండుగుల కాల్పుల్లో వారిద్దరూ మరణించారని అధికారులు వెల్లడించారు. దాస్కా పట్టణంలో నూర్ మదీనా మసీదు బయట ఈ ఘటన జరిగిందని చెప్పారు. మసీదులో ప్రార్థనలు ముగించుకొని బయటకు రాగానే ముగ్గురు దుండుగులు తుపాకులతో కాల్పులు జరిపారని, 53 ఏళ్ల షహీద్ లతీఫ్, అతడి సోదరుడు హషీం అక్కడికక్కడే చనిపోయారని, మరో వ్యక్తి గాయపడ్డాడని తెలిపారు. షహీద్ లతీఫ్ అలియాస్ బిలాల్ అలియాస్ నూర్ అల్–దిన్ నిషేధిత ఉగ్రవాద సంస్థ జైషే మొహమ్మద్ లాంచింగ్ కమాండర్‌గా పని చేస్తున్నాడు. భారత ప్రభుత్వం అతడిని చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద ఉగ్రవాదిగా ప్రకటించింది. భారత్‌లో పలు ఉగ్రవాద దాడుల వెనుక లతీఫ్ హస్తం ఉంది. 1994 నవంబర్‌లో భారత్‌లో అరెస్టయ్యాడు. జమ్మూకశ్మీర్ జైలులో 16 సంవత్సరాలపాటు జైలుశిక్ష అనుభవించాడు. 2010లో విడుదలై పాకిస్తాన్‌కు చేరుకున్నాడు. పాకిస్తాన్‌లోని పంజాబ్ రాష్ట్రం అమీనాబాద్‌లో జన్మించిన షహీద్ లతీఫ్ చిన్న వయసులోనే ఉగ్రబాట పట్టాడు. 2016 జనవరి 2న పఠాన్‌కోట్‌లోని ఐఏఎఫ్ స్థావరంపై జరిగిన దాడిలో ఏడుగురు భారత వైమానిక దళం సిబ్బంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ దాడికి పథక రచన చేసిందని లతీఫ్ అని భారత దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టులజాబితాలో లతీఫ్ పేరును చేర్చారు. అతడి కోసం ఎన్ఐఏ గాలిస్తోంది. పాకిస్తాన్ భూభాగంలోనే లతీఫ్‌ను గుర్తుతెలియని వ్యక్తులు కాల్చిచంపడం జైషే మొహమ్మద్‌కు భారీ ఎదురుదెబ్బేనని చెప్పొచ్చు.



సాక్షి 24|7
తమిళనాడు
TAMILNADU
గురువారం । 12 । అక్టోబర్ । 2023

ఆకట్టుకున్న పట్టు వస్త్రాల ప్రదర్శన



నాటి తరం నుంచి నేటి తరం వరకు కొన్ని దశాబ్దాల కాలం పాటుగా ఉపయోగించిన, తయారు చేసిన కంచి పట్టు చీరల కలెక్షన్లు చెన్నైకు చెందిన సంతోష్ పరేక్ సేకరించాడు. ఆధునిక ప్రపంచంలో కనుమరుగు అవుతున్న పట్టు వస్త్రాల విలువ, విశిష్టతను తెలియజేసే విధంగా తాను సేకరించిన వాటిని తేనం పేటలోని తులసీ వీవ్స్‌లో వాటిని బుధవారం కొలువు దీర్చాడు. నాటి తరం డిజైన్లు, నేటి తరంలో వచ్చిన మార్పులను వివరిస్తూ ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను మహిళలు ఆసక్తిగా తిలకిస్తున్నారు. - సాక్షి, చెన్నై

న్యూస్‌రీల్

విచారణకు సెంథిల్ బెయిల్ పిటిషన్



సాక్షి, చెన్నై: మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన మంత్రి సెంథిల్ బాలాజీ బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు స్పందించింది. బుధవారం విచారణ చేపట్టింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) తరఫున న్యాయవాది సుందరేషన్ హాజరై వాదనలు వినిపించారు. రిట్ పిటిషన్ దాఖలుకు సమయం ఇవ్వాలని కోరారు. సెంథిల్ బాలాజీ తరఫున సీనియర్ న్యాయవాది ఎన్ఆర్ ఇలంగో హాజరై వాదించారు. సెంథిల్ బాలాజీ ఆరోగ్య పరిస్థితి, స్టాన్లీ ఆసుపత్రి ఇచ్చిన నివేదికతో పాటు 8 మంది వైద్యులతో కూడిన నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదికలను కోర్టుకు సమర్పించారు. కోర్టు, ఈడీ ఈ నివేదికలను పరిశీలించాలని, సెంథిల్‌కు బెయిల్ మంజూరు చేయాలని కోరారు.

ఇస్లామిక్ హింద్ నేత ఇంట్లో ఎన్ఐఏ సోదాలు



మదురైలో తనిఖీలకు వెళ్తున్న ఎన్ఐఏ అధికారులు

సాక్షి, చెన్నై : మదురైలోని ఇస్లామిక్ హింద్ సంస్థ ప్రధాన కార్యదర్శి మహ్మద్ తాజుద్దీన్ నివాసంలో బుధవారం జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అధికారులు సోదాలు నిర్వహించారు. పీఎంకే వ్యతిరేకంగా కుట్ర కేసు విచారణలో భాగంగా ఈ తనిఖీలు చేపట్టారు. వివరాలు.. ఇటీవల కాలంగా రాష్ట్రంలో ఎన్ఐఏ సోదాలు విస్తృతంగా జరుగుతున్న విషయం తెలిసిందే. కోయంబత్తూరులో కారు బాంబు పేలుడు, మంగళూరులో కుక్కర్ పేలుడు కేసులు రాష్ట్రం చుట్టూ తిరుగుతున్నాయి. ఇప్పటికే ఈ కేసులో 15 మందికి పైగా కటకటాలలో ఉన్నారు. ఈ పరిస్థితులో గత ఏడాది బిహార్‌లో ప్రధాని నరేంద్రమోదీకి వ్యతిరేకంగా కుట్రకు వ్యూహ రచన చేసిన కేసులో ఆ రాష్ట్రానికి చెందిన ఇద్దరిని జాతీయ దర్యాప్తు సంస్థ అరెస్టు చేసింది. వీరు ఇచ్చిన సమాచారం ఆధారంగా ఇస్లామిక్ హింద్ సంస్థ తమిళనాడు ప్రధానకార్యదర్శి మహ్మద్ తాజుద్దీన్‌ను ఎన్ఏఐ టార్గెట్ చేసింది. ఢిల్లీ నుంచి డీఎస్పీ అక్షయ్ కుమార్ నేతృత్వంలో 40 మందితో కూడిన ఎన్ఐఏ బృందం బుధవారం ఉదయం మదురైకు చేరుకున్నారు. తహజుద్దీన్ నివాసంలో కొన్ని గంటల పాటు సోదాలు చేశారు. ఇందులో రెండు సిమ్ కార్డులతో కూడిన ఫోన్‌ను సీజ్ చేశారు. తహజుద్దీన్ వద్ద విచారణ అనంతరం ఎన్ఐఏ బృందం వెళ్లిపోయింది. కాగా ఈ సోదాలను వ్యతిరేకిస్తూ కొందరు ఇస్లామిక్ హింద్‌సంస్థ ప్రతినిధులు ఆందోళనకు దిగడంతో ఉత్కంఠ నెలకొంది. తన వద్ద ఎన్ఐఏ అధికారులు బిహార్ కేసు విషయంపై ప్రశ్నించారని, ఈకేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని వారికి వివరించినట్లు తహజుద్దీన్ మీడియాకు తెలిపారు.

తుల్కర్‌పట్టిలో పురావస్తు శాఖ తవ్వకాలు

అన్నానగర్: వల్లియూర్ సమీపంలోని తుల్కర్‌పట్టిలో బుధవారం 2వ దశ తవ్వకాల్లో భారీగా పురాతన వస్తువులు లభ్యమయ్యాయి. వివరాలు.. నెల్‌లై జిల్లాలోని వల్లియూర్ సమీపంలోని నంబియూత్ బేసిన్‌లోని తుళుక్కర్‌పట్టిలో తమిళనాడు ప్రభుత్వ పురావస్తు శాఖ అధికారులు తవ్వకాలు చేపట్టారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు 1,900 కంటే ఎక్కువ కళాఖండాలను గుర్తించారు. ఇందులో ఇనుప కొలిమి, ఇనుప ఖనిజం పదార్థాలు, ఇనుప స్లాగ్, బ్లో పైప్, ఉలి, ఉంగరం వంటి వస్తువులున్నట్లు అధికారులు వెల్లడించారు. నంబియాత్రంగరైలో సుసంపన్నమైన నాగరికత ఉందని పురావస్తు శాస్త్రవేత్తలు నిర్ధారించారు.

బాల్య వివాహాల నియంత్రణపై పుస్తకం

సాక్షి, చెన్నై: బాల్య వివాహాల కట్టడే లక్ష్యంగా జరుగుతున్న ప్రయత్నాలకు బలం చేకూర్చే రీతిలో ఈ వివాహాలకు వ్యతిరేకంగా ఓ పుస్తకం రూపుదిద్దుకుంది. రచయిత భువన్ రిభు ×వెన్ చిల్డ్రన్ హావ్ చిల్డ్రన్ : టిప్పింగ్ పాయింట్ టు ఎండ్ చైల్డ్ మ్యారేజ్¤ పేరిట ఆంగ్లంలో ఈ పుస్తకం సిద్ధం చేశారు. ఈ పుస్తకం గురించి బుధవారం స్థానికంగా రచయిత భువన్ రిభు పేర్కొంటూ, బాలల హక్కులు, పిల్ల రక్షణ కోసం పనిచేస్తున్న తాను, బాల్య వివాహాలను నిర్మూలించడమే లక్ష్యంగా ఆలోచనలు, ఫ్రేమ్ వర్క్, కార్యాచరణ ప్రణాళికను ఈ పుస్తకం ద్వారా తెలియజేసినట్టు వివవరించారు. బాల్య వివాహ రహిత భారత్ ప్రచారంలో ఈ పుస్తకం ఒక కీలక మైలురాయి అవుతుందని భావిస్తున్నట్టు తెలిపారు. కైలాష్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ కంట్రీ హెడ్ రవికాంత్ మాట్లాడుతూ, 2030 నాటికి బాల్య వివాహ రహిత భారత దేశంలో కోసం పౌర సమాజం, ప్రభుత్వాలు తీవ్ర కృషి చేస్తున్నాయని వివరించారు. తమ వంతుగా అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేశామని, ఇందుకు ఈ పుస్తకం మరింత దోహదకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

ఉప నేత సీటుకు.. పళణి వర్గం పట్టు

- స్పీకర్ అప్పావుతో అన్నాడీఎంకే వాగ్వాదం
- సభ నుంచి వాకౌట్
- సభాపతి తీరుపై పళణిస్వామి ఆగ్రహం
- వ్యవసాయ కళాశాలకు ఎంఎస్ స్వామినాథన్ పేరు
- ఆయన పేరిట ఏటా అవార్డుల ప్రదానం
- అసెంబ్లీలో సీఎం స్టాలిన్ వెల్లడి
- ముగిసిన వర్షాకాల సమావేశాలు



అసెంబ్లీలో ప్రసంగిస్తున్న సీఎం స్టాలిన్

అన్నాడీఎంకే శాసన సభా పక్ష ఉపనేత సీటు వ్యవహారం బుధవారం అసెంబ్లీలో చర్చకు వచ్చింది. ఈ అంశంపై స్పీకర్ అప్పావుతో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళణి స్వామి వాగ్వాదానికి దిగారు. సభాపతి తీరును నిరసిస్తూ అన్నాడీఎంకే సభ్యులు వాకౌట్ చేశారు. ఇదిలా ఉండగా హరిత విప్లవ పితామహుడు దివంగత శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ సేవలను ప్రశంసించే విధంగా సీఎం స్టాలిన్ అసెంబ్లీ వేదికగా ప్రత్యేక ప్రకటన చేశారు. తంజావూరు వ్యవసాయ కళాశాల, పరిశోధన కేంద్రానికి ఎంఎస్ స్వామినాథన్ పేరును ఖరారు చేశారు.

సాక్షి, చెన్నై: అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా చివరిరోజైన బుధవారం అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళణి స్వామి తమ పార్టీ శాసన సభాపక్ష ఉప నేత పదవి, సీటు వ్యవహారాన్ని ప్రస్తావించారు. అన్నాడీఎంకే నుంచి వేటుకు గురైన పన్నీరు సెల్వం, మనోజ్ పాండియన్, వైద్యలింగంను శాసన సభ నుంచి అనర్హత వేటుకు ఇప్పటికే ఫిర్యాదు చేశామని వివరించారు. తమ పార్టీ శాసన సభా పక్ష ఉపనేతగా ఆర్‌బీ ఉదయకుమార్‌ను నియమించాలని, ప్రధాన ప్రతి పక్ష నేత సీటు పక్కనే ఆయనకు సీటు కేటాయించాలని ఇప్పటికే 10 సార్లు స్పీకర్‌ను కలిసి విన్నవించినట్లు గుర్తుచేశారు. అయితే స్పీకర్ అసెంబ్లీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని, కోర్టు తీర్పుల నకలును సమర్పించినా ఖాతరు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమయంలో పళణి స్వామి వ్యాఖ్యలను స్పీకర్ ఖండించారు. అదే సమయంలో పళణి పేర్కొన్న అనర్హత వేటు ఫిర్యాదు విషయంపై తనకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని మనోజ్ పాండియన్‌విజ్ఞప్తి చేసినా స్పీకర్ అనుమతి ఇవ్వలేదు. తర్వాత అన్నాడీఎంకే విప్ ఎస్పీ వేలుమణికి మాట్లాడే అవకాశం కల్పించారు. వాడీవేడిగా సాగిన ఈ రచ్చ అనంతరం స్పీకర్ నిర్ణయాన్ని ఖండిస్తూ, ఆయనకు తీరుకు వ్యతిరేకంగా అన్నాడీఎంకే సభ్యులు సభలో నినాదాలు చేశారు. తర్వాత వాకౌట్ చేశారు. మీడియాతో పళణి స్వామి మాట్లాడుతూ, స్పీకర్‌కు వ్యక్తిగత అధికారాలు, వ్యక్తిగత నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉండొచ్చని పేర్కొంటూ, ప్రధాన ప్రతి పక్షం ఇచ్చిన లేఖలను, అనర్హత వేటు ఫిర్యాదులపై ఆయన ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. పట్టుమని 20 మంది సభ్యులు కూడా లేని కాంగ్రెస్ పార్టీకి శాసన సభా పక్ష నేత, ఉప నేత పదవులు ఉన్నాయని, అయితే 60 మందికి పైగా సభ్యులను కలిగిన తమకు మాత్రం ఉప నేత పదవి కేటాయించక పోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. రాజ్యాంగ పదవిలో కూర్చుని మధ్యవర్తిగా వ్యవహరించాల్సిన స్పీకర్ అందుకు భిన్నంగా నిర్ణయాలు తీసుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తాము అడిగే ప్రశ్నలకు మంత్రులు ఇవ్వాల్సిన సమాధానాలను కూడా స్పీకరే ఇచ్చేస్తున్నారని, ఇదెక్కడి పద్ధతి అని ప్రశ్నించారు.

ఎవరికి ఎక్కడ సీటు .. నా వ్యక్తిగతం..

అసెంబ్లీలో స్పీకర్ మాట్లాడుతూ, ఎవరికి ఎక్కడ సీటు కేటాయించాలనేది తన వ్యక్తిగత నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని వ్యాఖ్యానించారు. ఒక సభ్యుడు ఏ చిహ్నంతో గెలిచి సభలోకి వచ్చాడో అదే పార్టీకి చెందిన సభ్యుడిగానే తాను చివరి వరకు పరిగణిస్తానని పేర్కొన్నారు. మాజీ సీఎం అన్న హోదాలో ఆయన్ని(పన్నీరు)ను ముందు వరుసలో కూర్చోబెట్టామని వివరించారు. గత అన్నాడీఎంకే హయాంలో తమ నేత కరుణానిధికి ముందు వరుసలో సీటు ఇవ్వాలని విజ్ఞప్తి చేయగా, అప్పటి స్పీకర్ ధనపాల్ నిరాకరించారని గుర్తు చేశారు. అయితే, తాము ఓ మాజీ సీఎంకు తగిన గుర్తింపు ఇచ్చి ముందు వరుసలో కూర్చొబెట్టామన్నారు. గతంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేసిన 11 మంది అన్నాడీఎంకే సభ్యులపై అనర్హత వేటు వేయకుండా ధనపాల్ ఎందుకు జాప్యం చేశారో, ఆ సమయంలో ఆయన వ్యవహరించిన తీరు ఏమిటో తనకు తెలుసునని అన్నారు. ఒక పార్టీకి శాసన సభాపక్ష నేత, ప్రధాన ప్రతిపక్ష నేత మాత్రమే ఉంటారని, ఉప నేత నియామకం అనేది తన వ్యక్తిగత నిర్ణయం మేరకు ఆధారపడి ఉంటుందని స్పీకర్ వివరించారు.

స్వామినాథన్ సేవలకు గుర్తింపు

అసెంబ్లీలో ఉదయాన్నే సీఎం స్టాలిన్ 110 నిబంధనల ప్రకారం ఓ ప్రకటన చేశారు. ఇందులో హరిత విప్లవ పితామహుడి పరిశోధనలు, సేవలు, బిరుదులను గుర్తు చేశారు. తమిళనాడులో పుట్టి దేశం గర్వించ దగ్గ వ్యక్తిగా అవతరించి ప్రపంచ దేశాల్లో గుర్తింపు పొందిన డాక్టర్ ఎస్ఎం సేవలకు గుర్తింపుగా ఈ ప్రకటన చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. ఇందులో భాగంగా తంజావూరు జిల్లా ఈచ్చం కోట్టైని వ్యవసాయ కళాశాల, పరిశోధన కేంద్రానికి ఎంఎస్ స్వామినాథన్ కళాశాల, పరిశోధన కేంద్రంగా నామకరణం చేస్తున్నామన్నారు. అలాగే వ్యవసాయ పరిశోధనల్లో ఉత్తమ మార్కులు సాధించే విద్యార్థికి ఏటా ఎంఎస్ స్వామినాథన్ పేరిట బిరుదును ప్రదానం చేస్తామన్నారు. అనంతరం తిరుచ్చి పోలీసులు ఓ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యవహారాన్ని సభ దృష్టికి అన్నాడీఎంకే, కాంగ్రెస్ సభ్యులు తీసుకొచ్చారు. ఇందుకు సీఎం సమాధానం ఇస్తూ, సమాచారం అందగానే చర్యలు తీసుకున్నామని వివరించారు. మహిళలు, శిశువులు, బాలికలకు వ్యతిరేకంగా చర్యలకు పాల్పడే వారిని ఉపేక్షించమని, ఎంతటి వారైనా సరే శిక్ష పడే వరకు వదిలి పెట్టమని సీఎం స్పష్టం చేశారు. అంతకు ముందు ప్రశ్నోత్తరాల సమయంలో రహదారుల శాఖ మంత్రి ఏవీ వేలు మాట్లాడుతూ, ఏడు మీటర్లతో కూడిన రాష్ట్ర రహదారులను పది మీటర్లుగా పొడిగించి టోల్ గేట్లను కేంద్రం ఏర్పాటు చేస్తోంది, దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తమిళనాడులో ఉన్న అన్ని టోల్ గేట్లను ఎత్తి వేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అన్ని మార్గాలను ఫోర్‌వేలుగా మార్చేందుకు చర్యలు విస్తృతం చేశామన్నారు. ఉన్నతవిద్యామంత్రి పొన్ముడి మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రభుత్వం ఆర్ట్స్ అండ్ సైన్స్, పాలిటెక్నిక్ కళాశాలలకు భవనాలు, ఇతర నిర్మాణాల కోసం రూ. 262 కోట్లు కేటాయించామని ప్రకటించారు.



వాకౌట్ అనంతరం మీడియాతో మాట్లాడుతున్న పళణి స్వామి

సురక్షిత క్షేత్రం పరిధిలోకి మైలాడుతురై

మూడు రోజుల అసెంబ్లీ సమావేశాలు బుధవారం సాయంత్రంతో ముగిశాయి. అనంతరం సభను స్పీకర్ నిరవధికంగా వాయిదా వేశారు. అంతకు ముందు సభలో దాఖలు చేసిన రవాణా శాఖకు సంబంధించిన కొన్ని బిల్లులు, మాజీ ఎమ్మెల్యేలకు వేతన పెంపు తదితర 13 ముసాయిదాలకు సభ ఆమోద ముద్ర వేసింది. అలాగే, సురక్షిత వ్యవసాయ క్షేత్రంగా డెల్టా పరిధిలోని జిల్లాలను గత ప్రభుత్వ హయాంలో చేర్చిన విషయం తెలిసిందే. ఈ సమయంలో మైలాడుతురై జిల్లా ఆవిర్భవించ లేదు. ఆ తర్వాతి పరిణామాలతో మైలాడుతురై కొత్త జిల్లాగా రాష్ట్రంలో 38వ జిల్లాగా ఏర్పాటైంది. ప్రస్తుతం ఈ జిల్లాను కూడా సురక్షిత వ్యవసాయ క్షేత్రం పరిధిలోకి తీసుకొస్తూ సభ ఆమోదించింది.

పెండింగ్ బిల్లులను ఆమోదించండి



మంత్రి రఘుపతి , గవర్నర్ రవి

సాక్షి, చెన్నై : రాజ్ భవన్‌కు పరిమితమైన పలు బిల్లులు (ముసాయిదాలు)పై పరిశీలన జరిపి, త్వరిత గతిన ఆమోదించాలని రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవిని రాష్ట్రన్యాయ శాఖ మంత్రి రఘుపతి విజ్ఞప్తి చేశారు. దివంగత నేత అన్నాదురై జయంతి సందర్భంగా ప్రకటించిన 49 మంది ఖైదీల విడుదలకు సంబంధించిన ఉత్తర్వులను త్వరితగతిన ఆమోదించాలని కోరారు. ఈ మేరకు బుధవారం గవర్నర్‌కు మంత్రి లేఖ రాశారు. వివరాలు.. రాష్ట్ర ప్రభుత్వం, గవర్నర్ ఆర్ ఎన్ రవి మధ్య జరుగుతున్న వార్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. వీరి మధ్య నెలకొన్న అభిప్రాయ భేదాల కారణంగా అనేక ముసాయిదాలు ఆమోదానికి నోచుకోలేదు. డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినానతరం అసెంబ్లీ వేదికగా అనేక బిల్లులను ఆమోదించి రాజ్ భవన్‌కు పంపించారు. ఇందులో అనేక బిల్లులను తీవ్ర ఒత్తిడి, పోరాటాల మధ్య ఆమోదించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరెన్నో ముసాయిదాలు ప్రస్తుతం రాజ్ భవన్‌కు పరిమితమై ఉన్నాయి. సహకార శాఖ, విద్యాశాఖతో పాటు మాజీ మంత్రులపై అవినీతి కేసుల విచారణ తదితర అనేక ముసాయిదాలు, నివేదికలు ఇందులో ఉన్నాయి. అలాగే గత అన్నాడీఎంకే హయాంలో తమిళనాడు ఫిషరీస్ వర్సిటీ, వెటర్నరీ చట్ట ముసాయిదాలు రాజ్ భవన్‌కు వెళ్లాయి. వీటికి కూడా ఇంత వరకు ఆమోదం లభించ లేదు. అలాగే టీఎన్‌పీఎస్సీ చైర్మన్ నియామకం కూడా ఇందులో కీలక నివేదికగా ఉంది. వీటిని పరిశీలించి ఆమోదించాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పలు మార్లు గవర్నర్‌కు విజ్ఞప్తి చేసింది. ఒత్తిడి చేసిన సమయంలో ఏదో ఒక మార్పులు చేర్పులు, ప్రశ్నలను సంధిస్తూ ప్రభుత్వాన్ని వివరణ కోరడం రాజ్ భవన్‌కు పరిపాటిగా మారింది. ఈ పరిస్థితుల్లో పెండింగ్‌లో ఉన్న ముసాయిదాలు, నివేదికలు, సిఫార్సులు, ఉత్తర్వులకు తోడు ప్రస్తుతం బుధవారం అసెంబ్లీ ఆమోదం పొందిన తీర్మానాలు మరెన్నో జాబితాలోకి చేరనున్నాయి. 49 మంది మైనారిటీలతో పాటు ఏళ్ల తరబడి జైల్లో మగ్గుతున్న వారి విడుదల కోసం ఇటీవల పంపించిన ఉత్తర్వుతో పాటు గతంలో పంపిణీ అనేక ముసాయిదాలను పరిశీలించిన, త్వరితగతిన ఆమోదించాలని కోరుతూ న్యాయశాఖ మంత్రి రఘుపతి గవర్నర్ ఆర్ఎన్ రవికి లేఖ రాశారు. రాజ్ భవన్ నుంచి వచ్చే స్పందన మేరకు తదుపరి తమ అడుగుగా కొన్ని కీలక అంశాలపై సీఎం స్టాలిన్ తన అధికారాలను ప్రయోగించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

లియో ప్రత్యేక ప్రదర్శనలకు అనుమతి



విజయ్

తమిళసినిమా: నటుడు విజయ్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం లియో. త్రిష, ప్రియా ఆనంద్ హీరోయిన్లుగా నటించిన ఇందులో బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్, అర్జున్, దర్శకుడు గౌతమ్‌మీనన్, మిష్కన్ ముఖ్యపాత్రలు పోషించారు. 7 స్క్రీన్ స్టూడియోస్ పతాకంపై ఎస్ఎస్. లలిత్‌కుమార్ నిర్మించిన ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతాన్ని అందించారు. లియో చిత్రం నిర్మాణ కార్యక్రమాలను పూర్తిచేసుకుని ఈనెల 19న తెరపైకి రానుంది. ఈ చిత్రాన్ని థియేటర్లలో ప్రత్యేక ప్రదర్శనలకు ప్రభుత్వం అనుమతించింది. 19న వేకువజామున 4 గంటలకు, 7 గంటలకు ప్రత్యేక ప్రదర్శనలకు అనుమతించింది. అదే విధంగా మొదటి రోజున 6 ఆటలకు, ఆ తరువాత 20 నుంచి 24వ తేదీ వరకూ రోజుకు 5 ఆటలకు అనుమతినిచ్చింది.

'అనిత'ను వీడని ఈడీ

- కోర్టులో వాదనలు
- రూ. 60 కోట్ల అక్రమార్జనకు ఆధారాలున్నట్లు వెల్లడి



అనిత రాధాకృష్ణన్

సాక్షి, చెన్నై: మత్స్య శాఖ మంత్రి అనిత ఆర్ రాధాకృష్ణన్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వెంటాడుతోంది. ఇందుకు ఆయనపై గతంలో దాఖలైన కేసును అస్త్రంగా చేసుకుంది. ఈ కేసులో రూ. 60 కోట్ల మేరకు అక్రమార్జనకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నట్టు తూత్తుకుడి కోర్టులో ఈడీ తరఫు న్యాయవాదులు బుధవారం వాదనలు వినిపించారు. వివరాలు.. 2001-06 అన్నాడీఎంకే హయాంలో మంత్రిగా ఉన్నప్పుడు అనిత ఆర్ రాధాకృష్ణన్ ఆదాయానికి మించి ఆస్తులు గడించినట్లు ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన డీఎంకే ప్రభుత్వం కేసు నమోదు చేసింది. రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు రూ. 4.90 కోట్లు ఆదాయానికి మించిన ఆస్తులు గడించినట్టు విచారణలో తేల్చారు. అలాగే, అనిత, ఆయన సతీమణి, కుటుంబ సభ్యులు ఏడుగురిపై కేసు నమోదు చేసింది. ఈ కేసు కొన్నేళ్లుగా తూత్తుకుడి కోర్టులో విచారణలో ఉంది. ఈ సమయంలో అనిత రాధాకృష్ణన్ డీఎంకేలోకి చేరి మంత్రి అయ్యారు. తాజాగా డీఎంకే మంత్రులను టార్గెట్ చేస్తూ వస్తున్న ఈడీ అనితపై కూడా దృష్టి పెట్టింది. తూత్తుకుడి కోర్టులో విచారణలో ఉన్న కేసులో తమను కూడా ప్రతి వాదులుగా చేర్చుకోవాలని ఇటీవల పిటిషన్ దాఖలు చేసింది. 90 శాతం విచారణ ముగిసిన నేపథ్యంలో ప్రస్తుతం ఈడీ రంగంలోకి దిగడంతో గత కొద్ది రోజులుగా వాదనలు వాడీవేడిగా సాగుతున్నాయి. బుధవారం పిటిషన్ విచారణనకు రాగా, ఈడీ తరఫు న్యాయవాదులు ఏసీబీ విచారణను తప్పుబట్టారు. ఈ విచారణ సరిగ్గా జరగ లేదని వాదించారు. ఏసీబీ పూర్తిస్థాయిలో విచారణ జరప లేదని, ఈ దృష్ట్యా, తమకు ఈకేసును అప్పగించాలని కోరారు. తమ వద్ద అక్రమార్జనకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయని, మొత్తంగా రూ. 60 కోట్ల మేరకు అక్రమార్జన జరిగినట్టు కోర్టుకు వివరించారు. వాదనల అనంతరం తదుపరి విచారణను నవంబర్ 1వ తేదీకి తూత్తుకుడికోర్టు న్యాయమూర్తి వాయిదా వేశారు.

డెల్టాలో నిరసనల హోరు

- కావేరి కోసం గళమెత్తిన అన్నదాతలు
- దుకాణాలన్నీ స్వచ్ఛందంగా మూత

సాక్షి, చెన్నై: కావేరి జలాల విడుదల వ్యవహారంలో కర్ణాటక తీరును, కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ డెల్టా జిల్లాలో బుధవారం నిరసనలు హోరెత్తాయి. అన్ని జిల్లాల్లో దుకాణాలన్నీ మూత పడ్డాయి. జన జీవనం దాదాపుగా స్తంభించింది. వివరాలు.. వర్షాభావ పరిస్థితులు ఈ ఏడాది కర్ణాటక – తమిళనాడు మధ్య కావేరి జల వివాదానికి దారి తీసిన విషయం తెలిసిందే. ఫలితంగా రెండు రాష్ట్రాల్లోనూ నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం మేట్టూరు జలాశయం గేట్లను మూసి వేశారు. కావేరి జలాల విడుదల ఆగడంతో డెల్టా రైతుల కంట కన్నీరు తప్పడం లేదు. లక్షలాది ఎకరాల పంట దెబ్బతినే పరిస్థితి నెలకొంది. ఈ సమయంలో నీటిని ఇవ్వకుండా కర్ణాటక వ్యవహరిస్తున్న తీరును ఖండిస్తూ, ఉదాసీనంగా ఉన్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బుధవారం డెల్టా నిరసనలకు కావేరి పడుగై సమాఖ్య పిలుపు నిచ్చింది. ఇందుకు డీఎంకే, కాంగ్రెస్, వామపక్షాలు తదితర అన్ని పార్టీలు, ప్రజా సంఘాలు మద్దతు ప్రకటించాయి. దీంతో డెల్టా జిల్లాలు తిరువారూర్, తంజావూరు, నాగపట్నం, పుదుకోట్టై, మైలాడుతురై, తిరుచ్చి, కడలూరు జిల్లాలో నిరసనలు హోరెత్తాయి. ఎక్కడికక్కడ దుకాణాలన్నీ మూత పడ్డాయి. సుమారు లక్షా 33 వేల దుకాణాలు డెల్టా జిల్లాలో మూసి వేసి స్వచ్ఛందంగా యజమానులు నిరసనకు తరలి వచ్చారు. అనేక ప్రాంతాలలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. వాహన సేవలకు ఆటకం లేనప్పటికీ, జనం నిరసనకు మద్దతిస్తూ ఇళ్లకే పరిమితమయ్యారు. దాదాపు జనజీవనం స్తంభించింది. తిరుచ్చి, తంజావూరు, తిరువారూర్‌లలో నిరసనకారులు పలు చోట్ల ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. డెల్టా జిల్లాలో మొత్తం వంద చోట్ల నిరసనలు జరిగాయి. కొన్ని చోట్ల రైల్‌రోకోకు యత్నించగా నిరసనకారులను పోలీసులు అడ్డుకున్నారు.



తిరుచ్చిలో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

16న బీజేపీ ఒకరోజు దీక్ష

కావేరి జలాలను తన మిత్ర పక్షం కాంగ్రెస్‌తో చర్చించి విడుదల చేయించుకోవడంలో డీఎంకే ప్రభుత్వం విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ బీజేపీ నేతృత్వంలో ఈనెల 16న కుంబకోణంలో ఒక రోజు నిరసన దీక్షకు ఆ పార్టీ అధ్యక్షుడు అన్నామలై పిలుపు నిచ్చారు. కర్ణాటకలో డీఎంకే మిత్ర పక్షం కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నా, వారితో కనీసం చర్చించకుండా, తమిళ రైతుల జీవితాలతో డీఎంకే ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని అన్నామలై ఆగ్రహం వ్యక్తంచేశారు. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, కాంగ్రెస్ పార్టీని ఖండించక పోగా, కేంద్రంపై నిందలు వేసే విధంగా అసెంబ్లీలో తీర్మానాలు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. అసమర్థ డీఎంకే ప్రభుత్వాన్ని ఖండిస్తూ ఈనెల 16న పెద్ద ఎత్తున నిరసన దీక్షలకు నిర్ణయించినట్లు వెల్లడించారు.



మైలాడుతురైలో మూతపడిన దుకాణాలు



పుదుకోట్టైలో ..



తిరుచ్చిలో..

బాలికపై అత్యాచారం

- ఐదుగురికి తలా పదేళ్ల జైలు శిక్ష
- చెంగల్ పట్టు కోర్టు తీర్పు

తిరువొత్తియూరు: పదిహేడేళ్ల బాలికపై అత్యాచారం చేసిన కేసులో బంధువులు సహా ఐదుగురికి తలా 10 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ చెంగల్పట్టు కోర్టు తీర్పు ఇచ్చింది. వివరాలు.. కాంచీపురం జిల్లా ఉత్తరమేరూరు పుత్తలి ప్రాంతానికి చెందిన 17 సంవత్సరాల బాలిక మేకలు మేపుతూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో బాలిక గర్భవతి అయ్యింది. 2017లో ఓ బిడ్డ జన్మించింది. విచారణలో బాలికపై కొందరు అత్యాచారం చేసినట్లు తెలిసింది. అదే ప్రాంతానికి చెందిన మురుగదాస్ (33) బాలిక చెరువు గట్టు వద్ద మేకలు కాస్తుండగా అత్యాచారానికి పాల్పడినట్లు వెల్లడైంది. అలాగే బాలికకు పెద్దనాన్న వరుస అయ్యే కృష్ణన్ (55) కూడా అనేక సార్లు బలాత్కారం చేసినట్లు తెలిసింది. అలాగే తిరునావుక్కరసు (33), సుబ్రమణ్యం (62), థామస్ (19) కూడా బాలికపై అత్యాచారం చేసినట్లు తేలింది. దీంతో ఐదుగురు నిందితులపై పోలీసులు కేసు నమోదు చేశారు. బిడ్డకు తండ్రి ఎవరో అనే దానిపై పరీక్షలు చేపట్టారు. ఈ కేసు విచారణ చెంగల్పట్టు పోక్సో కోర్టులో విచారణ జరుగుతూ వచ్చింది. బుధవారం జరిగిన తుది విచారణ అనంతరం న్యాయమూర్తి తమిళరసి నిందితులు ఐదుగురికి తలా 10 సంవత్సరాల జైలు శిక్ష, తలా రూ.10 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. తీర్పు అనంతరం పోలీసులు దోషులను పుళల్ సెంట్రల్ జైలుకు తరలించారు.

క్లుప్తంగా

పశు వైద్యశిబిరానికి స్పందన



పాడి రైతులకు బహుమతులు ప్రదానం చేస్తున్న దామోదరన్

పళ్లిపట్టు: పశువైద్య శిబిరంలో పాల్గొన్న పాడి రైతులకు బహుమతులు ప్రదానం చేశారు. పళ్లిపట్టు యూనియన్ కేశవరాజుకుప్పం గ్రామంలో బుధవారం పశుసంవర్ధకశాఖ ద్వారా ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. తిరుత్తణి డివిజన్ పశుసంవర్ధక శాఖ సహాయ డైరెక్టర్ దామోదరన్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. పశువులకు టీకాలతో పాటు వైద్యపరీక్షలు నిర్వహించి చికిత్స చేశారు. ఇందులో భాగంగా గేదెలకు పోటీలు చేపట్టి మొదటి మూడు స్థానాలు సాధించిన గేదల యజమానులకు బహుమతులను అందజేశారు. శిబిరంలో భారీ సంఖ్యలో రైతులు పాల్గొని మూగజీవాలకు వైద్యపరీక్షలు చేయించుకున్నారు.

నోటీసులు ఇవ్వకుండా తొలగింపు

– న్యాయం చేయాలని వినతి



ఎస్పీ కార్యాలయానికి వచ్చిన కార్మికులు

తిరువళ్లూరు: 25 సంవత్సరాల పాటు పనిచేసిన కార్మికులను ఎలాంటి ముందస్తు నోటీసులు లేకుండా తొలగించడాన్ని నిరసిస్తూ బాధితులు బుధవారం ఎస్పీ ఫకెర్లా సెఫాస్ కల్యాణ్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. తిరువళ్లూరు జిల్లా కడంబత్తూరు యూనియన్ ఉలుంద్తై గ్రామంలో ట్రస్ట్ అక్వా పేరుతో వాటర్ కంపెనీ నడుస్తోంది. ఈ కంపెనీలో గత 25 సంవత్సరాలుగా 15 మంది కార్మికులు పనిచేస్తున్నారు. అయితే వీరిని ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే పనుల నుంచి తొలగించారు. ఈ నేపథ్యంలో బాధితులు బుధవారం ఉదయం ఎస్పీని కలిసి తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. స్పందించిన ఎస్పీ బాధితులకు న్యాయం చేయాలని డీఎస్పీని ఆదేశించారు.

ప్రజాసంబంధాల శిబిరంలో సహాయకాలు



సహాయకాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ కలైసెల్వి

కాంచీపురం: కలెక్టర్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన ప్రజాసంబంధాల శిబిరంలో 218 మంది అర్హులకు రూ.3.37 కోట్ల విలువైన సంక్షేమ సహాయకాలు పంపిణీ చేశారు. కాంచీపురం జిల్లా తిమ్మ సముద్రం గ్రామంలో కలెక్టర్ కలైసెల్వి అధ్యక్షతన ప్రజాసంబంధాల శిబిరం నిర్వహించారు. ఎంపీ సెల్వం, డీఆర్‌ఓ వెంకటేశ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. శిబిరంలో శాఖల ద్వారా ఏర్పాటు చేసిన వస్తు ప్రదర్శనను కలెక్టర్ ప్రారంభించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిపొందే విధానాలకు సంబంధించి అవగాహన కల్పించే రీతిలో స్టాల్స్ ఏర్పాటు చేశారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు తమ శాఖలకు సంబంధించి అమలు చేస్తున్న పథకాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపిక చేసిన 218 మంది అర్హులకు సంక్షేమ సహాయకాలను కలెక్టర్ పంపిణీ చేశారు. ఆర్‌డీఓ రమ్య, యూనియన్ చైర్‌పర్సన్ మలర్‌కొడి, పంచాయతీ సర్పంచ్ దేవేంద్రన్ పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సు కోసం విస్తృత కార్యక్రమాలు

సాక్షి, చెన్నై : రైతులను సంతృప్తి పరిచే విధంగా ఉత్పత్తులతో పాటు వారి ఉత్పాదకత పెంపు, శ్రేయస్సు, జీవితంలో స్థిరమైన వృద్ధిని నిర్ధారించడమే లక్ష్యంగా తమ పయనం సాగుతుందని ఇంటర్నేషనల్ ట్రాక్టర్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ రామన్ మిట్టల్ తెలిపారు. సోనాలికా ట్రాక్టర్లతో రైతులకు అత్యంత యాంత్రికమైన రేపటిని సృష్టించే విధంగా హెచ్1ఎఫ్‌వై 24లో చేపట్టనున్న కార్యక్రమాలను స్థానికంగా ఆయన ఈ సందర్భంగా వివరించారు. ఈ కాలంలో 78,793 ట్రాక్టర్ల అమ్మకాలు జరిగినట్టు, సెప్టెంబర్‌లో 15.8 శాతం మార్కెట్ వాటాను సాధించినట్టు ఆయన పేర్కొన్నారు. వెబ్‌సైట్ ద్వారా ధరలను రైతులకు తెలియజేయడానికి, రైతులకు అవసరమైన ఉత్పత్తులలో విప్లవాత్మక చర్యలు చేపట్టడంలో తాము ఎల్లప్పుడు ముందుంటామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. సంవత్సరాల వారంటీని సైతం పరిచయం చేసినట్టు, పండుగ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు మరింత చేరువయ్యే కార్యక్రమాలు చేపట్టనున్నామని, పథకాలు, ఫైనాన్సింగ్ ఎంపికలు అంశాలపై విస్తృతంగా దృష్టి పెట్టామని ఈ సందర్భంగా చెప్పారు.

మహిళలకు ఉచిత స్వయం ఉపాధి శిక్షణ



స్వయం ఉపాధి శిక్షణలో మహిళలు

పళ్లిపట్టు: మహిళలకు స్వయం ఉపాధి ఉచిత శిక్షణ బుధవారం ప్రారంభమైంది. మహిళలు ఉపాధి అవకాశాలు పొంది ఆర్థికంగా ఎదిగేందుకు వీలుగా ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు స్వయం ఉపాధి శిక్షణ కల్పిస్తున్నారు. ఇందులోభాగంగా ఆర్కేపేట యూనియన్ సెల్లాత్తూరులో ఆల్ ది చిల్డ్రన్ ట్రస్ట్ ద్వారా మహిళలకు ఎంబ్రాయిడింగ్ టైలరింగ్ ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. పంచాయతీ సర్పంచ్ దురై ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించగా గ్రామానికి చెందిన 50 మంది శిక్షణ పొందుతున్నారు. వారం రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతుల్లో ఎంబ్రాయిడింగ్ టైలరింగ్ ద్వారా ఉపాధి అవకాశాలు ఎక్కువ ఉన్నందున మహిళలు శిక్షణ పూర్తిచేసుకుని ఉపాధి పొంది ఆర్థికంగా ఎదగగలరని ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు.

50 బస్తాల గుట్కా స్వాధీనం

తిరువళ్లూరు: అక్రమంగా నిల్వ వుంచి విక్రయిస్తున్న 50 బస్తాల గుట్కాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తిరువళ్లూరు జిల్లా ఊత్తుకోట పరిధిలో అక్రమంగా గుట్కాను నిల్వవుంచి విక్రయిస్తున్నట్టు డీఎస్పీ గణేష్‌కుమార్‌కు రహస్య సమాచారం అందించారు. సమాచారం అందుకుని డీఎస్పీ నేతృత్వంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఊత్తుకోట సమీపంలోని తారాక్షి గ్రామంలో అక్రమంగా నిల్వ వుంచిన 50 బస్తాల గుట్కాను స్వాధీనం చేసుకుని వ్యాపారి మణిగండన్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఒకే ప్రాంతంలో సుమారు 50 బస్తాల గుట్కా బయటపడడం స్థానికంగా కలకలం రేపింది.

హత్య కేసులో నిందితుడి ఆత్మహత్య

అన్నానగర్: మనల్‌మేడు సమీపంలో భార్యను హత్య చేసిన కేసులో బెయిల్‌పై వున్న వ్యక్తి బుధవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. మైలాడుదురై జిల్లా మనల్‌మేడు సమీపంలోని బోద్దగరం గ్రామానికి చెందిన కలైవానన్ (38). అతను గత 15 సంవత్సరాలుగా కువైట్‌లో క్రేన్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో కలైవానన్‌కు కీర్తిక (28)తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి నాలుగేళ్ల కమలేశ్వరి, ఏడాది వయసున్న మహిళిని అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ ఏడాది మే నెలలో కలైవానన్ కువైట్ నుంచి స్వగ్రామానికి చేరుకున్నారు. జులై 1న విదేశాల నుంచి సంపాదించి పంపిన డబ్బు విషయంపై కలైవానన్ భార్యతో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో గుంతు నులిమి హత్య చేశాడు. దీనిపై ఫిర్యాదు మేరకు కలైవానన్‌ను అరెస్టు చేసి జైలుకు తరలించారు. దీంతో ఈనెల 6న బెయిల్‌పై బయటకు వచ్చిన కలైవానన్ మానసిక వేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మనల్‌మేడు పోలీసులు కలైవానన్ మృతదేహాన్ని మైలాడుతురై ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలిపై లైంగిక దాడి

అన్నానగర్: ధర్మపురి జిల్లా బాపారెడ్డి పట్టి సమీపంలోని రామియంపట్టి ప్రాంతానికి చెందిన 75 ఏళ్ల వృద్ధురాలు మంగళవారం ఇంటిలో ఒంటరిగా ఉంటోంది. అదే ప్రాంతానికి చెందిన కార్తీక్(26)ను తన ఇంటి సమీపంలోని కొబ్బరి మట్టలు కోసేందుకు ఆమె పిలిచినట్లు తెలుస్తోంది. ఇంటికి వచ్చిన కార్తీక్ వృద్ధురాలిపై అత్యాచారం చేసి పారిపోయాడు. అనంతరం వృద్ధురాలిని స్థానికులు ఆరూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం గోపీనాథం బట్టి పోలీసులు నిందితుడు కార్తీక్‌ను అరెస్టు చేశారు.

క్రీడాకారులను గుర్తించి శిక్షణ ఇవ్వాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్

వేలూరు: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను గుర్తించి వారికి అవసరమైన శిక్షణ ఇస్తే దేశ, జాతీయస్థాయి పోటీల్లో రాణించగలరని కలెక్టర్ భాస్కర పాండియన్ అన్నారు. తిరుపత్తూరు జిల్లా జోలార్‌పేటలోని జిల్లా క్రీడామైదానంలో యువజన విభాగం, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ, విద్యాశాఖ సంయుక్తంగా క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీలను కలెక్టర్ ప్రారంభించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ తిరుపత్తూరు జిల్లాలో అనేక కుగ్రామాలు ఉన్నందున క్రీడా కారులు, కళాకారులు అధికంగా ఉన్నారన్నారు. అయితే వారు అధికంగా గ్రామీణ ప్రాంతాలకే పరిమితం కావడంతో వారి ప్రతిభ బయటకు రాలేకపోతోందన్నారు. అటువంటి క్రీడాకారులను గుర్తించి వారికి అవసరమైన శిక్షణ ఇవ్వగలిగితే జాతీయ స్థాయి పోటీల్లోను రాణించగలరని తెలిపారు. జిల్లా స్పోర్ట్స్ అధికారి సేతురాజన్, అసిస్టెంట్ అధికారి గుణసుందరి, వివిధ పాఠశాలల విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

దళితులు ఏకమై సత్తా చాటాలి



తిరుత్తణిలో ధర్నా చేస్తున్న డీపీఎఫ్ శ్రేణులు

తిరుత్తణి: దళితులపై దాడుల కట్టడిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం విఫలమైనట్లు ఆరోపిస్తూ దళిత ప్రజా ఫ్రంట్ శ్రేణులు తిరుత్తణిలో బుధవారం ధర్నా చేశారు. తిరుత్తణికి చెందిన తిరునావుక్కరరసు నేతృత్వంలోని దళిత ప్రజాఫ్రంట్ తిరువళ్లూరు జిల్లా కార్యదర్శి కేబియెల్, రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి గజేంద్ర సమక్షంలో ధర్నా చేశారు. పాండిచ్చేరి సీఎం రంగస్వామి నేతృత్వంలోని ప్రభుత్వంలో దళిత సామాజికవర్గానికి చెందిన ఒకే మహిళా మంత్రి పదవికి రాజీనామా చేసేందుకు సీఎం ఒత్తిడితో దళిత మంత్రి పదవికి రాజీనామా చేసినట్లు ఆరోపించారు. అలాగే తిరుపత్తూరు జిల్లాలో పంచాయతీ సర్పంచ్‌గా గెలుపొందిన మహిళ రెండేళ్లుగా పదవీ స్వీకరించేందుకు ఉన్నత వర్గానికి చెందినవారు అడ్డుగా ఉండడంతో దీంతో గెలుపొంది రెండేళ్లుగా పదవీ స్వీకరించలేని పరిస్థితులు ఉన్నట్లు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో దళితులందరూ ఏకమై సత్తా చాటాలని పిలుపునిచ్చారు.

మనసున్న వార్డెన్ సాలిన్



మరుగుదొడ్లు శుభ్రం చేస్తున్న వార్డెన్ సాలిన్

తిరుత్తణి: ప్రభుత్వ హాస్టల్‌ను తన ఇల్లుగా చూసుకుంటూ అక్కడుంటున్న విద్యార్థులను తన పిల్లలుగా భావించి పరిశుభ్రతతో పాటు పాఠాలు బోధించి ఆకట్టుకుంటున్నారు అమ్మయార్‌కుప్పం ఎస్సీ బాలుర హాస్టల్ వార్డెన్ సాలిన్. రెండేళ్లకు ముందు ఇక్కడ రికార్డుల్లో మాత్రమే విద్యార్థులు కనబడేవారు. హాస్టల్‌లో పరిశుభ్రత లోపించడం, ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులు పక్కదారి పట్టడం, కనీస సౌకర్యాలు లేకపోవడంతో హాస్టల్‌లో తమ పిల్లలను చదివించేందుకు పేదలు వెనుకాడేవారు. అయితే సాలిన్ వార్డన్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత ఆదిద్రవిడ శాఖ ద్వారా హాస్టల్ సదుపాయాలకు కల్పిస్తున్న నిధులతో హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. మొక్కలు నాటించి పర్యవేక్షించారు. మరుగుదొడ్లు, వంట గదికి మరమ్మతులు చేశారు. దీంతో ప్రస్తుతం 50 నుంచి 55 మంది విద్యార్థులు హాస్టల్ ఉంటూ విద్యనభ్యసిస్తున్నారు. రాత్రిళ్లు హాస్టల్‌లోనే బస చేస్తూ విద్యార్థుల అభ్యసన ప్రక్రియకు సహకరిస్తున్నారు. అవసరమైన సందర్భంలో పాఠాలు భోదిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు. తమ ఉత్తమ సేవలకు గుర్తుగా కలెక్టర్ ఆల్బీజాన్ వర్గీస్ నుంచి ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవం రోజున ధ్రువీకరణ పత్రం కూడా పొందారు.

12 ఏళ్ల చిన్నారి గూండాన్ చట్టి



దర్శకురాలు అగస్త్యితో నిర్మాత కార్తికేయన్

తమిళసినిమా: అద్భుతాలకు నిలయం ఈ ఆధునిక కాలం. అదేవిధంగా ప్రతిభ ఏ ఒక్కరి సొత్తూ కాదు. అలా 5వ తరగతి చదువుతున్న 12 ఏళ్ల విద్యార్థిని గూండాన్ చట్టి అనే యానిమేషన్ చిత్రాన్ని తెరకెక్కించింది. ఈమె చిన్నారి పేరు పీకే అగస్త్యి. ఈ వయసులోనే తనకు కలిగిన ఆలోచనతో చిత్రం చేస్తానని తన తండ్రి డాక్టర్ ఏస్‌కే.కార్తికేయన్‌కు చెప్పగా ఆయన ఈ వయసులో చిత్రం ఏమిటి, దర్శకత్వం ఏమిటి అని నిరాశపరచకుండా, తన కూతురి ఆలోచనను గౌరవించి, ఆ చిన్నారిని ప్రోత్సహించే విధంగా ఆమె దర్శకత్వంలో నిర్మించిన చిత్రం గూండాన్ చట్టి. గ్రామీణ నేపథ్యంలో అగస్త్యి రూపొందించిన ఈ యానిమేషన్ చిత్రం పలువురు సినీ ప్రముఖుల నుంచి ప్రశంసలను అందుకుంటోంది. ఒక గ్రామంలోని ఇద్దరు స్నేహితులకు ఒకేసారి పుట్టిన పిల్లలు ఆ గ్రామంలో జరుగుతున్న అక్రమాలను ఎలా అరికట్టారు అనే చక్కని సందేశంతో, వినోదాన్ని చేర్చి జనరంజకంగా రూపొందించిన చిత్రం ఇది. అగస్త్యి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఈ చిత్రంలో 3 మంచి పాటలు చోటుచేసుకున్నాయి. ఒక విద్యార్థిని తెరకెక్కించిన ఈ చిత్రాన్ని రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో ప్రదర్శించే విధంగా నిర్మాత చర్యలు చేపడుతున్నట్లు సమాచారం. ఇది విద్యార్థుల వికాశాన్ని పెంపొందించే చిత్రంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ చిత్రానికి అమర్గీత్ సంగీతాన్ని అందించారు. కథనం, మాటలు, పాటలు, దర్శకత్వ సహకార బాధ్యతలను చిన్న తంబి నిర్వహించారు. కాగా గూండాన్ చట్టి చిత్రం త్వరలో తెరపైకి రావడానికి ముస్తాబవుతోంది.



రష్మిక

నా టైమ్ బాగుంది!

తమిళసినిమా: ఇప్పుడు దక్షిణాది, ఉత్తరాది అంటూ భేదం లేకుండా నటిగా ఊపేస్తున్న కన్నడ బ్యూటీ రష్మిక. కన్నడంలో కిరాక్ పార్టీ అనే ఒకే చిత్రంలో నటించి తెలుగు దర్శక నిర్మాతల దృష్టిలో పడ్డ ఈ అమ్మడు టాలీవుడ్‌లో క్రేజీ హీరోయిన్ స్థాయికి ఎదిగిపోయింది. అలా పండ్లున్న చెట్టుకే దెబ్బలు అన్న సామెతగా ఈమె పలు విమర్శలు ఎదుర్కొంటోంది. అలాగే కొన్ని అపజయాలను ఎదుర్కొంది. ముఖ్యంగా కోలీవుడ్‌లో నటించిన తొలి చిత్రం సుల్తాన్ చిత్రం ఆశించిన విజయాన్ని అందుకోలేదు. ఈ తరువాత విజయ్‌తో రొమాన్స్ చేసిన వారిసు చిత్రంలోనూ ఆ పాత్ర గ్లామర్‌కే పరిమితమైంది. అయినప్పటికీ బాలీవుడ్ నుంచి రష్మికకు కాలింగ్ వచ్చింది. అక్కడ నటించిన రెండు చిత్రాలు ఆమెకు నిరాశనే మిగిల్చాయి. అయితే లక్కు ఉంటే ఏ అపజయం ఆపలేదు అన్నట్లుగా రష్మిక బాలీవుడ్‌లో మరిన్ని అవకాశాలను అందుకుంటోంది. ఇక టాలీవుడ్‌లో పుష్ప–2 చిత్రంతో పాటు రెయిన్‌బో అనే ద్విభాషా (తెలుగు, తమిళం) చిత్రంలో నటిస్తోంది. ఇటీవల ఈ భామ ఒక ఇంటర్వ్యూలో పేర్కొంటూ ఇప్పుడు తన టైమ్ బాగుందని పేర్కొంది. ప్రతి బియ్యపు గింజపైనా మన పేరు రాసి ఉంటుంది అని అంటారని, ఇది నటీనటులకూ వర్తిస్తుందని తాను అంటానంది. నటించే పాత్రలపైనా వారి పేరు రాసి ఉంటుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. ఒక్కొక్కరికి మంచి టైమ్ వస్తుందని, అలా తనకిప్పుడు మంచి రోజులు నడుస్తున్నాయని చెప్పింది. అంతగా చిత్రాల్లో బిజీగా నటిస్తున్నట్లు పేర్కొంది. అన్నింటికీ మించి మంచి కథా పాత్రలు వరిస్తుండడం సంతోషంగా ఉందని చెప్పింది. ఈమె నటించిన హిందీ చిత్రం యానిమల్ త్వరలో విడుదలకు సిద్ధం అవుతోంది.

కోలీవుడ్ టాక్స్

జీవీ చిత్రం మొదలైంది!



ప్రారంభమైన కింగ్‌స్టన్ చిత్రం

తమిళసినిమా: సంగీత దర్శకుడిగా, నటుడిగా బిజీగా ఉన్న జీవీ.ప్రకాశ్‌కుమార్ కథ నచ్చితే చిత్ర నిర్మాణం చేపడుతున్నారు. అలా తాజాగా ఈయన కథానాయకుడిగా, సంగీతదర్శకుడిగా, నిర్మాతగా బాధ్యతలను నిర్వహిస్తున్న చిత్రం మంగళవారం చెన్నైలో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ వేడుకలో నటుడు కమలహాసన్ ముఖ్య అతిథిగా పాల్గొని ముహూర్తం షాట్‌కు క్లాప్ కొట్టి చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కాగా ఇది జీవీ.ప్రకాశ్‌కుమార్ నటిస్తున్న 25వ చిత్రం కావడం గమనార్హం. దీనికి కింగ్‌స్టన్ అనే టైటిల్‌ను నిర్ణయించారు. ఈ చిత్రాన్ని జీవీ.ప్రకాశ్‌కుమార్ పరలస్ యూనివర్సల్ పిక్చర్స్ సంస్థ, జి.స్టూడియోస్ సంస్థ కలిసి నిర్మిస్తున్నాయి. దీనికి కమల్ ప్రకాశ్ కథ, దర్శకత్వం బాధ్యతలను నిర్వహిస్తున్నారు. దివ్యభారతి నాయకిగా నటిస్తున్న ఇందులో మేర్కు తొడర్చి మలై ఆంటోని, కల్లూరి వినోద్, సేతన్, కుమరవేల్, మలయాళ నటుడు సబుమోన్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. చిత్ర వివరాలను దర్శకుడు తెలుపుతూ ఇది సముద్రం నేపథ్యంలో సాగే సాహసోపేతమైన యాక్షన్ థ్రిల్లర్ కథా చిత్రంగా ఉంటుందన్నారు. తన లాంటి వర్ధమాన దర్శకుడిని నమ్మి ఈ అవకాశాన్ని కల్పించిన జీవీ.ప్రకాశ్‌కుమార్‌కు, జి.స్టూడియోస్ సంస్థకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నానన్నారు. జీవీ.ప్రకాశ్‌కుమార్ పేర్కొంటూ దర్శకుడు చెప్పిన కథ వినగానే పిల్లల నుంచి పెద్దల వరకూ అలరిస్తుందని భావించి వెంటనే చిత్రాన్ని నిర్మించాలనే నిర్ణయానికి వచ్చినట్లు చెప్పారు. ఒక చిత్రానికి మంచి శ్రీకారం అవసరం అన్నారు. అలా తన చిత్ర నిర్మాణాన్ని ప్రారంభించి, శుభాకాంక్షలు అందించిన నటుడు కమలహాసన్‌కు ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని అన్నారు.

క్రైమ్, థ్రిల్లర్‌గా రత్తం



రత్తం చిత్రంలో విజయ్ ఆంటోని, మహిమానంబియార్, నందితా శ్వేత

తమిళసినిమా: నటుడు, సంగీత దర్శకుడు విజయ్ ఆంటోనికి సరైన సమయంలో మంచి హిట్ చిత్రం పడింది. ఈయన ఇంతకు ముందు స్వీయ దర్శకత్వంలో కథానాయకుడిగా నటించి నిర్మించిన చిత్రం పిచ్చైక్కారన్–2. ఈ చిత్రం తమిళం, తెలుగు భాషల్లో విడుదలై మంచి విజయాన్ని సాధించింది. ఆ తరువాత ఈయన నటించిన తమిళరసన్, కొలై చిత్రాలు ఆశించిన విజయాన్ని అందుకోలేదు. ఇలాంటి పరిస్థితుల్లో విజయ్‌ఆంటోని కథానాయకుడిగా నటించిన రత్తం చిత్రం. నటి నందితాశ్వేతా, రమ్యానంబీశన్, మహిమా నంబియార్ ముగ్గురు భామలు హీరోయిన్లుగా నటించారు. ఇన్ఫినిటీ ఫిలిం వెంచర్స్ పతాకంపై రూపొందిన ఈ చిత్రానికి సీఎస్.అముదమ్ దర్శకత్వం వహించారు. ఈయన ఇంతకుముందు తమిళ్ పడం, తమిళ్‌పడమ్–2 వంటి వినోదభరిత కథాచిత్రాలను తెరకెక్కించారన్నది గమనార్హం. అలాంటిది రత్తం చిత్రాన్ని వాటికి పూర్తి భిన్నంగా క్రైమ్ ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్ ఇతివృత్తంతో రూపొందించారు. ముఖ్యంగా మీడియా నేపథ్యంలో తెరకెక్కించిన చిత్రం రత్తం. చిత్ర ప్రారంభంలోనే ఒక పత్రిక సహాయ సంపాదకుడిని ఆయన కార్యాలయంలోనే ఒక వ్యక్తి కత్తితో పొడిచి హత్య చేస్తాడు. చనిపోయిన వ్యక్తి విజయ్ ఆంటోనికి మిత్రుడు. కాగా ఇంతకుముందు పత్రికలో పనిచేసిన విజయ్‌ఆంటోని ఈ తరువాత జర్నలిజానికి దూరంగా వేరే ప్రపంచంలో జీవిస్తుంటారు. అలాంటిది ఆయన మళ్లీ మీడియా ప్రపంచంలోకి రావలసిన పరిస్థితి ఏర్పడుతుంది. అందుకు కారణం ఏమిటి? జరుగుతున్న హత్యలకు కారణం ఎవరూ? వంటి అంశాలపై ఆయన ఇన్వెస్టిగేషన్ మొదలెడతారు. అయితే ఆ మిస్టరీని ఆయన ఛేదిస్తారా? అందుకు ఎలాంటి సాహసానికి పూనుకుంటారు? వంటి పలు ఆసక్తికరమైన అంశాలతో తెరకెక్కిన చిత్రం రత్తం. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకుల ఆదరణతో సక్సెస్‌ఫుల్‌గా ప్రదర్శింపబడుతోంది.

అధర్వ హీరోగా డీఎన్‌ఏ



ప్రారంభమైన డీఎన్‌ఏ చిత్రం

తమిళసినిమా: నటుడు అధర్వ కథానాయకుడిగా నటించనున్న నూతన చిత్రానికి డీఎన్‌ఏ అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఇంతకుముందు మనం కొత్తి పరవై, డాడా, కళవేత్తి మూర్కన్ వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన ఒలింపియా మూవీస్ అధినేత అంబేత్‌కుమార్ తర్వాత చిత్రాన్ని నిర్మించడానికి సిద్ధమయ్యారు. ఇందులో నటుడు అధర్వ కథానాయకుడిగా నటించనున్నారు. ఆయనకు జంటగా చిత్తా చిత్రంతో పాపులర్ అయిన మలయాళ నటి నిమీషా సజయన్ నటిస్తున్నారు. కాగా ఇంతకుముందు ఒరునాళ్ కూత్తు, మాన్‌స్టర్, పర్హానా వంటి సక్సెస్‌ఫుల్ చిత్రాలను తెరకెక్కించిన నెల్సన్ వెంకటేశన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. దీనికి డీఎన్‌ఏ అనే టైటిల్‌ను నిర్ణయించారు. ఈ చిత్రం బుధవారం పూజాకార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ వేడుకలో నిర్మాత ఆర్‌బీ. చౌదరి, దర్శకుడు పా.రంజిత్ పలువురు సినీ ప్రముఖులు పాల్గొని చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. వైవిధ్యమైన కథాంశంతో యాక్షన్ ఎంటర్‌టైనర్ కథా చిత్రంగా తెరకెక్కుతున్న ఈ చిత్ర షూటింగ్‌ను చెన్నై పరిసర ప్రాంతాల్లో నిర్వహించనున్నట్లు దర్శకుడు తెలిపారు. ప్రణాళిక ప్రకారం చిత్రాన్ని త్వరగా పూర్తిచేయనున్నట్లు చెప్పారు. కాగా ఇందులో నటించే ఇతర నటీనటులు, సాంకేతిక వర్గం వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్లు ఆయన చెప్పారు.

క్లుప్తంగా

పారిశుధ్య కార్మికులపై దాడి

తిరువళ్లూరు: చెత్తకుప్పల సేకరణకు వెళ్లిన బ్యాటరీ వాహనాన్ని ధ్వంసం చేయడంతో పాటు కార్మికులపై రాళ్లతో దాడి చేసిన యువకుడిని పెనాలూరుపేట పోలీసులు అరెస్టు చేశారు. తిరువళ్లూరు జిల్లా సెంద్రాన్ పాళ్యం గ్రామంలో రాజీ, భూషణం, కాంచన, పాంచాలి నలుగురు పారిశుధ్య కార్మికులుగా పని చేస్తున్నారు. వీరు బ్యాటరీ వాహనాల్లో వెళ్లి గ్రామంలో చెత్తకుప్పలను సేకరించి సమీపం లోని యార్డులో డంప్ చేస్తారు. ఈ నేపథ్యంలో మంగళవారం పారిశుధ్య కార్మికులు బ్యాటరీ వాహనంతో వెళ్లి మారియమ్మన్ ఆలయం వద్ద చెత్తకుప్పలను సేకరిస్తుండగా అదే గ్రామానికి చెందిన ఆనందన్ కుమారుడు సతీష్ పారిశుధ్య కార్మికులపై మద్యం మత్తులో దాడి చేసి గాయ పరిచాడు. అనంతరం బ్యాటరీ వాహనాలను ధ్వంసం చేశాడు. ఈ సంఘటనపై పంచాయతీ అధ్యక్షుడు మేనక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెనలూరుపేట పోలీసులు సతీష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

తిరువళ్లూరు: బంధువుల ఇంటికి వెళ్లి ద్విచక్ర వాహనంలో తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదం లో తీవ్రంగా గాయపడి మృతిచెందిన సంఘ టన విషాదాన్ని నింపింది. తిరువళ్లూరు జిల్లా కడంబత్తూరు యూనియన్ వసినంబట్టు గ్రామానికి చెందిన గోవిందరాజన్(67). ఇత డికి భార్య, ఇద్దరు పిల్లలు. మంగళవారం ఉదయం తిరువళ్లూరులో వున్న బంధువుల ఇం టికి వెళ్లిన గోవిందరాజన్ సాయంత్రం ద్విచక్ర వాహనంలో ఇంటికి బయలుదేరాడు. మప్పేడు సమీపంలోని కన్నూర్ వద్ద వెళుతం డగా ఎదురుగా వచ్చిన లారీ ద్విచక్రవా హనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయప డిన గోవిందరాజన్‌ను ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందిం చిన తరువాత శ్రీపెరంబదూరు వైద్యశాలకు తీసుకెళ్లారు. అయితే అక్కడ గోవిందరాజన్‌ను పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెంది నట్టు నిర్ధారించారు. మృతుడి సోదరుడు షణ్ముగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు మప్పేడు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పాము కాటుకు వ్యాపారి బలి

తిరువళ్లూరు: ఇంట్లో నిద్రిస్తున్న పాల వ్యాపా రిని పాము కాటు వేయడంతో వైద్యశాలలో చిక్సిత పొందుతూ మృతిచెందాడు. తిరువ ళ్లూరు జిల్లా చిన్నంబేడు గ్రామానికి చెందిన చెంగాళీ కుమారుడు కుమార్(40). ఇతనికి భార్య మంజులతో పాటు ఇద్దరు పిల్లలు వున్నారు. కుమార్ పాల వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో గత సోమవారం రాత్రి పాల వ్యాపారం ముగిం చుకుని 11.30 గంటలకు ఇంటికి చేరి నిద్రిం చాడు. అదే రోజు రాత్రి ఒంటి గంట సమయం లో కుమార్‌ను పాము కాటువేసింది. వెంటనే కుమార్ గట్టిగా కేకలు వేయడంతో అప్రమత్త మైన బంధువులు కుమార్‌ను పొన్నేరి వైద్యశా లకు తరలించారు. అయితే అక్కడ చిక్సిత పొం దుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య మంజుల ఇచ్చిన పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నగలు, నగదు చోరీ

అన్నానగర్: బన్రూటి సమీపంలో మంగళ వారం రూ.2 లక్షలు విలువైన నగలు, నగదుచో రీతో బుధవారం తెల్లవారుజామున మన స్తాపం చెంది ఓ రైతు షాక్‌కు గురై మృతిచెం దాడు. కడలూరు జిల్లా పన్రూటి సమీపంలోని ఎ.ఆండికుప్పం ప్రాంతానికి చెందిన రామలిం గం (69) రైతు. ఇతని భార్య ఆనంది. వీరి ద్దరూ 9వ తేదీ ఉదయం ఇంటికి తాళం వేసి కడలూరులోని తిరువందిపురం ఆలయానికి వెళ్లారు. అనంతరం సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చారు. అనంతరం ఇంటి ముందు తలుపు తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.2 లక్షల విలువైన నగలు, నగదును దుండగులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఫిర్యాదు మేరకు పబన్రూటి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తు న్నారు. ఈ క్రమంలో ఇంట్లో వున్న రామలింగా నికి గుండెపోటు వచ్చింది. అనంతరం బంధు వులు అతడిని పుదుచ్చేరిలోని ఓ ప్రైవేటు ఆస్ప త్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు.

అలరించిన సంగీత కచేరీ



కచేరి చేస్తున్న మల్లాది బ్రదర్స్

కొరుక్కుపేట: సంగీత కళానిధి నేదునూరి కృష్ణ మూర్తి 96వ జయంతిని పురస్కరించుకుని సామగాన లహరి కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వందే గురు పరంపరం పేరుతో మూడు రోజుల పాటు సంగీత కార్యక్రమాలను విజయ వంతంగా నిర్వహించారు. దీనికి చెన్నై మైలాపూర్‌లోని భారతీయ విద్యాభవన్ వేదికైం ది. జయంతి వేడుకల్లో మంగళవారం రాత్రి మల్లాది బ్రదర్స్ సంగీత కచేరి ఇచ్చారు. వాయిద్య సహకారాన్ని వయోలిన్‌పై ఎంబార్ ఎస్ కన్నన్, మృదంగంపై అర్జున్ గణేష్, ఘట్టంపై తిరుచ్చి మురళి అందించారు. మాజీ భారత ఎన్నికల కమిషనర్ గోపాలస్వామి, నేదునూరి కృష్ణమూర్తి, సంగీత కళానిధి చిత్ర వీణా డాక్టర్ ఎస్.రవి కిరణ్, సంగీత కళానిధి వయోలిన్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

40 ద్విచక్ర వాహనాలు సీజ్

తిరువొత్తియూరు: అరియలూరు జిల్లా అరియ లూరులో లైసెన్స్‌లు, ఆర్సీబుక్‌లు లేని 40 ద్వి చక్ర వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. అరియలూరు సీఐ కార్తికేయన్ నేతృత్వంలో 20 మందికి పైగా పోలీసులు బుధవారం వాహ నాల తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 18 ఏళ్లకు లోపు విద్యార్థులు బైక్‌లు నడుపుతు న్నట్లు తేలింది. పోలీసులు తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

నిఘా నీడలో.. సాగర్ కవచ్





సముద్ర తీరాలలో నిఘా, తనిఖీలు

సాక్షి, చెన్నై: రాష్ట్రంలోని సముద్ర తీర జిల్లాల్లో మంగళ, బుధవారం నిఘా నీడలో సాగర్ కవచ్ మాక్ డ్రిల్ జరిగింది. ఇందులో భాగంగా తీరంలో భద్రతా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తూ విన్యాసాలు చేశారు. వివరాలు.. రాష్ట్రంలోని సముద్ర తీరాల్లో భద్రతను పర్యవేక్షించేందుకు తరచూ మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. సాగర్ కవచ్ పేరిట జరిగే ఈ మాక్ డ్రిల్ పోలీసులకు ముచ్చెమటలు పట్టించడం జరుగుతోంది. చెన్నై మొదలు కన్యాకుమారి వరకు ఉన్న 13 సముద్ర తీర జిల్లాల్లో 48 గంటల పాటు ఈ డ్రిల్ నిర్వహించారు. మంగళవారం ఉదయాన్నే ఐదున్నర గంటలకు ఈ డ్రిల్‌కు శ్రీకారం చుట్టారు. పోలీసులు, కోస్ట్‌గార్డ్, నావికాదళం, సముద్ర తీర భద్రత విభాగాల నేతృత్వంలో రాష్ట్రంలోని సముద్ర తీర జిల్లాల్లో తొలి రోజు ఈ డ్రిల్ నిఘా నీడలో జరిగింది. రెండో రోజుగా బుధవారం అర్ధరాత్రి వరకు సిబ్బంది విన్యాసాలు చేపట్టారు.

ఉరుకులు.. పరుగులు..

ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాలతో ఆగమేఘాలపై పోలీసులు సముద్ర తీరాల్లోని పలు ప్రాంతాల వైపుగా పరుగులు తీశారు. ప్రత్యేక చెక్ పోస్టుల్ని ఏర్పాటు చేశారు. ఆయా సముద్ర తీర గ్రామాల్లో సైతం రంగంలోకి దిగి సోదాలు చేపట్టారు. సముద్ర మార్గం గుండా మారు వేషాల్లో సిబ్బంది కొందరు ఆయా ప్రాంతాల్లోకి చొరబడనున్నారనే సమాచారంతో, వారిని పట్టుకునేందుకు తీవ్రంగా కుస్తీపట్టారు. వాహనాల తనిఖీలు నిర్వహించారు. జాలర్ల గ్రామాల్లో అనుమానితులపై నిఘా ఉంచే విధంగా అవగాహన డ్రిల్ నిర్వహించారు. మారు వేషాల్లో ఉన్న సిబ్బందిని పట్టుకునేందుకు అనేక జిల్లా తీర పరిసరాల్లో పోలీసులు నిరీక్షించక తప్పలేదు. ప్రతి వాహనాన్ని పోలీసులు తనిఖీలు చేసిన తర్వాతే అనుమతించారు. అప్రమత్తంగానే ఉన్న సిబ్బంది చెన్నై కాశిమేడు, ఎన్నూరు, నాగపట్నం, రామనాథపురం, పుదుచ్చేరి తీరాల గుండా రాష్ట్రంలోకి పడవల్లో మఫ్టీ ఉన్న సిబ్బంది ప్రవేశించే అవకాశం ఉండడంతో అప్రమత్తంగా వ్యవహరించారు. సచివాలయం పరిసరాలు, ముఖ్య కూడళ్లు, ప్రధాన మాల్స్‌లోనూ ఈసారి మాక్ డ్రిల్ సాగింది.

లారీ నుంచి కింద పడిన 30 టన్నుల బండరాయి



రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు (ఇన్‌సెట్) బండరాయి

తిరువొత్తియూరు: కన్యాకుమారి జిల్లా ఇరచ్చ కులం ప్రభుత్వ పాఠశాల వద్ద బుధవారం ఉదయం లారీ నుంచి రోడ్డుపై 30 టన్నుల బరువైన బండరాయి కింద పడడంతో స్థానికులు భయాందోళన చెందారు. వివరాలు.. కన్యాకుమారి జిల్లా, తిరునెల్వేలి తెన్‌కాసి, తూత్తుకుడి తదితర జిల్లాల నుంచి ఎక్కువ సంఖ్యలో లారీలు సరుకులు, రాళ్లను ఎక్కించుకుని కేరళకు వెళ్తుంటాయి. ఈక్రమంలో డ్రైవర్లు భూతపాండి సమీపంలోని ఇరచ్చకులం మార్గంలో అధిక వేగంతో వెళ్తుండడం వల్ల తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా బుధవారం ఉదయం 7.15 గంటల సమయంలో ఇరచ్చకులం మెయిన్‌రోడ్డు మార్గంలో పెద్ద బండ రాయిని ఎక్కించుకుని ఓ లారీ బయలుదేరింది. ప్రభుత్వ మహోన్నత పాఠశాల వద్ద వెళుతుండగా హఠాత్తుగా లారీ నుంచి సుమారు 30 టన్నుల బండరాయి లారీ నుంచి రోడ్డుపై పడి దొర్లుకుంటూ వచ్చింది. దీంతో పాదచారులు భయాందోళనతో పరుగులు తీశారు. కొద్ది సమయం తరువాత అక్కడికి చేరుకున్న ప్రజలు లారీని చుట్టుముట్టి డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగారు. పాతపాండి పోలీసులకు సమాచారం అందించి రోడ్డుపై ధర్నా చేపట్టారు. ఆ మార్గంగా వచ్చిన ప్రభుత్వ బస్సులను కూడా నిలిపి వేశారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని బండరాయిని తొలగించడంతో పాటు సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో స్థానికులు ధర్నా విరమించారు.

మాజీ పంచాయతీ అధ్యక్షురాలు అరెస్ట్

తిరువొత్తియూరు: సేలం జిల్లా వాలపాడిలో విద్యార్థిని ప్రియుడి తండ్రి హత్య కేసుకు సంబంధించి పంచాయతీ అధ్యక్షురాలు సహా ఇద్దరు మహిళలను పోలీసులు అరెస్టు చేశారు. సేలం జిల్లా వాలపాడి సమీపంలో ఉన్న తెన్నం పిళ్లై గ్రామానికి చెందిన గుణశేఖరన్ (50). ఇతని కుమారుడు ప్రశాంత్ (26). బిగ్రేడ్ అదే ప్రాంతానికి చెందిన మురుగేశన్ కుమార్తె 18 సంవత్సరాలు. ప్రైవేటు కళాశాలలో బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. మురుగేశన్ కుమార్తెను ప్రశాంత్ ప్రేమించినట్లు తెలిసింది. ఈ వ్యవహారం ఇద్దరి తల్లిదండ్రులకు తెలియడంతో తరచూ గొడవలు జరిగేవి. గత 8వ తేదీ రాత్రి తిరిగి వాగ్వాదం చోటుచేసుకుంది. ఆ సమయంలో మురుగేశన్ అతని బంధువులు అన్నాడీఎంకే కార్యదర్శి శివ కుమార్, అన్నాడీఎంకే మాజీ పంచాయతీ సర్పంచ్ తమిళరసి (40), ముత్తమ్మాళ్ (42) అందరు కలిసి గుణశేఖర్, ప్రశాంత్‌పై దాడి చేశారు. దాడిలొ గాయపడ్డ ఇద్దరిని సేలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం గుణశేఖర్ మృతిచెందాడు. దీనిపై ఏతపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. మురుగేశన్, శివకుమార్‌లను అరెస్టు చేశారు. అదేవిధంగా ముత్తమ్మాల్, తమిళరసి ఇద్దరిని బుధవారం తెల్లవారుజామున అరెస్టు చేసి వారి వద్ద విచారణ చేస్తున్నారు.

ప్రియురాలి కుటుంబ సభ్యుల దాడిలో ప్రియుడి తండ్రి మృతి

అన్నానగర్: సేలం జిల్లా వాళప్పాడి సమీపంలోని తేనంబల్లైయూర్ గ్రామానికి చెందిన గుణశేఖరన్ (50) కుమారుడు ప్రశాంత్ (26). ఇతడు అదే ప్రాంతానికి చెందిన మురుగేశన్ కుమార్తె (17)ని ప్రేమిస్తున్నాడు. ఈ సమాచారం ఇరు కుటుంబాలకు తెలియడంతో ఘర్షణ చోటు చేసుకుంది. అనంతరం వాళపాడి ఆల్ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ప్రశాంత్‌ను హెచ్చరించి పంపించారు. అయితే 8వ తేదీ రాత్రి అమ్మాయి ప్రేమ వ్యవహారంతో మళ్లీ గొడవపడి గొడవ జరిగింది. ఇందులో మురుగేషన్ బంధువులు శివకుమార్, తమిళరసి, ముత్తమ్మ గుణశేఖరన్, ప్రశాంత్‌పై కర్రలతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన గుణశేఖరన్, ప్రశాంత్‌ను కుటుంబ సభ్యులు సేలం ఆస్పత్రికి తరలించారు. అక్కడ గుణశేఖరన్ మంగళవారం మృతి చెందాడు. ఎట్టాపూర్ పోలీసులు హత్య కేసు నమోదు చేసి మురుగేషన్, ఏడీఎంకే శాఖ కార్యదర్శి శివ కుమార్‌ను అరెస్ట్ చేశారు. అలాగే ముత్తమ్మాల్, తమిళరసి కోసం గాలిస్తున్నారు.

రుణాలు ఇప్పిస్తామని రూ.29.66 లక్షల మోసం

• వ్యక్తి అరెస్ట్



పోలీసులు అరెస్ట్ చేసిన సామ్రాజ్

వేలూరు: కాట్పాడి సమీపంలో బ్యాంకు రుణాలు ఇప్పిస్తామని నమ్మించి పలువురి వద్ద రూ: 29.66 లక్షలు మోసం చేసిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కాట్పాడి తాలుకాలోని 16 మంది వేలూరు ఎస్పీ కార్యాలయంలో గత జూన్‌లో వినతి పత్రాన్ని అందజేశారు. అందులో వేలూరు జిల్లా గుడియాత్తం తాలుకా కమలాపురం గ్రామానికి చెందిన సామ్రాజ్(34) పలువురి వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివిధ పారిశ్రామిక వేత్తల పథకాల కింద రూ.50 లక్షల వరకు బ్యాంకు రుణాలు ఇప్పిస్తామని ఇందుకు ప్రతి లక్ష రూపాయలకు ఐదు శాతం కమీషన్ అడ్వాన్స్‌గా చెల్లించాలని చెప్పాడు. వీటిని నమ్మిన 16 మంది నిరుద్యోగులు రూ: 29.66 లక్షల వరకు ఇచ్చారని అయితే ఇప్పటి వరకు బ్యాంకు రుణాలు ఇప్పించకుండా మోసం చేస్తున్నారని వీటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆ వినతిలో పేర్కొన్నారు. వినతిని స్వీకరించిన ఎస్పీ మణివన్నన్ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని జిల్లా క్రైమ్ పోలీసులను ఆదేశించారు. దీంతో క్రైమ్ ఇన్స్‌పెక్టర్ క్రిష్ణవేణి విచారణ చేశారు. విచారణలో సామ్రాజ్ బ్యాంకు రుణాల పేరుతో పలువురి వద్ద రూ: 29.66 లక్షలు తీసుకొని మోసం చేసినట్లు నిర్ధారణ అయింది. ఈ నేపథ్యంలో సామ్రాజ్ పల్లిగొండలో ఎవరికీ కనిపించకుండా తిరుగుతున్నట్లు తెలియడంతో పోలీసులు మంగళవారం రాత్రి అరెస్ట్ చేసి విచారణ చేస్తున్నారు.

హెచ్‌ఎంకు మద్దతుగా విద్యార్థినుల రాస్తారోకో



పాఠశాల ఎదుట రాస్తారోకో చేస్తున్న విద్యార్థినులు

వేలూరు: తిరుపత్తూరు జిల్లా జోలార్‌పేటలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 400 మంది విద్యార్థినులు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ పాఠశాల హెచ్‌ఎం శాంతి. ఇదిలాఉండగా హెచ్‌ఎం శాంతి విద్యార్థినుల పట్ల కఠినంగా ప్రవర్తిస్తున్నట్లు, అసభ్య పదజాలాలతో దూషిస్తున్నట్లు కొంతమంది విద్యార్థినులు తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లారు. ఆగ్రహించిన కొంతమంది తల్లిదండ్రులు నేరుగా పాఠశాలకు వెళ్లి హెచ్‌ఎంతో వాగ్వివాదానికి దిగారు. విషయం తెలుసుకున్న కొంతమంది విద్యార్థినులు హెచ్‌ఎం వద్ద వాగ్వివాదానికి దిగిన తల్లిదండ్రులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ హెచ్‌ఎం శాంతికి మద్దతుగా పాఠశాల ఎదుట టీచర్‌లు, విద్యార్థినులు రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలిసి విద్యాశాఖ సీఈఓ మునిసుబ్బరాయన్, జోలార్‌పేట సీఐ మంగయకరసి, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విద్యార్థినులతో చర్చలు జరిపారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విద్యార్థినుల, టీచర్‌లు రాస్తారోకోను విరమించారు.

ఆరోగ్యశ్రీ సేవలు భేష్



అవార్డును స్వీకరిస్తున్న డాక్టర్ ప్రభుశంకర్

తిరువళ్లూరు: రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ఆరోగ్యశ్రీ, ప్రధానమంత్రి జన్ ఆరోగ్యయోజన పథకాన్ని సమర్థవంతంగా సమన్వయం చేయడంతో పాటు ప్రజలకు పథకం చేరేలా వ్యవహరించిన డాక్టర్‌లను కలెక్టర్ సన్మానించి అవార్డులు, ప్రశంసాపత్రాలను అందజేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ఆరోగ్య బీమాతో పాటు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి జన్ ఆరోగ్యబీమాను సైతం సమర్థవంతంగా అమలు చేశారు. ఈ పథకాలను సమర్థవంతంగా సమన్వయం చేసిన తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాల వైద్యుడు డాక్టర్ ప్రభుశంకర్‌కు అవార్డును అందజేశారు. కాగా ఈ రెండు పథకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో వేర్వేరు పోటీలను నిర్వహించి విజయం సాధించిన వారికి బహుమతులను అందజేశారు. డిప్యూటీ డైరెక్టర్ శేఖర్ పాల్గొన్నారు.

హత్య కేసులో భర్తకు యావజ్జీవం

అన్నానగర్: తెన్‌కాశి సమీపంలో భార్యను సజీవదహనం చేసిన భర్తకు బుధవారం కోర్టు జీవిత ఖైదు విధించింది. తెన్‌కాశి జిల్లా బావూరు ఛత్రం సమీపంలోని కల్లూరాణికి చెందిన కృష్ణమూర్తి. ఇతని కూతురు శాంతి (36). నెల్లై వన్నార్‌పేటలోని ఓ ప్రైవేటు ల్యాబ్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తుంది. అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్న తూత్తుకుడి జిల్లా విలాతికులం సంగలింగపురానికి చెందిన ఆరోగ్యస్వామి (46)తో 2008లో వివాహమైంది. వీరికి ఒక కుమారుడు వున్నాడు. వీరందరూ పాళయంట్టైలో అద్దె ఇంట్లో నివశిస్తున్నారు. ఈ క్రమంలో ఆరోగ్యస్వామి తరచూ మద్యం తాగి ఇంటికి వస్తుండడంతో భార్యభర్తల మధ్య గొడవలు జరిగేవి. ఈ క్రమంలో బుధవారం యథావిధిగా దంపతుల మధ్య గొడవ చోటుచేసుకుంది. మనస్తాపం చెందిన శాంతి వెంటనే శాంతి శరీరంపై కిరోసిన్‌పోసుకుంది. వెంటనే అగ్గిపెట్టె తీసుకుని శాంతిపై వెలిగించాడు. ఈ ఘటనలో శాంతి శరీరం కాలిపోయి మృతిచెందింది. పాళయం కోట పోలీసులు ఆరోగ్యస్వామిని అరెస్టు చేశారు. బుధవారం న్యాయమూర్తి విజయకుమార్ కేసును విచారించి నిందితుడు ఆరోగ్యస్వామికి జీవిత ఖైదు, రూ.36వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

అన్నానగర్: కంబం సమీపంలో బుధవారం ఐస్‌బాక్స్‌పై చార్జ్ చేసిన ఓ యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. తేని జిల్లా కంబం గ్రామ చావడి వీధికి చెందిన గణేశన్. అదే ప్రాంతంలో ఐస్ కంపెనీ నడుపుతున్నాడు. ఇతని కంపెనీలో ట్రాలీలు, మోటారు సైకిళ్లవంటి వాహనాల్లో ఐస్‌బాక్సులతో వ్యాపారం చేస్తున్నారు. పగటిపూట వాహనాల్లో ఐస్‌బాక్సులను అమ్మకానికి తీసుకెళ్లి రాత్రికి తిరిగి కంపెనీకి చేరుకుంటున్నారు. ఆ తరువాత సాధారణంగా ఆ వాహనాల్లోని ఐస్‌బాక్స్ చల్లగా ఉండేందుకు రోజూ రాత్రి కరెంటుతో చార్జ్ అవుతుంది. దీంతో గణేశన్ చిన్న కుమారుడు చెల్లపాండి (34) బుధవారం ఐస్‌బాక్స్‌కు చార్జింగ్ పెట్టాడు. అప్పుడు ఊహించని విధంగా విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. కంబం సౌత్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దోపిడీలకు పాల్పడుతున్న ఐదుగురి అరెస్ట్

తిరువొత్తియూరు: చెన్నై, పుళల్ సమీపంలో దారి దోపిడీలకు పాల్పడుతున్న ఐదుగురు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి మోటారు సైకిల్, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. చెన్నై మాధవరం, రెడ్‌హిల్స్ మార్గంగా కోల్‌కత్తా రోడ్డులో దారి దోపిడీ చేస్తున్నట్లు పోలీసులు సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ఆ ప్రాంతంలో ఉన్న సీసీటీవీ కెమెరాలను ఆధారంగా తనిఖీ చేసి మాధవరం, పుళల్ ప్రాంతానికి చెందిన మూర్తి (21), ధనుష్‌కుమార్ (19), నాగరాజు (19), జయకుమార్ (19), అలగర్ స్వామి(21)ని అదుపులోకి తీసుకున్నారు. వారు రాత్రి సమయంలో ద్విచక్ర వాహనాల్లో వచ్చే వారిని అడ్డుకుని నగదు, సెల్‌ఫోన్‌ను అపహరిస్తున్నట్టు తెలిసింది. తర్వాత నిందితులను పుళల్ జైలుకు తరలించారు.

కూర్చోబెట్టి వినతులు స్వీకరించాలి



ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ మణివన్నన్

వేలూరు: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులను కూర్చోబెట్టి వినతులను స్వీకరించాలని ఎస్పీ మణివన్నన్ అన్నారు. బుధవారం వేలూరు ఎస్పీ కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా సత్‌వచ్చారి సమీపంలోని రాగవేంద్రనగర్‌కు చెందిన హిజ్రా విజయభాస్కర్ సహ హిజ్రాలతో వచ్చి ఎస్పీ మణివన్నన్ వద్ద వినతి పత్రం అందజేశారు. అందులో పేర్కొన్న విధంగా తాను గత 2022వ సంవత్సరంలో జరిగిన స్థానిక ఎన్నికల్లో వేలూరు కార్పొరేషన్ కార్పొరేటర్‌గా పోటీ చేశానని ఆ సమయంలో ఎన్నికల ఖర్చుల కోసం రంగాపురానికి చెందిన ఒకరి వద్ద రూ.10 లక్షల 65 వేలు అప్పుగా తీసుకున్నానని అనంతరం ఎన్నికల్లో ఓటమి పాలు కావడంతో అప్పును చెల్లించలేక పోయానన్నారు. అప్పటి నుంచి తరచూ ఇంటి వద్దకు తన అనుచరులతో వచ్చి ఘర్షణ పడి తన తల్లిపేరుపై ఉన్న ఇంటిని తాకట్టు పెట్టాలని కోరాడని, దీంతో తాము ఇంటిని తాకట్టు పెట్టుకున్నామన్నారు. సంవత్సర కాలంలో తాను రూ.15 లక్షల వరకు అతనికి చెల్లించామని అయినప్పటికీ తమ ఇంటిని తమకు అప్పగించకుండా రౌడీలను పెట్టి బెదిరిస్తున్నారని తెలిపింది. పోలీసులు విచారణ జరిపి తమ ఇంటిని తమకు అప్పగించాలని కోరింది. విచారణ జరిపి న్యాయం చేస్తామని ఎస్పీ హామీ ఇవ్వడంతో ఆమెతో పాటు వచ్చిన హిజ్రాలు వెనుదిరిగి వెళ్లారు. అదేవిధంగా జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వివిధ సమస్యలపై వినతీ పత్రాన్ని అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ ఎస్పీ కార్యాలయం నుంచి వెళ్లే వినతులను వెంటనే విచారణ జరిపి న్యాయం చేయాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులను కూర్చొబెట్టి వినతులను స్వీకరించి వెంటనే విచారణ చేపట్టి న్యాయం చేయాలన్నారు. ఆయనతో పాటు అడిషనల్ ఎస్పీలు, భాస్కరన్, కోటీశ్వరన్, పోలీసులున్నారు.

అవయవదాన యువకుడికి నివాళి

అన్నానగర్: నెల్‌లై ప్రభుత్వాస్పత్రిలో అవయవాలను దానం చేసిన యువకుడి మృతదేహానికి వైద్యులు నివాళులర్పించారు. విరుదునగర్ జిల్లా రాజపాళయం ముగవూరు ప్రాంతానికి చెందిన మారియప్పన్. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని రాజపాళయం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం చికిత్స నిమిత్తం నెల్‌లై ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సమయంలో అతనికి బ్రెయిన్‌డెడ్ అయ్యింది. కుటుంబ సభ్యులు మారియప్పన్ శరీర అవయవాలను దానం చేసేందుకు అంగీకరించారు. బంధువుల అంగీకారం తరువాత మారియప్పన్ కాలేయం, రెండు కిడ్నీలు, కళ్లను దానం చేశారు. అక్కడ నుంచి మంగళవారం తెల్లవారుజామున కాలేయాన్ని మదురైలోని అపోలో ఆస్పత్రికి రెండు కిడ్నీలలో ఒకటి మదురై రాజాజీ ప్రభుత్వాస్పత్రికి, మరొకటి నెల్‌లై ప్రభుత్వాస్పత్రికి, కళ్లను తమిళ మార్గదర్శకాల మేరకు నెల్‌లై ప్రభుత్వాస్పత్రికి అందచేశారు. అనంతరం ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశాల మేరకు మారియప్పన్ మృతదేహం మెడికల్‌కాలేజీ డీన్ రేవతి పాలన్ అనంతరం అంబులెన్స్‌లో మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. అతని మృతదేహానికి వైద్యులు నివాళులు అర్పించి గౌరవించారు.

ప్రారంభ దశలో గుర్తిస్తే కేన్సర్ నుంచి విముక్తి



అవగాహన సదస్సులో డాక్టర్ ప్రీతారెడ్డి

కొరుక్కుపేట: కేన్సర్ వ్యాధిని ప్రారంభదశలో గుర్తిస్తే పూర్తిగా దాని నుంచి విముక్తి పొందవచ్చునని అపోలో ఆస్పత్రి వైస్ చైర్‌పర్సన్ ప్రీతారెడ్డి తెలిపారు. ఈ మేరకు అపోలో ప్రోటాన్ క్యాన్సర్ సెంటర్ (ఏపీసీసీ) ఆధ్వర్యంలో సేవ్ ది బ్రెస్ట్ అవగాహన ప్రచారాన్ని ప్రారంభించారు. రొమ్ము సంరక్షణను ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రజల్లో అవగాహన తీసుకుని రానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రీతారెడ్డితోపాటు డైరెక్టర్ హర్షద్ రెడ్డి సమక్షంలో ఈ ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో రొమ్ము కేన్సర్ తో అధికసంఖ్యలో మహిళలు బాధపడుతున్నారని తెలిపారు. ప్రతి 28 మందిలో ఒకరు రొమ్ము కేన్సర్‌కు గురి అవుతున్నట్లు తెలిపారు. ప్రారంభదశలో కేన్సర్‌ను గుర్తించగలిగితే నయం చేయవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీసీసీ బ్రెస్ట్ ఆంకో ప్లాస్టిక్ సర్జరీ కన్సెల్‌టెంట్ డాక్టర్ ముంజులా రావు ,డాక్టర్ సప్నా నంగియా, డాక్టర్ ముక్తా మహాజన్ పాల్గొన్నారు.

దాండియా ధమాకా సంబరాలు



దాండియా ధమాకాలో మహిళా సభ్యులతో నిర్వాహకులు

కొరుక్కుపేట: తమిళనాడు ఆర్యవైశ్య మహిళా సభ (మద్రాసు యూనిట్) ఆధ్వర్యంలో దసరా సందర్భాన్ని పురస్కరించుకుని దాండియా ధమాకా కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చెన్నైలోని అన్నానగర్ టవర్ క్లబ్ వేదికైంది. మహిళా సభ చైర్‌పర్సన్ అనిత అధ్యక్షత వహించారు. మహిళలు ఆటపాటలతో, దాండియా, కోలాట నృత్యాలతో సందడి చేశారు. ఈ సందర్భంగా అద్భుతమైన ప్రదర్శన కనబరిచిన మహిళలకు బహుమతితోపాటు పాల్గొన్న వారిందరికీ గిఫ్ట్ హ్యాంపర్లను చైర్ పర్సన్ ప్రదర్శించారు. సెక్రటరీ లక్ష్మి, కోశాధికారి వసుంధర , దాండియా ధమాకా కన్వీనర్ పద్మప్రీత కలిసి బహూకరించారు.

రాజరాజేశ్వరి ఆలయంలో అభిషేక పూజలు



కోలాటం ఆడుతున్న భజన బృందం

తిరువళ్లూరు: కాకలూరు హౌసింగ్ బోర్డు కాలనీలో ఇటీవల నిర్మించిన రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో మండల పూజల్లో భాగంగా 23వ రోజు మంగళవారం రాత్రి ప్రత్యేక అభిషేకం పూజలు నిర్వహించారు. తిరువళ్లూరు జిల్లా కాకలూరు హౌసింగ్ బోర్డు కాలనీలో రాజరాజేశ్వరి ఆలయాన్ని ఇటీవల నిర్మించారు. నిర్మాణపనులు పూర్తయిన నేపథ్యంలో గత 17న కుంభాభిషేకం నిర్వహించారు. అనంతరం 48 రోజుల పాటు మండల పూజలు నిర్వహిస్తున్నారు. పూజల్లో భాగంగా 23వ రోజు మంగళవారం రాత్రి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం భక్తులకు అన్నదానంతో పాటు ప్రసాదాలను అందజేశారు. పళ్లిపట్టు తాలుకా చిన్నఅత్తిమాంజేరిపేటకు చెందిన నాగులమ్మ కోలాట భజన బృందం ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్సవ ఏర్పాట్లను కోర్డినేటర్ ఆర్య శ్రీనివాసన్, కాకలూరు హౌసింగ్ బోర్డు వ్యాపారుల సంఘం అధ్యక్షుడు సురేష్, కార్యదర్శి వెంకటేశన్, ట్రజరరీ అరుల్ చేశారు.

• నియామకం



కాంచీపురం జిల్లా ముసరవాక్కం ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం కుక్‌గా విధులు నిర్వహిస్తూ రోహిణి మృతిచెందింది. దీంతో ఆమె కుమార్తెకు మధ్యాహ్న భోజన పథకం ఆర్గనైజర్‌గా నియమిస్తూ కలెక్టర్ కలైసెల్వి ఉత్తర్వులు అందజేశారు. - కాంచీపురం

జగనన్న ఆరోగ్య సురక్ష


శ్రీకాకుళం జిల్లా షళంత్రి గ్రామంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది


అనంతపురం జిల్లా కొనకొండ్లలో వైద్యసేవల కోసం వచ్చిన ప్రజలు


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా గెద్దాడలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో వైద్య సేవలు


గుంటూరు బృందావన్‌గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి తరలివచ్చిన నగరవాసులు


ఒంగోలులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఓపీ విభాగం వద్ద క్యూలో ప్రజలు


పశ్చిమగోదావరి జిల్లా నందమూరులోని శిబిరం వద్ద పేరు నమోదు చేయించుకుంటున్న మహిళలు


శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెలుపోడులో రోగులకు మందుల కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి


విశాఖ జిల్లా ఆనందపురం మండలం గంభీరంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగిని పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది


తిరుపతి జిల్లా అనంతమడుగు గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య సేవలు పొందుతున్న స్థానికులు


నంద్యాల జిల్లా డబ్ల్యు.గోవిందిన్నె గ్రామంలో వృద్ధుడిని వీల్ చైర్‌లో శిబిరానికి తెస్తున్న ఆశా వర్కర్


విజయవాడ సింగ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో వృద్ధులకు మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది


అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం ఎర్రబల్లెలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి భారీగా హాజరైన గ్రామస్తులు


విజయనగరం జిల్లా బాడంగి మండలం ఆనవరంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి హాజరైన ప్రజలు

నేడు విశాఖలో జాతీయస్థాయి సైబర్ క్రైమ్ సమావేశం

దొండపర్తి (విశాఖ దక్షిణ): విశాఖలోని నొవోటెల్ హోటల్‌లో పది రాష్ట్రాల పోలీస్ ఉన్నతాధికారులతో సైబర్ క్రైంపై జాతీయస్థాయిలో ప్రత్యేక సమావేశం గురువారం నిర్వహించనున్నారు. ఏపీ సైబర్ క్రైం విభాగం ఆధ్వర్యంలో జరగనున్న ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌తో పాటు తమిళనాడు, కేరళ, జార్ఖండ్, ఒడిశా, అండమాన్, లక్షద్వీప్, పాండిచ్చేరి, ఇతర రాష్ట్రాల డీజీలు, ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. అలాగే కేంద్ర హోంశాఖ నుంచి కూడా అధికారులు పాల్గొని ప్రసంగించనున్నారు. ఇందుకు సంబంధించి విశాఖ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పర్యవేక్షణలో పోలీస్ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఇజ్రాయెల్‌లో ప్రవాసాంధ్రుల కోసం ఏపీఎన్ఆర్‌టీఎస్ హెల్ప్‌లైన్ నంబర్లు

హెల్ప్ లైన్ నంబర్లు +91 8500027678 (వాట్సాప్), 0863–2340678



సాక్షి, అమరావతి: ఇజ్రాయెల్‌లో ఉన్న ప్రవాసాంధ్రుల సహాయార్థం ఏపీఎన్ఆర్‌టీఎస్ 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా హెల్ప్‌లైన్ నంబర్లను ఏర్పాటు చేసింది. ప్రత్యేకంగా కేటాయించిన హెల్ప్‌లైన్ నంబర్లు +91 8500027678 (వాట్సాప్), 0863–2340678లలో సంప్రదించాల్సిందిగా కోరింది. ఇజ్రాయెల్‌లో పరిస్థితి క్షీణించినప్పుడు, స్వదేశానికి తిరిగి రావాల్సిన అవసరం ఏర్పడితే ప్రవాసాంధ్రులను సురక్షితంగా వెనక్కి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుందని, ఇప్పటికే దీనికి సంబంధించి భారతీయ కార్యాలయానికి లేఖ రాసినట్టు ఏపీఎన్ఆర్టీఎస్ అధ్యక్షుడు వెంకట్ మేడపాటి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇజ్రాయెల్ వెళ్లాలి అనుకునే వారు కూడా అక్కడి పరిస్థితులు సాధారణ స్థాయికి వచ్చే వరకు తమ ప్రయాణాన్ని వాయిదా వేసుకోవాలని సూచించారు. భారతీయ రాయబార కార్యాలయం ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ నెంబర్: +972 35226748, ఈమెయిల్ cons1.-telaviv@mea.gov.inల్లో కూడా సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

విద్యార్థులను ప్రపంచ పౌరులుగా తీర్చిదిద్దుతాం

విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను ప్రపంచ పౌరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో దశల వారీగా సీబీఎస్ఈ సిలబస్ విధానాన్ని అమలు చేస్తున్నట్టు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. బుధవారం సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయంలో 'సీబీఎస్ఈ సిలబస్ అమలు తీరు' పై జవహర్ నవోదయ, కేంద్రీయ విద్యాలయ, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రిన్సిపాళ్లతో సమావేశాన్ని నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ పేద విద్యార్థులు 21వ శతాబ్దపు సవాళ్లు ఎదుర్కొనే విధంగా పాఠ్యాంశ సంస్కరణలతో పాఠశాల విద్యలో కొత్త శకానికి నాంది పలికామన్నారు. సీబీఎస్ఈ అనుబంధ ప్రభుత్వ నిర్వహణ పాఠశాలల్లో బోధన, సబ్జెక్టులు, సిబ్బంది అర్హతలు, ఉపాధ్యాయ విభాగం/విద్యార్థి నిష్పత్తి, ప్రయోగశాలలు, లైబ్రరీ, పరీక్ష విధానం/ మూల్యాంకనం, ఆర్థిక నిర్వహణ, స్పోర్ట్స్ తదితర అంశాల క్షుణ్ణంగా చర్చించారు. పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, పాఠశాల విద్యా శాఖ కమిషనర్ సురేష్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

'ఎన్‌సీడీసీ' ఏర్పాటుతో మెరుగైన సేవలు

- రాష్ట్ర సహకార శాఖ స్పెషల్ సీఎస్ చిరంజీవి చౌదరి
- ఏపీ ప్రభుత్వ చొరవతో రాష్ట్రంలో ప్రారంభమైన సంస్థ కార్యకలాపాలు
- విభజన తర్వాత 9 ఏళ్లుగా హైదరాబాద్‌లోనే కార్యాలయం


ఎన్‌సీడీసీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న స్పెషల్ సీఎస్ చిరంజీవి చౌదరి

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సహకార సంఘాలకు జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ) ద్వారా మరింత మెరుగైన సేవలు పొందేందుకు ఆస్కారం ఏర్పడిందని రాష్ట్ర సహకార శాఖ స్పెషల్ సీఎస్ చిరంజీవి చౌదరి అన్నారు. విజయవాడ ఆటోనగర్‌లోని మార్క్‌ఫెడ్ కార్యాలయ భవన సముదాయంలోని నాలుగో అంతస్తులో ఎన్‌సీడీసీ సంస్థ ఉప కార్యాలయాన్ని చిరంజీవి చౌదరి బుధవారం ప్రారంభించారు. రాష్ట్ర విభజన తర్వాత గడిచిన తొమ్మిదేళ్లుగా హైదరాబాద్ కేంద్రంగానే ఈ సంస్థ తన కార్యకలాపాలను నిర్వహిస్తోంది. ఫలితంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేసే వివిధ రకాల పథకాల కోసం రాష్ట్రంలోని సహకార సంఘాలు తరచూ హైదరాబాద్ వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి హైదరాబాద్ వెళ్లలేక చాలామంది కేంద్ర పథకాలకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడింది. దీన్ని గుర్తించిన ఏపీ ప్రభుత్వం రాష్ట్రంలో సంస్థ కార్యకలాపాల కోసం కృషి చేసింది. ప్రభుత్వ కృషి ఫలించడంతో ఇక నుంచి విజయవాడలోనే సంస్థ కార్యకలాపాలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో రాష్ట్రంలోని సహకార సంఘాలకు జాతీయ స్థాయి పథకాలను మరింత చేరువకానున్నాయి. ఈ సందర్భంగా స్పెషల్ సీఎస్ చిరంజీవి చౌదరి మాట్లాడుతూ రాష్ట్రంలోని సహకార సంఘాలు, సహకార ఎఫ్‌పీవోలకు ఎన్‌సీడీసీ ఆర్థిక సేవలు పొందడంలో ఎలాంటి అవాంతరాలు లేకుండా చేరతాయన్నారు. ముఖ్యంగా వ్యవసాయ, అనుబంధ రంగాల్లో సహకార సంఘాలు తమ వ్యాపార ప్రణాళికలను ఎన్‌సీడీసీ అధికారులతో కలిసి రూపొందించుకోవడం, అవసరమైన సేవలను ఎలాంటి జాప్యం లేకుండా పొందేందుకు మార్గం సుగమమైందన్నారు. ఎన్‌సీడీసీ రీజనల్ డైరెక్టర్ వంశీ దుబాసీ, మార్క్‌ఫెడ్ ఎండీ రాహుల్ పాండే, మార్క్‌ఫెడ్ జీఎం ఆదినారాయణ, ఎన్‌సీడీసీ, ఆప్కాబ్, స్త్రీనిధి అధికారులతో పాటు వివిధ సహకార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సింహాద్రిలో విద్యుదుత్పత్తి పునరుద్ధరణ

పరవాడ (అనకాపల్లి జిల్లా): పరవాడ సమీపంలోని సింహాద్రి ఎన్టీపీసీలో సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన మొదటి యూనిట్‌లో మరమ్మతుల అనంతరం బుధవారం విద్యుదుత్పత్తిని పునరుద్ధరించారు. సంస్థలో 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మొదటి యూనిట్ బ్రాయిలర్‌లో అమర్చిన ట్యూబుకు రంధ్రం పడి ఈ నెల 8న అర్ధరాత్రి విద్యుదుత్పత్తి నిలిచిపోయిన విషయం తెలిసిందే. సమస్యను గుర్తించిన వెంటనే సాంకేతిక నిపుణులు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. బుధవారం మధ్యాహ్నం 1.30 గంటలకు యూనిట్ నుంచి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ప్రస్తుతం సంస్థలో నాలుగు యూనిట్‌లు యథావిధిగా పనిచేస్తున్నాయని సంస్థ అధికారులు తెలిపారు.

బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని


విద్యార్థినులకు నాప్‌కిన్స్ అందిస్తున్న మంత్రి రజిని

సాక్షి, అమరావతి/చిలకలూరిపేట: బాలికల ఆరోగ్యంపై తమ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో ముందుకు సాగుతోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. ప్రపంచ బాలికల దినోత్సవం సందర్భంగా ప్రముఖ అంతర్జాతీయ సంస్థ కింబెర్లీ- క్లార్క్ ఆధ్వర్యంలో కిశోర బాలికలకు మంగళవారం ఉచితంగా శానిటరీ నాప్‌కిన్స్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్య, ఆరోగ్య శాఖ విజ్ఞప్తి మేరకు ఈ సంస్థ 2.33 లక్షల శానిటరీ నాప్‌కిన్లు, 297 కేసుల డైపర్స్‌ను తొలి విడతలో పేద విద్యార్థులు, చిన్నారులకు అందజేసేందుకు ముందుకొచ్చింది. కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న ఏడో తరగతి నుంచి 12వ తరగతి లోపు ఆడపిల్లలకు స్వేచ్ఛ కార్యక్రమం కింద ప్రభుత్వం నెల నెలా 12 లక్షల శానిటరీ నాప్‌కిన్లను ఉచితంగా పంపిణీ చేస్తోందన్నారు.

హెల్త్ రికార్డులన్నీ కంప్యూటర్‌లో నిక్షిప్తం

రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలను కంప్యూటర్లలో నిక్షిప్తం చేస్తున్నామని మంత్రి రజిని చెప్పారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుంట్లలో బుధవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆమె పాల్గొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా వైద్యం పొందుతున్న అందరి ఆరోగ్య వివరాలను డిజిటలైజ్ చేస్తున్నట్లు తెలిపారు. 1.6 కోట్ల కుటుంబాలకు ఈ కార్యక్రమం ద్వారా వైద్య సేవలు అందించగలుగుతున్నామన్నారు. క్యాంపులకు హాజరైన వారిలో ఎవరికైనా మెరుగైన వైద్యం అవసరమైతే అలాంటి వారిని పెద్దాస్పత్రులకు సిఫారసు చేస్తున్నామని చెప్పారు. వ్యాధి నయం అయ్యేంతవరకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో చర్యలు చేపడుతోందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి దేశవ్యాప్తంగా ప్రశంసలు దక్కుతున్నాయని, కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుండడాన్ని జీర్ణించుకోలేని ప్రతిపక్షాలు అర్థంపర్థం లేని విమర్శలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీకి ప్రతి అంశంలోనూ బురదజల్లడమే పనిగా మారిందని మండిపడ్డారు.

కిడ్నీ మార్పిడి చేయించుకున్న యువకుడికి ఉద్యోగం

- నియామకపత్రం అందజేసిన ప్రకాశం జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్
- సీఎం జగన్ చొరవతో పూర్తి న్యాయం



ఒంగోలు అర్బన్: కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకున్న యువకుడికి మార్కాపురంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో కాంట్రాక్టు పద్ధతిలో స్టాఫ్‌నర్స్(మేల్) ఉద్యోగం కల్పించారు. ఒంగోలులోని ప్రకాశం భవన్‌లో బుధవారం అతనికి ఉద్యోగ నియామకపత్రాన్ని కలెక్టర్ దినేష్‌కుమార్ అందజేశారు. కొనకనమిట్ల మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన మార్తమ్మకు ఇద్దరు కుమారులు. భర్త మరణించడంతో కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. పెద్ద కుమారుడు శ్రీనివాసులు బీఎస్సీ నర్సింగ్ పూర్తిచేశారు. అతనికి కిడ్నీలు చెడిపోవడంతో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాలని వైద్యులు సూచించారు. దీంతో ఈ ఏడాది ఏప్రిల్‌లో ఈబీసీ నేస్తం కార్యక్రమంలో పాల్గొనేందుకు మార్కాపురం వచ్చిన సీఎం జగన్‌ను కలిసి తమ సమస్యను చెప్పారు. స్పందించిన సీఎం.. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించడంతో తల్లి కిడ్నీని శ్రీనివాసులుకు ట్రాన్స్‌ప్లాంటేషన్ చేశారు. ఒక కిడ్నీతో ఉన్న శ్రీనివాసులుకు వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగం కూడా కల్పించి ప్రభుత్వం పూర్తి అండగా నిలిచింది. తమ సమస్య తెలుసుకుని తక్షణమే స్పందించి పరిష్కరించిన సీఎం వైఎస్ జగన్‌కు, కలెక్టర్‌కు శ్రీనివాసులు కృతజ్ఞతలు తెలిపారు.

ఏలూరు యాసిడ్ దాడి కేసులో ముగ్గురికి జీవిత ఖైదు

- 117 రోజుల్లోనే ఎస్సీ, ఎస్టీ స్పెషల్ కోర్టు తీర్పు
- సత్వర విచారణతో నిందితులకు నాలుగు నెలల్లోపే శిక్ష విధింపు
- ఏలూరు ఎస్పీ మేరీ ప్రశాంతి వెల్లడి


మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి, చిత్రంలో ఏఎస్పీ, పీపీ తదితరులు

ఏలూరు టౌన్: ఏలూరులో మహిళపై యాసిడ్ దాడికి తెగబడిన కేసులో ముగ్గురు నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ ఏలూరు జిల్లా ఎస్సీ, ఎస్టీ స్పెషల్ కోర్టు న్యాయమూర్తి ఎం.సునీల్‌కుమార్ సంచలన తీర్పు వెలువరించారు. యాసిడ్ దాడిలో ప్రాణాలు కోల్పోయిన ఎడ్ల ఫ్రాన్సికా కుటుంబానికి సత్వర న్యాయం అందిస్తూ కేవలం 117 రోజుల్లోనే తీర్పు వెలువరించారు. జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి మీడియాకు బుధవారం వెల్లడించారు. ఏలూరు కొత్తగూడెం ప్రాంతానికి చెందిన ప్రధాన నిందితుడు బోడ నాగసతీష్‌కు జీవిత ఖైదు, రూ.10 వేల జరిమానా, యాసిడ్ దాడికి పాల్పడిన ఏలూరుకు చెందిన బెహరా మోహన్, బూడిద ఉషాకిరణ్‌కు జీవిత ఖైదుతోపాటు రూ.15 వేల చొప్పున జరిమానా విధించారు. యాసిడ్ విక్రయించిన ఏలూరు గడియార స్తంభం ప్రాంతానికి చెందిన కొల్లా త్రివిక్రమరావు (68)కు రూ.1,500 జరిమానా విధించారు.

దాడి జరిగిందిలా..

మృతురాలు ఫ్రాన్సికా భర్తకు దూరంగా ఉంటూ నగరంలోని ప్రైవేట్ దంత వైద్యశాలలో రిసెప్షనిస్ట్‌గా పనిచేస్తోంది. కాగా.. ఫ్రాన్సికా సోదరితో ఏలూరు వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన బోడ నాగసతీష్ సన్నిహితంగా ఉండేవాడు. దీనిని ఫ్రాన్సికా వ్యతిరేకించింది. దీంతో కక్ష పెంచుకున్న సతీష్.. ఫ్రాన్సికాను హతమార్చేందుకు నగరానికి చెందిన మోహన్, ఉషాకిరణ్ అనే వ్యక్తులకు సుపారీ ఇచ్చాడు. వారిద్దరూ ఈ ఏడాది జూన్ 13న రాత్రి 8.30 గంటల సమయంలో ఫ్రాన్సికాపై యాసిడ్‌తో దాడి చేశారు. గాయపడిన ఆమెను ఏలూరు జీజీహెచ్‌లో చేర్పించగా.. మెరుగైన వైద్యం కోసం బాధితురాలిని విజయవాడ జీజీహెచ్‌కు, ఆ తరువాత మణిపాల్ ఆస్పత్రికి తరలించారు. మృతురాలు తల్లి ధనలక్ష్మి ఏలూరు దిశ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. సీఐ ఇంద్ర శ్రీనివాస్ కేసు నమోదు చేశారు. కాగా, ఫ్రాన్సికాను బతికించాలనే తపనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధితురాలి చికిత్స కోసం రూ.20 లక్షలు మంజూరు చేశారు. అయితే.. 8 రోజులపాటు మృత్యువుతో పోరాడిన ఆమె జూన్ 21న మృతి చెందింది.

సత్వర విచారణతో నిందితులకు కఠిన శిక్షలు

డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాలతో కేసు సత్వర విచారణ బాధ్యతను ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులుకు అప్పగించారు. నిందితుల్ని అరెస్ట్ చేసి కేవలం 21 రోజుల్లోనే చార్జ్‌షీట్ దాఖలు చేసి, పటిష్టమైన సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించారు. సునీల్‌కుమార్ కేవలం 117 రోజుల్లోనే విచారణ పూర్తి చేసి దోషులకు జీవిత ఖైదు విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి.శ్రీవాణీబాయ్ వాదనలు వినిపించారు. సాక్షులను ప్రవేశ పెట్టడంతో కీలకంగా వ్యవహరించిన దిశ సీఐ ఇంద్ర శ్రీనివాస్, విశ్వం, డీఎస్పీ శ్రీనివాసులు, డీసీఆర్‌బీ సీఐ దుర్గాప్రసాద్‌ను జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి అభినందించారు.

కొండంత ఆశతో పొగాకు సాగు



- పదేళ్ల నాటి పరిస్థితులతో పోల్చితే పరిస్థితిలో మార్పు
- గత రెండేళ్లు లాభాలు చూసిన రైతాంగం
- ఈ ఏడాదీ బోర్డు అనుమతిలో వడివడిగా సాగు

దేవరపల్లి: మెట్ట ప్రాంతంలో వర్జీనియా పొగాకు సాగుకు రైతులు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది పంట సీజన్‌కు పొగాకు బోర్డు విధి విధానాలను ఖరారు చేసి బ్యారన్ల రిజిస్ట్రేషన్లు ప్రారంభించడంతో సాగుకు రైతులు అడుగు ముందుకేశారు. వాతావరణం అనుకూలించకపోవడం వల్ల నాట్లు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. మెట్ట ప్రాంతంలో ఉత్తర తేలిక నేలల్లో రైతులు సుమారు 9162 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. పొగాకు సాగులో రైతులు అనేక ఒడుదుడుకులు ఎదుర్కొని నిలబడ్డారు. ఇక్కడ పండించిన పొగాకు అంతర్జాతీయ మార్కెట్లో గుర్తింపు పొందింది. ఇతర దేశాలకు దీటుగా పండించి ఎగుమతి చేస్తున్నారు. ప్రపంచ దేశాలకు అవసరమైన పొగాకును ఈ ప్రాంతంలో రైతులు పండిస్తున్నందున మార్కెట్లో గిరాకీ ఉంటుంది.

పదేళ్ల క్రితం నష్టాలు

పదేళ్ల క్రితం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపు లక్ష ఎకరాల్లో పంట సాగు చేసేవారు. తర్వాత గిట్టుబాటు ధర రాకపోవడం, దిగుబడులు, నాణ్యత తగ్గడంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లారు. ఫలితంగా పొగాకు సాగు సగానికి తగ్గిపోయింది. దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెంలోని 1,2 వేలం కేంద్రాల పరిధిలో సుమారు ఎనిమిది మండలాలతో పాటు తెలంగాణాలోని రెండు మండలాల్లో పొగాకు సాగు చేస్తున్నారు. 13594 బ్యారన్లు ఉండగా, 11313 మంది సాగు చేస్తున్నారు. ఎక్కువ మంది కూలీలకు జీవనోపాధి కలుగుతుంది. 21426 హెక్టార్లలో సాగుకు పొగాకు బోర్డు అనుమతించగా రైతులు బ్యారన్లను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. 2021–22 సీజన్‌లో 18,765 హెక్టార్ల.. 2022–23లో 21,426 హెక్టార్లలో పంట వేశారు. గత రెండేళ్లు మార్కెట్ ఆశాజనకంగా ఉంది. దీంతో సాగు విస్తీర్ణం ఈ ఏడాది 10 వేల ఎకరాలకు పెరుగుతుందని అంచనా. ఇప్పటికే కొబ్బరి, ఆయిల్‌పాం, జీడిమామిడి, నిమ్మ వంటి తోటలను రైతులు తొలగించి పొగాకు సాగుకు భూములను సిద్ధం చేస్తున్నారు. గత ఏడాది 54 మిలియన్ల కిలోల ఉత్పత్తి జరిగింది. ఈ ఏడాది 49.48 మిలియన్ల కిలోల ఉత్పత్తికి బోర్డు అనుమతి ఇవ్వడంతో రైతులు ఎక్కువ విస్తీర్ణంలో సాగుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ఏడాది కూడా లాభసాటిగా ఉంటుందని సాగుకు శ్రీకారం చుట్టారు. నారుమడులు ఆశాజనకంగా ఉన్నాయి. ఐదు వేలం కేంద్రాల పరిధిలో సుమారు 1200 ఎకరాల్లో నారుమడులు కట్టారు. దసరా తర్వాత నాట్లు ఊపందుకుంటాయని భావిస్తున్నారు.

వేలం కేంద్రాల వారీగా సాగు వివరాలు(హెక్టార్లలో)

వేలం కేంద్రం	రైతులు	బ్యారన్లు	సాగు విస్తీర్ణం
దేవరపల్లి	1634	1868	2989
జంగారెడ్డిగూడెం-1	2209	2661	4257
జంగారెడ్డిగూడెం-2	2391	2579	4126
కొయ్యలగూడెం	2402	2718	4350
గోపాలపురం	2188	2629	4207

ఆలస్యంగా పొగాకు నాట్లు

మెట్టలోని నాట్లు ఆలస్యంగా జరుగుతున్నాయి. ఇప్పటి వరకు 200 హెక్టార్లలో నాట్లు వేశారు. వాతావరణం అనుకూలించకపోవడం, వర్షాలు లేకపోవడంతో ఆలస్యమవుతున్నాయి. బ్యారన్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తికావస్తుంది. దీని ప్రభావం దిగుబడులపై పడుతుంది. ఈ ఏడాది పొగాకు బోర్డు 49.48 మిలియన్లల ఉత్పత్తికి అనుమతి ఇచ్చింది. బ్యారన్‌కు 35 క్వింటాళ్ల ఉత్పత్తికి అనుమతి ఉంది. దీనికి లోబడి రైతులు పంట వేసుకోవాలి. సీటీఆర్ఐ సిఫార్సు చేసిన వంగడాలను సాగు చేయాలి. సాగు విస్తీర్ణం పెంచితే రైతులు నష్టపోతారు.

–ఆదిశేషయ్య, రీజినల్ మేనేజరు, పొగాకు బోర్డు.

ఈ ఏడాది మనదేశంలో జీ 20 సదస్సులు జరిగాయి. దేశదేశాల ప్రతినిధులు మనదేశంలో అడుగుపెట్టారు. వారికి మనదేశం గురించి సరళంగా వివరించాలి. ఆ వివరణ మనకు గర్వకారణంగా సమగ్రంగా ఉండి తీరాలి. అందుకు ఒక గిఫ్ట్ బాక్స్‌ను రూపొందించారు విశాల రెడ్డి. మిల్లెట్ బ్యాంకు స్థాపకురాలిగా తన అనుభవాన్ని జోడించారు. మన జాతీయ పతాకాన్ని గర్వంగా రెపరెపలాడించారు.



జి–20 ప్రతినిధులకు భారతీయ సంస్కృతి, కళలు, చిరుధాన్యాల వంటల గురించి వివరిస్తున్న విశాలరెడ్డి

విశాల ప్రపంచం

విశాలాక్షి ఉయ్యాల. చిత్తూరు జిల్లాలో ముల్లూరు కృష్ణాపురం అనే చిన్న గ్రామం ఆమెది. ప్రపంచ దేశాల ప్రతినిధులు హాజరైన జీ 20 సదస్సులో సమన్వయకర్తగా వ్యవహరించారు. మనదేశంలో విస్తరించిన అగ్రికల్చర్, కల్చర్, ఆర్ట్, క్రాఫ్ట్, కళావారసత్వాలను కళ్లకు కట్టారు. అంత గొప్ప అవకాశం ఆమెకు బంగారు పళ్లెంలో పెట్టి ఎవ్వరూ ఇవ్వలేదు. తనకు తానుగా సాధించుకున్నారు. 'ఆడపిల్లకు సంగటి కెలకడం వస్తే చాలు, చదువెందుకు' అనే నేపథ్యం నుంచి వచ్చారామె. 'నేను బడికెళ్తాను' పోరాట జీవితంలో ఆ గొంతు తొలిసారి పెగిలిన సమయమది. సొంతూరిలో ఐదవ తరగతి పూర్తయిన తర్వాత మండల కేంద్రంలో ఉన్న హైస్కూల్‌కి వెళ్లడానికి ఓ పోరాటం. కాళ్లకు చెప్పుల్లేకుండా పదికిలోమీటర్ల దూరం నడిచి వెళ్లి చదువుకున్నారు. ఆ తర్వాత కాలేజ్... కుప్పంలో ఉంది. రోజూ ఇరవై– ఇరవై నలభై కిలోమీటర్ల ప్రయాణం. డిగ్రీ కర్నాటకలోని కోలార్ గోల్డ్ ఫీల్డ్స్‌లో. అప్పటికి ఇంట్లో పోరాడి కాలేజీకి వెళ్లడానికి ఒక సైకిల్ కొనిపించుకోగలిగారామె. ప్రయాణ దూరం ఇంకా పెరిగింది. మొండితనంతో అన్నింటినీ గెలుస్తూ వస్తున్నప్పటికీ విధి ఇంకా పెద్ద విషమ పరీక్ష పెట్టింది. తల్లికి అనారోగ్యం. క్యాన్సర్‌కి వైద్యం చేయించడానికి బెంగుళూరుకు తీసుకువెళ్లడం, డాక్టర్‌లతో ఇంగ్లిష్‌లో మాట్లాడగలిగిన చదువు ఉన్నది ఇంట్లో తనకే. బీఎస్సీ సెరికల్చర్ డిస్‌కంటిన్యూ చేసి అమ్మను చూసుకుంటూ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ డిస్టెన్స్‌లో బీఏ చేశారు. అమ్మ ఆరోగ్యం కోసం పోరాటమే మిగిలింది, అమ్మ దక్కలేదు. ఆమె పోయిన తర్వాత ఇంట్లో వాళ్లు ఏడాది తిరక్కుండా పెళ్లి చేసేశారు. మూడవ నెల గర్భిణిగా పుట్టింటికి రావాల్సి వచ్చింది. ఎనిమిది నెలల బాబుని అక్క చేతిలో పెట్టి హైదరాబాద్‌కు బయలుదేరారు విశాలాక్షి ఉయ్యాల. 'తొలి ఇరవై ఏళ్లలో నా జీవితం అది'... అంటారామె. 'మరో ఇరవై ఏళ్లలో వ్యక్తిగా ఎదిగాను, మూడవ ఇరవైలో వ్యవస్థగా ఎదుగుతున్నా'నని చెప్పారామె.



హైదరాబాద్ నిలబెట్టింది!

"చేతిలో పదివేల రూపాయలతో నేను హైదరాబాద్‌లో అడుగు పెట్టిన నాటికి ఈవెంట్స్ రంగం వ్యవస్థీకృతమవుతోంది. ఈవెంట్స్ ఇండస్ట్రీస్ కోర్సులో చేరిపోయాను. ఇంగ్లిష్ భాష మీద పట్టుకోసం బ్రిటిష్ లైబ్రరీ, రామకృష్ణ మఠం నుంచి పుస్తకాలు తెచ్చుకుని చదివేదాన్ని. మొత్తానికి 2004లో నెలకు మూడు వేల జీతంతో ఈవెంట్ మేనేజర్‌గా ఉద్యోగంలో చేరాను. ఆ తర్వాత నోవాటెల్‌లో ఉద్యోగం నా జీవితానికి గొప్ప మలుపు. ప్రపంచస్థాయి కంపెనీలలో ఇరవైకి పైగా దేశాల్లో పని చేయగలిగాను. నా పేరుకు కూడా విశాలత వచ్చింది చేసుకున్నాను. హైదరాబాద్‌లో రహగిరి డే, కార్ ఫ్రీ డే, వన్ లాక్ హ్యాండ్స్ వంటి సామాజిక కార్యక్రమాలు నిర్వహించాను. ప్రదేశాలను మార్కెట్ చేయడంలో భాగంగా హైదరాబాద్‌ని మార్కెట్ చేయడంలో భాగస్వామినయ్యాను. ఒక ప్రదేశాన్ని మార్కెట్ చేయడం అంటే ఆ ప్రదేశంలో విలసిల్లిన కల్చర్, ఆర్ట్, క్రాఫ్ట్ అన్నింటినీ తెలుసుకోవాలి, వచ్చిన అతిథులకు తెలియచెప్పాలి. అలాగే రోడ్ల మీద ఉమ్మడం, కొత్తవారి పట్ల దురుసుగా ప్రవర్తించడం వంటి పనులతో మన ప్రదేశానికి వచ్చిన వ్యక్తికి చేదు అనుభవాలు మిగల్చకుండా పౌరులను సెన్సిటైజ్ చేయాలి. ఇవన్నీ చేస్తూ నా రెండవ ఇరవై ముగిసింది. అప్పుడు కోవిడ్ వచ్చింది. హాలిడే తీసుకుని మా ఊరికి వెళ్లాలనిపించింది. అప్పుడు నా దగ్గరున్నది పదివేలు మాత్రమే. నాకు అక్కలు, అన్నలు ఏడుగురు. నా కొడుకుతోపాటు వాళ్ల పిల్లలందరినీ చదివించాను. అప్పటికి నేను పెట్టిన స్టార్టప్ మనుగడ కూడా ప్రశ్నార్థకమైంది. పదివేలతో వచ్చాను, ఇరవై ఏళ్ల తర్వాత పదివేలతోనే వెళ్తున్నాను... అనుకుంటూ మా ఊరికెళ్లాను.

ఊరు కొత్త దారిలో నడిపించింది!

నా మిల్లెట్ జర్నీ మా ఊరి నుంచే మొదలైంది. మా అక్క కేజీ మిల్లెట్స్ 15 రూపాయలకు అమ్మడం నా కళ్ల ముందే జరిగింది. అవే మిల్లెట్స్ నగరంలో యాభై రూపాయలు, వాటిని కొంత ప్రాసెస్ చేస్తే వంద నుంచి రెండు– మూడు వందలు, వాటిని రెడీ టూ కుక్‌గా మారిస్తే గ్రాములకే వందలు పలుకుతాయి. తినే వాళ్లకు పండించే వాళ్లకు మధ్య ఇంత అగాథం ఎందుకుంది... అని ఆ అఖాతాన్ని భర్తీ చేయడానికి నేను చేసిన ప్రయత్నమే మిల్లెట్ బ్యాంక్. ఈ బ్యాంక్‌ను మా ఊరిలో మొదలు పెట్టాను. ఒక ప్రదేశం గురించి అక్కడి అగ్రికల్చర్, కల్చర్, ఆర్ట్, క్రాఫ్ట్ అన్నీ కలిస్తేనే సమగ్ర స్వరూపం అవగతమవుతుంది. నేను చేసింది అదే. మా మిల్లెట్ బ్యాంకు జీ 20 సదస్సుల వరకు దానంతట అదే విస్తరించుకుంటూ ఎదిగింది. ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు, చేర్యాల పెయింటింగ్స్, ఉత్తరాది కళలు, మన రంగవల్లిక... అన్నింటినీ కలుపుతూ ఒక గిఫ్ట్ బాక్స్ తయారు చేశాను. ప్రతినిధులకు, వారి భాగస్వాములకు భారతదేశం గురించి సమగ్రంగా వివరించగలిగాను. జీ20 ద్వారా ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చుకున్న నా మిల్లెట్ బ్యాంకు మరింతగా వ్యవస్థీకృతమై ఒక అమూల్‌లాగా ఉత్పత్తిదారుల సహకారంతో వందేళ్ల తర్వాత కూడా మనగలగాలనేది నా ఆకాంక్ష. మిల్లెట్ బ్యాంకుకు అనుబంధంగా ఓ ఇరవై గ్రీన్ బాక్స్‌లు, సీడ్ బ్యాంకులు కూడా ఏర్పాటు చేయాలి. రైతును తన గింజలు తానే సిద్ధం చేసుకోగలిగినట్లు స్వయంపోషకంగా మార్చాలనేది రైతు బిడ్డగా నా కోరిక" అని మిల్లెట్ బ్యాంకు, సీడ్ బ్యాంకు స్థాపన గురించి వివరించారు విశాలరెడ్డి.

– వాకా మంజులారెడ్డి
ఫొటోలు: ఎస్. ఎస్. ఠాకూర్

స్త్రీ 'శక్తి'కి పురస్కారం

టీసీఈఐ (తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ) నిర్వహిస్తున్న 'స్త్రీ శక్తి అవార్డ్స్ 2023' అవార్డు కమిటీకి గౌరవ సభ్యురాలిని. ఈ నెల 17వ తేదీన హైదరాబాద్, గచ్చిబౌలిలో పురస్కార ప్రదానం జరుగుతుంది. గడచిన ఐదేళ్లుగా స్త్రీ శక్తి అవార్డ్స్ ప్రదానం జరగనుంది. ఇప్పటి వరకు తెలంగాణకు పరిమితమైన ఈ అవార్డులను ఈ ఏడాది జాతీయస్థాయికి విస్తరించాం. పదిహేనుకు పైగా రాష్ట్రాలతోపాటు మలేసియా, యూఎస్‌లలో ఉన్న భారతీయ మహిళల నుంచి కూడా ఎంట్రీలు వచ్చాయి. అర్హత కలిగిన ఎంట్రీలు 250కి పైగా ఉండగా వాటిలో నుంచి 50 మంది అవుట్ స్టాండింగ్ ఉమెన్ లీడర్స్ పురస్కారాలందుకుంటారు. జీవితంలో ఎదురైన సవాళ్లను ఎలా ఎదుర్కొన్నారు, ఆత్మస్థయిర్యం కోల్పోకుండా ముందుకు సాగిన వైనం, వారు సాధించిన విజయాలు– చేరుకున్న లక్ష్యాలు, ఎంతమందికి ఉపాధినిస్తున్నారు, వారి భవిష్యత్తు ప్రణాళికలు కార్యాచరణ ఎలా ఉన్నాయనే ప్రమాణాల ఆధారంగా విజేతల ఎంపిక ఉంటుంది.

– విశాల రెడ్డి ఉయ్యాల
ఫౌండర్, మిల్లెట్ బ్యాంకు

నేడు ప్రపంచ దృష్టి దినోత్సవం

ఆశాలత చకచకా ఐదు నిమిషాల్లో వంట ముగుస్తుంది. ఇంత సులువుగా హాయిగా వండొచ్చా అనిపిస్తుంది వీడియో చూస్తే! కాని ఆమెకు చూపు లేదు. ఫుడ్ వ్లోగర్‌గా ఇన్‌స్టాలో లక్ష, యూ ట్యూబ్‌లో రెండు లక్షల మంది ఫాలోయెర్లను సంపాదించుకుంది. కొత్తిమీర పచ్చడి నుంచి రొయ్యల వేపుడు వరకూ ఆమె వంటలకు డిమాండ్. కళ్లు లేని వారు ఇన్‌స్పయిర్ చేయగలరు అంటుందామె. కాసర్‌గోడ్‌కు చెందిన ఆశాలత తెలుసుకోదగ్గ వ్యక్తి.

రుచికి చూపెందుకు?





ఆశాలత

నేడు ప్రపంచ దృష్టి దినోత్సవం. అంటే దృష్టి కలిగి ఉన్నందుకు ఎంత జాగ్రత్తగా కాపాడుకోవాలో ఎరుక తెచ్చుకోవాల్సిన దినం. దృష్టి లేని వారికి సమాజంలో అందాల్సిన సౌలభ్యాలు, అవకాశాల గురించి చైతన్యం కలిగించుకోవాల్సిన దినం. దృష్టి లేకపోయినా తమ జీవన సమరాన్ని గొప్పగా సాగిస్తుంటే అందరం కలిసి ముందుకు సాగుదాం అని చెప్పాల్సిన దినం. పరస్పరం స్ఫూర్తి పొందాల్సిన దినం. కేరళలోని కాసర్‌గోడ్ జిల్లాలో రావణేశ్వరంలో నివసించే ఆశాలతను చూస్తే ఆమె నుంచి పొందాల్సిన స్ఫూర్తి, ఆమెకు ఇవ్వాల్సిన ఉత్తేజం చాలానే ఉందనిపిస్తుంది.

మునివేళ్లకు కళ్లు

49 ఏళ్ల ఆశాలత మునివేళ్లకు కళ్లున్నాయ్ అనిపిస్తుంది ఆమె వంట చేసే పద్ధతి చూస్తే. కత్తిపీటతో కూరలు తరగడం, మిక్సీలో మసాలాలు వేసుకోవడం, స్టౌ ఆన్ చేసి మూకుళ్లు పెట్టడం, వండటం ఇవన్నీ మునివేళ్ల స్పర్శతోనే ఆమె గుర్తించి పూర్తి చేస్తుంది. 'నాకు పుట్టుకతో దృష్టి లేదు. టీనేజ్ వరకూ వెలుతురు, చీకటి అర్థమయ్యేవి. టీనేజ్ దాటాక పూర్తిగా చీకటి కమ్ముకుంది. అయినప్పటికీ మా అమ్మా నాన్నలు నన్ను అంధురాలిగా చూస్తూ, నిరాశ పరుస్తూ పెంచలేదు. మా నాన్న టి.సి.దామోదర్ నన్ను చదువుకోమని బాగా ప్రోత్సహించాడు. బ్రెయిలీలోనే చదువు కొనసాగించి బి.ఇడి చేశాను. ఆ తర్వాత టీచర్ ఉద్యోగం పొందాను. మా ఊరి గవర్నమెంట్ స్కూల్‌లోనే సోషల్ టీచర్‌గా పని చేస్తున్నాను' అని చెప్పింది ఆశాలత. 18 ఏళ్లకు పెళ్లయ్యాక అత్తారింటిలో ఆమెకు వేరే ఏ పని చెప్పకపోయినా, ముగ్గురు పిల్లలు పుట్టినా పెంచడంలో అవస్థ రాకుండా చూసుకున్నా ఆశాలత అందరూ చేయదగ్గ పనులు చేయడానికి ప్రయత్నించేది. 'దృష్టి లేకపోతే ఇంటి పనులు కష్టమే. ఇల్లు చిమ్మడం, బట్టలు ఉతకడం కంటే వంట చేయడం సులభం అని మెల్లగా నేను తెలుసుకున్నాను' అందామె నవ్వుతూ.

వంటలో మేటి

సమయం దొరికితే వంట చేయడం మొదలెట్టిన ఆశాలత లాక్‌డౌన్‌లో పూర్తిస్థాయి వ్లోగర్‌గా మారి తన వంట వీడియోలను అప్‌లోడ్ చేస్తూ ఫాలోయెర్స్‌ను సంపాదించుకుంది. 'అంధులు తమ రోజువారి పనులు ఎలా చేసుకుంటారో... ముఖ్యంగా వంట ఎలా చేసుకుంటారో చూపించాలనుకున్నాను' అంటుందామె. దృష్టి లేకపోయినా ఆమె అంత సామర్థ్యంగా, కచ్చితంగా వంట చేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆమె పాటించే శుభ్రతను చూసి కూడా.

'మా అబ్బాయి అమల్ నా వీడియోలు షూట్ చేసి ఎడిట్ చేస్తాడు. నేను నా పిల్లలకు ఒకటే చెప్తాను.. మీ మీద మీరు ఆధారపడండి... అమ్మ నాన్నలు మీ కోసం అన్నీ చేయాలనుకోకండి అని' అంటుందామె. వెజ్, నాన్‌వెజ్ కూరలు ఇంట్లో అందరూ చేసుకునే విధంగా ఆమె వీడియోలు చేసి పెడుతుంది. అలాగే తరచూ కుటుంబంతో విహారాలు చేసి ఆ వీడియోలు కూడా పెడుతుంది. 'అంధులు నన్ను చూసి ఇన్‌స్పయిర్ అవ్వాలి. ఇంట్లోనే ఉండకుండా లోకాన్ని తిరిగి అనుభూతి చెందాలి' అంటుందామె. ఆమె తన వీడియోల్లో అంధులు కరెన్సీ ఎలా గుర్తిస్తారు, అలంకరణ సామాగ్రి ఎలా ఎంచుకుంటారు లాంటి అంశాల గురించే కాక సాధారణ స్త్రీలకు ఉపయోగపడే అంశాలను కూడా పోస్ట్ చేస్తూ ఉంటుంది. ●

సినిమా

కల్కిలో ఇలా..



● అమితాబ్ బచ్చన్

బిగ్ బి అమితాబ్ బచ్చన్ అభిమానులకు బర్త్ డే గిఫ్ట్ ఇచ్చింది 'కల్కి 2898 ఏడీ' టీమ్. బుధవారం (అక్టోబర్ 11) అమితాబ్ బచ్చన్ పుట్టినరోజు సందర్భంగా 'కల్కి...'లో ఆయన గెటప్ ఇలా ఉంటుందంటూ లుక్‌ని విడుదల చేశారు మేకర్స్. ప్రభాస్ హీరోగా తెరకెక్కుతోన్న పాన్ ఇండియా చిత్రం 'కల్కి 2898 ఏడీ'. "కొన్ని తరాలకు స్ఫూర్తిగా నిలిచిన లెజెండ్‌తో సినిమా చేయడం ఓ ఆశీర్వాదం. ఒక పెద్ద కల నెరవేరినట్లు అనిపిస్తోంది. పుట్టిన రోజు శుభాకాంక్షలు సార్" అంటూ సోషల్ మీడియా వేదికగా ప్రభాస్ స్పందించారు. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో కమల్‌హాసన్, దీపికా పదుకోన్, దిశా పటానీ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సి. అశ్వినీదత్ నిర్మిస్తున్నారు. "మైథాలజీ స్ఫూర్తితో సైన్స్ ఫిక్షన్‌గా రూపొందుతోన్న చిత్రం 'కల్కి 2898 ఏడీ'. ఈ చిత్రాన్ని 2024 ప్రథమార్ధంలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం" అని చిత్ర యూనిట్ పేర్కొంది.

నచ్చావే మరింత..

"హే బుజ్జి బంగారం.. ప్రేమేగా ఇదంతా.. హే నువ్వు నా సొంతం.. నచ్చావే మరింత...' అంటూ ప్రేయసిని ఉద్దేశించి పాట పాడారు వైష్ణవ్ తేజ్. శ్రీకాంత్ ఎన్. రెడ్డి దర్శకత్వంలో వైష్ణవ్ తేజ్, శ్రీ లీల జంటగా నటించిన ఫ్యామిలీ–యాక్షన్ ఎంటర్‌టైనర్ మూవీ 'ఆదికేశవ'. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం నవంబరు 10న విడుదల కానుంది. తాజాగా ఈ సినిమాలోని 'హే బుజ్జి బంగారం..' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. చిత్రసంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్ స్వరపరచిన ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా అర్మాన్ మాలిక్, యామిని ఘంటసాల పాడారు.



● వైష్ణవ్ తేజ్, శ్రీలీల

రేపే నారాయణమూర్తి యూనివర్సిటీ



● ఆర్. నారాయణమూర్తి

"'యూనివర్సిటీ' విద్యార్థులే కాదు.. వారి తల్లిదండ్రులు, అధ్యాపకులు చూడాల్సిన సినిమా" అని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ఆర్. నారాయణమూర్తి లీడ్ రోల్‌లో నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'యూనివర్సిటీ' చిత్రం రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులకు 'యూనివర్సిటీ' ప్రివ్యూ వేశారు. ప్రొఫెసర్ కంచె ఐలయ్య మాట్లాడుతూ– "దేశంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలి. అప్పుడే ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీ ఉండదు' అనే అంశాన్ని ఈ చిత్రం ద్వారా గట్టిగా చెప్పారు నారాయణమూర్తి" అన్నారు. "నిరుద్యోగ సమస్య దేశాన్ని ఎంత పట్టి పీడిస్తోందో ఈ చిత్రంలో బాగా చెప్పారు" అన్నారు ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి. "పరీక్షల మీద పరీక్షలంటూ నిరుద్యోగుల జీవితాలతో ఆడుకోవడం దుర్మార్గం" అన్నారు ఆర్. నారాయణమూర్తి.

మోగించిందే పీపీ సన్నాయి...

'నింగి నేలా.. నీలా నాలా.. కలిశాయే...' అంటూ మొదలవుతుంది 'యానిమల్' సినిమాలోని 'అమ్మాయి..' పాట. రణ్‌బీర్ కపూర్, రష్మికా మందన్నా జంటగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'యానిమల్'. ఈ చిత్రంలో "పెదవంచుల్లో మోగించిందే పీపీ సన్నాయి... అమ్మాయి.. అమ్మాయీ..." అంటూ సాగే పాట లిరికల్ వీడియోను యూనిట్ విడుదల చేసింది. ఈ పాటకు అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా, ఈ చిత్ర సంగీత దర్శకుడు ప్రీతమ్, రాఘవ చైతన్య పాడారు. భూషణ్‌కుమార్, క్రిషన్‌కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా, మురాద్ ఖేతని నిర్మించిన ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో డిసెంబరు 1న విడుదల కానుంది.



● రణ్‌బీర్, రష్మిక

థ్రిల్లర్ గాడ్



● నయనతార ● 'జయం' రవి

'జయం' రవి, నయనతార జంటగా ఐ. అహ్మద్ దర్శకత్వంలో రూపొందిన తమిళ చిత్రం 'ఇరైవన్'. ఈ సినిమా 'గాడ్' టైటిల్‌తో ఈ శుక్రవారం తెలుగులో రిలీజ్ కానుంది. నిర్మాతలు సుధన్ సుందరం, జి. జయరాం, సీహెచ్ సతీష్ కుమార్ మాట్లాడుతూ– "క్రైమ్ థ్రిల్లర్ జానర్‌లో రూపొందిన ఈ సినిమా సీట్ ఎడ్జ్ థ్రిల్లర్‌గా ప్రేక్షకులను మెప్పిస్తుంది" అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: యువన్ శంకర్ రాజా.

వ్యూహం.. శపథం... డేట్ ఫిక్స్



● 'వ్యూహం'లో అజ్మల్
● 'శపథం'లో అజ్మల్

దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'వ్యూహం'. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హఠాన్మరణం తర్వాత రాజకీయ పార్టీలు ఎలాంటి వ్యూహాలు పన్నాయి? ఆ తర్వాత ఎలాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి? అనే కథాంశంతో 'వ్యూహం' రూపొందుతోంది. ఈ చిత్రంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాత్రలో అజ్మల్ నటిస్తున్నారు. ఆర్‌జీవీ డెన్ ప్రొడక్ట్– రామదూత క్రియేషన్స్‌పై దాసరి కిరణ్ కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. తొలి భాగం 'వ్యూహం'ని నవంబర్ 10న, 'శపథం' (వ్యూహం 2)ని జనవరి 25న విడుదల చేయనున్నట్లు బుధవారం ప్రకటించారు. ఈ చిత్రానికి కెమెరా: సుజీష్ రాజేంద్రన్.

నువ్వు నీలా ఉండు అని చెప్పింది

– నూపుర్ సనన్



రవితేజ టైటిల్ రోల్ చేసిన తాజా చిత్రం 'టైగర్ నాగేశ్వర రావు'. ఈ చిత్రంలో నూపుర్ సనన్, గాయత్రీ భరద్వాజ్ హీరోయిన్లుగా నటించారు. తేజ్ నారాయణ్ అగర్వాల్ సమర్పణలో మయాంక్ సింఘానియా సహనిర్మాతగా అభిషేక్ అగర్వాల్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో నూపుర్ సనన్ మాట్లాడుతూ– "ఈ సినిమాలో ఎవర్నైనా ప్రేమిస్తే వారి కోసం ఏదైనా చేయడానికి సాహసించే మార్వాడి అమ్మాయి సారా పాత్రను చేశాను. ఈ చిత్రంలో నా వేషధారణ మోడ్రన్‌గా ఉంటూనే ట్రెడిషనల్‌గా ఉంటుంది. తెలుగులో చేసిన తొలి సినిమా 'టైగర్ నాగేశ్వర రావు'తోనే నాకు సారాలాంటి చాలెంజింగ్ రోల్ దొరకడాన్ని అదృష్టంగా భావిస్తున్నాను. ఈ సినిమా కోసం దాదాపు రెండు వందల మందిని ఆడిషన్ చేశాక, 'సారా' పాత్రకు నన్ను ఎంపిక చేశారు వంశీగారు. సెట్స్‌లో ఆయన చెప్పినట్లు నటించాను. ప్రస్తుతం నవాజుద్దీన్ సిద్ధిఖీతో ఓ సినిమా చేస్తున్నాను" అన్నారు. ఇంకా మాట్లాడుతూ– "నేను సినిమాల్లోకి వెళ్తానన్నప్పుడు 'నువ్వు నీలా ఉండు' అని అక్క (హీరోయిన్ కృతీ సనన్) సలహా ఇచ్చింది. 'మిమి' సినిమాలో అక్క నటన నాకు కన్నీళ్లు తెప్పించింది. మా అక్క తెలుగులో మహేశ్‌బాబు, ప్రభాస్, నాగచైతన్య వంటి స్టార్లతో సినిమాలు చేసింది. ఆ విధంగా తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యింది" అని చెప్పుకొచ్చారు.

తెలుగు సినిమా మారిపోయింది

– దర్శకుడు మల్లికార్జున్



శివ కంఠమనేని, క్యాథలిన్ గౌడ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'మధురపూడి గ్రామం అనే నేను'. మల్లికార్జున్ దర్శకత్వంలో ముప్పా వెంకయ్య చౌదరి సారథ్యంలో జి. రాంబాబు యాదవ్ సమర్పణలో కేఎస్ శంకర్ రావు, ఆర్ వెంకటేశ్వర రావు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 13న విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో మల్లికార్జున్ మాట్లాడుతూ – "ఓ మనిషికి ఆత్మ ఉంటుందన్నట్లుగానే.. ఓ ఊరికి ఆత్మ ఉంటే ఏం జరుగుతుందనే కల్పిత కథే ఈ చిత్రం. ఓ వ్యక్తి మరో వ్యక్తి తలను నరికి పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడనే వార్తను నా చిన్నతనంలో చదివాను. ఆ విజువల్‌ను ఊహించుకుంటూ ఈ సినిమా కథను అల్లుకున్నాను. అయితే ఆ ఘటనకు, ఈ సినిమాకు ఏ మాత్రం సంబంధం లేదు. పోరాటం, స్నేహం, రాజకీయం... ఇలా అన్ని రకాల ఎమోషన్స్ ఉన్న రా అండ్ రస్టిక్ ఫిల్మ్. సూరి పాత్రలో హీరో శివ నా విజన్‌కి తగ్గట్లు నటించాడు. నిర్మాతలు బాగా సపోర్ట్ చేశారు. మణిశర్మగారి సంగీతం ఈ చిత్రానికి అదనపు బలం. కరోనా తర్వాత తెలుగు సినిమా మారిపోయింది. ఆరు ఫైట్లు.. ఆరు పాటలు అంటే ఆడియన్స్ చూడటం లేదు. కొత్తదనం కోరుకుంటున్నారు. అందుకే ఈ సినిమా తీశాను. ఇక ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో నా దగ్గర ఓ కథ ఉంది" అన్నారు.

నాపై నాకు నమ్మకం వచ్చింది

– రాఘవా లారెన్స్

"'జిగర్తాండ డబుల్ ఎక్స్'లో నాకు మేకప్ వాడలేదు. మేకప్ లేకుంటే బాగుండదేమో? అనుకున్నాను. కానీ, స్క్రీన్‌పై చూసుకున్నాక నా మీద నాకు నమ్మకం ఏర్పడింది" అన్నారు రాఘవా లారెన్స్. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో రాఘవా లారెన్స్, ఎస్‌జే సూర్య ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జిగర్తాండ డబుల్ ఎక్స్'. కార్తికేయన్ నిర్మించిన ఈ చిత్రం దీపావళికి తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో రిలీజ్ కానుంది. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ సినిమాలోని 'కోరమీసం..' పాటను రిలీజ్ చేశారు.



● ఎస్‌జే సూర్య, లారెన్స్, కార్తీక్ సుబ్బరాజ్

ఈ సందర్భంగా లారెన్స్ మాట్లాడుతూ– "'జిగర్తాండ'లో నేను చేయాల్సింది.. కానీ, కుదర్లేదు. ఆ చిత్రానికి కార్తీక్ సుబ్బరాజ్‌కు జాతీయ అవార్డు వచ్చింది. 'జిగర్తాండ డబుల్ ఎక్స్' కోసం ఓ ఊర్లో రోడ్డు, బ్రిడ్జి నిర్మించారు మా నిర్మాత. ఆయన మంచి మనసు కోసమైనా ఈ చిత్రం బాగా ఆడాలి" అన్నారు. "ఈ సినిమా పండగలా ఉంటుంది" అన్నారు కార్తికేయన్. "'జిగర్తాండ' కంటే డబుల్ ఎక్స్ రేంజ్‌లో ఈ చిత్రం ఉంటుంది" అన్నారు కార్తీక్ సుబ్బరాజ్. "ఈ సినిమా నాకు ప్రత్యేకం" అన్నారు ఎస్‌జే సూర్య.

నవంబర్‌లో పొలిమేర 2



● రాజేశ్

'సత్యం' రాజేశ్, కామాక్షీ భాస్కర్ల, గెటప్ శ్రీను, రాకేందు మౌళి, బాలాదిత్య, సాహితీ దాసరి, రవి వర్మ, 'చిత్రం' శ్రీను, అక్షతా శ్రీనివాస్ ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'మా ఊరి పొలిమేర 2'. అనిల్ విశ్వనాథ్ దర్శకత్వం వహించారు. గౌరు గణబాబు సమర్పణలో గౌరీ కృష్ణ నిర్మించారు. ఈ చిత్రాన్ని పంపిణీదారుడు వంశీ నందిపాటి నవంబర్ 3న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. డా. అనిల్ విశ్వనాథ్ మాట్లాడుతూ– "గ్రామీణ నేపథ్యంలో జరిగే మర్డర్ మిస్టరీకి బ్లాక్ మ్యాజిక్ అంశాన్ని జోడించి ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. కొన్ని వాస్తవ ఘటనలను ఈ చిత్రంలో జోడించాం" అన్నారు. "'మా ఊరి పొలిమేర' ఘనవిజయం అందుకోవడంతో రెండో భాగంపై భారీ అంచనాలు ఉన్నాయి. ఆ అంచనాలకు తగ్గట్టుగా రాజీ పడకుండా ఈ సినిమా తీశాం" అన్నారు గౌరీకృష్ణ.

ఉపాధ్యాయుల కథ

వికాశ్ వశిష్ఠ హీరోగా మోక్ష, కుషిత కళ్లపు హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'నీతోనే నేను'. అంజిరామ్ దర్శకత్వంలో ఎమ్. సుధాకర్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా రేపు విడుదలవుతోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకలో ఎమ్. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ– "'నీతోనే నేను' షూటింగ్‌ని ఒక్క షెడ్యూల్‌లో 33 రోజుల్లోనే పూర్తి చేశాం. ఈ సినిమా చూసిన మెదక్ వాళ్లందరూ... మా ప్రాంతవాసి నిర్మించిన గొప్ప సినిమా అని చెప్పుకుంటారు" అన్నారు. "మా చిత్రాన్ని ఆదరించాలి" అన్నారు అంజిరామ్. "సమాజాన్ని గొప్పగా తీర్చిదిద్దే ఉపాధ్యాయుల కథతో ఈ సినిమా చేశాం" అన్నారు చిత్ర ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఎమ్. ప్రభాకర్ రెడ్డి. "మా సినిమా అందరికీ నచ్చుతుంది" అన్నారు మ్యూజిక్ డైరెక్టర్ కార్తీక్.



● వికాశ్ వశిష్ఠ



క్వార్టర్ ఫైనల్లో బోపన్న జోడీ

షాంఘై ఓపెన్ ఏటీపీ మాస్టర్స్-1000 టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ వరుసగా రెండో విజయం నమోదు చేసింది. చైనాలో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం 4-6, 6-3, 10-8తో ఖచనోవ్-రుబ్లెవ్ (రష్యా) జోడీపై గెలిచింది. 71 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్లో బోపన్న జోడీ ఆరు ఏస్లు సంధించి, ప్రత్యర్థి సర్వీస్ను రెండుసార్లు బ్రేక్ చేసింది. క్వార్టర్ ఫైనల్లో అరెవాలో (ఎల్సాల్వడార్)-రోజర్ (నెదర్లాండ్స్)లతో బోపన్న, ఎబ్డెన్ తలపడతారు.

అల్కరాజ్కు చుక్కెదురు



ప్రపంచ రెండో ర్యాంకర్, స్పెయిన్ టెన్నిస్ స్టార్ కార్లోస్ అల్కరాజ్ షాంఘై ఓపెన్ ఏటీపీ మాస్టర్స్-1000 టోర్నీ నుంచి నిష్క్రమించాడు. పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ అల్కరాజ్ 7-5, 2-6, 4-6తో 19వ ర్యాంకర్ దిమిత్రోవ్ (బల్గేరియా) చేతిలో ఓడిపోయాడు. 2 గంటల 10 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్లో దిమిత్రోవ్ పది ఏస్లు సంధించడంతోపాటు అల్కరాజ్ సర్వీస్ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు.

అదరగొట్టిన రోహిత్



రోహిత్ శర్మ

7 వరల్డ్కప్లో రోహిత్ సెంచరీల సంఖ్య. ఈ టోర్నీ చరిత్రలో అత్యధిక సెంచరీలు చేసిన ఆటగాడిగా నిలిచిన అతను సచిన్ టెండూల్కర్ (6) పేరిట ఉన్న రికార్డును సవరించాడు. 2015 ప్రపంచకప్లో ఒక సెంచరీ చేసిన రోహిత్, 2019 వరల్డ్కప్లో 5 శతకాలు బాదాడు.

556 అంతర్జాతీయ క్రికెట్లో (మూడు ఫార్మాట్లలో కలిపి) రోహిత్ సిక్సర్ల సంఖ్య. గేల్ (553) రికార్డు అధిగమించాడు.

63 సెంచరీకి రోహిత్ తీసుకున్న బంతుల సంఖ్య. వరల్డ్కప్లో భారత్ తరఫున ఫాస్టెస్ట్ సెంచరీగా గతంలో కపిల్ దేవ్ (72 బంతులు; 1983లో) పేరిట ఉన్న రికార్డును రోహిత్ బద్దలు కొట్టాడు.

31 వన్డేల్లో రోహిత్ సెంచరీల సంఖ్య. రికీ పాంటింగ్ (30)ను అతను అధిగమించాడు. ఈ జాబితాలో సచిన్ (49), కోహ్లి (47) మాత్రమే ముందున్నారు.

19 వరల్డ్కప్లో 19 ఇన్నింగ్స్లలోనే 1000 పరుగులు పూర్తి చేసిన డేవిడ్ వార్నర్ (19) రికార్డును రోహిత్ సమం చేశాడు.

16 ప్రపంచకప్ టోర్నీ చరిత్రలో అఫ్గానిస్తాన్ ఓడిన మ్యాచ్ల సంఖ్య. మూడో ప్రపంచకప్ ఆడుతున్న అఫ్గానిస్తాన్ 17 మ్యాచ్లు ఆడి కేవలం ఒక మ్యాచ్లోనే గెలిచింది. 2015 ప్రపంచకప్లో స్కాట్లాండ్పై అఫ్గానిస్తాన్ ఒక వికెట్ తేడాతో నెగ్గింది.

వరల్డ్కప్ చరిత్రలో అత్యుత్తమ బ్యాటర్లలో ఒకడిగా ఇప్పటికే తన పేరును లిఖించుకున్న రోహిత్ శర్మ ఇప్పుడు మరో మెట్టు ఎక్కాడు. టోర్నీలో ఏడో శతకం సాధించిన తొలి ఆటగాడిగా శిఖరాన నిలుస్తూ మెరుపు ప్రదర్శనతో జట్టుకు అద్భుత విజయాన్ని అందించాడు. గత మ్యాచ్లో డకౌట్ అయిన కసినంతా చూపిస్తూ అఫ్గానిస్తాన్పై అతను చెలరేగాడు. ఈ క్రమంలో తన స్థాయిని ప్రదర్శిస్తూ పలు రికార్డులను అధిగమించాడు. దాంతో రోహిత్ ధాటికి అఫ్గాన్ విలవిల్లాడింది. మెరుగైన స్కోరు సాధించామన్న ఆ జట్టు సంబరం కాస్తా రోహిత్ ఆట ముందు ఆవిరైంది. రోహిత్ ఆటతో సులువుగా, ఎలాంటి ఇబ్బంది లేకుండా భారత్ లక్ష్యం చేరింది. ఇక శనివారం జరిగే అసలు పోరులో పాకిస్తాన్ను పడగొట్టేందుకు టీమిండియా సిద్ధమైంది.

న్యూఢిల్లీ: ప్రపంచకప్ తొలి పోరులో పటిష్ట ఆస్ట్రేలియాను ఓడించిన భారత్ రెండో పోరులో చిన్న టీమ్ అఫ్గానిస్తాన్పై చెలరేగింది. ఏకపక్షంగా సాగిన మ్యాచ్ను ఏకంగా 15 ఓవర్లు మిగిలి ఉండగానే ముగించి భారీ విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంది. బుధవారం ఫిరోజ్షా కోట్లా స్టేడియంలో జరిగిన మ్యాచ్లో భారత్ ఎనిమిది వికెట్ల తేడాతో అఫ్గానిస్తాన్ను ఓడించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్కు దిగిన అఫ్గాన్ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 272 పరుగులు చేసింది. కెప్టెన్ హష్మతుల్లా షాహిది (88 బంతుల్లో 80; 8 ఫోర్లు, 1 సిక్స్), అజ్మతుల్లా ఒమర్జాయ్ (69 బంతుల్లో 62; 2 ఫోర్లు, 4 సిక్స్లు) అర్ధ సెంచరీలు చేశారు. బుమ్రా నాలుగు వికెట్లతో, హార్దిక్ పాండ్యా రెండు వికెట్లతో ప్రత్యర్థిని దెబ్బ కొట్టారు. అనంతరం భారత్ 35 ఓవర్లలో 2 వికెట్లకు 273 పరుగులు సాధించి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రోహిత్ శర్మ (84 బంతుల్లో 131; 16 ఫోర్లు, 5 సిక్స్లు) మెరుపు సెంచరీతో చెలరేగగా, విరాట్ కోహ్లి (56 బంతుల్లో 55 నాటౌట్; 6 ఫోర్లు) మరో అర్ధ సెంచరీని తన పేరిట నమోదు చేసుకున్నాడు. ఆడిన రెండు మ్యాచ్లూ గెలిచిన టీమిండియా శనివారం అహ్మదాబాద్లో జరిగే తమ తర్వాతి పోరులో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్తో తలపడుతుంది.

సెంచరీ భాగస్వామ్యం...

బ్యాటింగ్కు స్వర్గధామంలాంటి పిచ్పై అఫ్గానిస్తాన్ చెప్పుకోదగ్గ స్కోరే సాధించగలిగినా... కీలక సమయాల్లో భారత బౌలర్లు చెలరేగడంతో ఆ జట్టు ఆశించినన్ని



బుమ్రా, హార్దిక్

పరుగులు రాబట్టడంలో విఫలమైంది. 31 పరుగుల వ్యవధిలో ఆ జట్టు తొలి 3 వికెట్లు చేజార్చుకుంది. అయితే హష్మతుల్లా, అజ్మతుల్లా కీలక భాగస్వామ్యంతో జట్టును ఆదుకున్నారు. 21.2 ఓవర్లపాటు భారత్కు వికెట్ ఇవ్వకుండా నిలువరించడంలో సఫలమైన వీరిద్దరు నాలుగో వికెట్కు 121 పరుగులు జత చేశారు. అయితే రన్రేట్ పేలవంగా సాగడంతో అది చివర్లో జట్టు స్కోరుపై ప్రభావం చూపించింది. టీమిండియా బౌలర్లలో సిరాజ్ మినహా అంతా మెరుగైన ప్రదర్శనే చేశారు. ఓవర్కు 8.44 చొప్పున పరుగులిచ్చిన సిరాజ్ బౌలింగ్లో అఫ్గాన్ బ్యాటర్లు 12 ఫోర్లు, 1 సిక్స్ రాబట్టారు.

ఎదురులేని బ్యాటింగ్తో...

తనదైన శైలిలో మెరుపు బ్యాటింగ్తో చెలరేగిన రోహిత్ సునాయాసంగా అఫ్గాన్ నుంచి మ్యాచ్ను లాక్కున్నాడు. ఫజల్ ఓవర్లో సిక్సర్తో వరల్డ్ కప్లో వేయి పరుగులు పూర్తి చేసుకున్న రోహిత్, అతని తర్వాతి ఓవర్లో 2 ఫోర్లు, 6 బాది 30 బంతుల్లోనే హాఫ్ సెంచరీని చేరుకున్నాడు. తర్వాతి రెండు ఓవర్లలో రోహిత్ మరో 2 ఫోర్లు, 2 సిక్స్లు కొట్టాడు. 10 ఓవర్లు ముగిసేసరికి భారత్ స్కోరు 94 పరుగులకు చేరింది. ముజీబ్ ఓవర్లో మూడు ఫోర్లు కొట్టిన అతనికి సెంచరీ పూర్తి చేసేందుకు ఎక్కువ సమయం పట్టలేదు. 18వ ఓవర్ రెండో బంతికే రోహిత్ శతకం పూర్తి కావడం విశేషం. మరో ఎండ్లో రోహిత్కు సహకరించిన ఇషాన్ కిషన్ (47 బంతుల్లో 47; 5 ఫోర్లు, 2 సిక్స్లు) వికెట్ తీసి భారీ భాగస్వామ్యం తర్వాత అఫ్గాన్ కాస్త ఊపిరి పీల్చుకుంది. తొలి వికెట్కు రోహిత్, కిషన్ 156 పరుగులు జత చేశారు. ఆ తర్వాత జత కలిసిన కోహ్లి ప్రశాంతంగా ఆడుకుంటూ పోయాడు. రషీద్ ఓవర్లో వరుసగా 4, 4, 6 కొట్టిన భారత కెప్టెన్ అతని తర్వాతి ఓవర్లో స్వీప్ షాట్కు ప్రయత్నించి బౌల్డ్ కావడంతో ఒక గొప్ప ఇన్నింగ్స్ ముగిసింది. విజయానికి 64 పరుగులు కావాల్సిన ఈ దశలో జత కలిసిన కోహ్లి, శ్రేయస్ అయ్యర్ (23 బంతుల్లో 25 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) చివరి వరకు నిలిచి ఆట ముగించారు.

భారత కెప్టెన్ మెరుపు సెంచరీ

- ప్రపంచకప్ చరిత్రలో 7వ శతకం
- భారత్కు వరుసగా రెండో విజయం
- 8 వికెట్లతో అఫ్గానిస్తాన్ చిత్తు



హష్మతుల్లా

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
న్యూజిలాండ్	2	2	0	4	1.958
భారత్	2	2	0	4	1.500
పాకిస్తాన్	2	2	0	4	0.927
దక్షిణాఫ్రికా	1	1	0	2	2.040
ఇంగ్లండ్	2	1	1	2	0.553
బంగ్లాదేశ్	2	1	1	2	-0.653
ఆస్ట్రేలియా	1	0	1	0	-0.883
శ్రీలంక	2	0	2	0	-1.161
నెదర్లాండ్స్	2	0	2	0	-1.800
అఫ్గానిస్తాన్	2	0	2	0	-1.907

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్రేట్

ప్రపంచకప్లో నేడు

ఆస్ట్రేలియా X దక్షిణాఫ్రికా
వేదిక: లక్నో
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్స్టార్ యాప్లో ప్రత్యక్ష ప్రసారం

నవీన్కు కోహ్లి బాసట!

గత వరల్డ్ కప్లో భారత్, ఆస్ట్రేలియా మధ్య మ్యాచ్ జరుగుతుండగా స్టీవ్ స్మిత్ను ప్రేక్షకులు 'చీటర్' అంటూ గేలి చేశారు. అయితే బ్యాటింగ్ చేస్తున్న కోహ్లి బౌండరీ వద్దకు వచ్చి అలా చేయవద్దని వారించడంతో పాటు స్మిత్ భుజంపై చేయి వేసి మద్దతు పలికాడు. ఇప్పుడు కూడా దాదాపు అలాంటి ఘటనే జరిగింది. ఐపీఎల్ టోర్నీలో కోహ్లి, అఫ్గాన్ ఆటగాడు నవీన్ ఉల్ హక్ మధ్య గొడవ జరిగింది. అప్పటి నుంచి నవీన్ ఎక్కడ, ఏ మ్యాచ్లో కనిపించినా ప్రేక్షకులు కోహ్లి, కోహ్లి అంటూ ఆట పట్టిస్తూ వచ్చారు. ఇప్పుడు మైదానంలో అదే కనిపించింది. అయితే 'ఢిల్లీ బాయ్' కోహ్లి మళ్లీ స్వయంగా ఫ్యాన్స్ను నిలువరించాడు.



కోహ్లి, నవీన్

ఇలా చేయవద్దంటూ ఆపాడు. ఆ తర్వాత నవీన్తో చేతులు కలపగా ఇద్దరు చిరునవ్వులు చిందిస్తూ 'థమ్సప్' సంకేతం చూపించడం హైలైట్గా నిలిచింది. తాజా ఘటనతో నాటి వివాదానికి తెర పడినట్లే. మ్యాచ్లో నవీన్ బౌలింగ్లో 10 బంతులు ఆడిన కోహ్లి 3 సింగిల్స్ తీశాడు.

స్కోరు వివరాలు

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (సి) శార్దుల్ (బి) పాండ్యా 21; ఇబ్రహీమ్ (సి) రాహుల్ (బి) బుమ్రా 22; రహమత్ (ఎల్బీ) (బి) శార్దుల్ 16; హష్మతుల్లా (ఎల్బీ) (బి) కుల్దీప్ 80; అజ్మతుల్లా (బి) పాండ్యా 62; నబీ (ఎల్బీ) (బి) బుమ్రా 19; నజీబుల్లా (సి) కోహ్లి (బి) బుమ్రా 2; రషీద్ ఖాన్ (సి) కుల్దీప్ (బి) బుమ్రా 16; ముజీబ్ (నాటౌట్) 10; నవీన్ (నాటౌట్) 9; ఎక్స్ట్రాలు 15; **మొత్తం** (50 ఓవర్లలో 8 వికెట్లకు) 272. **వికెట్ల పతనం:** 1-32, 2-63, 3-63, 4-184, 5-225, 6-229, 7-235, 8-261. **బౌలింగ్:** బుమ్రా 10-0-39-4, సిరాజ్ 9-0-76-0, హార్దిక్ పాండ్యా 7-0-43-2, శార్దుల్ ఠాకూర్ 6-0-31-1, కుల్దీప్ యాదవ్ 10-0-40-1, రవీంద్ర జడేజా 8-0-38-0.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (బి) రషీద్ 131; ఇషాన్ కిషన్ (సి) ఇబ్రహీమ్ (బి) రషీద్ ఖాన్ 47; కోహ్లి (నాటౌట్) 55; శ్రేయస్ అయ్యర్ (నాటౌట్) 25; ఎక్స్ట్రాలు 15; **మొత్తం** (35 ఓవర్లలో 2 వికెట్లకు) 273. **వికెట్ల పతనం:** 1-156, 2-205. **బౌలింగ్:** ఫారుఖీ 6-0-50-0, ముజీబ్ 8-0-64-0, నవీన్ ఉల్ హక్ 5-0-31-0, అజ్మతుల్లా 4-0-34-0, నబీ 4-0-32-0, రషీద్ 8-0-57-2.

'ఒలింపిక్ సవాల్కు సిద్ధం'

షట్లర్ సాత్విక్ సాయిరాజ్ వ్యాఖ్య ● 'ఆసియా' ప్రదర్శనపై చీఫ్ కోచ్ గోపీచంద్ సంతోషం

సాక్షి, హైదరాబాద్: 'మేం వరుస విజయాలు సాధిస్తున్నా చాలా మంది ప్రత్యర్థులు కొంత కాలం వరకు కూడా మమ్మల్ని పట్టించుకోలేదు. అయితే ఇప్పుడు మా ఆటపై అందరి దృష్టి ఉంటుంది. కానీ ఇప్పుడు ఇకపై మా ఆటను విశ్లేషించి మాపై విజయం సాధించేందుకు ప్రయత్నిస్తారు'... భారత డబుల్స్ బ్యాడ్మింటన్ స్టార్, వరల్డ్ నంబర్వన్ సాత్విక్ సాయిరాజ్ చేసిన వ్యాఖ్య ఇది. సాత్విక్-చిరాగ్ శెట్టి ద్వయం ఇటీవల జరిగిన ఆసియా క్రీడల్లో పురుషుల డబుల్స్లో స్వర్ణపతకాన్ని సొంతం చేసుకుంది. టీమ్ ఈవెంట్లో కూడా భారత పురుషుల జట్టు రజతం సాధించగా... పురుషుల సింగిల్స్లో హెచ్ఎస్ ప్రణయ్ కాంస్యం గెలిచాడు. ఈ నేపథ్యంలో బుధవారం గచ్చిబౌలిలోని పుల్లెల గోపీచంద్ అకాడమీలో అభినందన కార్యక్రమం జరిగింది. ఇందులో ఆటగాళ్లతో పాటు చీఫ్ కోచ్ గోపీచంద్ పాల్గొన్నారు.

వాళ్లని పడగొట్టగలిగాం...

గత ప్రపంచ చాంపియన్షిప్లో పతకం సాధించకపోవడంతో తీవ్రంగా నిరాశ చెందామని, ఆ తర్వాత మరింత పట్టుదలగా సాధన చేసి ఆసియా క్రీడలకు వెళ్లినట్లు సాత్విక్ వెల్లడించాడు. చాలా కాలంగా తమకు కొరకరాని కొయ్యగా ఉన్న మలేసియా జోడీ సా వుయి యిక్-ఆరోన్ చియాలను ఆసియా క్రీడల సెమీఫైనల్లో ఓడించడం తమ ఆనందాన్ని రెట్టింపు చేసిందని అతను అన్నాడు. వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ కోసం తాము అన్ని విధాలా సిద్ధమవుతామన్న సాత్విక్... అన్నింటికంటే ఫిట్నెస్ కీలకమని వ్యాఖ్యానించాడు. 'ఇప్పుడు మాకు ప్రత్యేకంగా ప్రత్యర్థులు ఎవరూ లేరు. మా శరీరమే మాకు ప్రత్యర్థి. రాబోయే రోజుల్లో గాయాలు లేకుండా పూర్తి ఫిట్గా ఉంటే చాలు. కోర్టులో ఫలితాలు వాటంతట అవే వస్తాయి. ఈ క్రమంలో ఒలింపిక్స్కు ముందు కొన్ని టోర్నీలలో మేం ఓడినా పర్వాలేదు. అన్నింటిలోనూ గెలిస్తే అసలు సమయానికి సమస్య రావచ్చేమో' అని సాత్విక్ అన్నాడు.

ఇలాంటి అవకాశం రాదని...

పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో తీవ్ర గాయంతో బాధపడుతూనే ప్రణయ్ పతకం కోసం పోరాడాడు. చివరకు అతను విజయం సాధించినప్పుడు కోచ్ గోపీచంద్ సహా సహచరులంతా భావోద్వేగానికి గురయ్యారు. అయితే గాయం ఉన్నా ఆడేందుకు సిద్ధం కావడం అందరం కలిసి తీసుకున్న నిర్ణయమని ప్రణయ్ చెప్పాడు. 'నా శరీరం ఎంత వరకు సహకరించగలదో ఫిజియో కొన్ని సూచనలు ఇచ్చారు. దాని ప్రకారమే కోచ్ గోపీ సర్తో పాటు అందరితో చర్చించాక నేను ఆడేందుకు సిద్ధమయ్యా. నొప్పి ఉన్నా సరే పట్టుదలగా ఆడాలని నిర్ణయించుకున్నా. ఎందుకంటే ఇలాంటి అవకాశం మళ్లీ మళ్లీ రాదు. ఆసియా క్రీడల్లో పతకం విలువేంటో తెలుసు. గతంలో ఎన్నోసార్లు గాయాలతో బాధపడి కీలక సమయాల్లో అవకాశం కోల్పోయా. ఈ జీవితకాలపు అవకాశాన్ని పోగొట్టుకోరాదని భావించా. అయితే గాయం తీవ్రత వల్లే టీమ్ ఈవెంట్ ఫైనల్లో ఆడలేదు' అని ప్రణయ్ చెప్పాడు. నిజానికి తమ స్వర్ణంకంటే ప్రణయ్ కాంస్యం గెలుచుకోవడం తమకు ఎక్కువ ఆనందాన్నిచ్చిందని సాత్విక్ అన్నాడు. అతను పతకం కోసం ఎంత కష్టపడ్డాడో, కీలక సమయాల్లో వెనుకబడి పుంజుకునేందుకు ఎంత పోరాడాడో తమకు తెలుసు కాబట్టి అతను పతకం సాధించాలని జట్టంతా కోరుకుందని సాత్విక్ వెల్లడించాడు.



ప్రణయ్, సాత్విక్ సాయిరాజ్లతో భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్

'వారి వల్లే ఈ ఉత్సాహమంతా'

గోపీచంద్ భారత కోచ్గా మారి 17 ఏళ్లు పూర్తయ్యాయి. ఇక చాలనుకొని తప్పుకోవాలని చాలా సార్లు భావించానని, అయితే యువ ఆటగాళ్ల విజయాలు తనకు ప్రేరణ అందిస్తున్నాయని గోపీచంద్ చెప్పారు. సింగిల్స్, టీమ్ ఈవెంట్లలో పతకాలు రావడం ఎంతో ఆనందం కలిగించిందని గోపీచంద్ అన్నారు. 'నా దృష్టిలో ఆసియా క్రీడల మెడల్ అంటే ఒలింపిక్స్, ప్రపంచ చాంపియన్షిప్ పతకాలతో సమానం. అందుకే ఈ ఆనందమంతా. జట్టు సభ్యులంతా చాలా బాగా ఆడారు. శ్రీకాంత్, లక్ష్య సేన్లకు ప్రత్యేక అభినందనలు. ఇక ప్రణయ్ పతకం కోసం ప్రార్థించినంతగా నేను ఎప్పుడూ ప్రార్థించలేదు. ఈ ఒక్కసారి అతడిని గెలిపించమని దేవుడిని కోరుకున్నా. ఒలింపిక్స్కు ఇంకా సమయముంది. అయితే దానికి తగిన విధంగా సిద్ధమవుతాం' అని గోపీచంద్ అన్నారు. అధికారికంగా ఇప్పుడు సాత్విక్-చిరాగ్ నంబర్వన్ ర్యాంక్ అందుకున్నా... గత ఏడాది కాలంగా వారి ఆటను చూస్తే అప్పటి నుంచే వారిని తాను నంబర్వన్గా భావించినట్లు ఆయన వెల్లడించారు.

సింధు శుభారంభం

వాంటా (ఫిన్లాండ్): ఆర్కిటిక్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ పీవీ సింధు శుభారంభం చేసింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో ప్రపంచ 13వ ర్యాంకర్ సింధు 21-13, 21-6తో 2017 ప్రపంచ చాంపియన్ నొజోమి ఒకుహారా (జపాన్)పై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి చేరింది. ఒకుహారాపై సింధుకిది 11వ విజయం. ఇటీవల ఆసియా క్రీడల్లో నిరాశపరిచిన సింధు ఈ మ్యాచ్లో 33 నిమిషాల్లో ప్రత్యర్థి ఆట కట్టించింది. తొలి గేమ్లో సింధుకు కాస్త పోటీనిచ్చిన ఒకుహారా రెండో గేమ్లో మాత్రం భారత స్టార్ దూకుడుకు చేతులెత్తేసింది. రెండో గేమ్ ఆరంభంలోనే 6-0తో ఆధిక్యంలోకి వెళ్లిన సింధు ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు. మరో మ్యాచ్లో భారత్కే చెందిన ఆకర్షి 18-21, 22-20, 21-18తో లియాన్ టాన్ (బెల్జియం)పై నెగ్గింది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో కిరణ్ జార్జి (భారత్) 24-22, 15-21, 21-15తో తోమా జూనియర్ పొపోవ్ (ఫ్రాన్స్)పై విజయం సాధించాడు.



'కంగారు' పడితే కష్టమే

కృష్ణమాచారి శ్రీకాంత్

భారత్ చేతిలో తొలి మ్యాచ్లో ఓడిన ఆస్ట్రేలియా ఇప్పుడు జోరు మీదున్న దక్షిణాఫ్రికాతో తలపడనుంది. కీలకమైన ఈ పోరులో ఓడితే ఆసీస్కు ఇబ్బందులు తప్పవు. లెక్క బెట్టి తర్వాతి మ్యాచ్లు గెలవాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. కంగారు పడితే మాత్రం కష్టాలు తప్పవు. లక్నో పిచ్ స్పిన్కు అనుకూలం. దీంతో బ్యాటింగ్, బౌలింగ్ విభాగాలపై ఇంకాస్త శ్రద్ధ పెట్టాలి. ముందుగా బ్యాటింగ్కు దిగితే మంచి స్కోరు సాధించి పిచ్ పరిస్థితుల్ని ఆకళింపు చేసుకుంటే తర్వాత ప్రత్యర్థి వికెట్లను పడగొట్టేందుకు మెరుగైన అవకాశాలుంటాయి. ఏడో నంబర్లో గ్రీన్ లేదంటే స్టొయినిస్లలో ఎవరిని ఎంచుకుంటారన్నది ఆసక్తికరం. ఇక స్పిన్ విభాగం మరింత బాధ్యత పెంచుకోవాలి. మ్యాక్స్వెల్ రూపంలో అనుభవజ్ఞుడైన స్పిన్నర్ ఉన్నప్పటికీ స్పెషలిస్ట్ స్పిన్నర్ ఆడమ్ జంపా రాణించాల్సిన అవసరమైతే ఉంది. అతను భారత్తో జరిగిన మ్యాచ్లో నిరాశపరిచాడు. ఇప్పుడు సఫారీ జట్టు పనిపడితే జట్టుకు ఎంతో ఉపయోగపడుతుంది. మరోవైపు దక్షిణాఫ్రికాను చూస్తే ఇటీవల నిలకడైన ఆటతీరుతో విజయాలు సాధిస్తోంది. సొంతగడ్డపై 3-2తో ఆసీస్ను ఓడించింది. బ్యాటర్లంతా సూపర్ ఫామ్లో ఉన్నారు. శ్రీలంకతో మ్యాచ్లో ఏకంగా ముగ్గురు సెంచరీలు చేశారు. లక్నో పిచ్పై డికాక్కు మంచి అవగాహన వుంది. ఐపీఎల్ క్రికెట్లో ఆడిన అనుభవం ఇప్పుడు కచ్చితంగా మేలు చేస్తుంది. మిడిలార్డర్లో మిల్లర్, క్లాసెన్లు రాణిస్తే పరుగుల వరదకు ఢోకా ఉండదు. లెఫ్టార్మ్ స్పిన్నర్లు కేశవ్ మహరాజ్, షమ్సీలను ఒకవేళ దక్షిణాఫ్రికా పక్కన బెడితే అంతకు మించిన ఆశ్చర్యం ఉండదు. కుల్దీప్ యాదవ్లాగే షమ్సీ లెఫ్టార్మ్ మణికట్టు స్పిన్నర్ కాబట్టి తుది జట్టులో ఉంచితే మంచి ఫలితాలుంటాయి. ప్రపంచకప్ ప్రారంభదశలోనే రెండు మేటి జట్ల మధ్య మ్యాచ్ ప్రేక్షకులను అలరిస్తుంది. రెండిటిలోనూ ఏ జట్టూ తగ్గదు. ఎంతవరకైనా పోరాడతాయి.

'మాతో పోలిస్తే అంతరం చాలా ఎక్కువ'

- భారత యువ మహిళా షట్లర్ల ఆటతీరుపై సైనా వ్యాఖ్య
- 'ప్రోస్' బ్యాడ్మింటన్ అకాడమీ మెంటార్గా కొత్త పాత్ర

సాక్షి, హైదరాబాద్: భారత మహిళల బ్యాడ్మింటన్లో వస్తున్న కొత్త తరం ఆటగాళ్లలో దూకుడు లోపించిందని ఒలింపిక్ కాంస్య పతక విజేత సైనా నెహ్వాల్ ఆవేదన వ్యక్తం చేసింది. ప్రత్యర్థిపై ఆధిపత్యం ప్రదర్శించే ధాటైన ఆట వారి నుంచి రావాలని ఆమె సూచించింది. సరిగ్గా చెప్పాలంటే తనతో పాటు సింధు తర్వాత వచ్చిన ప్లేయర్లు ఆశించిన ప్రదర్శన ఇవ్వలేకపోతున్నారని సైనా చెప్పింది. 'నిజాయితీగా చెప్పాలంటే మా ఇద్దరికీ, కొత్తగా వచ్చిన మహిళా షట్లర్లకు మధ్య అంతరం చాలా ఎక్కువగా ఉంది. మ్యాచ్ ఆరంభం నుంచి అటాక్ చేసే మాలాంటి ప్లేయర్లు ఇప్పుడు భారత్కు కావాలి. త్వరలోనే మహిళల బ్యాడ్మింటన్లో మంచి ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నా' అని సైనా పేర్కొంది. 'బ్యాడ్మింటన్ ప్రోస్' పేరుతో కొత్తగా రానున్న బ్యాడ్మింటన్ అకాడమీకి సైనా మెంటార్గా వ్యవహరించనుంది. మాజీ ఆటగాడు అనూప్ శ్రీధర్, విజయ్ లాన్సీ కలిసి దీనిని ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొంది. 'ప్రోస్ అకాడమీకి ప్రత్యేక కోచ్ల బృందం ఉంది. నాకున్న అనుభవాన్ని వారితో పంచుకునేందుకే మెంటార్గా పని చేయబోతున్నా. దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో బ్యాడ్మింటన్ అకాడమీలు రావడం సానుకూల పరిణామం' అని సైనా పేర్కొంది. భారత షట్లర్ పారుపల్లి కశ్యప్, ప్రస్తుతం భారత టీమ్ కోచ్ల బృందంలో ఒకడైన గురుసాయిదత్ కూడా ఈ అకాడమీకి మెంటార్లుగా పని చేస్తారు.



'బ్యాడ్మింటన్ ప్రోస్ అకాడమీ ప్రారంభోత్సవంలో విజయ్, సైనా, కశ్యప్, గురుసాయిదత్

సాక్షి బిజినెస్
గురువారం
12-10-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

	సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
	394	122
	66,473	19,811

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	13,556	▼	8
డోజోన్స్	33,624	▼	115
ఎఫ్‌టీఎస్ఈ 100	7,620	▼	8
డాక్స్	15,460	▲	36
షాంఘై	3,079	▲	4
నికాయ్	31,936	▲	190

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

	ధర		మార్పు
బంగారం (24 క్యారెట్)	57,860	▲	381
బంగారం (22 క్యారెట్)	57,628	▲	381
వెండి (కేజీ)	69,494	▲	911

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.45	84.12
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	100.70	104.04
€	యూరో	ఒకటి	86.77	89.86
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	55.13	56.83
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	52.39	54.73
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.11	62.05
SAR	సౌదీ రియాల్	పదిహేనుకు	21.23	22.85
UAE D	యూఏఈ దిర్హామ్	పదిహేనుకు	21.76	23.55
¥	చైనా యువాన్	పదిహేనుకు	10.27	12.34

క్యూ2లో టీసీ'ఎస్'!

- రూ.11,342 కోట్ల నికర లాభం; 8.7 శాతం అప్
- ఆదాయం 7.9 శాతం పెరుగుదల; రూ.59,692 కోట్లు
- రూ.17,000 కోట్లతో షేర్ల బైబ్యాక్‌కు సై..
- షేరుకు రూ. 9 చొప్పున రెండో మధ్యంతర డివిడెండ్

ముంబై: దేశీ సాఫ్ట్‌వేర్ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీస్ (టీసీఎస్).. మెరుగైన ఫలితాలతో బోణీ కొట్టింది. ఈ ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికంలో (2023–24, క్యూ2) కంపెనీ రూ. 11,342 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ. 10,431 కోట్లతో పోలిస్తే 8.7 శాతం వృద్ధి చెందింది. మొత్తం ఆదాయం సైతం 7.9 శాతం పెరుగుదలతో రూ. 55,309 కోట్ల నుండి రూ.59,692 కోట్లకు ఎగబాకింది. ఇక వాటాదారులకు టీసీఎస్ మరోసారి భారీ బైబ్యాక్ ఆఫర్‌ను ప్రకటించడం విశేషం. మరోపక్క, మందకొడి ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఐటీ రంగానికి ప్రతికూలతలు కొనసాగుతాయని కూడా కంపెనీ స్పష్టం చేసింది.

త్రైమాసిక ప్రాతిపదికన ఇలా...

ఈ ఆర్థిక సంవత్సరం జూన్ క్వార్టర్ (క్యూ1లో) నమోదైన రూ.11,074 కోట్లతో పోలిస్తే త్రైమాసిక ప్రాతిపదికన క్యూ2లో నికర లాభం 2.5% వృద్ధి చెందింది. మొత్తం ఆదాయం క్యూ1లో రూ.59,381 కోట్లతో పోలిస్తే క్యూ2లో అర శాతం పెరిగింది.

ఫలితాల్లో ఇతర ముఖ్యాంశాలు...

- క్యూ2లో కంపెనీ నిర్వహణ లాభం 9.1 శాతం వృద్ధితో రూ.14,483 కోట్లకు పెరిగింది. అదేవిధంగా నిర్వహణ మార్జిన్లు పావు శాతం పెరిగి 24.3 శాతానికి చేరాయి.
- భౌగోళికంగా చూస్తే, యూకే నుండి ఆదాయం 10.7 శాతం ఎగబాకగా, ఉత్తర అమెరికా నుండి స్వల్పంగా 0.1 శాతం వృద్ధి చెందింది. వర్ధమాన మార్కెట్లలో మధ్యప్రాచ్యం, ఆఫ్రికా ఆదాయం 15.9 శాతం వృద్ధి నమోదు కాగా, లాటిన్ అమెరికా 13.1 శాతం, ఆసియా పసిఫిక్ 4.1 శాతం, భారత్ ఆదాయం 3.9 శాతం చొప్పున పెరిగాయి.
- విభాగాల వారీగా.. ఇంధనం, వనరులు, యుటిలిటీల నుండి ఆదాయం 14.8 శాతం పెరిగింది. తయారీ రంగం నుండి ఆదాయం 5.8 శాతం, లైఫ్ సైన్సెస్–హెల్త్‌కేర్ 5 శాతం పెరగ్గా, బ్యాంకింగ్–ఫైనాన్షియల్ సర్వీసెస్ (బీఎఫ్ఎస్ఐ) మాత్రం మైనస్ 0.5 శాతంగా నమోదైంది.
- సెప్టెంబర్ చివరి నాటికి టీసీఎస్ మొత్తం ఉద్యోగుల సంఖ్య 6,08,985కు చేరింది. క్యూ2లో నికరంగా 6,000 మంది సిబ్బంది తగ్గారు. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 40,000 మంది ఫ్రెషర్లను నియమించుకోవాలన్న లక్ష్యంలో ఎలాంటి మార్పు లేదని టీసీఎస్ చీఫ్ హెచ్ఆర్ ఆఫీసర్ మిలింద్ లక్కడ్ చెప్పారు. క్యాంపస్ నియమకాలపై ఇప్పటికే దృష్టి పెట్టామన్నారు.
- క్యూ2లో కంపెనీ 11.2 బిలియన్ డాలర్ల విలువైన కొత్త కాంట్రాక్టులను కుదుర్చుకుంది. ఇందులో బీఎస్ఎన్ఎల్ 4జీ/5జీ, వాహన దిగ్గజం జేఎల్ఆర్‌కు సంబంధించిన డీల్స్ ప్రధానంగా ఉన్నాయి.
- ఇజ్రాయెల్‌లో 250 మంది కంపెనీ ఉద్యోగులు పని చేస్తున్నారని, యుద్ధ ప్రభావం అక్కడ తమ వ్యాపారాలపై పెద్దగా ప్రభావం చూపలేదని టీసీఎస్ సీఎఫ్ఓ ఎస్. గణపతి సుబ్రమణ్యం చెప్పారు.
- రూ. 1 ముఖ విలువ గల ఒక్కో షేరుపై కంపెనీ రూ. 9 చొప్పున రెండో మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. దీనికి రికార్డు తేదీ అక్టోబర్ 19 కాగా, నవంబర్ 7న చెల్లించనుంది. దాదాపు రూ.3,300 కోట్లు ఇందుకు వెచ్చించనుంది.

టీసీఎస్ షేరు ధర బుధవారం బీఎస్ఈలో అర శాతం నష్టంతో రూ. 3,610 వద్ద ముగిసింది. మార్కెట్ ముగిసిన తర్వాత ఫలితాలు వచ్చాయి.

బైబ్యాక్ బొనాంజా @ రూ.17,000 కోట్లు

టీసీఎస్ బైబ్యాక్ పరంపరను కొనసాగిస్తోంది. రూ. 17,000 కోట్ల విలువైన షేర్లను వాటాదారుల నుంచి తిరిగి కొనుగోలు చేసేందుకు డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది. బైబ్యాక్ షేరు ధరను రూ. 4,150గా నిర్ణయించింది.



"మా సర్వీస్‌లకు కొనసాగుతున్న డిమాండ్, క్లయింట్లు దీర్ఘకాల ప్రాజెక్టులకు కట్టుబడి ఉండటం, జెన్ ఏఐ ఇంకా ఇతర కొత్త టెక్నాలజీలను ప్రయోగాత్మకంగా ఉపయోగించేందుకు చూపుతున్న ఆసక్తి.. మా దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలపై భరోసా కల్పిస్తోంది. ఆర్థిక అనిశ్చితి కొనసాగుతోంది. దీనివల్లే ఆదాయ వృద్ధి అంతంతమాత్రంగా నమోదైంది. అయితే పటిష్టమైన డీల్స్ జోరుతో ఆర్డర్ బుక్ భారీగా వృద్ధి చెందింది. మొత్తం కాంట్రాక్ట్ విలువ (టీసీవీ) పరంగా క్యూ2లో రెండో అత్యధిక స్థాయిని నమోదు చేసింది."

\- కె. కృతివాసన్, టీసీఎస్ సీఈఓ

వర్క్ ఫ్రమ్ హోమ్‌కు 'టాటా'

కరోనా మహమ్మారి కారణంగా కల్పించిన రిమోట్ వర్కింగ్ (వర్క్ ఫ్రమ్ హోమ్) సదుపాయానికి టీసీఎస్ టాటా చెప్పింది. ఇకపై తమ ఉద్యోగులందరూ ఆఫీసుల నుంచే విధులు నిర్వర్తించాలని కంపెనీ బుధవారం ప్రకటించింది. కో–వర్కింగ్ వల్ల వ్యవస్థ విస్తృతం అవుతుందని, ఉత్పాదకత పెరుగుతుందని టీసీఎస్ చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్ మిలింద్ లక్కడ్ పేర్కొన్నారు.

ఆక్సా వాటా భారతీ గ్రూప్ చేతికి

కొనుగోలుకు బైండింగ్ డీల్

న్యూఢిల్లీ: జీవిత బీమా రంగ భాగస్వామ్య సంస్థలో ఏఎక్స్ఏ(ఆక్సా) వాటాను కొనుగోలు చేయనున్నట్లు భారతీ గ్రూప్ తాజాగా పేర్కొంది. వెరసి భారతీ ఆక్సా లైఫ్ ఇన్సూరెన్స్‌లో ఆక్సాకుగల 49 శాతం వాటాను సొంతం చేసుకునేందుకు తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు వెల్లడించింది. ఈ లావాదేవీ తదుపరి జీవిత బీమా జేవీకి హోల్డింగ్ కంపెనీగా భారతీ లైఫ్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్(బీఎల్‌వీపీఎల్) నిలవనున్నట్లు తెలియజేసింది. 100 శాతం వాటాను పొందడం ద్వారా భారతీ గ్రూప్ ఈ ఫీట్‌ను సాధించనుంది. ప్రస్తుతం జేవీలో ఆక్సాకు 49 శాతం వాటా ఉంది. తగిన అనుమతులు పొందాక లావాదేవీ డిసెంబర్‌కల్లా పూర్తికానున్నట్లు భారతీ అంచనా వేసింది. 2006లో ఆక్సా, భారతీ గ్రూప్ సంయుక్తంగా భారతీ ఆక్సా లైఫ్ ఇన్సూరెన్స్, భారతీ ఆక్సా జనరల్ ఇన్సూరెన్స్‌లను ఏర్పాటు చేశాయి. తదుపరి 2020లో ఐసీఐసీఐ లాంబార్డ్‌కు జనరల్ ఇన్సూరెన్స్‌ను విక్రయించాయి.

హైదరాబాద్ నుంచి మరిన్ని ఫ్లయిట్లు

సింగపూర్ ఎయిర్‌లైన్స్ వెల్లడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హైదరాబాద్–సింగపూర్ రూట్లో అక్టోబర్ 29 నుంచి మరిన్ని ఫ్లయిట్లు నడపనున్నట్లు సింగపూర్ ఎయిర్‌లైన్స్ జీఎం (ఇండియా) సై యెన్ చెన్ తెలిపారు. ప్రస్తుతం వారానికి ఏడు సర్వీసులు ఉండగా 12కి పెంచుకోనున్నట్లు వివరించారు. అనుబంధ బడ్జెట్ విమానయాన సంస్థ స్కూట్ నిర్వహించే ఫ్లయిట్స్ స్థానంలో వీటిని నడపనున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి సర్వీసులు ప్రారంభించి 20 ఏళ్లవుతున్న సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ విషయాలు తెలిపారు. హైదరాబాద్ మార్కెట్ నుంచి ఫుల్ సర్వీస్‌లు, కార్గోకు డిమాండ్ పెరిగినట్లు చెన్ చెప్పారు.

చైనా ఈవీ స్టార్టప్ దివాలా

సమస్యల్లో డబ్ల్యూఎం మోటార్స్



షాంఘై: తాజాగా చైనాకు చెందిన ఎలక్ట్రిక్ వాహన (ఈవీ) వర్ధమాన కంపెనీ డబ్ల్యూఎం మోటార్స్ దివాలా ప్రకటించింది. సబ్సిడీలలో కోత, అందుబాటు ధరలకు ప్రాధాన్యతగల మార్కెట్ నేపథ్యంలో ఈవీ స్టార్టప్.. పలు సవాళ్లను ఎదుర్కొంది. వెరసి కార్యకలాపాలను కొనసాగించడంలో విఫలమైంది. నిజానికి ఈవీ అమ్మకాలలో చైనా ప్రపంచంలోనే నాయకత్వ స్థాయిలో ఉంది. కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ వివరాల ప్రకారం అంతర్జాతీయ అమ్మకాలలో(2023 తొలి క్వార్టర్) 56 శాతం వాటాను ఆక్రమిస్తోంది. ఈ కాలంలో ఈవీ అమ్మకాలు వార్షికంగా 32 శాతం ఎగశాయి. వీటిలో బ్యాటరీ ఈవీల వాటా 73 శాతంగా నమోదైంది. మిగిలిన 27 శాతం వాటాను ప్లగిన్ హైబ్రిడ్ ఈవీలు అందిపుచ్చుకున్నాయి.

కంపెనీ ఎదిగిన తీరిలా

డబ్ల్యూఎం మోటార్స్‌ను 2015లో ఫ్రీమ్యాన్ షేన్ ఏర్పాటు చేశారు. తొలి దశలో టెక్ దిగ్గజాలు బైడు, టెన్సెంట్, పీసీసీడబ్ల్యూ(హాంకాంగ్), హాంగ్వాన్, షున్ టక్ హోల్డింగ్స్ తదితరాలు పెట్టుబడులు అందించాయి. ఇతర ప్రత్యర్థి సంస్థల బాటలోనే చైనీస్ క్లిష్టతరహా బ్యాటరీ సప్లై చైన్ ఎకోసిస్టమ్ ఆధిపత్యం ద్వారా కంపెనీ లబ్ధి పొందింది. అయితే, ప్రత్యర్థి సంస్థల నుంచి తీవ్రపోటీ, ముడివ్యయాల పెరుగుదల, సబ్సిడీలలో కోత, అమ్మకాలు పడిపోవడం వంటి అంశాలు రెండేళ్లుగా కంపెనీకి సవాళ్లు విసురుతున్నాయి. దీంతో 2021కల్లా వార్షిక నష్టం రెట్టింపై 1.13 బిలియన్ డాలర్లను తాకింది.

ఫ్రీడమ్ సన్‌ఫ్లవర్ 10 లీటర్ల జార్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జెమినీ ఎడిబుల్స్, ఫ్యాట్స్ ఇండియా (జీఈఎఫ్) తాజాగా ఫ్రీడమ్ రిఫైండ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ 10 లీటర్ల జార్‌ను మార్కెట్లోకి తీసుకొచ్చింది. యాంకర్ సుమ కనకాల, జీఈఎఫ్ ఇండియా సేల్స్, మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ పి.చంద్ర శేఖర రెడ్డి బుధవారమిక్కడ ఈ ఉత్పాదనను విడుదల చేశారు. ఆయిల్ వినియోగంతర్వాత నిల్వ చేసుకునేందుకు వీలుగా పది లీటర్ల జార్‌ను పరిచయం చేస్తున్నట్టు చెప్పారు. రూ.600 కోట్లతో ఆయిల్ రిఫైనరీ, సీడ్స్ క్రషింగ్ యూనిట్‌ను హైదరాబాద్ సమీపంలో నెలకొల్పుతున్నట్టు వెల్లడించారు. 2025–26లో ఈ కేంద్రంలో ఉత్పత్తి ప్రారంభం అవుతుందని, 1,000 మందికి ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు.



19,800 పైకి నిఫ్టీ



- సెన్సెక్స్ లాభం 394 పాయింట్లు
- సూచీలకు రెండో రోజూ లాభాలే...

ముంబై: ద్రవ్యోల్బణ ఆందోళనలు తగ్గడం, ప్రపంచ మార్కెట్లలో సానుకూల సంకేతాలు కలిసిరావడంతో స్టాక్ సూచీలు రెండోరోజూ లాభాలు ఆర్జించాయి. క్రూడాయిల్ ధరలు దిగిరావడం, దేశీయ కార్పొరేట్ క్యూ2 ఆర్థిక ఫలితాలపై ఆశాజనక అంచనాలు మార్కెట్ వర్గాలను మెప్పించాయి. అలాగే అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ షేర్లు ఒకటిన్నర శాతం రాణించి సూచీలకు దన్నుగా నిలిచాయి. ఫలితంగా బుధవారం సెన్సెక్స్ 394 పాయింట్లు పెరిగి 66,473 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 122 పాయింట్లు బలపడి 19,811 వద్ద నిలిచింది. ఉదయం లాభాల్లో మొదలైన సూచీలు ఇంట్రాడే స్థిరంగా ముందుకు కదలాయి. ఒక దశలో సెన్సెక్స్ 513 పాయింట్లు పెరిగి 66,592 వద్ద, నిఫ్టీ 149 పాయింట్లు దూసుకెళ్లి 19,839 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని అందుకున్నాయి. ఎఫ్ఎంసీజీ, ఇంధన, మెటల్, ఫార్మా, ప్రైవేట్ రంగాలకు చెందిన చిన్న, తరహా షేర్లకూ కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్ఈ మిడ్ క్యాప్ ఇండెక్స్ 0.55%, స్మాల్ క్యాప్ సూచీ 0.77% ర్యాలీ చేశాయి. అయితే ప్రభుత్వరంగ బ్యాంకుల షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. టీసీఎస్ రెండో క్వార్టర్ ఆర్థిక ఫలితాల వెల్లడి ముందు పలు ఐటీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. సెన్సెక్స్ ర్యాలీతో బీఎస్ఈలో ఇన్వెస్టర్లు సంపదగా భావించే బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల మొత్తం విలువ ఒక్కరోజులో రూ.1.90 లక్షల కోట్లు పెరిగింది.

పంచతంత్రం

ఎంపీ బాణాలు లక్ష్యం ఛేదిస్తాయా?

మూడు రాష్ట్రాల్లో 18 మంది ఎంపీలకు బీజేపీ టికెట్లు

రాజస్తాన్‌లో రాజె వర్గానికి చెక్ పెట్టే వ్యూహంలో బీజేపీ అగ్రనాయకులు

"బీజేపీ అమ్ముల పొదిలో ఉన్న బాణాలు పార్టీ ఎంపీలు. వాటిని బయటకి తీసి వదిలితే కాంగ్రెస్ వెన్నులో వణుకు పుట్టాల్సిందే. రాజస్థాన్‌లో ఈ ఎంపీల బాణం గురి తప్పదు. లక్ష్యాన్ని సరిగ్గా ఛేదిస్తుంది" ఇదీ బీజేపీలో జరుగుతున్న చర్చ ఇది. బీజేపీ తొలి విడతగా 41 మంది అభ్యర్థులతో జాబితా విడుదల చేస్తే అందులో ఏడుగురు ఎంపీలే ఉన్నారు. అంతమంది దిగ్గజ నాయకుల్ని అసెంబ్లీ ఎన్నికల్లో ఎందుకు దింపింది ? వచ్చే లోక్‌సభ ఎన్నికల వ్యూహం ఇందులో దాగుందా ?



రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో భారతీయ జనతా పార్టీ ఒక్కో జాబితాను విడుదల చేస్తూ ఉంటే అందులో ఉండే అతిరథ మహారథుల్లాంటి నాయకుల పేర్లను చూస్తే అందరూ విస్తుపోవాల్సి వస్తుంది. 18 మంది ఎంపీలు, నలుగురు కేంద్ర మంత్రుల్నిఈ మూడు రాష్ట్రాల అసెంబ్లీ బరిలో దింపింది. రాజస్తాన్‌ల మొదటి జాబితాలో ఏకంగా ఏడుగురు ఎంపీలున్నారు. బీజేపీ ఎంపీలైన రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ , దియా కుమారి, నరేంద్ర కుమార్, బాబా బాలకాంత్, దేవ్‌జీ పటేల్, కిరోరిలాల్ మీనా, భగీరథ్ చౌధరిలు ఈ సారి ఎమ్మెల్యేలుగా పోటీ చేయనున్నారు. పార్టీ కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నింపడానికే ప్రధానమంత్రి మోదీ ఈ నిర్ణయం తీసుకున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మోదీతో కలిసి పని చేసినవారే ఇప్పుడు తమతో కలిసి పనిచేయడానికి వచ్చారన్న భావన కార్యకర్తలకు బూస్టప్ ఇస్తుందని, ఒక్క సీటుని వదిలిపెట్టకుండా అన్నింట్లో విజయం సాధిస్తామని రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ చెబుతున్నారు.

విజయావకాశాలు మెరుగు

రాజస్థాన్ అసెంబ్లీలో 200 స్థానాలుంటే, 25 లోక్‌సభ స్థానాలున్నాయి. అంటే ఒక్కో ఎంపీ ఎనిమిది అసెంబ్లీ స్థానాల్లో ప్రభావం చూపించగలరు. ఆ విధంగా బీజేపీ 56 సీట్లను గెలుచుకోవాలన్న లక్ష్యంతో ఏడుగురు ఎంపీలను బరిలోకి దింపింది. కేంద్ర మంత్రులైన గజేంద్ర సింగ్, అర్జున్ మేఘ్వాల్ కూడా ఈ సారి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉంది.

ఎంపీల ప్రజాదరణకు ఇదో పరీక్ష

2024 లోక్‌సభ ఎన్నికలకు కొద్ది నెలల ముందు జరుగుతున్న ఎన్నికలు కావడంతో వీటిని సెమీఫైనల్‌గా భావించవచ్చు. అందుకే బీజేపీ ఎంపీలకు ఎంత ప్రజాదరణ ఉందో తెలుసుకోవడానికే బీజేపీ పెద్దలు ఎంపీలను నిలబెడుతున్నారు. ఎంపీల పరిధిలో ఉన్న నియోజకవర్గాల్లో గెలుపోటముల ఆధారంగా వచ్చే లోక్‌సభ ఎన్నికలపై కసరత్తు చేస్తారు. గత రెండు సార్వత్రిక ఎన్నికల్లో మోదీ వేవ్ ఆధారంగానే అన్ని రాష్ట్రాల్లో ఎంపీ సీట్లు బీజేపీ కైవశం చేసుకోగలిగింది. అందులోనూ రాజస్తాన్‌లో మొత్తం 25 స్థానాలు తన ఖాతాలో వేసుకొని క్లీన్ స్వీప్ చేసింది. ఇప్పుడు ఈ అసెంబ్లీ ఎన్నికలు ఒక రకంగా ఎంపీలకు లిట్మస్ టెస్ట్ వంటిది.

మోదీ హవా

రాజస్తాన్‌లో బీజేపీ ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి ఎవరో ప్రకటించడం లేదు. ప్రధాని మోదీకున్న ఛరిష్మాపైనే ఆధారపడుతోంది. దానికి తోడు స్థానిక సమస్యలు, స్థానికంగా ప్రభావం చూపించగలిగే ఎంపీలను బరిలో నిలబెడితే విజయావకాశాలు ఎక్కువవుతాయని భావించి ఈ నిర్ణయం తీసుకుంది.

అసెంబ్లీ స్థానాలు	200
పార్లమెంటు స్థానాలు	26
ఒక్కో ఎంపీ ప్రభావితం చేసే స్థానాలు	8 సీట్లు
ఏడుగురుని బరిలోకి దింపడం ద్వారా గురిపెట్టిన స్థానాలు	56

భగ్గుమన్న అసమ్మతి

బీజేపీ తొలి జాబితాలో ఏడుగురు ఎంపీలకు చోటు కల్పించడంపై అసమ్మతి భగ్గుమంది. విద్యాధర్ నగర్ నియోజకవర్గం నుంచి మూడు సార్లు ఎమ్మెల్యే నర్పత్ సింగ్ రజ్వీ స్థానంలో ఎంపీ దియా కుమారికి టికెట్ ఇవ్వడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. మాజీ ఉప రాష్ట్రపతి భైరాన్ సింగ్ షెకావత్ అల్లుడు రజ్వీ కావడంతో రాజకీయంగా కలకలం రేగింది. సిట్టింగ్ ఎమ్మెల్యేని కాదని ఒక ఎంపీకి టికెట్ ఎలా ఇస్తారని రజ్వీ ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో తన భవిష్యత్ ప్రణాళిక వెల్లడిస్తానని స్పష్టం చేశారు. మరి కొన్ని అసెంబ్లీ స్థానాల్లో వసుంధరా రాజె అనుచర వర్గానికి టికెట్లు ఇవ్వకపోవడంపైన కూడా అసంతృప్త జ్వాలలు ఎగసి పడుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా ఎన్నికల్లో ఎంపీలను బాణాలుగా వదిలితే అవి లక్ష్యాన్ని ఛేదిస్తాయా అన్న అనుమానాలైతే వస్తున్నాయి.

వసుంధర రాజెకు కౌంటర్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాలకు రాజస్తాన్ మాజీ ముఖ్యమంత్రి వసుంధరా రాజె మధ్య ఎప్పుడూ సత్సంబంధాలు లేవు. అయినప్పటికీ ఆరెస్సెస్ అండదండలతో ఆమె తనకున్న స్థానాన్ని కాపాడుకుంటూ వస్తున్నారు. ఇప్పటివరకు రాజస్తాన్‌లో వసుంధరా రాజె, ఆమె వర్గీయులకు టిక్కెట్లు దక్కలేదు. రాజెకు చెక్ పెట్టడానికే బీజేపీ వ్యూహాత్మకంగా పార్టీ ప్రముఖుల్ని బరిలోకి దింపిందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

\- సాక్షి, నేషనల్ డెస్క్

నవంబర్ 25న రాజస్తాన్ అసెంబ్లీ పోలింగ్

భారీగా పెళ్లిళ్లు ఉండడంతో తేదీ మార్చిన కేంద్ర ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ: రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికలపై కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. నవంబర్ 23కి బదులుగా నవంబర్ 25న పోలింగ్ నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు బుధవారం ఒక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. గత సోమవారం అయిదు రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పుడు రాజస్తాన్ ఎన్నికల తేదీని నవంబర్ 23గా ప్రకటించింది. అయితే అదే రోజు రాష్ట్రంలో దేవ్ ఉథాని పర్వదినాన్ని జరుపుకుంటారు. రాజస్తాన్ వాసులకు అదొక పవిత్ర దినం. పెళ్లిళ్ల సీజన్ మొదటి రోజు కూడా అదే. ఆ రోజు పెళ్లి చేసుకుంటే జీవితంలో అంతా మంచే జరుగుతుందని ప్రజల విశ్వాసం. దీంతో ఆ ఒక్క రోజే రాష్ట్ర వ్యాప్తంగా 50 వేలకు పైగా పెళ్లిళ్లు జరగనున్నాయి. పెళ్లి అంటే దాని చుట్టూ జరిగే వ్యాపారాలతో అందరూ ఆ రోజు బిజీగా ఉంటారు. పోలింగ్ బూత్‌కి రావడానికి రవాణా సదుపాయాల సమస్య కూడా తలెత్తే అవకాశం ఉంది. అలాంటి రోజు పోలింగ్ జరిగితే ప్రజలు ఓటు వెయ్యడం కష్టమవుతుందని , పోలింగ్ శాతం తగ్గిపోతుందని ఆందోళనలు నెలకొన్నాయి. వివిధ రాజకీయ పార్టీలు, సామాజిక సంస్థలు, మీడియాలో వచ్చిన కథనాలు, ఇతర వర్గాల విజ్ఞప్తి మేరకు కేంద్ర ఎన్నికల సంఘం పోలింగ్ తేదీని 25కి మారుస్తూ కొత్త షెడ్యూల్ ప్రకటించింది. భారీ సంఖ్యలో పెళ్లిళ్లు, ఇతర సామూహిక కార్యక్రమాలు జరగడం వల్ల ఓటింగ్ తగ్గుతుందన్న ఆందోళనతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టుగా ఈసీ స్పష్టం చేసింది.

బీజేపీ ఎంపీపై దాడి

జోధ్‌పూర్: రాజస్తాన్‌లో బీజేపీ ఎంపీ దేవీ ఎం.పటేల్ కాన్వాయ్‌పై బుధవారం కొందరు దాడికి దిగారు. స్థానిక ఆలయంలో పూజలు జరిపి సాంచోర్‌లోని తన నివాసానికి వెళ్తుండగా ఈ ఉదంతం చోటుచేసుకుంది. సాంచోర్ అసెంబ్లీ స్థానం నుంచి ఆయన నామినేషన్ వేయడానికి వీల్లేదని నిరసనకారులు నినాదాలు చేస్తూ పెద్ద ఎత్తున రాళ్లు రువ్వారు. దాడి నుంచి ఎంపీ సురక్షితంగా బయటపడ్డారు. రాళ్ల దాడిలో వాహనాలు బాగా దెబ్బతిన్నాయి. దాడికి దిగినవారు పార్టీలోని ఆయన ప్రత్యర్థి నేత దానారాం చౌదరి వర్గీయులని భావిస్తున్నారు. దానారాం గత అసెంబ్లీ ఎన్నికల్లో సాంచోర్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. జాలోర్ ఎంపీ అయిన పటేల్‌కు ఈసారి సాంచోర్ అసెంబ్లీ టికెట్ దక్కింది. దీన్ని చౌదరి వ్యతిరేకిస్తున్నారు.

మిజోరంలో ముక్కోణం

ఈశాన్య రాష్ట్రం మిజోరంలో ముక్కోణ పోరు నెలకొంది. పాలక మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్ఎఫ్), కాంగ్రెస్‌తో పాటు జోరాం పీపుల్స్ మూవ్‌మెంట్ ఈసారి హోరాహోరీగా తలపడుతున్నాయి...

జోరాం పీపుల్స్ మూవ్‌మెంట్ (జెడ్‌పీఎం) రాకతో బుల్లి రాష్ట్రం మిజోరంలో పోరు ఆసక్తికరంగా మారింది. ఆ పార్టీ మొత్తం 40 స్థానాలకూ అభ్యర్థులను బరిలో దింపింది. పార్టీ నాయకుడు లాల్‌దుహోమా గత ఉప ఎన్నికలో నెగ్గిన సెర్చిప్ నుంచే పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ ఇప్పటికే 39 మంది అభ్యర్థులను ప్రకటించింది. ఇక పాలక ఎంఎన్ఎఫ్ కూడా మొత్తం సీట్లకూ అభ్యర్థులను ప్రకటించింది. వీరిలో 15 కొత్త ముఖాలున్నాయి. ఇద్దరు మహిళలకు కూడా అవకాశం దక్కింది. సీఎం, ఎంఎన్ఎఫ్ అధ్యక్షుడు జోరాంతంగా ఐజ్వాల్ ఈస్ట్–1 నుంచే బరిలో దిగుతున్నారు. ఇక ఒకే ఒక్క ఎమ్మెల్యే ఉన్న బీజేపీ ఇంకా అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది.



జెడ్‌పీఎం జోరు...!

మిజోరం జనాభా కేవలం 11 లక్షలు. దశాబ్దాల తరబడి సాగిన చొరబాట్ల సమస్య అనంతరం 1987లో రాష్ట్రంగా ఏర్పడింది. నాటినుంచీ ప్రతి రెండుసార్లకు ఒకసారి చొప్పున అధికారం ఎంఎన్ఎఫ్, కాంగ్రెస్ మధ్య చేతులు మారుతోంది. ఈసారి మాత్రం పాలక ఎంఎన్ఎఫ్‌కే కాస్త మొగ్గుందని పరిశీలకులు భావిస్తున్నారు. కానీ జెడ్‌పీఎం గట్టి పోటీ ఇచ్చి ప్రభుత్వ ఏర్పాటులో కీలకంగా మారే ఆస్కారం కూడా లేకపోలేదని చెబుతున్నారు. సరిగ్గా 2018 అసెంబ్లీ ఎన్నికల ముందు ఆరేడు పార్టీల కూటమిగా పుట్టుకొచ్చిన జెడ్‌పీఎం ఆ తర్వాత ఒకే పార్టీగా రూపుమార్చుకుంది. పట్టణ ప్రాంతాల్లో చూస్తుండగానే పట్టు సాధించింది. ఈసారి రాష్ట్రవ్యాప్తంగా సత్తా చాటాలని భావిస్తోంది. మిజోరం జనాభాలో క్రైస్తవులే మెజారిటీ. వారి మనోగతంతో పాటు మయన్మార్ శరణార్థుల అంశం కూడా ఈసారి నిర్ణాయకంగా మారవచ్చని భావిస్తున్నారు. రాష్ట్రంలో నవంబర్ 7న పోలింగ్ జరగనుంది. ఫలితాలు డిసెంబర్ 3న వెల్లడవుతాయి.


2018లో ఇలా...

2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, ఎంఎన్ఎఫ్ అన్ని స్థానాల్లోనూ పోటీ చేయగా బీజేపీ 39 స్థానాల్లో బరిలో దిగింది. ఎంఎన్ఎఫ్ 26, కాంగ్రెస్ 5 సీట్లు గెలవగా బీజేపీ ఒక్క స్థానంతో సరిపెట్టుకుంది. స్వతంత్రులుగా బరిలో దిగిన జెడ్‌పీఎం అభ్యర్థులు ఎనిమిది సీట్లలో నెగ్గారు. కేంద్రంలోని పాలక ఎన్డీఏ కూటమిలో భాగస్వామిగా ఉన్న ఎంఎన్ఎఫ్ మిజోరంలో బీజేపీతో జట్టు కట్టకుండా విడిగానే పోటీ చేసింది.

\-సాక్షి, నేషనల్ డెస్క్

పార్టీ	2018	2013
ఎంఎన్ఎఫ్	26	5
కాంగ్రెస్	5	34
జెడ్‌పీఎం	8	-
బీజేపీ	1	0
ఇతరులు	0	1

క్యాండీ క్రష్ ఆడుతూ ఛత్తీస్‌గఢ్ సీఎం



రాయపూర్: ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపిక కసరత్తులో తలమునకలైంది. దీనికి సంబంధించి రాయపూర్‌లో అతి ముఖ్యమైన సమావేశంలో పాల్గొన్న ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ క్యాండీక్రష్ ఆడడం రాజకీయంగా మాటల యుద్ధానికి దారి తీసింది. రాయపూర్‌లో మంగళవారం రాత్రి అభ్యర్థుల ఎంపికపై స్క్రీనింగ్ కమిటీ సమావేశం జరిగింది. అత్యంత కీలకమైన ఈ సమావేశంలో సీఎం బఘేల్ తన ఫోన్‌లో క్యాండీక్రష్ ఆడుతూ కనిపించారు. ఈ ఫొటోను బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవీయ సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తూ వ్యంగ్యంగా కామెంట్ చేశారు. ''అభ్యర్థుల ఎంపిక కోసం కసరత్తు జరుగుతూ ఉంటే సీఎం హాయిగా క్యాండీ క్రష్ ఆడుతూ రిలాక్సవుతున్నారు. బహుశా కాంగ్రెస్ ఎన్నికల్లో గెలవదని ఆయనకూ తెలిసి ఉంటుంది'' అని మాలవీయ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. వీటిని బఘేల్ తిప్పికొడుతూ గతంలో తాను ఛత్తీస్‌గఢ్ సంప్రదాయ క్రీడలు గిల్లీ దండా, భవురా ఆడినప్పుడు కూడా బీజేపీ విమర్శలు చేసిందని గుర్తు చేశారు.'' ఛత్తీస్‌గఢ్ సంప్రదాయ క్రీడలు ఎంత ఇష్టంగా ఆడతానో క్యాండీక్రష్ అంతే ఇష్టంగా ఆడతాను. క్యాండీక్రష్‌లో చాలా లెవల్స్ పూర్తయ్యాయి. ఇంకా ఆటని కొనసాగిస్తూ లెవల్స్ అన్నీ దాటతాను. ఎవరు అధికారంలోకి వస్తారో రారో ప్రజలే నిర్ణయిస్తారు. ఎవరు గెలుస్తారో అందరికీ తెలుసు'' అని ఎదురుదాడి చేశారు. ఛత్తీస్‌గఢ్‌లో రెండు దశల్లో నవంబర్ 7, 17 తేదీల్లో ఎన్నికలు జరగనున్నాయి.

క్లుప్తంగా...

సహిత విద్యా రిసోర్స్ పర్సన్ల మెరిట్ జాబితా విడుదల

సాక్షి, అమరావతి: సహిత విద్యా రిసోర్స్ పర్సన్ల మెరిట్ జాబితాను సమగ్ర శిక్ష రాష్ట్ర పీడీ బి.శ్రీనివాసరావు విడుదల చేశారు. అభ్యర్థులకు https:// apie. apcfss. in/ వెబ్‌సైట్‌లో మెరిట్ జాబితాను అందుబాటులో ఉంచారు. అభ్యర్థులు మెరిట్ జాబితాలో సందేహాలు ఉంటే సంబంధిత జిల్లా సమగ్ర శిక్షా కార్యాలయాన్ని సంప్రదించవచ్చు. ఇంటర్వ్యూలకు ఎంపికైన వారు కేటాయించిన తేదీల్లో ధ్రువపత్రాలతో డీఈవో కార్యాలయాల్లో హాజరుకావాల్సి ఉంది.

వృత్తి విద్యా కోర్సులతో జీవన నైపుణ్యాల పెంపు

సమగ్ర శిక్ష రాష్ట్ర పీడీ శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: విద్యార్థుల్లో జీవన నైపుణ్యాలు పెంపొందించడానికి చదువుతో పాటు వృత్తి విద్య కూడా ముఖ్యమని సమగ్ర శిక్ష రాష్ట్ర పీడీ బి.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం విజయవాడలో 'వన్ డే ఒకేషనల్ ఎడ్యుకేషన్ వర్క్ షాప్' కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఒకేషనల్ విద్యలో ఆసక్తి ఉన్న విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. తద్వారా డ్రాపౌట్లను తగ్గించవచ్చన్నారు. సమగ్ర శిక్ష ఏఎస్పీడీ కె.వి.శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ పాఠశాలల్లో వృత్తి విద్యా కోర్సులను సక్రమంగా అమలు చేయాలని సూచించారు. జీసీడీవో ఏడీ ఎస్.రవూఫ్, స్టేట్ ఒకేషనల్ కో ఆర్డినేటర్లు బి.భారతి, డా.శారద, జిల్లాల ఒకేషనల్ కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రలో అధికారుల వసతి ఏర్పాట్లకు కమిటీ

- రాత్రిపూట కూడా ఉండేందుకు వీలుగా బస, వసతి ప్రాంతాలను గుర్తించాలి

- వీలైనంత త్వరగా నివేదికను సాధారణ పరిపాలన శాఖకు సమర్పించాలి
- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ జవహర్‌రెడ్డి
- విశాఖపట్నంలో ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం ఏర్పాటు
- సీఎంకు సహాయంగా ఉండేలా అధికారులు బస ఏర్పాట్లు చేసుకోవాలి



సాక్షి, అమరావతి: సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంపై ప్రభుత్వం దృష్టి పెట్టినందువల్ల అధికార యంత్రాంగం కూడా ఇందుకు సన్నద్ధమవుతోంది. త్వరలో ముఖ్యమంత్రి, మంత్రులు ఉత్తరాంధ్ర జిల్లాల్లో పర్యటించడంతో పాటు అభివృద్ధి, సంక్షేమ కార్యకలాపాల అమలు తీరును నిరంతరం సమీక్షిస్తారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయాన్ని విశాఖపట్నంలో ఏర్పాటు చేయాల్సి ఉంది. రాత్రి పూటఆయన అక్కడే బస చేయనున్నారు. వివిధ శాఖలపై విశాఖలోనే సమీక్షలు చేసే అవకాశం ఉంది. అందువల్ల సీనియర్ అధికారులు, జిల్లా పరిపాలన అధికారులు సీఎంకు అందుబాటులో ఉంటూ సహాయ సహకారాలు అందించాల్సి వస్తుంది. కొంతమంది సీనియర్ అధికారులను రాత్రిపూట కూడా విశాఖలో బస చేయమని కోరవచ్చు. ఈ కారణంగా వీలైనంత త్వరగా తగిన వసతిని గుర్తించి నివేదిక ఇచ్చేందుకు ముగ్గురు అధికారులతో కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్.జవహర్ రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక సీఎస్, ఆర్థిక శాఖ ప్రత్యేక సీఎస్, సాధారణ పరిపాలన శాఖ (సర్వీసెస్-హెచ్ఆర్ఎం) కార్యదర్శితో కమిటీని ఏర్పాటు చేశారు. వీలైనంత త్వరగా తగిన వసతి గుర్తించి సాధారణ పరిపాలన శాఖకు నివేదికను సమర్పించాల్సిందిగా ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. రాత్రి పూట తగిన రవాణా, వసతి ఉండేలా విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లో బస చేయడానికి తగ్గ ప్రాంతాలను గుర్తించాలని పేర్కొన్నారు.

అభివృద్ధికి అవసరం..

రాష్ట్రంలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాలను ఉత్తరాంధ్రగా పిలుస్తారు. ఈ ప్రాంతం ముఖ్యంగా ఆరోగ్యం, విద్య, నీటిపారుదల, కనెక్టివిటీ మొదలైన సూచికల్లో వెనుకబడి ఉంది. గిరిజన జనాభా అత్యధికంగా ఉంది. ఉత్తరాంధ్రలో నాలుగు జిల్లాలను వామపక్ష తీవ్రవాద ప్రభావిత జిల్లాలుగా కేంద్ర హోంమంత్రిత్వ శాఖ గుర్తించింది. ఉత్తరాంధ్రలోని కొన్ని జిల్లాల వెనుకబడిన ప్రాంతాల గ్రాంటు కింద కూడా ఉన్నాయి. ఉత్తరాంధ్రలో రెండు జిల్లాలను ఆకాంక్ష జిల్లాలుగా నీతి ఆయోగ్ గుర్తించింది. ఉత్తరాంధ్ర చారిత్రకంగా వెనుకబడిన ప్రాంతంగా గుర్తించి 2014 ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో ప్రత్యేక అభివృద్ధి ప్రోత్సాహకాలను పొందుపరిచారు. ఈ నేపథ్యంలో ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించడం, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును పర్యవేక్షించడం, సమీక్షించడంతో పాటు స్థానిక అవసరాలను తెలుసుకోవడం వంటివి అధికారయంత్రాంగం చేయాల్సి ఉంటుంది. రాత్రి పూట బస చేయాల్సిందిగా అన్ని ప్రభుత్వ శాఖల కార్యదర్శులు, శాఖాధిపతులను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకోసం విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లో రవాణా, వసతి చూసుకోవాల్సిందిగా ఆయా శాఖలు, శాఖాధిపతులకు ప్రభుత్వం స్పష్టం చేసింది.

టెంట్ పీకేశారు





స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టయిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు సంఘీభావంగా టీడీపీ నేతలు అనకాపల్లి జిల్లా యలమంచిలిలో నిర్వహిస్తున్న రిలే దీక్ష శిబిరాన్ని బుధవారం ఎత్తివేశారు. 33 రోజులు కావస్తున్నా చంద్రబాబుకు బెయిల్ రాకపోవడంతో ఆ పార్టీ కేడర్‌లో నిర్లిప్తత నెలకొంది. అంతేగాక ప్రజల నుంచి కూడా మద్దతు లభించకపోవడం, నిర్వహణ భారంగా మారడంతో పచ్చనేతలు చేతులెత్తేశారు. -యలమంచిలి (అనకాపల్లి రూరల్)

ఐవోక్యూఎమ్ ఫలితాల్లో శ్రీచైతన్య ప్రభంజనం

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా మేథమెటిక్స్ టీచర్స్ అసోసియేషన్ నిర్వహించిన ఇండియన్ ఒలంపియాడ్ క్వాలిఫయర్ ఇన్ మేథమెటిక్స్ (ఐవోక్యూఎమ్) ఫలితాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థ సత్తాచాటింది. ఇందులో తమ విద్యాసంస్థ అత్యధికంగా 365 సెలక్షన్లు సాధించిందని శ్రీచైతన్య డైరెక్టర్ సీమ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి అత్యధికంగా 167 మంది విద్యార్థులు, తెలంగాణ నుంచి 47, కర్ణాటక నుంచి 63, తమిళనాడు నుంచి 28, నార్త్ ఇండియా నుంచి 60 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ఆమె వెల్లడించారు. ఈ ఫలితాలు సాధించిన విద్యార్థినీవిద్యార్థులకు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకులకు సీమ అభినందనలు తెలిపారు.

అటవీశాఖ కార్యాలయంలో యాంటీ పోచింగ్ సెల్

టోల్‌ఫ్రీ నంబర్ 18004255909

సాక్షి, అమరావతి: వన్యప్రాణుల వేట నిరోధానికి అటవీశాఖ టోల్‌ఫ్రీ నంబరు ఏర్పాటు చేసింది. ఎక్కడైనా వేటాడుతున్నట్లు తెలిస్తే 18004255909 నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరింది. మంగళగిరిలోని అటవీ శాఖ ప్రధాన కార్యాలయంలో బుధవారం పీసీసీఎఫ్, అటవీ దళాల అధిపతి మధుసూదన్‌రెడ్డి దీనికి సంబంధించిన యాంటీ పోచింగ్ సెల్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ సెల్ ఒక రేంజ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో పనిచేస్తుందని, వన్య ప్రాణుల సంరక్షణే ధ్యేయమని అన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అటవీ ప్రాంతాల్లో చాలావరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని వివరించారు. పీసీసీఎఫ్ ఏకే నాయక్, అడిషనల్ పీసీసీఎఫ్ శాంతి ప్రియ పాండే, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.